మరణకాంక్ష

– సలీం

మరణ కాంక్ష

ఒంగోల్లోని తూర్పుపాలెం... సమయం సాయంత్రం ఐదు గంటలు... అప్పుడే స్కూల్ వదిలారు. పిల్లలు పెద్దగా అరుచుకుంటూ బైటికొచ్చారు. ఎనిమిదో తరగతి చదువుతున్న సిద్దార్థ పుస్తకాల సంచిని భుజాలకు తగిలించుకుని గేట్ బైటికి మెల్లగా నడుస్తూ, నెట్టుకుంటూ అరుచుకుంటూ పోతున్న పిల్లల వైపు అసహనంగా చూశాడు. రోజూ యింతే. స్కూల్ వదలగానే జైల్లోంచి బైటపడ్డట్టు పిల్లలు కేరింతలు కొడ్తూ యిళ్ళ వైపుకు పరుగెత్తుతారు. ప్రిన్సిపాల్ గారు డిసిప్లిన్ డిసిప్లిన్ అంటూ ఎంత మొత్తుకున్నా ప్రయోజనం ఉండదు. గేటు దాటకముందు క్యూ పద్ధతి పాటిస్తారు కానీ గేటు దాటటం ఆలస్యం పంజరంలోంచి బైట పడిన పక్షుల్లా మారిపోతారు.

సిద్దార్థ ఇదే విషయాన్ని తన నానమ్మతో చెప్తే 'చదువంటే ఆసక్తి లేనోళ్ళు, స్కూలంటే ఇష్టం లేనోళ్ళు స్కూల్ వదలగానే అబ్బా పీడా వదిలిందని ఆనందంతో గంతులేస్తారేమో నాన్నా' అంది.

'మరి నాకెందుకు అలా అన్పించదూ' అని అడిగితే 'నువ్వు బంగారు కొండవి. చదువుల తండ్రివి' అంటూ బుగ్గలు పుణికింది.

యింటికొచ్చేదారిలోనే రామాలయం ఉంది. అక్కడ ఎన్ని పావురాలో... గుంపులు గుంపులుగా... దైవదర్శనానికొచ్చిన భక్తులు పావురాలకు జొన్నలు విసురుతున్నారు. అవి కువకువలాడుకుంటూ తింటున్నాయి. ఆ దృశ్యం చూడటం సిద్దార్థకెంతిష్టమో... రోజూ చూసినా యింకా చూడాలనిపిస్తో ఉంటుంది.

గింజల్ని తింటున్న పావురాల వైపు చూస్తూ సిద్దార్థ అక్కడే నిలబడ్డాడు. అవి తమ మెడల్ని ఒయ్యారంగా తిప్పటం ఎంత బావుందో... పిల్లలెవరో హుష్ అంటూ వాటిని అదిలించినట్టున్నారు. ఒక్కసారిగా బూడిద రంగు మేఘం కమ్మేసినట్లు పావురాలు

శబ్దం చేసుకుంటూ పైకి ఎగిరాయి. గుడి ప్రాకారం మీద కొన్ని నిముషాలు కూచుని నేల మీద ఉన్న గింజలవైపు ఆశగా చూసి, మెల్లగా ఒక్కటొక్కటే దిగొచ్చి మళ్ళా గింజల్ని తినటంలో లీనమైపోయాయి.

కొద్దిసేపు చూశాక యింటివైపుకి కదిలాడు. దారికి రెండు వైపులా గుబురుగా పెరిగిన తుమ్మ చెట్లున్నాయి. చీకటి పడ్డాక ఆ దారెంట నడవడమంటే పిల్లలందరూ భయపడ్తారు. ఓ చెట్టుకింద ఏదో కదిలినట్టనిపించి నిశితంగా చూశాడు. పిల్లి... నల్లపిల్లి. దాని నోట్లో ఏదో ఉంది. మరికొంత దగ్గరగా జరిగి చూశాడు. పావురం రెక్క... అక్కడే మరో పిల్లి ఉంది. ఓ రెక్క తెగిపోయిన పావురం మెడని నోట్లో యిరికించుకుని పరుగు లంకించుకుంది. నల్లపిల్లి తన నోట్లోని రెక్కని వదిలేసి ఆపిల్లి వెంట బడింది. దాని నోట్లోని పావురాన్ని లాక్కునే ప్రయత్నంలో భీకరంగా అరిచి పోట్లాటకు దిగింది.

అప్పటికే ఆ దృశ్యం మిగతా పిల్లల కంట బడింది. రాళ్ళు తీసుకుని పిల్లులవైపు గురి చూసి కొట్టారు. గాయపడిన పావురాన్ని వదిలేసి ఆ రెండు పిల్లులు పారిపోయాయి. పిల్లలు దగ్గరకెళ్ళి చూశారు. పావురం ఒంటినిండా రక్తం... ఓ కాలు విరిగిపోయింది. మెడ సగం కొరికి వదిలేయటం వల్ల చచ్చిపోయినట్టు పడిపోయి ఉంది. కానీ చావలేదు. దాని గుండె కొట్టుకోవటం కన్పిస్తోంది.

“పాపం చూడరా... ఎంత రక్తం కారుతుందో... యిది బతకటం కష్టం. అరగంటకో గంటకో చచ్చిపోవటం ఖాయం” అన్నాడొకడు. సిద్ధార్థ ఆ పావురాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. అది సగం తెరిచిన కళ్ళతో సిద్ధార్థ వైపు చూసింది. ఆ చూపులో అనంతమైన వేదన కన్పించింది. కుడిచేతి వ్రేళ్ళతో దాన్ని ప్రేమగా నిమిరాడు. అది మరింత దీనంగా వాడి వైపు చూసినట్లనిపించింది. ఆ చూపులో వేడుకోలు... అది మాట్లాడలేకున్నా దాని మూగ భాష తనకర్థమౌతోంది. ఆ బాధనుంచి విముక్తి కలిగించమని తనని ప్రార్థిస్తున్నట్లు...

వాడికి నానమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. రోజూ ఉదయం, సాయంత్రం యింట్లోని పూజా మందిరంలో గంటకు పైగా నిష్ఠగా క్రమం తప్పకుండా పూజ చేసే నానమ్మని ఓసారి తనడిగాడు ‘రోజూ దేవుడికి అంత భక్తిగా పూజ చేస్తావు కదా... ఏం కావాలని కోరుకుంటావు నానమ్మా’ అని.

ఆ మాటలకు నానమ్మ నవ్వింది. కట్టుడు పళ్ళు చక్కగా అమరటం వల్ల నానమ్మ

నవ్వితే చాలా అందంగా ఉంటుంది.

'నా మనవడు బాగా చదువుకుని, పేద్ద డాక్టరై నాలాంటి ముసలోళ్ళకొచ్చే రోగాల్ని బాగుచేస్తూ గొప్ప పేరు తెచ్చుకోవాలని కోరుకుంటా' అంది ముసి ముసిగా నవ్వుతూ.

'నీకేం కావాలని కోరుకుంటావో చెప్పు'

'నాకంతకన్నా ఏం కావాలి నాయనా. నాకొడుకూ కోడలు బాగుండాలని కోరుకుంటా'

'అది కాదు నానమ్మా... నీకేం అక్కరలేదా... దేవుడ్ని ఏమీ అడగవా?'

కొన్ని క్షణాల విరామం తర్వాత చెప్పింది. 'నాకు అనాయాస మరణం ప్రసాదించమని వేడుకుంటాను'

'అంటే ఏమిటి?'

'అంటే ఏ బాధా లేకుండా చనిపోవటం. నిద్రలోనే నొప్పి తెలీకుండా మృత్యువు ఒడిలోకి చేరిపోవటం... ఎంతో పుణ్యం చేసుకున్న వాళ్ళకే అటువంటి మరణం రాసిపెట్టి ఉంటుంది తెలుసా... కాళ్లూ చేతులు ఆడుతున్నపుడే తిరుగుతూ తిరుగుతూ ఏరోగమూ రొష్టూ లేకుండా హాయిగా చనిపోవటం'.

పదమూడేళ్ళ సిద్దార్థకి నానమ్మ మాటలు అర్థం కాలేదు. చావంటే అందరూ భయపడ్తారు కదా. ఎవరైనా చనిపోతే అందరూ ఏడుస్తారు కదా. అంటే చావునెవ్వరూ యిష్టపడరనే కదా. మరి నానమ్మ చావు రావాలని కోరుకుంటుందేమిటి? హాయిగా చనిపోవటం అంటుందేమిటి?

'నువ్వు చావకూడదు నానమ్మా. అలా అనకు. నేను తట్టుకోలేను. నాకు ఏడుపొస్తుంది.' ఆమెని అల్లుకు పోతూ కన్నీళ్ళ పర్యంతమైన మనవణ్ణి ఆమె మురిపెంగా దగ్గరకు తీసుకుంది. వాడికి నానమ్మంటే ప్రాణం. అమ్మ కోప్పడినా నాన్న కొట్టడానికొచ్చినా తనకు వత్తాసు పలికేది నానమ్మే. నానమ్మ అడ్డు పడితే నాన్న కూడా ఏమీ అనడు. తనకేం కావాలన్నా తన తరఫున నాన్నతో పోట్లాడి యిప్పించేది నానమ్మే.

'చావు ఎవరికైనా తప్పదు నాన్నా. నేను జీవితాన్ని ఆనందంగా గడిపాను. యిపుడు వయసైపోయింది. ఏదో ఓ రోజు ఆ దేవుడి దగ్గరకు వెళ్ళాల్సిన దాన్నే. రోగాల్తో

మంచానపడి, బంధువులు ఆత్మీయులు సైతం ఈమె తొందరగా చచ్చిపోతే బావుంటుంది, చాకిరీ చేయలేక చస్తున్నాం అనుకునే దుస్థితి దాపురించకముందే చనిపోవటం ఉత్తమం. అందుకే భగవంతుణ్ణి రోజూ కోరుకుంటాను నన్ను ఉన్నపళంగా మృత్యుపీడ లేకుండా తీస్కెళ్ళిపొమ్మని'

ఆ జ్ఞాపకాల్లోంచి బైటపడి తన చేతుల్లో ఉన్న పావురం వైపు మరోసారి చూశాడు సిద్దార్థ. అది చావు తొందరగా రావాలని కోరుకుంటున్నట్లు అన్పించింది. దాని సగం తెర్చిన కన్ను 'నన్నీబాధనుంచి, శరీర హింసనుంచి విముక్తురాల్ని చేయవా' అంటూ ప్రార్థిస్తున్నట్టనిపించింది.

చుట్టూ మూగిన కొంతమంది విద్యార్థులు సిద్దార్థ ఏం చేస్తాడోనని ఆసక్తిగా చూస్తున్నారు. హంస శరీరంలో గుచ్చుకున్న బాణాన్ని పెరికేసి, గాయానికి కట్టు కట్టి బతికించుకున్న అలనాటి సిద్దార్థుడిలా ఈ పావురాన్ని బతికించుకుంటాడా... డాక్టర్ దగ్గరకు తీస్కెళ్తాడా... యింటికి తీస్కెళ్ళి సపర్యలు చేసి కాపాడుకుంటాడా... లేక తనకెందుకు లెమ్మని వదిలేసి వెళ్తాడా...

సిద్దార్థ తన అరచేతుల్లో ఉన్న పావురం కాళ్ళని కుడిచేత్తో పట్టుకున్నాడు. ఓ కాలు విరిగిపోవటం వల్ల పట్టు సరిగ్గా దొరకటంలేదు. కొద్ది దూరంలో పడి ఉన్న పెద్ద సైజు రాయిని సమీపించి దాని తలని బలంగా రాతికేసి బాదాడు. దాని తల రాతిని తాకిన మరుక్షణమే అది చచ్చిపోయింది.

చుట్టూ ఉన్నవాళ్ళు ఒక్కసారిగా 'అ...' అంటూ అరిచారు... భయంతో కొంత మంది, బాధతో కొంత మంది, ఆశ్చర్యంతో కొంతమంది, అపనమ్మకంతో కొంతమంది సిద్దార్థ వైపు చూస్తున్నారు. ఆడ పిల్లలు ఆ దృశ్యాన్ని చూళ్ళేక అక్కడినుంచి పరుగు లంకించుకున్నారు.

సిద్దార్థ మాత్రం ఓ ఘనకార్యాన్ని చేసినవాడిలా గర్వంగా తలెత్తుకుని అందరివైపు ఓ చూపు విసిరి యింటిదారి పట్టాడు.

జరిగిన విషయం అమ్మకు చెప్పాలనుకున్నాడు. తిడ్తుందేమోనని భయమేసింది. రాత్రి భోజనాలయాక మెల్లగా నానమ్మ దగ్గరకెళ్ళి కూచున్నాడు.

"నానమ్మా... ఈ రోజు స్కూల్ నుంచి వస్తుంటే ఏం జరిగిందో తెలుసా" అన్నాడు.

"నువ్వు చెప్పకుండా ఎలా తెలుస్తుంది? నాకేమైనా దివ్య దృష్టి ఉందా?" అంటూ నవ్వింది.

ఆ సంఘటన గురించి చెప్తున్నప్పుడు ఆమె శ్రద్ధగా వింది.

"నానమ్మా... ఆ పావురాన్ని చంపేసి తప్పు చేశానా... పాపం చుట్టుకుంటుందా... దేవుడు నన్ను శిక్షిస్తాడా?" బేలగా మొహం పెట్టి అడిగాడు.

ఆమె వెంటనే సమాధానం చెప్పలేదు. కొద్దిసేపు తన మనవడి ప్రవర్తనలో అసహజత్వమేమైనా ఉందా అని ఆలోచించింది.

"అసలా పావురాన్ని బండకేసి బాది చంపాలనే ఆలోచన ఎందుకొచ్చింది?" అని అడిగింది.

"అది బాధతో విలవిల్లాడుతుంటే చూళ్ళేకపోయాను నానమ్మా. కన్నీళ్ళొచ్చాయి. ఎట్టాగూ కొద్దిసేపట్లో చచ్చిపోయేలా ఉందది. అప్పటివరకూ అది నరకయాతన అనుభవించాల్సిందేగా నానమ్మా. నువ్వే చెప్పావుగా తీస్కొని తీస్కొని చావటం కన్నా ఒక్కసారిగా చచ్చిపోవటం యోగమని. దాని మీద బోల్డంత జాలేసింది నానమ్మా. దానికి హెల్ప్ చేద్దామనే చంపేశాను"

"సరే. చంపాలనుకున్నావు. ఇహపరమైన కష్టాన్నుంచి దానికి విముక్తి ప్రసాదించాలనుకున్నావు. నువ్వు బండకేసి బాది చంపటం చూసేవాళ్ళకు చాలా క్రూరంగా కన్పించి ఉంటుంది."

"మెడ పిసికి చంపుదామనుకున్నాను... కానీ మెడ ఆల్రెడీ పిల్లి సగం కొరికేసింది. తీరా అది చావక కొన ప్రాణంతో మిగిల్తేనో... బాధ తెలీకుండా క్షణంలో చచ్చిపోవాలంటే నేను చేసిన పద్ధతే సరైందనిపించింది. యింతకూ నేను పాపం చేశానంటావా?"

కొన్ని క్షణాల విరామం తర్వాత చెప్పింది. "లేదు. మంచి పనే చేశావు. నీది దయార్ద్ర హృదయం. కానీ అందరికీ ఆ విషయం అర్థం కాకపోవచ్చు. నాకు తెలుసు. నామనవడిది అతి సున్నితమైన మనసని" అతని బుగ్గలు పుణికి పుచ్చుకుంటూ అంది.

సిద్దార్థ తృప్తిగా నిద్రపోయాడు. చచ్చిపోయిన పావురం థ్యాంక్స్ చెప్పినట్టు కలకూడా వచ్చింది.

మరునాడు స్కూల్‌కెళ్ళగానే ప్రిన్సిపాల్ పిలిపించాడు. అప్పటికే నిన్న జరిగిన విషయం తొమ్మిదో తరగతి విద్యార్థి ఒకడు పూర్తిగా ఆయన చెవిలో వూదాడు.

"నిన్న సాయంత్రం స్కూల్ నుండి వెళ్తున్నప్పుడు ఏదో బృహత్కార్యం చేశావట. నిజమేనా" అని అడుగుతున్న ప్రిన్సిపాల్ కళ్ళు క్రోధంతో ఎర్రబడటం సిద్దార్థ గమనించాడు. కానీ బృహత్కార్యం అంటే అర్థం తెలీక "ఏం చేశాను సార్?" అన్నాడు.

"చేసింది చాలక ఏం చేశానని అడుగుతున్నావా రాస్కెల్? తెలీనట్లు నటించినంత మాత్రాన వదిలేస్తాననుకున్నావా? నిన్న పావురాన్ని బండకేసి బాది చంపావుట"

"దాని మెడ పిల్లి కొరికేసింది. ఓ రెక్క తెగిపోయింది. ఓ కాలు విరిగింది. దాని బాధ చూళ్ళేక చంపేశాను సార్"

"నీకు చెప్పిందా అది బాధ పడ్తున్నట్లు? స్కౌండ్రల్. ఈ వయసులోనే అంతటి రాక్షస ప్రవృత్తి, కిరాతకత్వం ఉంటే పెద్దయ్యాక మర్డర్లు చేసినా చేస్తావు. గూండానో రౌడీనో అవుతావు. రేపు మీనాన్నని పిల్చుకునిరా మాట్లాడాలి"

"సార్... పాపమనిపించింది. దాని వంటినిండా రక్తం సార్. మెడ తెగటం వల్ల నరకయాతన అనుభవించింది సార్. తట్టుకోలేకపోయాను. ఎలాగూ చస్తుంది కదా అని చంపేశాను. అదీ మనసులో తొందరగా చచ్చిపోతే బావుండునని అనుకుని ఉంటుంది. దాని కోరిక తీర్చడంలో సాయపడ్డానంతే సార్"

"నోర్ముయ్ వెధవ! సమర్థింపొకటి. దానికో మనసుంది... నీకర్థమై దాని కోరిక తీర్చావు... అపర భగవంతుడివి కదా"

"మనసులోని కోరికని చెప్పడానికి దానికి నోరు లేదు కదా సార్"

"నీకు నోరుంది కదాని చేసిన చండాలపు పనిని సమర్థించుకుంటున్నావా... తప్పు చేయటమే కాక దాన్ని తప్పు కాదని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నావే... అది మరింత ఘోరమైన తప్పు... 'పొరపాటైపోయింది సార్. మరెప్పుడూ చేయను' అన్నా నాకింత మానసిక క్షోభ ఉండకపోను"

"నేనేమీ తప్పు చేయలేదు సార్" వాక్యం సగంలో ఉండగానే చెంప ఛెళ్ళు మనేలా కొట్టాడు ప్రిన్సిపాల్. "నీకేమైనా పిచ్చుందేమో డాక్టర్‌కి చూపించమని మీ

నాన్నకి చెప్పాలి. యిది ముదిరితే చాలా ప్రమాదం” అన్నాడు.

సిద్ధార్థకి ఏడుపొచ్చింది. దాంతోపాటు ప్రిన్సిపాల్ మీద కోపం కూడా. తను తప్పు చేయకుండా ఎందుకు శిక్ష అనుభవించాలి? అసలు దండించడానికి ఇతనెవరు? ఇతనికేం అధికారం ఉందని? లాంటి ప్రశ్నలు మనసునిండా...

మరునాడు వాడి నాన్న ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వచ్చాక సిద్ధార్థ స్కూలునిండి రాగానే చింత బరికెతో చావబాదాడు. నానమ్మ అడ్డు పడినా ఆపలేదు.

“వీడు పెద్దయ్యాక ఎవర్నయినా కత్తితో పొడిచి చంపి వాణ్ణి బాధలనుంచి విముక్తి కలిగించడానికి చంపేశానంటే వీడి బతుకేమైపోద్ది” అంటూ భార్యకు చెప్పుకుని, కొడుకు భవిష్యత్తుని తల్చుకుని కుమిలిపోయాడు.

***

“తొందరగా తెములు నాన్నా... బస్సొచ్చేస్తుంది” స్కూల్ యూనిఫాం వేసుకుంటున్న ప్రసాద్‌ని హెచ్చరించింది వాళ్ళమ్మ. ఆమె చేతిలో టై పట్టుకుని నిలబడి ఉంది.

“ఓవర్ మమ్మీ. యిపుడు టై యివ్వు. నా బూట్లేవి? పాలిష్ చేశావా... మెరుస్తూ ఉండాలి. లేకపోతే అసెంబ్లీలో పక్కన నిల్చోబెట్టి ఫైన్ వేస్తారు” అన్నాడు. ఆమె యిచ్చిన టైని మెడలో వేసుకుని సాక్స్ తొడుక్కున్నాడు. బూట్లు పాలిష్ చేయబడి ఉండటం చూసి, సంతృప్తితో తలాడించి బూట్లుతొడుక్కున్నాడు. స్కూల్ బ్యాగ్‌ని వీపు వెనక భుజాలకు తగిలించుకుని “బై మమ్మీ” అని ఒక్కంగలో యింటి నుంచి బైట పడి స్కూల్ బస్ ఆగే చోటికి పరుగెత్తాడు.

“అలా పరుగెత్తితే టిఫిన్ బాక్స్‌లో పెట్టిన పప్పంతా ఒలికి పోతుందిరా. చివరి నిముషంవరకూ తాత్సారం చేయటం... ఆ తర్వాత కొంపలు మునిగిపోయినట్లు పరుగెత్తడం. ఏం పిల్లాడో బాబూ... వీడికి చెప్పలేక చచ్చిపోతున్నాను” వాళ్ళమ్మ అంటున్న మాటలు వాడికి పూర్తిగా విన్పించలేదు.

అప్పటికే ఆ కాలనీ నుంచి హార్వార్డ్ స్కూలుకెళ్ళే పిల్లలు ఐదారుగురు అక్కడ నిలబడి ఉన్నారు. తన క్లాస్‌మేట్ రమ్యని చూడగానే ప్రసాద్‌లో ఉత్సాహం పెల్లుబికింది. “హాయ్... హోం వర్క్ మొత్తం చేశావా... అసలే మ్యాథ్స్‌సార్ మహా కోపిష్ఠి... బెత్తం విరిగేలా కొడ్తాడు” అన్నాడు.

"ఓ... నిన్ననే చేశా. ఐనా సార్ గాళ్స్‌ని కొట్టరు" కళ్ళు తమాషాగా మూసి తెరుస్తూ అంది.

'ఆ అమ్మాయి కళ్ళు ఎంతందంగా ఉన్నాయో చూశారా? తుమ్మెద రెక్కల్లా ఆ కన్రెప్పలు... పాత సినిమాల్లో సావిత్రి కళ్ళు అచ్చు యిలానే ఉండేవి కదా' అని అమ్మ నాన్నతో అనటం ప్రసాద్ చాలా సార్లు విన్నాడు.

యిద్దరివీ పక్కపక్క యిళ్ళే. యిద్దరూ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. రమ్య వాళ్ళ నాన్న నిజాం కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్. ప్రసాద్ వాళ్ళ నాన్న కెనరా బ్యాంక్‌లో ఆఫీసర్. అమ్మకూడా అదే బ్యాంక్‌లో క్లర్క్ గా పన్చేస్తోంది.

"మీ నాన్న నీకన్నీ చెప్తాడు. హోం వర్క్‌లో హెల్ప్ చేస్తాడు. అందుకే క్లాస్ ఫస్ట్ ఎప్పుడూ నీకే వస్తుంది. మానాన్నకు లెక్కలు రావు. బికాం కదా చదివాడు" అన్నాడు ప్రసాద్.

"మీరందరూ అనుకుంటున్నట్లు మా డ్యాడీ ఏం చెప్పడు. నేనే చదువుకుంటాను. హోంవర్కంతా నేనే చేశాను తెలుసా. మా డ్యాడి హెల్ప్ చేయలేదు... నిజం" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అంది.

బస్ వచ్చింది. ప్రిన్సిపాల్ గారు చెప్పిన విషయం గుర్తొచ్చి పిల్లలందరూ క్యూలో నిలబడ్డారు. ప్రసాద్ వెనక రమ్య... రమ్య వెనక యిద్దరు అబ్బాయిలు...

ప్రసాద్ ముందున్న పిల్లలు బస్ ఎక్కారు. ప్రసాద్ వంతు వచ్చింది. కుడికాలు ఎత్తి ఫుట్ బోర్డ్ మీద పెట్టబోయాడు. కాలు కదల్లేదు. ప్రసాద్‌కి ఓ క్షణం ఏం జరుగుతుందో అర్థం కాలేదు. మరలా బలమంతా వుపయోగించి కాలు కదల్చడానికి ప్రయత్నించాడు. ప్రయోజనం కన్పించలేదు. 'ఇదేమిటి? కాలు నా స్వాధీనంలో లేదేమిటి? చచ్చుబడి పోయినట్లు... శిథిలమైపోయినట్లు... తను టివీలో చూసిన ఓ జానపద సినిమాలో హీరో కాళ్ళు శాపవశాన శిలలా మారిపోయినట్లు తన కాళ్ళు కూడా మారిపోతున్నాయా...

"తొందరగా ఎక్కు" వెనకనుంచి రమ్య అసహనంగా అరిచింది.

ఎడం కాలు ఎత్తాడు. కాలు కదిలింది. ప్రాణం లేచొచ్చింది. అమ్మో... యిందాక ఎంత భయం వేసిందో... ఫుట్‌బోర్డ్ మీద ఎడం కాలిని పెట్టి కుడికాలిని పైకి లాక్కున్నాడు. బస్‌లోకి ఎక్కాక ఖాళీ సీటుకోసం పరుగెత్తుతున్న రవిని చూసి పోటీపడ్తూ పరుగెత్తాడు.

మరో అడుగేస్తే చాలు ఆ సీటుని చేరుకోవచ్చనుకుంటున్నంతలోనే ధడాల్న పడిపోయాడు. బస్‌లో ఉన్న విద్యార్థులందరూ మొదట నిశ్శబ్దమైపోయి తర్వాత పెద్దగా నవ్వారు.

ప్రసాద్‌కి అవమానం, కోపం, రోషం, ఏడుపు... అన్నీ ఒకేసారి వచ్చాయి. అప్పటికే సీట్లో కూచున్న రవి చొక్కా పట్టుకుని "కాలెందుకు అడ్డం పెట్టావురా. నన్ను పడేశావని ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేస్తానుండు" అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాడు రవి. "నేను కాళ్ళడ్డం ఎలా పెడ్తాను? నువ్వు నా ముందున్నావు. నువ్వు పరుగెత్తావు... నీ వెనక నేనూ పరుగెత్తాను. అంతే. నువ్వెలా పడ్డావో నాకు తెలీదు" అన్నాడు. రవి పదో తరగతి చదువుతున్నాడు.

తనకంటే చిన్నవాడైన ప్రసాద్ చొక్కా పట్టుకున్నా అతను పడిపోయాడన్న సానుభూతి వల్ల అతనికి కోపం రాలేదు.

"లేదు. నువ్వు వెనక నుంచి కాలు అడ్డం పెట్టి ఉంటావు. మనం రోజూ యిలా సీట్ల కోసం పోటీలు పడ్తుంటాంగా. ఎప్పుడైనా పడ్డానా" ఉక్రోషంగా అన్నాడు ప్రసాద్.

"ప్రామిస్... మదర్ ప్రామిస్. నేను పడేయలేదురా. నువ్వే పడ్డావు"

"ఎందుకు పడ్తాను? వూర్కే వూర్కే పట్టానికి నేనేమైనా పిచ్చోణ్ణా"

"ఏమోరా" అనగానే మళ్ళా అందరూ నవ్వారు.

"ఉండు. నీ సంగతి యిప్పుడు కాదు. తర్వాత చెప్తాను"

స్కూల్ గేట్లోంచి లోపలికెళ్ళిన మరుక్షణం ప్రసాద్ యివన్నీ మర్చిపోయాడు.

మరునాడు ఆదివారం.

ప్రసాద్‌కి సైకిల్ తొక్కడం చాలా యిష్టం. పక్కింటి రమ్య సైకిల్ కొన్నప్పటి నుంచీ ఆ కోరిక మరీ బలంగా వేళ్లూనుకుంది.

పేపర్ చదువుకుంటున్న నాన్న దగ్గరకెళ్ళి "డ్యాడీ... సైకిల్ కొనివ్వరా?" అని అడిగాడు.

"సైకిలా... ఎందుకురా నీకు" విసుగ్గా అన్నాడు.

"నా ఫ్రెండ్సందరూ సైకిళ్ళేసుకునే స్కూలు కొస్తున్నారు తెలుసా... నేనూ సైకిల్ మీదే స్కూల్‌కెళ్తా డ్యాడీ... మీకు బస్సుకి నెలనెలా కట్టే డబ్బులు మిగుల్తాయి"

"నీ అతి తెలివి నాదగ్గర చూపించకు. బస్సుకి డబ్బులు ఖర్చయినా పర్లేదు. బస్‌లోనే వెళ్ళు"

"సైకిల్ కొనిస్తే మీకేంటి నష్టం?" వాడికప్పటికే ఏడుపొచ్చేస్తోంది.

"నష్టమేరా... సైకిల్ పైనుంచి పడ్తే దెబ్బలు తగుల్తాయి. నువ్వు స్కూల్ నుంచి వచ్చేవరకు టెన్షన్‌తో చావాలి. బస్సే మనకు కన్వీనియంట్. గుమ్మం ముందు ఆగుతున్నట్టే లెక్క. సేఫ్ అండ్ సెక్యూర్"

"మా స్కూల్లో ఆడపిల్లలు కూడా సైకిళ్ళ మీద వస్తారు డ్యాడీ. రమ్య వాళ్ళ డ్యాడీ కూడా రమ్యకు సైకిల్ కొనిచ్చారు. రోజూ సాయంత్రం ప్రాక్టీస్ చేస్తోంది... మీరూ చూశారుగా"

"వాళ్ళందరి సంగతి నాకెందుకురా... నేను సైకిల్ కొనివ్వను. నీకు దెబ్బలు తగిల్తే తట్టుకోలేనురా"

"నేర్చుకునే టైంలో ఎవ్వరికైనా దెబ్బలు తగుల్తాయి డ్యాడీ. మీరూ చిన్నప్పుడు సైకిల్ పై నుంచి మూడు నాలుగు సార్లు పడ్డానని చెప్పారు కదా. ఐనా తాతగారు మీకు సైకిల్ కొనిచ్చారు కదా"

"ఒరేయ్... నీ వెధవ లాజిక్కులు నా దగ్గర వాడకు. మా నాన్నకు ఆరుగురు సంతానం. నేను నాలుగోవాణ్ణి. నాకు నువ్వొక్కడివే నలుసువి" అన్నాడు

"అందునా లేకలేక కలిగిన సంతానం. పెళ్ళయిన ఎనిమిదేళ్ళకు పుట్టావు. మేం తిరగని గుళ్ళూ గోపురాలు లేవు. మేం మొక్కని దేవుళ్ళు లేరు. నీకేమైనా ఐతే నేనుగాని, నాన్నగాని తట్టుకోలేం బాబూ" అంది అమ్మ.

నాన్న కన్నా అమ్మని ఒప్పించడం సులభమని వాడికి వూహ తెల్సినప్పటి నుండే అర్థమైంది.

ఆ రోజుకి మరలా సైకిల్ ప్రస్తావన తీసుకురాకుండా జాగ్రత్త పడ్డాడు.

మరునాడు స్కూలు నుంచి ఎప్పటికిమల్లే నాలుగున్నరకు యింటికొచ్చేశాడు. తను వచ్చిన రెండు గంటలకు అమ్మ బ్యాంక్ నుంచి వచ్చింది. నాన్న మామూలుగా ఎనిమిది దాటితేగాని రాడు.

అమ్మ కిచెన్‌లో వంటపనిలో నిమగ్నమైపోయింది.

"మమ్మీ. కూరలు తరగమంటావా" అంటూ కిచెన్ లోకెళ్ళాడు.

"వద్దు నాన్నా. తరిగిపెట్టిన కూరలు ఫ్రిజ్‌లో ఉన్నాయి" మురిపెంగా కొడుకు వైపు చూస్తూ అంది సరోజ.

"ఎనీ అదర్ హెల్ప్ మమ్మీ" వాడి కళ్ళు ఆశగా మెరుస్తున్నాయి.

"యస్... బాగా చదువుకుని, మంచి మార్కులు తెచ్చుకుని, ఓ జిల్లాకి కలెక్టరయిపో... చాలు. అంతకన్నా ఏమీ కోరను"

"మమ్మీ... నీకోసం తప్పకుండా అవుతాను. ష్యూర్ మమ్మీ. నా జీతంతో నీకు కారు కొనిపెడ్తా... స్కార్పియో. నువ్వు దర్జాగా కార్లో బ్యాంకుకెళ్ళొచ్చు"

"అప్పటికి రిటైరైపోతానేమోరా" కొడుకు వైపు గర్వంగా చూసుకుంటూ చెప్పింది.

"ఐతే ఏమైంది? అప్పుడు కారేసుకుని రోజూ సాయంత్రం నెక్లెస్ రోడ్డుకి షికారుకెళ్ళి రావొచ్చు" అన్నాడు.

కొన్ని క్షణాల విరామం తర్వాత "మమ్మీ... నాదో చిన్న రిక్వెస్ట్. ప్లీజ్ మమ్మీ తీర్చవా?" అన్నాడు.

"ఓ అదా సంగతి... నా రాజా బాబు ఏదో టెండర్ పెట్టబోతున్నాడన్మాట. సరే చెప్పు ఏంటో ఆ రిక్వెస్ట్"

"సైకిల్ కొనివ్వమని నాన్నకు చెప్పు మమ్మీ"

"నిన్న చెప్పాంగా... సైకిల్ కొనే ప్రసక్తే లేదు. నువ్వు బ్యాలెన్స్ చేయలేవు"

"చేస్తాను మమ్మీ. రెండిళ్ళవతల రవి లేడూ... వాడి సైకిల్ రెండు మూడు సార్లు నడిపాను"

కొడుకు వైపు ఆశ్చర్యంగా చూసింది. "ఓరి రాస్కెల్... పడలేదా... పడకుండా ఎలా నేర్చుకున్నావురా? పడ్డా మాకు తెలీకుండా దెబ్బల్ని దాచుకున్నావా?"

"లేదు మమ్మీ... రవి పట్టుకున్నాడు. నేను మెల్లగా నడిపాను. పడకుండా నాకు కాళ్ళు అందుతాయి తెలుసా"

"ఐనా సరే... నో సైకిల్. నువ్వు స్కూల్‌కి బస్‌లోనే వెళ్ళాలి"

ప్రసాద్ తలొంచుకుని మౌనంగా కూచున్నాడు. అలా కూచుంటే బాధపడిపోతున్నాడనుకుని అమ్మ కరిగిపోతుందని వాడి ఆశ.

వాడు వూహించినట్టే ఆమె దగ్గరకొచ్చి కొడుకు తల నిమురుతూ, "నా మాట విను కన్నా. నువ్వు పెద్దయ్యాక ఏకంగా కారే కొనిస్తారు డ్యాడీ... సరేనా"

"ప్లీజ్ మమ్మీ. అపుడు కారు కొనిచ్చినా యిపుడు సైకిల్ కొనివ్వలేదన్న దిగులు మిగిలి పోతుందిగా మమ్మీ"

ఆ మాటకు ఆమె పెద్దగా నవ్వింది... తెరలు తెరలుగా నవ్వింది.

"నా బాబుకి ఎంత తెలివో... సరే. ఓ కండిషన్ మీద మీ నాన్నని ఒప్పిస్తా. నువ్వు స్కూల్‌కి బస్‌లోనే వెళ్ళాలి"

ప్రసాద్ కొన్ని క్షణాలు ఆలోచించాడు. మొదట సైకిల్ కొనిస్తే బాగా నేర్చుకున్నాక అప్పుడు మరలా స్కూలుకేసుకెళ్ళే ప్రస్తావన తీసుకురావొచ్చు అనుకుని "సరే మమ్మీ. నీ యిష్టం" అన్నాడు.

"మళ్ళా ఆ అతి తెలివి చూడు. యిపుడు తీరబోతుంది నీ యిష్టం. యిందులో నా యిష్టమేదో ఉన్నట్టు ఎలా అంటున్నాడో చూడు" అంటూ మురిసిపోయింది.

***

ఓ పది రోజుల తర్వాత...

సాయంత్రం ఆరు గంటల సమయం.

ప్రసాద్ ఆతృతగా అమ్మ రాకకోసం ఎదురు చూస్తున్నాడు. నిమిషాలు యుగాల్లా ఉన్నాయి. అసహనంగా లోపలికి బైటికి పదిసార్లు తిరిగి ఉంటాడు. 'అమ్మ ఎప్పుడూ యింతే... చెప్పిన టయానికేదీ చేయదు' అనుకున్నాడు. యిహ లాభంలేదని యింటి గడపమీదే కూచున్నాడు. చూపు రోడ్డుమీదే ఉంది. మనసంతా అమ్మ తీసుకొస్తానన్న సైకిల్ మీదే ఉంది. ఎలా ఉంటుందో సైకిల్? ఏ రంగుది తెస్తుందో... తను బ్లాక్ కలర్ కావాలని అడిగాడు. రమ్య సైకిల్ కంటే అందంగా ఉండాలని చెప్పాడు.

యింటి ముందు ఆటో ఆగగానే పరుగెత్తాడు. ఆటో డ్రైవర్ దిగి వెనకున్న సైకిల్ని

కిందకు దింపి పట్టుకున్నాక సరోజ దిగి, ఆటోకి డబ్బులిచ్చింది.

ప్రసాద్ జెట్‌స్పీడులో వెళ్ళి సైకిల్‌ని లాగేసుకున్నాడు. "అంత తొందరేమిట్రా... నిదానం" అని అమ్మ అంటున్న మాటలు వాడికి విన్పించలేదు. వళ్ళంతా కళ్ళు చేసుకుని తన సైకిల్‌ని చూసుకున్నాడు. కలర్ బ్లాకే... బావుంది. కొత్తగా నిగనిగలాడ్తోంది.

"మమ్మీ... యిపుడే వస్తాను" అంటూ సైకిల్ని నడుపుకుంటూ బయల్దేరాడు.

"ఎక్కడికిరా... నాన్న వచ్చేవరకు ఆగరా?" అంటున్న అమ్మతో "రవిగాడికి సైకిల్ చూపించి వస్తాను మమ్మీ... జస్ట్ వన్ మినిట్" అన్నాడు.

రవి దగ్గరకెళ్ళకుండా మొదట రమ్య వాళ్ళింటికెళ్ళాడు. "రమ్యా... మా డ్యాడీ నా కోసం సైకిల్ కొన్నారు చూశావా?" మొహం నిండా నవ్వులు విరబూస్తుండగా అన్నాడు.

"వావ్... ఎంత బావుందో" రమ్య సైకిల్‌ని ముట్టుకుని చూసింది. "నడపటం వచ్చా... ప్రాక్టీస్ చేయాలా?"

"వచ్చు... నువ్వూ వస్తావా... సైకిల్ మీద రెండు రౌండ్లు వేద్దాం" తన ప్రతిభని రమ్యకు చూపించాలన్న ఆతురత అతన్లో.

"సరే పద. నేను నా సైకిల్ తెచ్చుకుంటాను" అంది రమ్య.

రమ్య సైకిల్ తొక్కుతుంటే ఆ అమ్మాయి పక్కనే ఉండటానికి ప్రయత్నిస్తూ సైకిల్ నడుపుతున్నాడు ప్రసాద్. మనసంతా గాల్లో తేలిపోతున్నట్లుంది. కాలనీ చుట్టూ ఒక రౌండ్ పూర్తయింది. రెండో రౌండ్లో రమ్య స్పీడ్ పెంచింది. ప్రసాద్ పెడల్ని బలంగా తొక్కడానికి ప్రయత్నించాడు. కుడికాలు కదల్లేదు. మరలా ఎడంకాలితో ప్రయత్నించాడు. ఫలితం శూన్యం. అతనికి భయంతో చెమటలు పట్టాయి.

"అంత స్లో ఏంటి? నువ్వు వెనకబడి పోతున్నావు" ముందున్న రమ్య వెనక్కి తిరక్కుండానే అంది.

సైకిల్ బాగా స్లో ఐంది. పెడల్ని కదిలించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు ప్రసాద్. యింకా స్లో ఐ సైకిల్తోపాటు కింద పడిపోయాడు.

రమ్య సైకిల్ ఆపి "ఏమైంది పడిపోయావు... బ్యాలెన్స్ కోల్పోయావా" అంటూ

వెనక్కి వచ్చి అతనికి చేయందించి లేపింది.

అతను సమాధానం యివ్వలేదు. సిగ్గుతో అవమానంతో మొహం ఎర్రగా కందిపోయింది. సైకిల్ని లేపి రమ్య పిలుస్తున్నా వినకుండా యింటికెళ్ళిపోయాడు.

"వంటినిండా ఆ దుమ్మేంట్రా... పడ్డావా... అయ్యో చూడు మోచేతి దగ్గర ఎలా గీరుకు పోయిందో" సరోజ కంగారు పడ్తూ దూదిని డెట్టాల్తో తడిపి గాయమైన చోట శుభ్రం చేసి ఆయింట్‌మెంట్ రాసింది.

ప్రసాద్‌కి అయోమయంగా ఉంది. ఎందుకు తను సైకిల్ పెడల్ని తొక్కలేకపోయాడు? అమ్మకు చెప్పాలనుకున్నాడు. స్నానం చేసొచ్చాక అమ్మ వడ్డించిన భోజనం చేసి పుస్తకాలు ముందరేసుకుని కూచోగానే ఆ విషయాన్ని మర్చిపోయాడు.

***

సరోజ ఆఫీసు నుండి త్వరగా వచ్చేసింది.

బైట సైకిల్ తొక్కుతున్న ప్రసాద్ అమ్మను చూడగానే యింట్లోకొచ్చి "ప్లెజంట్ సర్‌ప్రైజ్ మమ్మీ. నువ్వు మామూలుగా వచ్చే టైంకంటే గంట ముందొచ్చేశావు" అన్నాడు.

"యింకో సర్‌ప్రైజ్ ఏంటో తెలుసా... రేపు శెలవ పెట్టేశాను. ఎందుకో చెప్పుకో చూద్దాం"

ప్రసాద్ మొహంలో సంతోషం పుచ్చపువ్వులా విచ్చుకుంది. "మమ్మీ... రేపు నా బర్త్‌డే కదా. అందుకే కదా శెలవపెట్టావు"

"మరి నా రాజా బేటా పుట్టిన రోజుని ధూంధాంగా చేయాలి కదా. నీకోసం రేపన్నీ స్పెషల్ ఐటెమ్స్ చేయాలనుకుంటున్నా. అందుకే బ్యాంక్ నుంచి తొందరగా వచ్చేశా. నీకు గారెలు, చికెన్ కర్రీ అంటే యిష్టం కదా. వాటితోపాటు పులిహోర, పాయసం చేస్తాను. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ఏం కావాలో చెప్పు"

"నేనేదడిగితే అది చేసి పెడ్తావా?"

"యస్... నువ్వు ఆర్డర్ వేయటమే" అంటూ నవ్విందామె.

"దోసెలు"

"మీ నాన్నకి దోసెలో కోడికూర నంజుకు తినటం యిష్టమని కదా అలా అడిగావు.

నాకు తెలుసులే... నువ్వెప్పుడూ మీ నాన్న పార్టీనే" అందామె అలిగినట్లు మొహం పెట్టి.

"లేదు మమ్మీ. నాకు నువ్వంటేనే యిష్టం. నాన్నన్నా యిష్టమే కానీ ఓ సెంటీమీటర్ తక్కువ యిష్టం" అంటూ వాళ్ళమ్మ మెడ చుట్టూ చేతులేసి "నాకు నువ్వంటే ప్రాణం" అన్నాడు.

"చాల్లేరా సినిమా డైలాగులు. ఉత్త మాటలు కాదు... చేతల్లో చూపించు"

"మమ్మీ... ఏం చేయమంటావో చెప్పు... నీకోసం ఏం చేయడానికైనా సిద్ధమే. ప్రాణాలిచ్చేయమంటావా... నవ్వుతూ యిచ్చేస్తా"

"నోర్ముయ్ వెధవా... అపశకునపు మాటలు మాట్లాడకూడదని ఎన్ని సార్లు చెప్పాను? ఉత్త వాగుడు కాయవైనావు. చిన్నప్పుడు వద్దన్నా వినకుండా మీ అమ్మమ్మ వస ఎక్కువ పోసింది నీకు. నా దుంప తెంచుతున్నావు" ఆమె వంట గదిలోకి వెళ్తూ అంది.

ప్రసాద్ కూడా ఆమెతో పాటు వంటగదిలో కెళ్ళాడు.

"మమ్మీ. రేపు సినిమాకెళ్దాం. మనందరం కలిసి సినిమాకెళ్ళి ఎన్ని రోజులైందో"

"సరేరా. ఏ సినిమానో నువ్వే చెప్పు. ఎటొచ్చీ మరీ కొత్త సినిమాలు చెప్పకు. టిక్కెట్లు దొరకవు. అంత మంది జనాల్ని చూస్తే నాకు వూపిరాడదు. అన్నింటికంటే ముఖ్యం రేపు ఒక్కరోజైనా తొందరగా యింటికి రమ్మని మీ నాన్నతో చెప్పాలి"

ప్రసాద్‌కి మేఘాలమీద తేలిపోతున్నట్లుంది. పుట్టినరోజుకని అమ్మ కొనుక్కొచ్చిన రెడీమేడ్ బట్టల్ని తీసి చూసుకున్నాడు. రేపు స్కూల్లో టీచర్లందరితోపాటు తన క్లాస్‌లో వాళ్ళకి చాక్లెట్లు యివ్వడానికి షాపుకెళ్ళి క్యాడ్‌బరిస్ చాక్లెట్లు కొన్నాడు. ఆఫీసునుండి వచ్చేటప్పుడు వాడి నాన్న కేక్ కొనుక్కొచ్చాడు.

"ముందే చెప్తున్నా విను. అర్ధరాత్రి పన్నెండింటికి లేచి కేకు కట్ చేయడాలు, హ్యాపీ బర్త్‌డేలు చెప్పుకోడాలు నాకిష్టముండదని నీకు తెల్సుగా. ఐనా అర్ధరాత్రి అంకమ్మ శివాల్లా పన్నెండింటి దాకా మేల్కొని, మరునాటికి మొహాలు వాడిపోయి... యింక బర్త్‌డేలో హేపీ ఏమిట్రా... న్యూయియర్ అర్ధరాత్రి పన్నెండింటికి చేసుకోవడంలో అర్థముంది. బర్త్‌డేలకి ఈ జాడ్యాన్ని అంటించిందెవరు? అసలీ కేకులు కట్ చేసే కల్చర్

కూడా నాకిష్టముండదు. నీ పోరు పడలేక తెచ్చాను. నువ్వు ఉదయం స్కూల్ కెళ్ళే ముందు కట్ చేద్దాం. బాక్స్‌లో కొన్ని పీసెస్ పట్టుకెళ్ళి ముఖ్యమైన ఫ్రెండ్స్‌కి యిచ్చుకో. సరేనా" అన్నాడు వాడి నాన్న.

ప్రసాద్ బుద్ధిగా తలూపాడు. "రేపు సినిమాకి మాత్రం తొందరగా రావాలి. లేకపోతే టిక్కెట్లు దొరకవు" అన్నాడు.

"సరేలేరా... యిప్పటికి డజను సార్లు చెప్పావు."

"నువ్వు పన్లో పడ్తే మర్చిపోతావు నాన్నా. ఎన్ని సార్లు అనుభవం కాలేదూ. అడ్మిషన్ టైంలో, ఫీజు కట్టాల్సి వచ్చినపుడు, పేరెంట్స్ మీట్ అప్పుడు... పాపం మమ్మీనే అన్నీ చూసుకుంటుంది"

"నీ మమ్మీ సమర్థురాలన్న నమ్మకంతోనే నీ బాధ్యతంతా ఆమెకొదిలేశా" అంటూ సరోజ వైపు చూసి కన్ను గీటాడతను.

"డ్యాడీ. యిలాంటి సాకులు చెప్పి తప్పించుకోవాలనుకుంటున్నావేమో... నేనొప్పుకోను"

"సరే... సరే... రేపు ఐదింటికల్లా యింట్లో ఉంటా. నిన్నూ అమ్మనీ పిల్చుకుని ఆ దిక్కుమాలిన సినిమాకి తీస్కెళ్తా. కనీసం ఏ విశ్వనాథ్ గారి సినిమాకో బాలచందర్ గారి సినిమాకో కాకుండా కత్తులూ, గొడ్డళ్ళతో ఒకర్ని ఒకరు నరుక్కునే సినిమా సెలక్ట్ చేశావేమిట్రా?"

"చాలా బావుందట నాన్నా... నా ఫ్రెండ్స్ చాలా మంది చూశారు"

"రేపు నీ బర్త్ డే కదా... కానీయ్... నీ యిష్టారాజ్యమే నడవనీ" అన్నాడతను.

మరునాడు ప్రసాద్‌కి తలంటి స్నానం చేయించింది సరోజ. యూనిఫాం కాకుండా కొత్త బట్టలు వేసుకొచ్చిన ప్రసాద్ పూజగదిలో ఉన్న దేవుళ్ళ విగ్రహాలకి మొక్కాక, పాయసం తిన్పించబోతే "ఒక్క క్షణం మమ్మీ" అంటూ అమ్మానాన్న కాళ్ళకు నమస్కారం చేశాడు.

"చూశారా నా కొడుకెంత బుద్ధిమంతుడో" అంటూ మురిసిపోతున్న సరోజతో "కాకా పట్టడంలో నిష్ణాతుడు" అని పైకన్నా లోలోపల వాడి నాన్న కూడా సంతోషపడ్డాడు.

కట్ చేసిన కేక్ ముక్కల్ని వేరే టిఫిన్ బాక్సులో పెట్టుకుని, చాక్లెట్ ప్యాకెట్లు బ్యాగులో పెట్టుకుని బస్టాప్ దగ్గర నిలబడ్డాడు. అతని కళ్ళు రమ్య కోసం వెతుక్కున్నాయి. రోజూ తనకంటే ముందుండే రమ్య ఈ రోజెందుకో లేటయింది. అసలొస్తుందా... జ్వరమేమైనా వచ్చిందా... దూరంగా బస్ వస్తూ కన్పించగానే అతన్లో ఆతురత... తల తిప్పి వెనక్కి చూశాడు. రమ్య పరుగెత్తుకుంటూ వస్తోంది. ప్రసాద్ అసంకల్పితంగా ఆమెకు ఎదురెళ్ళి "యింతాలస్యమైందేం. బస్ వచ్చేస్తోంది" అన్నాడు.

రమ్య అతని చేతిలో ఓ ప్యాకెట్ పెట్టి "హేపీ బర్త్ డే ప్రసాద్" అంది.

"నా బర్త్ డే అని నీకెలా తెలుసు" సంతోషంతో ఉక్కిరి బిక్కిరౌతూ అడిగాడు.

"లాస్ట్ యియర్ నా కోసం స్కూల్‌కి కేక్ తెచ్చావుగా. నాకు గుర్తుంది. నా ఫ్రెండ్స్ బర్త్‌డేలని మర్చిపోను" అంది.

"థ్యాంక్స్. ఈ రోజు కూడా నీకోసమని కేక్ తెచ్చాను" తన బ్యాగ్‌లో వెతకబోతున్న ప్రసాద్‌తో "బస్ వెళ్ళిపోతుంది. మొదట బస్సెక్కు. తర్వాత చూసుకుందాం" అంది రమ్య. యిద్దరూ బస్ ఎక్కారు. మళ్ళా కేక్ తీయబోతే యిపుడొద్దన్నట్టు సైగచేసింది.

స్కూల్ గేట్లోంచి లోపలికెళ్ళగానే కేక్ తీసి రమ్యకిచ్చాడు. "నేనిచ్చిన గిఫ్ట్ ఏమిటో చూసుకోవా" అందా అమ్మాయి. గిఫ్ట్ రేపర్ని విప్పదీశాడు. లోపల కాఫీ రంగు హీరో పెన్... గోల్డెన్ కలర్ క్యాప్... ఎంతందంగా ఉందో... "ఐ లవ్ యిట్" అన్నాడు.

"బాల్ పాయింట్ పెన్లు వాడకంలోకి రాక ముందు యింక్ పెన్నులే వాడే వాళ్ళు కదా. ఆ రోజుల్లో హీరో పెన్ వాడటం అంటే చాలా గొప్ప అని మా డ్యాడీ చెప్పారు. అందులోనూ ఈ రంగు పెన్ చాలా మంది యిష్టపడేవారట. నీకు స్పెషల్‌గా ఉండాలని కొన్నాను. గిఫ్ట్ ప్యాక్ చేయించడానికి మనింటి దగ్గరున్న షాపుకెళ్ళాను. అందుకాలస్యమైంది"

"ఈ గిఫ్ట్‌ని చాలా భద్రంగా, అపురూపంగా దాచుకుంటాను. ప్రామిస్" అన్నాడు. రమ్య విరిసిన మందారంలా నవ్వింది.

స్కూల్లో ఉన్నంత సేపూ ప్రసాద్‌కి చాలా హాయిగా గడిచింది. టీచర్లందరూ హేపీ బర్త్ డే చెప్పడాలూ... వాళ్ళకి చాక్లెట్లు పంచడాలూ... తన క్లాస్‌మేట్స్‌తో సరదాగా

కబుర్లు... సమయమే తెలీలేదు. నాల్గింటికి స్కూల్ వదిలారు. నాలుగున్నరకల్లా యింట్లో ఉన్నాడు.

రాగానే "నాన్నకు ఫోన్ చేశావా... యిపుడు బయల్దేరితే కదా ఐదింటికి రాగలరు" అన్నాడు

"యిప్పటికి రెండుసార్లు చేశాన్రా... సెల్ మోగుతోంది కాని రెస్పాన్స్ లేదు. బహుశా ఏ మీటింగ్‌లోనో ఉండి ఉంటారు. సెల్ ఫోన్‌ని సైలెంట్ మోడ్‌లో పెట్టి ఉంటారు"

"నాన్న ఎప్పుడూ యింతేనమ్మా"

"పని కదా నాన్నా... ఉద్యోగాలన్నాక బాస్ చెప్పినట్లు వినాలి కదా"

"పని రోజూ ఉండేదేగా మమ్మీ. నా బర్త్ డే ఏడాదికొక్కసారేగా వచ్చేది" వస్తున్న ఏడుపుని ఆపుకున్నాడు.

"యింత చిన్న విషయానికే బాధ పడిపోతే ఎలా నాన్నా... సినిమా ఎక్కడికి పోతుంది? ఈ రోజు కాకపోతే రేపు చూడొచ్చు. ఐనా యింకా టైం ఉందిగా. నువ్వు టెన్షన్ పడకు"

సరోజ మరోసారి ఫోన్ చేసింది. రెస్పాన్స్ లేదు.

ప్రసాద్ మొహం వేలాడేసుకుని సోఫాలో కూర్చున్నాడు.

సమయం ఐదయింది. సరోజలోకూడా అసహనం... ఐదుంపావుకి ఈ రోజిక సినిమాకి వెళ్ళొద్దనే నిర్ణయానికొచ్చేసింది. ఐదు గంటల యిరవై నిముషాలకి భర్తనుంచి ఫోనొచ్చింది.

"యిప్పుడే మీటింగయిపోయింది. చాలా యింపార్టెంట్ మీటింగ్ కాబట్టి మిస్ చేయడానికి వీలు కాలేదు. రెడీగా ఉన్నారుగా. ఓ పని చేయి. డైరెక్ట్‌గా సినిమా హాలు దగ్గరకు వచ్చేయి. శాంతి టాకీస్ కదా. టిక్కెట్లు తీసుకో. ఈ లోపల నేను వచ్చేస్తాను" అన్నాడు.

"పర్లేదులెండి. అంత హడావిడి పడ్తూ సినిమా చూడకపోతేనేం... మీరు సినిమా హాలు దగ్గరకు రావాలన్నా కనీసం అరగంట పడ్తుంది. ఆరింటికి సినిమా మొదలు

పెడ్తారు. రేపు వెళ్దాంలెండి. మీరింటికి వచ్చేయండి" అంది.

"రేపు కాదు మమ్మీ. ఈ రోజే వెళ్దాం" అమ్మ దగ్గర నిలబడి పెద్దగా అరిచాడు ప్రసాద్.

ఫోన్లో అటువైపు నుండి నవ్వు విన్పించింది. "మన పుత్రరత్నం ఏమంటున్నాడో విన్నావుగా. పుట్టిన రోజునాడు వాణ్ణి డిసప్పాయింట్ చేయటమెందుకు? నువ్వు బయల్దేరు. మళ్ళా టిక్కెట్లు దొరక్కపోతే వాడు బాధ పడ్తాడు"

యింటికి తాళం వేసి ఆటో మాట్లాడుకుని సినిమా హాలుకెళ్ళేటప్పటికి సమయం ఐదు గంటల నలభై నిముషాలైంది. సరోజ టికెట్ కౌంటర్ దగ్గరకెళ్ళి బాల్కనీకి మూడు టిక్కెట్లు తీసుకుంది.

"నీ అదృష్టంరా. మనం లేట్‌గా వచ్చినా హౌస్ ఫుల్ కాలేదు" అంది ప్రసాద్‌తో.

తన మాట నెగ్గించుకున్నందుకు వాడికి చాలా సంతోషంగా ఉంది. నాన్న రావటమే మిగిలింది. సినిమా హాల్లో కొస్తున్న ప్రతి స్కూటర్ వైపు నాన్నేమోననే ఆశతో చూస్తున్నాడు.

సమయం ఆరుగంటలైంది. సినిమా మొదలైంది. ప్రసాద్ తొందరపెడ్తున్నాడు. "మమ్మీ... మొదట్లోనే గొప్ప ఫైటింగ్ సీన్ ఉంటుందట. మనం మిస్ అయిపోతాం మమ్మీ" అంటూ ఒకటే గొడవ...

సరోజకి అర్థం కావటం లేదు. మామూలుగా ఐతే ఈపాటికి వచ్చేయాలి. ఎక్కడైనా బాగా ట్రాఫిక్ జాం అయిందేమో... అలా జరిగిఉంటే తప్పకుండా ఫోన్ చేసి ఉండేవారు.

ఆరుంపావైంది. సరోజ అతని సెల్‌కి ఫోన్ చేసింది. మోగుతోంది కాని రెస్పాన్స్ లేదు.

అరున్నర... "మమ్మీ... సినిమా సగమైపోయి ఉంటుంది. డ్యాడీ ఎప్పుడూ యింతే" ప్రసాద్ చిందులేస్తున్నాడు. సరోజలో కొద్దికొద్దిగా చోటుచేసుకుంటున్న భయం.

దార్లో ఏమైనా సమస్య ఏర్పడిందా... స్కూటర్ రిపేరుకొచ్చిందా...

మళ్ళా అతని సెల్‌కి ఫోన్ చేసింది. నో రెస్పాన్స్...

"మనం హాల్లోకెళ్ళి కూచుందాం మమ్మీ. డ్యాడీ వచ్చినపుడు సెల్‌కి ఫోన్ చేస్తారుగా.

అప్పుడు నేను బైటికొచ్చి డ్యాడీకి టిక్కెట్ యిచ్చి లోపలికి పిల్చుకొస్తా" అన్నాడు ప్రసాద్.

ఆమెకేం చేయాలో తోచటం లేదు. వాడి గోల భరించలేక మెట్లెక్కి హాల్లోకెళ్ళింది. కొద్దిగా తీసిన తలుపుల్లోంచి డైలాగులు అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

"పద మమ్మీ. లోపలకెళ్దాం" అన్నాడు ప్రసాద్.

తన చేతిలో నిశ్శబ్దంగా ఉన్న సెల్ వైపు దీర్ఘంగా చూసి, నిట్టూర్చి "సరే పద" అంటూ తలుపు వైపుకి కదిలింది. తలుపు తీసి లోపలికెళ్ళబోతున్నప్పుడు సెల్ మోగింది. తన భర్త నుంచే ఫోన్.

ఆమె ఉద్విగ్నంగా "ఎక్కడున్నారండీ? యింతాలస్యమైందేం?" అంది.

అట్నుంచి వెంటనే సమాధానం రాలేదు. "మాట్లాడరేంటండీ?" అంది గొంతు పెంచి.

"నా పేరు సుధాకర్ మేడం. సబిన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్. మీరు ఈయనకేమవుతారు?" అని విన్పించింది.

ఆమె స్థాణువులా నిలబడిపోయింది. తన భర్త సెల్లోంచి ఈ పోలిసెవరో ఎందుకు మాట్లాడుతున్నాడు? ఈయన సెల్ పోయిందా? దొరికినవాళ్ళు పోలీసులకి యిస్తే ఫోన్ చేస్తున్నారా...

ఈయన కూడా పోలీస్ స్టేషన్లో ఉన్నారా? లాంటి సవాలక్ష అనుమానాలు...

"నేను ఆయన మిసెస్‌నండి. ఆయనేం చేస్తున్నారు? సెల్ మీ దగ్గరెందుకుంది? ఓ సారి ఆయన్తో మాట్లాడించండి" అంది.

"ఐయాంసారీ మేడం. ఓల్డ్ యం.యల్.ఏ. క్వార్టర్స్ దగ్గర చిన్న యాక్సిడెంట్ అయింది. మీ హజ్బెండ్ నడుపుతోన్న స్కూటర్ని ఎదురుగా వస్తున్న క్వాలిస్ ఢీకొట్టింది"

"మై గాడ్... ఆయనకెలా ఉంది? ఏమైనా దెబ్బలు తగిలాయా? మీరెక్కడినుంచి మాట్లాడుతున్నారు?"

"కొద్దిగా దెబ్బలు తగిలాయి మేడం. హైదర్‌గూడ అపోలో హాస్పిటల్‌లో జాయిన్ చేశాం. నేనక్కడనుంచే మాట్లాడ్తున్నా"

"నేను వస్తున్నా. ఆయనకేం పర్లేదుగా" ఆమె గొంతు వణికింది.

"పర్లేదు మేడం. మీరు వీలైనంత తొందరగా రండి"

అమ్మ మొహం పాలిపోవటం... ఆమె గొంతులో తొణికిన భయం... దుఃఖం గమనించిన ప్రసాద్ "మమ్మీ! నాన్నకేమైంది?" అని అడిగాడు.

"ఏదో యాక్సిడెంట్ ఐందట. నాన్నని అపోలో హాస్పిటల్లో చేర్పించారట" ఆమె మాట్లాడుతూనే వేగంగా బైటికొచ్చి ఆటో మాట్లాడింది. ఆటో వేగంగా పోవటం లేదనిపించి ఆటో నడుపుతున్న వ్యక్తిని కోప్పడింది. మనసునిండా రకరకాల భయాలు... చిన్న దెబ్బలే తగిలాయా... సెల్‌లో ఎందుకు మాట్లాడలేదు? మాట్లాడలేని పరిస్థితా... అంటే బాగా దెబ్బలు తగిలాయా... 'భగవంతుడా... నన్ను అన్యాయం చేయకు...' తనకు గుర్తొచ్చిన ప్రతి దేవుణ్ణి మొక్కుకుంది.

ఆమె హాస్పిటల్‌కి చేరుకోగానే లాంజ్‌లో ఉన్న సబిన్‌స్పెక్టర్ దగ్గరకు పరుగెత్తింది. "ఆయనకేమైంది? యిపుడెక్కడున్నారు? నేనాయన్ని వెంటనే చూడాలి" ఏడుస్తూనే మాట్లాడింది.

"ఓ మీరేనా సెల్ ఫోన్లో మాట్లాడింది" అన్నాడతను.

"ఔను. నా పేరు సరోజ. ఆయన నా భర్త. ఆయనెక్కడున్నారో చూపించండి. ప్లీజ్ ఒక్కసారి నన్నాయన దగ్గరకు పిల్చుకెళ్ళండి" అంది ఉద్వేగంతో అతని చేతులు పట్టుకుంటూ.

"మీరు కొద్దిసేపు కూచోండి మేడం. ప్లీజ్ రిలాక్స్" తన పక్కనున్న కుర్చీలో కూచోమన్నట్లు సైగ చేశాడు.

"కూచుంటాను. యిప్పుడు కాదు. మొదట ఆయన్ని చూడనివ్వండి. ఒక్క నిమిషం మాట్లాడనివ్వండి"

"ప్రస్తుతం మీ హజ్బెండ్‌ని ఐ.సి.యు.లోకి తీసుకెళ్ళారు. మనం లోపలికెళ్ళడానికి వీలుకాదు. కొద్దిసేపు ఓపిక బట్టండి. ఎవ్విరిథింగ్ విల్ బి ఆల్ రైట్"

"ఐ.సి.యు.లోకి తీసుకెళ్ళారా? బాగా దెబ్బలు తగిలాయా... మీరు చిన్నచిన్న దెబ్బలే అన్నారు. మరెందుకు ఐ.సి.యు.లోకి తీసుకెళ్ళారు?"

"మీరు కొద్దిసేపు కూచోండి. డాక్టర్లు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటారు.

హాస్పిటల్ దగ్గరగా ఉండటం మేలైంది. యాక్సిడెంట్ జరిగిన కొద్ది నిముషాలకే హాస్పిటల్‌కి చేర్చాం. మీరు దయచేసి కొద్దిసేపు కూచోండి. డాక్టర్లు బైటికొచ్చాక వాళ్ళనడిగి లోపలికెళ్ళి చూద్దురుగాని" అన్నాడతను.

సరోజ అక్కడ ఖాళీగా ఉన్న కుర్చీలో కూచుని ప్రసాద్‌ని తన పక్కనే కూచోబెట్టుకుంది. ప్రసాద్ చేతిని తన చేతుల్లో బలంగా పట్టుకుని కూచుంది. ఆమెకు ఏం జరిగిందో ఏం జరగబోతుందో అర్థం కావటం లేదు. అంతా శూన్యంలా అన్పిస్తోంది. కళ్ళెదురుగా ఉప్పెనలా పొంగుకొస్తున్న చీకటి... నోరు తెర్చుకుని ముందుకొస్తున్న కొండచిలువలా నిరాశ...

యాక్సిడెంట్ జరిగిన వార్త తెల్సుకుని బ్యాంక్ ఉద్యోగులు కొంత మంది వచ్చి సరోజకు తోడుగా హాస్పిటల్లో ఉండిపోయారు. వెంటనే ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సరోజ దగ్గర సంతకాలు తీసుకున్నారు.

రాత్రి పదకొండున్నరకి 'తమ శాయశక్తులా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని' డాక్టర్లు చెప్పగానే సరోజ స్పృహతప్పి పడిపోయింది.

***

విశాలమైన లా కాలేజీ ప్రాంగణం....

యల్.యల్.బి. ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు కొంత మంది చెట్ల కింద నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

మొదటి పీరియడ్ ప్రారంభం కావడానికింకా ఇరవై నిముషాల టైం ఉంది.

"ఆత్మహత్య చేసుకోబోయి విఫలమైన నిర్భాగ్యులమీద ఐ.పి.సి. 309 కింద కేసు పెట్టడం దుర్మార్గమనిపిస్తోంది కిరణ్. ఆత్మహత్యకు పురిగొల్పేవాళ్ళమీద, ప్రోత్సహించేవాళ్ళమీద 306 కింద కేసు పెట్టడంలో న్యాయముంది. కానీ సెక్షన్ 309 మాత్రం అనాలోచితంగా పెట్టారేమోననిపిస్తోంది. భారత శిక్షాస్మృతిలోంచి దీన్ని తొలగించాల్సిన అవసరం ఉంది. నువ్వేమంటావ్" అన్నాడు రమణ.

"ఈ రోజు మధ్యాహ్నం మూడింటికి పెట్టిన డిబేట్ కాంపిటీషన్లో టాపిక్ అదేగా.

నువ్వు పాల్గొంటున్నావా?"

"అందుకేగా నీ దగ్గర చర్చ లేవదీసింది. నాకేమైనా మంచి పాయింట్స్ చెప్తావని ఆశ. నాకు ప్రైజ్ వచ్చిందనుకో... నీ ఫ్రెండ్‌ని కాబట్టి నువ్వు సంతోషపడ్తావుగా"

"ఎంత దురాశ... నేనూ పార్టిసిపేట్ చేస్తేనో"

"నువ్వు చేయవు... నాకు తెలుసు"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?"

"అక్షర కూడా పార్టిసిపేట్ చేస్తుంది కాబట్టి"

ఆ పేరు వినగానే కిరణ్ కొద్దిగా సిగ్గుపడ్డాడు. తమాయించుకుని "అక్షర పార్టిసిపేట్ చేస్తే నాకేంటి? అది డిబేట్ కాంపిటీషన్. ఎవరైనా పోటీ పడొచ్చు. నా అధికారాన్ని హరించే హక్కు అక్షరకు లేదు"

"కొయ్ కొయ్. ఒరేయ్ కిరణ్. నేను నీ బెస్ట్ ఫ్రెండ్‌ని. నీ గురించి నాకు తెలీదా? నీ ప్రతిభ గురించీ తెలుసు... నీ త్యాగాల గురించీ తెలుసు"

"ప్రతిభేంటీ త్యాగాలేంటి... గ్రీక్ అండ్ లాటిన్‌లో మాట్లాడకు. డిబేట్‌లో కూడా ఇలానే మాట్లాడావంటే జడ్జెస్‌కి అర్థం కాక జుట్టు పీక్కుంటారు"

"నీకు చక్కటి వాగ్ధాటి ఉంది. సమర్థవంతంగా వాదించి ఎదుటి వ్యక్తిని ఒప్పించగల మెప్పించగల నేర్పరివి. ఏ సమస్యనైనా అనేక కోణాల్లోంచి విశ్లేషించేంత తెలివుంది. విషయ పరిజ్ఞానం ఉంది. గత రెండేళ్ళలో ఎన్నిసార్లు నీకు డిబేట్ కాంపిటీషన్లలో ఫస్ట్ ప్రైజ్ వచ్చిందో మన కాలేజీలో అందరికీ తెలుసు"

"చాలా సార్లు అక్షరక్కూడా వచ్చిందన్న విషయం మర్చిపోతున్నావు"

"అందుకేగా నువ్వీ సంవత్సరం ఆ అమ్మాయితో పోటీ పడకుండా తప్పుకుంటున్నావు"

"నిజమే... అక్షర చేతిలో ఓడిపోవటం ఇష్టం లేక"

"కాదు. అక్షరని గెలిపించటం ఇష్టం కాబట్టి. ప్రతిపోటీలో అక్షరకే ఫస్ట్ రావాలని కోరుకుంటున్నావు కాబట్టి. ప్రేమ బాబూ... ప్రేమలో ఉండే త్యాగం బాబూ. నాకు తెలీదనుకోకు. అక్షరకు ఫస్ట్ ప్రైజ్ వస్తే నీకొచ్చినంత సంతోషపడ్తావు. నిజం చెప్పు. అదే కదా కారణం"

కిరణ్ కొన్ని క్షణాలు మౌనంగా ఉన్నాక మాటలు కూడబలుక్కుంటున్నట్లు మెల్లగా చెప్పాడు “పోటీలో ఎపుడైనా నాకు ఫస్ట్ వచ్చి ఆ అమ్మాయికి సెకండ్ వచ్చినపుడు ఆమె కళ్ళలో సంతోషం కన్నా బాధని చూశాన్రా. ఏం చేసినా అందులో ఎప్పుడూ ఫస్టుండాలనే ఆమె పట్టుదలా విజయకాంక్ష నాకు నచ్చుతాయి. షి ఈజ్ ఏ గ్రేట్ వుమన్”

“నేనొప్పుకొను. నువ్వే గ్రేట్... అటువంటి అమ్మాయిని ప్రేమిస్తున్నావంటే... సినిమాల్లో చూపించే అర్థం లేని ప్రేమకథలు చూసీచూసీ ప్రేమంటేనే అసహ్యం వేస్తున్న తరుణంలో నీకు అక్షర మీదున్న ప్రేమను తల్చుకుంటే చాలు... చేతులెత్తి మొక్కాలనిపిస్తుందిరా... ఎంత గొప్ప ఆదర్శం నీది!”

“ఆపరా... ఆదర్శాలేమిటి? అర్థం లేని మాట. నన్ను గ్రేట్ అంటున్నావంటే అక్షరని తక్కువ చేస్తున్నట్లే కదా... అలా ఆలోచించటం తప్పుకదా. ఎదుటి వ్యక్తిని తక్కువచేసి ఆత్మన్యూనతకు గురి చేస్తే అది ప్రేమవుతుందా? యింకెప్పుడూ అలా మాట్లాడకు. ప్రేమలో ఎక్కువతక్కువలుండవు. నేను అక్షరని ప్రేమిస్తోంది ఆదర్శాల కోసం కాదు. ఆమె కోసం... ఆమెనే కోరుకునే నా హృదయం కోసం”

“సరే... నాకో విషయం చెప్పు. అక్షరలో ఏం చూసి ప్రేమిస్తున్నావు?”

“జీవితం మీద ఆ అమ్మాయికున్న ఆశావహ దృక్పథం... అసాధ్యాలనుకున్న వాటిని కూడా జయించాలన్న కసి... ప్రతి రోజునీ భగవంతుడు ప్రసాదించిన వరంలా... ఓ పండుగలా ఆస్వాదించే ఆమె మనస్తత్వం. జీవితాన్ని ప్రేమించే తత్వం... ఆమె తెలివి... అందం...”

కిరణ్ తన మాటల్ని మధ్యలోనే ఆపేశాడు. అతని చూపు ఓ వైపుకు మరలి అక్కడ ఒక చోట ఘనీభవించింది.

రమణ కూడా అటువైపుకు చూశాడు.

అక్షర లోపలికొస్తోంది....

ఆమె మొహంలో కన్పిస్తోన్న స్నిగ్ధత్వాన్ని చూస్తున్నాడు కిరణ్. పెద్దకళ్ళు... చిన్ని నోరు... అందమైన చుబుకం... కింది పెదవికి ఎడం వైపు బ్యూటీ స్పాట్‌లా కనువిందు చేసే చిన్ని పుట్టుమచ్చ... అన్నింటినీ మించి ఆ మొహంలో కన్పిస్తోన్న తేజస్సు...

జీవితాన్ని ప్రతి క్షణం ఆస్వాదించేవాళ్ళ మొహాల్లో మాత్రమే కన్పించే వెలుగు... గెలుపుని స్వంతం చేసుకుని ఆత్మస్థయిర్యాన్ని ఆభరణంగా ధరించిన వ్యక్తుల్లో కన్పించే దివ్యాకర్షణ...

కిరణ్‌ని చూసి "హాయ్" అంటూ విష్ చేసిందామె. రమణ వైపు కూడా చేయి వూపి, క్లాస్ రూంలోకి వెళ్ళిపోయింది... తన చక్రాల కుర్చీని నడుపుకుంటూ.

రమణ వాచీ వైపు చూసుకున్నాడు. "అమ్మో... ఇంకా ఆరు నిముషాలే టైం ఉంది. డిబేట్ టాపిక్ గురించి మనం మాట్లాడుకోనే లేదు. టాపిక్ పక్కదారి పట్టింది"

"పక్కదారి కాదు. నేను వెళ్ళాలనుకుంటున్న పక్కాదారి"

"సరే మహాశయా... సెక్షన్ 309 గురించి నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పు"

"అక్షర గెలవాలని కదా నేను డ్రాప్ అయ్యాను. మరి నీకెలా పాయింట్స్ చెప్తాను?" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

"మిత్ర ద్రోహం చేయకు ప్లీజ్. అక్షరకు ఫస్ట్ ప్రైజ్ గ్యారంటీ. మేము పోటీ పడేది సెకండ్, థర్డ్ ప్రైజుల కోసమే. ఆత్మహత్య చేసుకోవడమో... ఆత్మహత్యాప్రయత్నమో నేరమెలా అవుతుంది?"

"నేరమే. మనిషికి బతికే హక్కుంది తప్ప తన ప్రాణాన్ని తీసుకునే హక్కు లేదు"

"నా ప్రాణం నా ఇష్టం... ఈ ప్రభుత్వమెవరు మధ్యలో కల్పించుకుని నన్నాపడానికి? నన్ను శిక్షించేంత తప్పు నేనేం చేశానని"

"ప్రభుత్వం ఉన్నదే ప్రజల సంక్షేమం కోసం. యింటి యజమానిగా ఓ తండ్రి కుటుంబ బాధ్యతల్ని ఎలా నిర్వర్తిస్తాడో ప్రభుత్వమూ ప్రజల బాధ్యతల్ని అలా నెత్తిన వేసుకుంటుంది. ఉదాహరణకి హెల్మెట్లు ధరించకుండా ద్విచక్రవాహనాలు నడపటం నేరం కాబట్టి పోలీసులు పట్టుకుని జరిమానా విధిస్తున్నారు. 'నేను హెల్మెట్ ధరించకపోతే నీకేం నష్టం? దెబ్బతగిల్తే నష్టపోయేది నేనేగా. దానికి నేను సంసిద్ధంగా ఉన్నపుడు నువ్వెవరు మధ్యలో' అని వాదిస్తే అది వితండవాదం అవుతుంది. ప్రయాణాల్లో ప్రజలకు దెబ్బలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అలానే ఆత్మహత్యలు చేసుకోకుండా నివారించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అందుకే ఆత్మహత్యా

ప్రయత్నం నేరమని చట్టంలో సెక్షన్ 309ని ప్రవేశపెట్టింది."

"ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న వ్యక్తి గురించి ఓ క్షణం ఆలోచించు. జీవితంలో ఓడిపోయి... బతుకు మీద రోత పుట్టి... సమాజంలో పేరుకుపోయిన కుళ్ళు కుతంత్రాలకు విసిగిపోయి... మానసికంగా ఎప్పుడో చచ్చిపోయి... మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో తన జీవితాన్ని అంతం చేసుకోవాలనుకుంటాడు. ఉన్న కష్టాలకు తోడు అది నేరమని కేస్ పెట్టి శిక్షకు గురి చేయటం ఏం న్యాయం? అతను పడే కష్టాన్ని తొలగించలేని ప్రభుత్వానికి, అతనికో పరిష్కారమార్గం చూపలేని ప్రభుత్వానికి... అతను ఎన్నుకున్న చావనే పరిష్కారాన్ని అడ్డుకునే అధికారం ఉండటం అన్యాయం అన్పించటం లేదా?"

"ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనల్ని పరిశీలిస్తే, బలమైన కారణాల్తో జరిగేవి పది శాతం కూడా ఉండవు. అమ్మ మందలించిందనో, మార్కులు తక్కువ వచ్చాయనో, పరీక్షల్లో తప్పటం వల్లనో, పుట్టింటికెళ్ళిన భార్య తిరిగిరాలేదనో, తనక్కావల్సిన ఛానెల్ పెట్టలేదనో... ఇలాంటి అర్థ రహితమైన కారణాల్తో బలహీన మనస్కులు చేసుకునే ఆత్మహత్యలే ఎక్కువ. వీటిని ప్రభుత్వం నేరంగా పరిగణించకపోతే మనుషులు వేలం వెర్రిగా ఆత్మహత్యలు చేసుకునే అవకాశం ఉంది. నవ్వేకాదు ఆత్మహత్యలు కూడా అంటువ్యాధిలా అంటుకుంటాయి. ఒకర్ని చూసి మరొకరు... గొర్రెలమంద ఒకదాని తర్వాత ఒకటి దిగుడు బావిలోకి దూకినట్లు. ఆత్మహత్యలు పెరగటం కూడా ప్రభుత్వ వైఫల్యం కిందికొస్తుంది. అందుకే వాటిని సమర్థవంతంగా నిరోధించాల్సిన అవసరం, దానికవసరమైన చట్టాలు చేసి అమలు జరపాల్సిన అవసరం ప్రభుత్వానికుంది.

నువ్వు మరో విషయాన్ని ప్రస్తావించావు. వాళ్ళు పడే కష్టాలకు, వాళ్ళ సమస్యలకు పరిష్కారాలు చూపలేని ప్రభుత్వానికి అడ్డుకునే అధికారం ఉందా అని. తాహతుకి మించి అప్పులు చేసి, తీర్చలేని స్థితిలో మానసికంగా వ్యథ చెంది చేసుకునే ఆత్మహత్యలకు ప్రభుత్వం ఏం చేస్తుంది? అనారోగ్యాన్ని ఎదుర్కోలేక చావాలనుకుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది? ఏ ప్రభుత్వమైనా ప్రజలు గౌరవంగా బతకడానికి అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పిస్తుంది. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజల మీదుంది. ఉచిత వైద్యం, తక్కువ వడ్డీతో రైతులకు రుణాలు, రుణ మాఫీలు, సబ్సిడీ మీద

నిత్యావసర వస్తువుల్ని అందించటం... ఎన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడ్తుందో ప్రభుత్వం. ఐనా చస్తానంటే అది నేరం కాక ఏమవుతుంది?"

లెక్చరర్ రావడం చూసి ఇద్దరూ క్లాస్ రూంలోకెళ్ళి కూచున్నారు, అక్షర కూచున్న సీటుకి వెనకే కిరణ్ కూచున్నాడు. నడుందాకా సాగిన నల్లటి దట్టమైన కురుల సోయగాన్ని మధ్య మధ్యలో ఆస్వాదిస్తూ పాఠం విన్నాడు.

మధ్యాహ్నం మూడింటికి డిబేట్ పోటీ ప్రారంభమైంది.

నలుగురు విద్యార్థులు మాట్లాడాక రమణకు పిలుపొచ్చింది.

"ఆత్మహత్య చేసుకోవాలనుకోవటం నేరమెలా అవుతుంది? ఓ వ్యక్తి ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికొచ్చాడో తెల్సుకోకుండా... సమస్య మూలాల్లోకి వెళ్ళకుండా ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణించటం సరికాదు.

ఐనా శిక్ష ఎవరికి వేస్తున్నారు? ఎవరైతే బాధితుడో అతనికే శిక్ష. మన న్యాయశాస్త్రాల ప్రకారం ఎవ్వరైతే బాధిస్తున్నారో వాళ్ళకు కదా శిక్షపడాలి.

జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిలేక ఆత్మహత్యలు చేసుకునే బలహీన మనస్కుల విషయంలో శిక్ష వేయాల్సింది ఎవరికో తెలుసా... పిల్లల్ని అలా పెంచిన తల్లిదండ్రుల్ని శిక్షించాలి. జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యం నూరిపోయని చదువుల్ని నిందించాలి. పుస్తకాల్లో ఉన్న పాఠాల్తో పాటు జీవితానికవసరమైన పాఠాల్ని నేర్పని పంతుళ్ళని దండించాలి. ఆత్మహత్య తప్ప మరో గత్యంతరం లేని పరిస్థితుల్లోకి నెట్టేసిన సమాజాన్ని శిక్షించాలి.

క్రూరమైన వ్యక్తుల్ని శిక్షించేలా చట్టాలు ఉండాలి కాని చట్టమే క్రూరంగా ఉండకూడదు. చట్టాలకు కూడా మానవత్వపు సుగంధాలు అద్దినపుడే అవి కలకాలం మనగలుగుతాయి. అందువల్ల క్రూరమైన, అమానుషమైన సెక్షన్ 309 ని ఇండియన్ పీనల్ కోడ్ నుంచి తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అంటూ రమణ తన వాదనని వినిపించాడు.

అతని తర్వాత మాట్లాడటానికి అక్షరని పిలిచారు.

తన చక్రాల కుర్చీని నడుపుకుంటూ వచ్చిన అక్షర మాట్లాడటానికి ఉద్యుక్తురాలు

కాగానే హాలంతా నిశ్శబ్దమైపోయింది.

"ఆత్మహత్య మహాపాపం లాంటి మాటలు నేను మాట్లాడను. మరణం తర్వాత వేసే పాప పుణ్యాల తూకాలూ... స్వర్గనరకాల్ని నేను నమ్మను కాబట్టి.

జీవితం జీవించడానికే. బతుకనేది ఓ పోరాటం. పిరికితనంతో వెన్ను చూపి పారిపోవటమే ఆత్మహత్యలకు కారణం. సమస్య ఎలాంటిదైనా దాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి. జీవితం ఓ ఆట. గెలుపోటముల ప్రసక్తి లేకుండా ఆడటమే మన కర్తవ్యం. ఎటొచ్చీ గెలవాలన్న పట్టుదలతో ఆడాలి. గెలుస్తామన్న నమ్మకంతో ఆడాలి. ఆ నమ్మకాన్ని జీవితాంతం కోల్పోకూడదు. ఓడినా మళ్ళా ఆడాలి. గెలిచేవరకూ ఆడుతూనే ఉండాలి తప్ప మధ్యలో ఆగిపోవటం, ఆటనుంచి పారిపోవటం సమర్థనీయం కాదు.

నాకంటే ముందు మాట్లాడిన వక్తలు కొంత మంది చిన్నకారణాల్తో ఆత్మహత్యలు చేసుకోవడం సమర్థనీయం కాదన్నారు. అంటే పెద్ద కారణాల్తో చేసుకుంటే తప్పులేదనా... ఏ కారణాల్తో చేసుకున్నా ఆత్మహత్య చేసుకోవడం నేరమే.

నా ఉద్దేశంలో పరిష్కారం లేని సమస్యలుండవు. చీకట్లో కూచుని చుట్టూ అంధకారం ఉందని బాధపడ్తూ కూచుంటే ఎలా? కొవ్వొత్తి వెలిగిస్తే చీకటి మటుమాయం. కొవ్వొత్తి కూడా లేకపోతేనో... లేచి వెతికితే ఎక్కడో ఓ చోట వెల్తురు కన్పిస్తుంది.

రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం అందరికీ సమాన హక్కులున్నాయి. అధికరణ 21 ద్వారా గౌరవంగా బతికే హక్కుని మనకు రాజ్యాంగం కల్పించింది... గియన్ కౌర్ కేసులో పంజాబ్ హైకోర్టుకు చెందిన ఐదుగురు జడ్జీల ధర్మాసనం జీవించే హక్కు గురించి చెప్తూ చనిపోయే హక్కు దీనికి పూర్తి విరుద్ధమని తీర్పిచ్చింది. జీవించే హక్కు అంటే అర్థం సహజ మరణం వచ్చే క్షణం వరకూ జీవించటమని విశదపర్చింది. పి. రతినమ్ కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పుని కొట్టేస్తూ సెక్షన్ 309 రాజ్యాంగ బద్ధమైందేనని తీర్పిచ్చింది.

కాబట్టి ఇండియన్ పీనల్ కోడ్ లో సెక్షన్ 309 ఉండటం ఎంతైనా అవసరం" అంటూ ముగించింది.

ఆ వాక్పటిమకు అందరూ అప్రతిభులై విన్నారు. గడ్డకట్టిన మౌనాన్ని కోసే పదునైన కత్తి లాంటి స్వరం... చక్కటి ఉచ్ఛారణ... కవితాత్మకమైన వాక్యాలు... సెలయేరులా

ప్రవాహవేగంతో సాగే ఆంగ్ల భాష... ఎక్కడ గొంతుని పెంచాలో ఎక్కడ మంద్రస్వరాన్ని విన్పించాలో తెల్సిన ఇంద్రజాలకురాలిలా ప్రేక్షకుల్ని వశీకరణకు గురిచేసే ప్రతిభ...

చప్పట్లతో హాలంతా మార్మోగింది.

మరో ఎనిమిది మంది మాట్లాడాక సాయంత్రం నాలుగున్నర సమయంలో రిజల్ట్స్ చెప్పారు. అందరూ వూహించినట్లే అక్షరకి ఫస్ట్ ప్రైజ్ వచ్చింది.

అందరూ కంగ్రాట్స్ చెప్పటం పూర్తయ్యాక చివర్లో వెళ్ళి "నేను కంగ్రాట్స్ చెప్పను" అన్నాడు కిరణ్.

అక్షర నవ్వింది. "నేను మాట్లాడింది నీకు నచ్చలేదా?"

"అందుక్కాదు. నీకు ఫస్ట్ రాకపోతే ఆశ్చర్య పడాలిగాని వస్తే వింతేముంది? చదువులోనైనా డిబేట్ కాంపిటీషనో, ఎస్సే రైటింగ్ కాంపిటీషనో ఐనా ఎప్పుడూ ఫస్ట్ నువ్వేగా"

"నువ్వెందుకీమధ్య పార్టిసిపేట్ చేయటం లేదు? యింతకు ముందు గట్టి పోటీ ఇచ్చేవాడివిగా. నువ్వు పాల్గొని ఉంటే నాకు ఫస్ట్ వచ్చేది కాదేమో. ఐనా సరైన ప్రత్యర్థి లేకుండా గెలిచినా అందులో తృప్తి ఉండదు" రూం బైటికి చక్రాల కుర్చీని నడుపుతూ అందామె.

"నేను పాల్గొన్నా నీకే ఫస్ట్ వచ్చేది"

"అపుడు చాలా సంతోష పడేదాన్ని"

"ఓ... నన్ను ఓడించటంలోనే నీ సంతోషం ఇమిడి ఉందంటావు"

"కాదు... నీ పైన గెలవటంలో... నాప్రశ్నకు సమాధానం చెప్పలేదు. ఎందుకని ఈ మధ్య కాంపిటీషన్స్‌లో నీ పేరివ్వటం లేదు?"

"మనం మాట్లాడటం కన్నా వేరే వాళ్ళు మాట్లాడుతుంటే వినడం బావుంటుందనిపించి" అనగానే అక్షర తలతిప్పి 'మళ్ళా చెప్పు' అన్నట్లు చూసింది.

"ఐ మీన్... నా ఉద్దేశంలో... అంటే... అబ్బ... ఇంత డొంకతిరుగుడు దేనికి... నువ్వు మాట్లాడుతుంటే వినటం నాకిష్టం. వీణ తంత్రి మీటుతున్నట్లు ఎంత మధురంగా ఉంటుందో... వింటుంటే హాయిగా ఉంటుంది తెలుసా"

అక్షర శబ్దం వచ్చేలా నవ్వింది. "అబద్ధాలు చెప్పినా అతికినట్లుండాలి. నువ్వేం లాయరౌతావు? నువ్వు పోటీలో పాల్గొన్నా నేను మాట్లాడేటప్పుడు వినొచ్చుగా. కారణం అది కాదు"

కిరణ్ సమాధానం చెప్పలేదు. అప్పటికే మెయిన్ రోడ్ పైకి వచ్చేసింది.

తన పక్కనే నడుస్తోన్న కిరణ్‌తో "నీ బండేదీ" అని అడిగింది.

"ఈ రోజు తీసుకు రాలేదు. మెకానిక్ కిచ్చాను" అబద్ధం చెప్పాడు.

"అలానా. ఐనా నీ రూట్ ఆ వైపు కదా... ఇటొస్తున్నావేం"

"నాకిటువైపు కొద్దిగా పనుంది. ఇఫ్ యూ డోంట్ మైండ్... నీతోపాటు నడవొచ్చా"

"ఓ... దానికేం భాగ్యం" అక్షర చక్రాలకుర్చీ కమర్చిన మోటార్‌ని నడక వేగానికి సరిపడేలా మార్చింది.

ఆమె పక్కనే నడుస్తూ "నేను అడిగిందానికి నీనుంచి ఇంకా సమాధానం రాలేదు" అన్నాడు.

అతనేం అడిగాడో ఆమెకు తెలుసు. ఐనా తెలీనట్లు "ఏమడిగావూ?" అంది.

"ప్రేమభిక్ష"

"తెలుగు సినిమాలు బాగా చూస్తావా... పదం బావుంది"

"నవ్వులాట కాదు. నిజంగా చెప్తున్నాను. నువ్వంటే నాకిష్టం. నా ప్రేమను తిరస్కరించకు"

"ఈ విషయంలో నీకు సరైన అవగాహన లేదనిపిస్తోంది. నేనారోజే చెప్పాను... ఇంకెప్పుడూ ఆ ప్రస్తావన తీసుకురావొద్దని"

"తెస్తాను... వందసార్లు తెస్తాను. నువ్వు ఒప్పుకునేదాక... నిన్ను ఒప్పించేదాక ఆ విషయం ప్రస్తావిస్తూనే ఉంటాను"

అక్షర అతని వైపు మొదట విసుగ్గా చూసింది. వెంటనే సంబాళించుకుని నిప్పుని ముట్టుకుంటాననంటూ మారాం చేసే పసిపిల్లాడివైపు చూసినట్టు చూసింది. మళ్ళీ రోడ్ వైపుకు దృష్టి సారిస్తూ అంది."నీది ప్రేమ కాదు కిరణ్... జాలి. నామీద జాలిపడేవాళ్ళంటే నాకసహ్యం. ఎవరో నన్ను చూసి జాలిపడేంత దయనీయమైన స్థితిలో

ఉన్నానని అనుకోను. నాకున్న పరిమితుల్లో నేను సంతోషంగా బతుకుతున్నాను"

"నిన్ను చూస్తే జాలి కాదు అక్షరా... ఆరాధన. నీ మానసిక స్థయిర్యం, నీ ఆలోచనా దృక్పథం నన్ను అమితంగా ఆకర్షించాయి. నువ్వంటే నాకు నిజమైన ప్రేమ. నిన్ను నిన్నుగా ప్రేమించే ప్రేమ"

"ఈ వయసులో అలానే అన్పిస్తుంది కిరణ్. నీ ఆలోచనలో ఉన్న తప్పేమిటో నీ మెదడు గ్రహించలేదు. ఎదురుగా కన్పిస్తున్న నిజాన్ని చూడటానికి నీ కళ్ళు తిరస్కరిస్తాయి. నువ్వేది వూహిస్తున్నావో అదే సాకారమై కన్పించేలా చేసే కనికట్టు ప్రేమంటే. కొన్నాళ్ళు గడిచాక ఒక్కొక్క అపోహ తొలగిపోతుంది. కళ్ళకు కప్పిన పొరలు ఒక్కొక్కటిగా విడిపోయేకొద్దీ చేదు నిజం బైటపడ్తుంది"

"ఏమిటా చేదు నిజం?"

"నువ్వనుకుంటున్న ప్రేమ ప్రేమకాదనే నిజం"

"నువ్వు పొరబడ్తున్నావు. ఎన్ని యుగాలైనా నాప్రేమ ఇలానే చెక్కు చెదరకుండా ఉంటుంది. కొన్నాళ్ళు గడిచాక నీకే ఓ తీయటి నిజం తెలుస్తుంది"

"ఏంటది?"

"నా ప్రేమ నిజమైందని... స్వచ్ఛమైందని... అపూర్వమైందని... అమరమైందని"

"కవిత్వం కూడా వచ్చా నీకు?"

"కవిత్వం కాదు... గుండెల్లోంచి పొంగుకొస్తున్న నిజం"

"కిరణ్... మనం మరో యేడాదిలో లాయర్లు కాబోతున్నాం. చిన్న పిల్లల్లా మాట్లాడుకోటం తగదు. నా గురించి నీకు పూర్తిగా తెలీదు. తెలిస్తే ప్రేమిస్తున్నానంటూ ఇలా పిచ్చి ప్రేలాపనలు చేయవు"

"నీ గురించి ఏం తెల్సినా అది ఎంత భయంకర విషయమైనా సరే నా ప్రేమలో మార్పుండదు అక్షరా... నేను ప్రేమిస్తున్నది నీ అందాన్నో, నీ శరీరాన్నో కాదు. ఉక్కులా దృఢమైన నీ మనోనిబ్బరాన్ని... మంచుకన్నా తెల్లనైన నీ మనసుని... అనంత మాధుర్యాలు దాచుకున్న నీ వ్యక్తిత్వాన్ని"

"నువ్వో విషయం మర్చిపోయావు కిరణ్..."

మధ్యలోనే అడ్డుపడ్తూ "నేనేమీ మర్చిపోలేదు. అన్నీ బాగా గుర్తున్నాయి. నా జ్ఞాపక శక్తి మీద నాకు బోలెడంత నమ్మకముంది"

అక్షరకు అంత సీరియస్ విషయం మాట్లాడ్తున్నా అతనలా అనగానే నవ్వొచ్చింది. "నన్ను పూర్తిగా మాట్లాడనీయవా? జ్ఞాపక శక్తి నీకే కాదు నాకూ ఉందిలే. అందుకేగా కాలేజీ ఫస్ట్ నువ్వో నేనో అని అందరూ ఎదురు చూస్తున్నారు. నేననేది ఆ విషయం కాదు. ప్రేమకు పర్యవసానం ఏమిటి?"

"పెళ్ళి"

"ప్రేమకు మనసుంటే చాలు కానీ పెళ్ళికి మనసుతోపాటు శరీరమూ ముఖ్యమే. ఒప్పుకుంటావా?"

"నువ్వేమీ అశరీరవాణివి కాదుగా. నీకూ మనసుంది. శరీరమూ ఉంది. నువ్వు చెప్పిన రెండూ ఉన్నట్టేగా"

"నేను చెప్పేది నీకు సరిగ్గా అర్థం కావటం లేదు కిరణ్. ఏదో ఓ రోజు నాకు సంబంధించిన విషయాలన్నీ చెప్తాను. అప్పటిగ్గాని నీకు బోధ పడదు"

"ఏదో ఓ రోజంటూ పోస్ట్‌పోన్ చేయటం దేనికి? ఇప్పుడు చెప్పు... వింటాను"

"ఇపుడు కాదు. ఐనా నేను చెప్పటం ప్రారంభిస్తే కొన్ని విషయాలు మర్చిపోవచ్చు. కొన్నిటిని సరిగ్గా చెప్పలేకపోచ్చు. అందుకే రాసి పెడ్తాను. నువ్వు చదివాక మళ్ళీ ఈ విషయం గురించి మాట్లాడుకుందాం"

"సరే. ఎప్పుడు రాసి పెడ్తావు?"

"చెప్పలేను. నా మూడ్‌ని బట్టి రాసుకుంటూ పోతాను. ఎపుడు పూర్తయితే అపుడిస్తాను. సరేనా"

"తప్పుతుందా... నిన్ను ప్రేమించిన పాపానికి"

"చూశావా... అప్పుడే నీ స్వరంలో మార్పొచ్చింది. నన్ను ప్రేమించటం పాపం అనేదాకా వచ్చావు. అందుకే నేచెప్పింది"

"ఏదో మాట వరసకన్నా తల్లీ... సరే తప్పుని దిద్దుకుంటున్నా. తప్పుతుందా నిన్ను ప్రేమించిన పుణ్యానికి"

అక్షర నవ్వింది. తెరలు తెరలుగా నవ్వింది. నక్షత్రాలు తెగిపడ్డట్లు నవ్వింది. వెన్నెల ఒలకబోసినట్లు నవ్వింది. “మొత్తానికి కాబోయే లాయర్ అన్పించుకున్నావ్. క్షణంలో మాట మార్చేశావు”

ఆ మాటకు కిరణ్ కూడా నవ్వాడు.

***

ప్రసాద్ బూట్లకి లేసులు బిగిస్తూ కిచెన్లో ఉన్న అమ్మకు విన్పించేలా “ఈ రోజేమిటి బ్రేక్ ఫాస్ట్” అన్నాడు.

“ఉప్మా” ఆమె కిచెన్లోంచే సమాధానమిచ్చింది.

“అబ్బా మమ్మీ. నాకు ఉప్మా నచ్చదని ఎన్నిసార్లు చెప్పాలి? దోసెలో చపాతీలో చేయొచ్చుగా”

“పిండి ఐపోయిందిరా నాన్నా. ఈ రోజు ఆఫీస్ నుండి వచ్చేప్పుడు తెస్తాలే. రేపు నువ్వేం కావాలంటే అది వండి పెడ్తాను. సరేనా” ఓ ప్లేట్లో ఉప్మా, టమేటా పచ్చడి తెచ్చి డైనింగ్ టేబుల్ మీద పెడ్తూ అంది.

“నాకొద్దు మమ్మీ. నేను తినను”

“ఈ ఒక్క పూటకి సర్దుకో బాబూ”

“వద్దు మమ్మీ... ప్లీజ్”

“నేనూ ప్లీజే... ఏం తినకుండా పోతే నేను బాధపడ్తానని తెలీదా... లంచ్ కూడా తిన్లేను”

“అబ్బా మమ్మీ... సెంటిమెంట్తో ఎలా లొంగదీస్తావో”

“నువ్వు నేర్పిందే కదరా” అంటూ నవ్వింది.

“కాంప్రొమైజ్ కొద్దాం మమ్మీ. బ్రెడ్ అండ్ జాం తింటా... ఓకేనా”

ఆమె కొడుకు వైపు మురిపెంగా చూసి, “మొండిఘటం... ఏదోలా మాట నెగ్గించుకుంటాడు చూడు” అంటూ బ్రెడ్తోపాటు జాం బాటిల్ తెచ్చి డైనింగ్ టేబుల్ మీద పెట్టింది.

ప్రసాద్ కుర్చీ లాక్కుని కూచుని బ్రెడ్‌కి తాపీగా జామ్ రాస్తూ "మమ్మీ... నాకు సెల్ ఫోన్ కొనిస్తానన్నావు. ఎప్పుడు కొనిస్తావు?" అన్నాడు.

అతని పక్కనే మరో కుర్చీలో కూచుని కొడుకోసం తెచ్చిన ఉప్మా ప్లేటుని ముందుకి లాక్కుంటూ "అప్పుడే నీకు సెల్ ఫోన్ ఎందుకురా? నువ్వు టెన్త్‌లో ఐదు వందలకు పైగా మార్కులు తెచ్చుకుంటే యింటర్లో జాయినయ్యేముందు కొనిస్తానని చెప్పాగా" అంది.

"మా క్లాస్‌లో అందరికీ సెల్ ఫోన్లున్నాయి మమ్మీ. నాకే లేదు. ఎంత అవమానంగా ఉంటుందో తెలుసా"

"అవమానపడాల్సింది సెల్ ఫోన్ లేదనో, స్కూటర్లూ కార్లూ లేవనో కాదురా. బుద్ధిగా చదువుకోని వాళ్ళు అవమానపడాలి. సరైన ప్రవర్తన లేని పిల్లలు అవమానపడాలి. నీకేంరా... బాగా చదువుతావు. అల్లర్లు చేయవు. గుడ్ కాండక్ట్ అని మీ ప్రిన్సిపాల్ మొన్ననే సర్టిఫికెట్ యిచ్చిందిగా"

"మమ్మీ. టాపిక్‌ని మార్చకు. యిక్కడ డిస్కషన్ జరుగుతోంది సెల్ ఫోన్ కొనివ్వడం గురించి. నా కాండక్ట్ గురించి కాదు"

"నువ్విపుడు టెన్త్ క్లాస్... ఆ విషయం మర్చిపోకు. సెల్ ఫోన్ వల్ల పోసుకోలు కబుర్లు, పిచ్చి మెసేజ్‌లు తప్ప ఏం ప్రయోజనం చెప్పు? సమయం వృధా కావటం తప్ప. వద్దు నాన్నా. నా మాటిను. నీకు యింటర్లో కొని పెడ్తాగా"

"నువ్వు సెల్ ఫోన్ కొనిచ్చినా కొనివ్వకున్నా బాగా చదువుతాను మమ్మీ. ఐదు వందలేం ఖర్మ ఐదువందల యాభైకి పైగా మార్కులు తెచ్చుకుంటా. అడ్వాన్స్‌గా ఓ బుల్లి ఫోన్ కొనివ్వు మమ్మీ"

"నీ అతి తెలివి నాదగ్గర చూపకురా. బుల్లి ఫోను కూడా ఫోనే... అది చేసే నష్టంలో తేడా ఏమీ ఉండదు"

"ప్లీజ్ మమ్మీ... దాని వల్ల లాభాలు కూడా ఉన్నాయి. నాకు నువ్వంటే ప్రాణం కదా. ఎపుడు గుర్తొస్తే అపుడు మాట్లాడొచ్చు. నువ్వు బ్యాంక్ నుంచి ఎపుడొస్తుందీ తెల్సుకోవచ్చు. నాకు సడన్‌గా ఏమైనా అనారోగ్యమనిపిస్తే నీకు వెంటనే కబురు పెట్టొచ్చు"

అనారోగ్యమనే మాట వినగానే ఆమె తల్లడిల్లిపోయింది. "వద్దునాన్నా... అలా అనకు. నేను విన్లేను. నువ్వు పదికాలాలపాటు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలనే

రోజూ దేవుణ్ణి మొక్కుకుంటా. నాకు నువ్వు తప్ప ఎవరున్నారు చెప్పు. నీకోసమే ప్రాణాలు నిలుపుకుని జీవితంతో పోరాడుతున్నా" ఆమె కన్నీళ్ళ పర్యంతమైంది.

"ప్లీజ్ మమ్మీ. ఏడ్వకు. నువ్వేడిస్తే తట్టుకోలేను. సారీ మమ్మీ. నిన్ను బాధపెడితే క్షమించు. నాకు సెల్ ఫోన్ వద్దు మమ్మీ" అన్నాడు ఎడం చేత్తో ఆమె బుగ్గల మీద జారుతున్న కన్నీళ్ళను తుడుస్తూ.

ఆ మాటలకు తల్లి హృదయం వెన్నలా కరిగిపోయింది. "కొనిస్తాలే నాన్నా. నీ బర్త్‌డే వస్తుందిగా. అప్పుడు కొనుక్కుందువు గానీ" అంది. అలా అన్న మరుక్షణమే తను తప్పు చేశానని ఆమెకర్థమైంది. యిపుడిపుడే మానుతున్న గాయాన్ని అనాలోచితంగా కెలికింది. అసలా గాయం ఎప్పటికైనా మానుతుందా? కొన్ని గాయాలు జీవితాంతం సలుపుతూనే ఉంటాయి.

ప్రసాద్ కొన్ని క్షణాల వరకూ మౌనంగా ఉన్నాక మాటలు కూడ బలుక్కుంటూ "యింకెప్పుడూ నా బర్త్ డే గుర్తు చేయకు మమ్మీ. నాన్న నావల్లనే చనిపోయాడన్న బాధ నన్ను వెంటాడుతూనే ఉంటుంది. నా బర్త్ డే నాన్న డెత్ డే అనే విషయం గుర్తున్నంతకాలం నేను బర్త్‌డేలు జరుపుకోనని చెప్పాగా" అన్నాడు.

ఆమె ఏదో అనేలోపల కాలింగ్ బెల్ మోగింది.

లేవబోతున్న ఆమెను వారిస్తూ "నేను చూస్తానుండు మమ్మీ" అన్నాడు ప్రసాద్. కుర్చీలోంచి లేవబోయాడు. ఎవరో తుమ్మ జిగురుతో కుర్చీకి అతికించినట్లు... మళ్ళా ప్రయత్నించాడు. నడుము, కాళ్ళు చచ్చుబడిపోయిన భావన. చప్పున భయం కళ్ళల్లోకి పాకింది. రెండు చేతుల్ని డైనింగ్ టేబుల్ మీద మోపి బలమంతా వుపయోగించి లేవబోయాడు. వీలు కాలేదు.

మళ్ళా కాలింగ్ బెల్ మోగింది. ప్రసాద్ తీస్తానన్నాడు కదాని ఉప్మా తినటంలో నిమగ్నమైన సరోజ 'యింకెంత సేపు... త్వరగా తీయ్' అన్నట్టు కొడుకు వైపు విసుగ్గా చూసింది. జరగరానిదేదో జరుగుతోందని వాడి పాలిపోయిన మొహం చూడగానే ఆమెకర్థమైంది. వాడి మొహంలో తనెప్పుడూ చూడని విషాదం... నిస్పృహ... ఓడిపోతున్న బేలతనం... జరుగుతున్న దాన్ని నమ్మలేనంత విస్మయం... అది నిజమేనేమోనన్న భయం...

ఆమె చప్పున లేచి తలుపు తీసింది. "హాయ్ ఆంటీ" అంటూ రమ్య లోపలికొచ్చింది.

"హాయ్ ప్రసాద్... నా మ్యాథ్స్ నోట్ బుక్ తీసుకురావడం మర్చిపోతావేమోనని గుర్తు చేయడానికొచ్చాను. పోనీ యిపుడిచ్చేస్తావా నా బ్యాగ్‌లో పెట్టుకుంటాను" అంది.

ప్రసాద్ మైనపు బొమ్మలా చూశాడు తప్ప సమాధానం యివ్వలేదు.

వెంటనే సరోజ కల్పించుకుంటూ "వాడు బ్యాగ్లో భద్రంగా పెట్టడం నేను చూశాలే. స్కూల్లో యిస్తాడ్లేమ్మా" అంది.

"సరే ఆంటీ" అంటూ ప్రసాద్ వైపు తిరిగి "తొందరగా రా... బస్సొచ్చే టైమైంది" అంది.

"వస్తాడ్లే నువ్వెళ్ళమ్మా" అంది సరోజ.

"బై ఆంటీ" అంటూ రమ్య బైటికెళ్ళగానే తలుపేసి వచ్చి కొడుకు పక్కన కూచుంటూ "ఏమైందిరా... మొహం నిండా ఆ చెమటలేమిటి" అంటూ వాడి తలని చెంపల్ని ప్రేమగా నిమిరింది.

కొద్దిగా తెప్పరిల్లిన ప్రసాద్ మళ్ళా రెండు చేతుల్ని టేబుల్ మీద అదిమిపెట్టి లేవడానికి ప్రయత్నించి, సులువుగా లేచి నిలబడ్డాడు. మరి యిందాక ఎందుకు లేవలేకపోయాడు? ఎవరో మంత్రించినట్లు... కుర్చీకి చూయింగ్ గమ్ లాంటిదేమైనా అతుక్కుని ఉందా అని చూశాడు. ఏమీ లేదు. ఎందుకైనా మంచిదని చేత్తో కుర్చీ సీట్ ని తడిమాడు. జిగురుగానో అనుమానాస్పదంగానో ఏదీ తగల్లేదు. వాడి చర్యల్ని చూస్తున్న సరోజ మరింత కంగారు పడ్తూ "ఏమైంది నాన్నా... ఏం వెతుకుతున్నావ్... అసలేమైంది నీకు?" అని అడిగింది.

ప్రసాద్ అమ్మ వైపు ఓ సారి చూసి మళ్ళా కుర్చీ వైపు భయంగా చూశాడు. ఓసారి కూచున్నాడు. లేచి నిలబడ్డాడు. మళ్ళా కూచున్నాడు. లేచి నిలబడ్డాడు.

"ఏం జరిగిందో చెప్పురా... పిచ్చిపట్టినట్టు అలా ప్రవర్తిస్తున్నావేమిట్రా" పెద్దగా అసహనంతో అరిచింది.

"యిందాక రమ్య వచ్చింది కదా. అప్పుడు లేవాలనుకునికూడా లేవలేకపోయాను"

"లేవలేకపోవటమేమిట్రా?"

"నిజం మమ్మీ. కుర్చీకి అతుక్కుపోయినట్లనిపించింది"

ఆమె పెద్దగా నవ్వింది. "నిన్న రాత్రి టీవీలో వేసిన హారర్ సినిమా చూడొద్దురా అంటే విన్నావా... మాయలూ మంత్రాలు ఉండవని చెప్పానా... భ్రమపడి ఉంటావు నాన్నా"

"అంతేనంటావా?" బలహీన స్వరంతో అన్నాడు.

"ముమ్మాటికీ అంతే. అనవసరంగా భయపెట్టేశావు గదా. తొందరగా బయల్దేరు. రమ్య కంగారు పడ్తో ఉంటుంది" అంటూ తొందర చేసింది.

రమ్య మ్యాథ్స్ నోట్ బుక్ తన దగ్గర ఉందని గుర్తుకు రాగానే స్కూల్ బ్యాగ్ భుజానికి తగిలించుకుని బస్టాప్ వైపుకు వేగంగా నడిచాడు. అప్పటికే స్కూల్ బస్ వచ్చేసి ఉంది. రమ్య బస్ లోంచే పరుగెత్తు అంటూ అరిచింది. బస్‌లోకి ఎక్కిన వెంటనే ప్రసాద్ తను కుర్చీకి అతుక్కుని పోయి లేవలేకపోయిన విషయం మర్చిపోయాడు.

***

సూర్యోదయానికి ముందే లేచి కూచుంది అక్షర. రాత్రి కూడా సరిగ్గా నిద్ర పోలేదు... రేపటికోసం ఎదురుచూట్టంలోనే తెల్లారిపోయింది. తను కన్న కలలు నిజం కాబోతున్న రోజిది. తన తల్లిదండ్రుల త్యాగానికి తను రుణం తీర్చుకునే అవకాశాన్ని కలుగచేసే రోజు. తను చదివిన లా కోర్సు ఫైనలియర్ రిజల్ట్స్ ఈ రోజే వెలువడేది.

చెదిరిపోయిన జుట్టుని రబ్బర్ బ్యాండ్‌లో బంధించి, స్వాధీనంలో లేని కాళ్ళని చేతుల్తో మెల్లగా జరుపుకుని మంచం కిందకు వేల్లాడేసింది. మంచం తలవైపున్న చక్రాల కుర్చీని దగ్గరకు లాక్కుని శరీరాన్ని అందులోకి చేర్చడానికి దాదాపు పావుగంట శ్రమపడి విజయం సాధించింది. రోజూ ఉండే ప్రహసనమే ఐనా ప్రతిసారీ శరీరాన్ని కుర్చీలోకి చేర్చగానే 'హమ్మయ్య' అనుకుంటుంది. చక్రాలున్నాయి కాబట్టి అది ఒక చోట నిలకడగా నిలబడదు. చేతుల్తో దాన్ని కదలకుండా పట్టుకుంటూనే అవే చేతుల్ని వాడి నడుం కిందినుంచి చచ్చుబడిపోయిన శరీరాన్ని కదిల్చి ఆ కుర్చీలోకి చేరేలా చేయడం సర్కస్ ఫీట్ కన్నా తక్కువ శ్రమతో కూడుకున్నదేమీ కాదు. మొదట్లో అమ్మో లేక నాన్నో తనని ఎత్తుకుని చక్రాల కుర్చీలో కూచోబెట్టేవారు. తను పెద్దయే కొద్దీ వాళ్ళనెంత తక్కువ శ్రమ పెట్టాలో అంతే పెట్టేలా అసాధ్యాలుగా అన్పించిన కొన్ని పనుల్ని నిరంతర సాధన

ద్వారా, మొక్కవోని పట్టుదల వల్ల సాధించింది.

యిటువంటి చిన్నచిన్న విజయాలు కూడా ఆమెకెంత సంతోషాన్ని, తృప్తినీ కలుగచేస్తాయో... అలా సాధించిన ప్రతిసారీ 'ఐ యాం ది విన్నర్' అనుకుంటుంది.

రాబోయే రిజల్ట్స్‌ని తల్చుకోగానే, 'నాకిప్పటివరకు ఓటమి అంటే ఏమిటో తెలీదు. ఐయాం ఆల్వేస్ ఏ విన్నర్. ఈ పరీక్షలో కూడా విజయం నాదే' అనుకోగానే ఆమె పెదవుల మీద సన్నటి దరహాస రేఖ మెరిసింది.

మోటార్ అమర్చిన చక్రాల కుర్చీని మెల్లగా నడుపుకుంటూ బాత్రూం తలుపు తీసుకుని లోపలికి ప్రవేశించింది. తన శారీరిక వైకల్యానికి అనుగుణంగా మలచుకున్న బాత్రూం... తన సలహాలకనుగుణంగా తండ్రి చేసిన చిన్న చిన్న మార్పుల వల్ల కొన్ని పనుల్ని తానే చేసుకోగలుగుతున్నందుకు తన్ను తాను ప్రతి రోజూ అభినందించుకుంటూ ఉంటుంది. అదే తనకు బలాన్నిస్తుంది... టానిక్‌లా... మరిన్ని అవరోధాల్ని అధిగమించడానికి అవసరమైన మానసిక బలం యిలాంటి సజెషన్స్‌ద్వారా పొందవచ్చని చెప్పింది నాన్నే.

బ్రష్ మీద పేస్ట్ వేసుకుని మెల్లగా బ్రష్ చేసుకుంటూ 'థ్యాంక్ యూ నాన్నా' అనుకుంది. పట్టులేని వేళ్ళనుంచి రెండు సార్లు బ్రష్ జారి పడిపోయింది. చాలా కష్టం మీద బ్రష్‌ని మళ్ళా తీసుకుని ఆ పనిని పూర్తి చేసింది. మొదట్లో పది పన్నెండు సార్లు బ్రష్ కింద పడిపోతే అమ్మ దగ్గరుండి తీసిస్తూ 'ఎన్నిసార్లు కింద పడిందన్నది ముఖ్యం కాదు బేబీ... ఎన్ని సార్లు మనం మళ్ళా ప్రయత్నించామన్నదే ముఖ్యం' అంటూ సక్సెస్ పాఠాలు బోధించేది. యిపుడు ఒకటి రెండు సార్ల కంటే ఎక్కువగా జారిపోవటం లేదు. 'మరి కొన్నాళ్ళు పోతే అసలు బ్రష్ జారకుండా ఎంచక్కా పళ్ళు తోముకుంటాను. డెఫినెట్‌గా' అనుకుంది.

స్నానం చేయాలంటే అమ్మ సాయం కావాల్సిందే. తన బెడ్రూం తలుపు ఎప్పుడూ తెరిచే ఉంటుంది. అమ్మను పిలవాలంటే తన కుర్చీకున్న బటన్ నొక్కితే చాలు. బజ్జర్ మోగుతుంది. టైం ఎంతయిందో... అమ్మ లేచి ఉంటుందో లేదో... తనంటే ఉత్సాహమో ఉద్వేగమో ఆపుకోలేక ప్రాతఃకాలాన్నే లేచి కూచుంది కానీ పాపం అమ్మ రాత్రి పదకొండు వరకు పని చేస్తూనే ఉంటుంది. ఏ పన్నెండుకో నిద్ర పోయి ఉంటుంది.

యింకా లేచి ఉండదు. కుర్చీకి ఓ వైపు అమర్చిన ఎలక్ట్రానిక్ టాకింగ్ క్లాక్‌ని కుడిచేతి చూపుడు వేలితో తడిమింది. ఫైవ్ ఫార్టీ టూ ఏ.యమ్. అని విన్పించింది. అమ్మ మామూలుగా ఐతే ఆరింటికి లేస్తుంది. ఐనా చూద్దామని బజ్జర్ బటన్‌ని నొక్కింది. సమాధానం రాలేదు. మరోసారి బజర్ నొక్కే ప్రయత్నంచేసే లోపలే "వస్తునానమ్మా" అంటూ అమ్మ గొంతు విన్పించింది.

"అమ్మా నువ్వు అప్పుడే లేచావా... యింకా ఆరు కాలేదుగా" అంది తన గదిలోకొచ్చిన అమ్మతో.

"ఈ రోజు నాలుగున్నరకే లేచానమ్మా" అందామె తన కూతురివైపు మురిపెంగా చూస్తూ.

"అంటే నాకన్నా ముందే లేచి కూచున్నావన్మాట. ఏమిటీ విశేషం?"

"విశేషమే. ఈ రోజు మా అమ్మాయి అక్షర పూర్తిగా లాయర్ అనిపించుకునే రోజమ్మా. ఫైనలియర్ రిజల్ట్స్ వచ్చే రోజు. అక్షర గురించి నీకు తెలీదు కదమ్మా. రాత్రంతా నిద్రపోయి ఉండదు. ఐదింటికే లేచి కూచుని ఉంటుంది. దాన్ని తయారు చేసి పంపించేవరకు ఓ చోట కాలు నిలువనీకుండా కంగారు పెట్టేస్తుంది తల్లీ. అందుకు లేచాను"

"అమ్మా! నిజంగానే ఐదింటికే లేచి కూచున్నా. నీకిలాంటివి ముందే ఎలా తెలుస్తాయమ్మా"

"నేను తొమ్మిది నెలలు మోసి కని అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురి గురించి నాక్కాక మరెవరికి తెలుస్తుంది చెప్పు" అందామె బాత్రూంలో గీజర్ ఆన్ చేస్తూ.

"నేను ఏ జన్మలో పుణ్యం చేసుకున్నానో మమ్మీ... నీకూ నాన్నకి కూతురిగా పుట్టాను... ఐ యాం సో లక్కీ" అక్షర కళ్ళలో సన్నటి నీటి పొర.

"రోజుకి ఎన్నిసార్లు చెప్తావు తల్లీ ఈ మాటని" కూతురిని సమీపించి ఆమె జుట్టుని ప్రేమగా సవరిస్తూ అంది.

"రోజుకి వందసార్లు చెప్పినా తనివి తీరదు మమ్మీ... తృప్తిగా అన్పించదు. మీరు నాకోసం పడ్తున్న శ్రమా చేస్తున్న త్యాగాలూ చూస్తుంటే..."

"త్యాగాలేమిటే... మా కూతురి కోసం మేము చేసేదాన్ని త్యాగమనరు. బాధ్యతంటారు. నువు మా ప్రాణం తల్లీ. నీకోసం నేనూ మీ నాన్న ఎంత కష్టమైనా భరిస్తాం... నువ్వు సంతోషంగా ఉండటం కోసం ఎంతటి సమస్యనైనా ఎదుర్కొంటాం" అంది.

అక్షర అమ్మ పొట్టలో తల పెట్టేసి ఏడ్చేసింది. "నేను మీకు గాక మరెవరికైనా పుట్టి ఉంటే నా శారీరిక లోపంతో ఎంత నరకాన్ని అనుభవించేదాన్నో తల్చుకుంటేనే భయమేస్తోంది మమ్మీ"

"నీ లోపం గురించి నువ్వు బాధపడకూడదనే కదమ్మా మా తాపత్రయమంతా. నువ్వు దాన్ని తల్చుకుని కన్నీళ్ళు పెట్టుకుంటున్నావంటే మేం మా ప్రయత్నంలో ఫెయిలయినట్టే"

"లేదమ్మా... నా లోపం గురించి నేను బాధ పడటం మానేసి చాలా సంవత్సరాలైందమ్మా. ప్రతి క్షణం మీలాంటి తల్లిదండ్రులున్నందుకు సంతోషంతో మురిసిపోతుంటాను తప్ప దుఃఖపడనమ్మా. ఈ కన్నీళ్ళు మీకు కృతజ్ఞతలు తెల్పటం కోసం మీ పాదాలమీద రాల్చిన నీటి పుష్పాలమ్మా"

"అబ్బో... మా అక్షరకి కవిత్వం కూడా వచ్చేస్తోందే. వాళ్ళ నాన్నలా గొప్ప కవయిత్రి అవుతుందేమో" అనగానే అక్షర హాయిగా నవ్వేసింది.

"నాన్నగారిలా కవిత్వం రాసినా రాయకున్నా నేను మాత్రం లాయర్నవుతానమ్మా. ఏదో ఓ నాడు సుప్రీం కోర్టులో జడ్జీగా చారిత్రాత్మకమైన తీర్పులివ్వాలనేదే నా జీవితాశయం"

"సరే తల్లీ... నీ జీవితాశయాన్ని సాధించుకోడానికి నేనూ నాన్నా మెట్లుగా మారిపోతాం... నువ్వు ఎంచక్కా ఎక్కేయడమే. సరేనా. నీళ్ళు వేడయి ఉంటాయి. పద స్నానం చేయిస్తాను" అంది.

"నేను మెట్లు ఎక్కలేను కదమ్మా"

"మేమే ఎత్తుకుని ఎక్కిస్తాం తల్లీ"

"అందుకేనమ్మా నేనదృష్టవంతురాల్నని చెప్పింది. మెట్లూ మీరే ఎక్కించేదీ మీరే. నాకన్నీ మీరే"

"చాల్లేవే పొగిడిందీ... పద" చక్రాల కుర్చీని బాత్రూంలోకి నెట్టుకెళ్తూ అంది.

"పొగడ్త కాదమ్మా. తల్చుకుని తల్చుకుని సంతోషంతో పొంగిపోతున్నా" అంది అక్షర.

చిన్న పిల్లకు స్నానం చేయించినట్లు స్నానం చేయించింది అమ్మ. పుట్టిన కొత్తల్లో తన కాళ్ళ మీద బేబీని పడుకోబెట్టి స్నానం చేయించేది. కొద్దిగా పెద్దయ్యాక నిల్చోబెట్టి స్నానం చేయించేది. ఐదేళ్ళ వయసొచ్చాక 'నేనే లాల పోసుకుంటాను మమ్మీ. నువ్వు లోపలికి రావొద్దు' అంటూ మారాం చేసి బాత్రూంలోని నీళ్ళన్నీ ఒలకబోసేది. ఏడేళ్ళప్పుడు ఈ మహమ్మారి జబ్బొచ్చిపడింది. అప్పటినుండి మళ్ళా పసి పిల్లగా ఉన్నపుడు ఎలా స్నానం చేయించేదో అలా చేయించటం ఆమెకలవాటై పోయింది.

టవల్తో వళ్ళంతా శుభ్రంగా తుడిచి మళ్ళా చక్రాల కుర్చీలో కూచోబెట్టి బెడ్రూంలోకి తెచ్చింది.

"ఏం బట్టలేసుకుంటావు? చుడీదారా? నువ్వే సెలెక్ట్ చేసుకో తల్లీ. నేనిచ్చేది నీకు నచ్చదు కదా" అంది.

"ఈ రోజు జీన్స్ ప్యాంట్ వేసుకుని టీ షర్ట్ వేసుకుంటా మమ్మీ. అదిగో ఆ డార్క్ బ్లూ కలర్‌జీన్స్, ఆ బ్లాక్ కలర్ టీ షర్ట్ యివ్వు. కంఫర్టబుల్‌గా ఉంటుంది"

మొదట లోదుస్తులు తొడిగి తర్వాత తనడిగిన ప్యాంటూ షర్టూ తొడిగింది. జుట్టు దువ్వి జడ వదులుగా వేసింది. పౌడర్ రాయబోతుంటే "చేసింది చాల్లే మమ్మీ. చిన్నచిన్న పనులైనా నన్ను చేసుకోనీ" అంటూ అక్షరే మొహానికి క్రీం రాసుకుని దానిమీద పౌడర్ అద్దుకుంది. మొహానికి బొట్టు పెట్టుకుని అద్దంలో ఓ సారి చూసుకుంది.

గుండ్రటి మొహం... గోధుమ రంగు... విశాలమైన కళ్ళు. తీర్చి దిద్దినట్టున్న కనుబొమలు, చిన్ని నోరు... వి ఆకారంలో చుబుకం... ఎంతందంగా ఉన్నానో అనుకుంది. చిన్నప్పుడు అమ్మ తనను ముద్దు చేస్తూ 'నా బంగారు తల్లిని చూశారా... చందమామలా ఉంది కదూ... మచ్చ లేని చందమామ' అనేది. నిజమే... తన మొహంలో మచ్చ లేదు... కానీ తన శరీరంలో మచ్చ ఉంది. పెద్ద మచ్చ... భయపెట్టే మచ్చ... భయంకరమైన మచ్చ...

ఆమెను చుట్టుకోబోతున్న విషాదాన్ని ఒక్క విదిలింపుతో దూరంగా తోసేసింది. తనకు నడుం కింది భాగం చచ్చుబడిపోయిందని తెల్సినప్పటినుంచీ అమ్మా నాన్న నూరిపోసిన ధైర్య వచనాల్ని గుర్తు చేసుకుంది. ప్రతి మనిషిలోనూ బలాలూ బలహీనతలూ ఉంటాయి. బలహీనతల్ని తల్చుకుంటూ కుమిలిపోయే వ్యక్తి జీవితంలో ఏమీ సాధించలేడు. తనకున్న బలాల్ని సమీకరించుకుని బలహీనతల్ని అధిగమించడానికి ప్రయత్నిస్తూ ఆశావహ దృక్పథంతో ముందుకు సాగే వ్యక్తి మాత్రమే అద్భుతమైన విజయాల్ని సాధించగలడు.

తనకు జీవితంలో ఓడిపోవాలని లేదు. గెలవాలి.

'మరణాన్నే ఎదిరించి గెలిచావే... చావునే ధిక్కరించినదానివి. నీకు మిగతా సమస్యలో లెక్కా' అంటూ అమ్మ తనని ఉత్సాహ పర్చటం ఎన్నిసార్లు గుర్తొస్తుందో... తల్చుకున్న ప్రతిసారీ తనలో కొత్త వూపిరులూదుతూ...

“వెళ్ళొస్తానమ్మా” గేటు దాటాక అమ్మతో అంది.

“జాగ్రత్త తల్లీ... దార్లో వెహికిల్స్‌ని చూసుకుంటూ ఓ పక్కగా వెళ్ళు. మెల్లగా వెళ్ళు. స్పీడ్ పెంచకు. కొద్దిగా ఆలస్యమైనా కొంపలేం మునగవు”

“అమ్మా. రోజూ చెప్పే మాటలేగా... నాకు గుర్తుంటాయిలే. చెప్పిందే చెప్పడానికి నీకు విసుగనిపించడం లేదేమో గానీ నాకైతే వినీ వినీ బోర్ కొడ్తుందమ్మా”

“నీకు నచ్చినా నచ్చకున్నా సరేనే... నేను చెప్పకుండా ఉండలేను. తల్లి మనసు కదా... నా భయాలేవో నాకుంటాయి. ఐనా రిజల్ట్స్ తెల్సుకోవడం కోసం నువ్వు కాలేజీ కెందుకెళ్తున్నావో అర్థం కావటం లేదు. ఇంట్లో ఉన్నా తెలుస్తాయిగా. ఆత్రమనాలా? మొదటి రెండుసంవత్సరాల్లో డిస్టింగ్షన్ మార్కులు తెచ్చుకున్నావు. ఫైనలియర్లో కూడా తప్పకుండా డిస్టింగ్షన్ వస్తుందన్న నమ్మకం నాకుంది... నువ్వలా ఆరాటపడ్తుంటే చూసేవాళ్ళు నీమీద నీకు నమ్మకం లేదనుకునే ప్రమాదం ఉంది”

“నా ఆరాటానికి కారణం డిస్టింగ్షన్ వస్తుందా రాదా అని కాదమ్మా. అది తప్పకుండా వస్తుందని నాకు తెలుసు. కాలేజీ ఫస్ట్‌కి నాతో పోటీ పడ్తున్న అబ్బాయి ఉన్నాడని చెప్పానే. అతన్ని బీట్ చేశానా లేదా అనేది తెల్సుకోవాలని ఉత్సుకత... మరో కారణం ఏమంటే పీజీలో చేరడానికి అవసరమైన గైడెన్స్ మా ప్రొఫెసర్ గారు యిస్తామన్నారు.”

"కాలేజీ ఫస్ట్ నీక్కాక మరెవ్వరికి వస్తుంది తల్లీ"

"నువ్వు మరీలే అమ్మా. ఎంత కూతుర్నయితే మాత్రం మరీ అంత నమ్మకం పనికిరాదు. చాలా గట్టి పోటీ యిస్తున్నాడమ్మా. ఒకట్రెండు మార్కుల్లో అటుదిటౌతుందేమోనని భయం"

"కాదు. ఎప్పటికీ విజయం నీదే. ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్" అంది అమ్మ.

అక్షర కాలేజీకి చేరుకునే సమయానికి అక్కడ తన క్లాస్‌మేట్స్ చాలా మంది కన్పించారు. ఆమెను చూడగానే ఒక్కసారిగా చుట్టూ మూగి "కంగ్రాట్స్ అక్షరా... నీకు అక్షర అని మీ తల్లిదండ్రులు పెట్టిన పేరుని సార్థకం చేసుకున్నావు. కాలేజీకే ఫస్టొచ్చావు. నీకొచ్చిన మార్కులు ఈ కాలేజీ హిస్టరీలోనే రికార్డట తెలుసా? ప్రిన్సిపాల్ గారు నిన్నొక్కసారి కన్పించమని చెప్పారు" అన్నారు.

'మమ్మీ... ఐ హావ్ అఛీవ్డ్ ఇట్. థ్యాంక్స్ టు యూ అండ్ డాడ్' అని మనసులో అనుకుని తనకు కంగ్రాట్స్ చెప్తున్న అందరికీ థ్యాంక్స్ చెప్పింది.

ప్రిన్సిపాల్ రూం వైపుకు చక్రాల కుర్చీని తిప్పుతున్నప్పుడు కన్పించాడు కిరణ్. అతని చేతిలో రెండు గులాబీ పూల గుచ్ఛం... ఒకటి పసుపు రంగుదైతే మరొకటి తెల్లగులాబీ.

అతను ముందుకొచ్చి "నీకు కాలేజీ ఫస్టొచ్చినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు" అంటూ గులాబీల్ని చేతికందించాడు.

"థ్యాంక్స్... గులాబీలు చాలా బావున్నాయి"

"ఎల్లో కలర్ గులాబీలంటే ఇష్టమని చెప్పావుగా. అందుకే ఆ రంగుది ఇచ్చాను"

"మరి తెల్లగులాబీనో"

"నాకిష్టమైన రంగు"

ఆమె శబ్దం రాకుండా నవ్వింది. "బావుంది. ఒకటి నువ్వూ ఒకటి నేనా... రెండింటినీ కలిపి సెల్లోటేప్‌తో కట్టేసి... సింబాలిక్ ఎక్స్‌ప్రెషనా"

"చాలా బాగా వూహించావ్... నా మనసులో మాటని గులాబీల్తో తెలిపే ప్రయత్నం.."

"చాల్లే ఎవరైనా వింటే నవ్వుతారు"

"ఎందుకు?"

"పిచ్చిముదిరి పాకాన పడిందని. అవన్నీ వదిలెయ్. సెకండ్ ఎవరూ... నువ్వేనా?"

"ఇంకెవరైనా ఐతే వూర్కుంటానా... ఫస్టయితే ఏదోలే మా అక్షరే గదాని వదిలేశానుగానీ"

"అంటే ఏంటి? నువ్వు వదిలేయబట్టే నాకు ఫస్టొచ్చిందనా? అపర త్యాగయ్యవా" అక్షర కళ్ళలో చిరుకోపం...

"సరదాగా అన్నాలే... ఫస్ట్ నీక్కాక మరెవరికొస్తుంది?"

"అలా చెప్పు. కాలేజీ సెకండ్ వచ్చినందుకు కంగ్రాట్స్" అంది చేయి కలుపుతూ.

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్న కిరణ్ వదలకుండా ఆ చేతిని అలాగే పట్టుకున్నాడు.

"ఏయ్ వదులు... ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?" చేతిని బలవంతంగా లాక్కుంటూ అంది.

"ప్రేమనుకుంటారు"

"కాదు పిచ్చనుకుంటారు. నన్ను ప్రేమించడం ఎంత తెలివిలేనితనమో నీకర్థం కావటం లేదు. నా గురించి పూర్తిగా తెలిస్తే ఇలా వెంటపడవు?"

"నువ్వు ఉత్తరం ద్వారా తెలియబరుస్తానన్నావుగా. ఆ ముహూర్తంకోసం ఎదురుచూస్తున్నా"

"ఈ రోజే ముహూర్తం. నా గురించి చెప్పాల్సిన విషయాలన్నీ ఆ ఉత్తరంలో రాశాను. కొద్దిసేపు వెయిట్ చేయగలవా ప్లీజ్. ప్రిన్సిపాల్ గారు పిలుస్తున్నారట. వెళ్ళొస్తాను"

"కొద్దిసేపేంఖర్మ... జీవితాంతం వేచి ఉండమన్నా ఇక్కడే ఇలాగే నిలబడి ఉంటాను"

"అపర క్యాసబియాంకాలానా" అక్షర మనసారా నవ్వింది. "అంతొద్దులే. అరగంట చాలు" అంటూ అతనిచ్చిన గులాబీల్ని హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని ప్రిన్సిపాల్ రూం వైపుకు మళ్ళింది.

అక్షరని చూడగానే ప్రిన్సిపాల్ తన కుర్చీలోంచి లేచి ముందుకొచ్చి చేయి కలుపుతూ "హార్టీ కంగ్రాచ్యులేషన్స్ అక్షరా... వి ఆర్ ఆల్ ప్రౌడ్ ఆఫ్ యూ. నీలాంటి బ్రిలియంట్ స్టూడెంట్ మా కాలేజీలో చదవటం మా కాలేజీ చేసుకున్న అదృష్టం" అన్నాడు. దాంతో పాటు తన చేతిలో ఉన్న బొకేని ఆమెకిచ్చాడు. సంతోషంతో ఉక్కిరిబిక్కిరౌతూ "థ్యాంక్యూ సార్" అంటూ గొణిగింది. అతని రూంలో ఉన్న లెక్చరర్లు, ప్రొఫెసర్లు కూడా కంగ్రాట్స్ చెప్పారు.

"ఈ క్రెడిట్ అంతా మన కాలేజీదే సార్. మాకు పాఠాలు చెప్పిన లెక్చరర్ల ప్రతిభ... యింత ప్రతిభావంతులైన స్టాఫ్ ఉన్న కాలేజీలో చదవటమే నా అదృష్టం. మీకు నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాలి సార్. నా క్లాస్ రూం ఫస్ట్ ఫ్లోర్‌లో కాకుండా ప్రతేడూ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండేలా పర్మిషన్ ఇచ్చినందుకు ఐ యాం గ్రేట్‌ఫుల్ టు యూ సార్" అంది అక్షర.

"నెక్ట్స్ ఏం చేయాలనుకుంటున్నావు?" ప్రిన్సిపాల్ గారు తన కుర్చీలో కూచున్నాక అడిగారు

"మొదట బార్ కౌన్సిల్లో పేరు ఎన్‌రోల్ చేసుకుంటా. అప్పుడే ప్రాక్టీస్ చేయను సార్. నాకు ఎల్.ఎల్.యమ్. చదవాలని ఉంది. తర్వాతే ప్రాక్టీస్ గురించి ఆలోచిస్తా"

"గుడ్ ఐడియా. అసలు నేనే ఈ సలహా ఇవ్వాలనుకున్నాను. నీలాంటి వాళ్ళు తప్పకుండా పీజీ చదవాలమ్మా"

అక్కడే ఉన్న ప్రొఫెసర్ కిషన్‌రావ్ కల్పించుకుని, "పీజీ గురించి నన్ను సలహా అడిగితే కాలేజీకి రమ్మని చెప్పాను సార్. ఐ విల్ గైడ్ హర్ ప్రాపర్లీ" అన్నాడు.

"గుడ్. మిస్ అక్షరా... లైక్ టూ హావ్ కాఫీ ఆర్ టీ" అని అడిగాడు.

"ఏమీ వద్దుసార్" అంది యిబ్బందిగా.

"నో ఛాయిస్ నీకు. ఛాయిసల్లా కాఫీ ఇష్టమా టీ ఇష్టమా అనేదే. నువ్వు రికార్డు సృష్టించావు అక్షరా... నీకొచ్చిన పర్సెంటేజ్ సామాన్యమైన విషయం కాదమ్మా. నువ్వు కాలేజీకే కాదు యూనివర్శిటీకే ఫస్టొచ్చావు. నీకు ట్రీట్ ఇవ్వాలనే పిలిపించాను."

"నాకు టీ కాఫీలు అలవాటు లేదు సార్" అంది అక్షర.

“సరే. నీకోసం ఫ్రూట్ జ్యూస్ తెప్పిస్తాను. మేమందరం కాఫీలు తాగుతాం” అంటూ ప్యూన్‌కి ఏమేం కావాలో చెప్పాడు.

రెండు ప్లేట్లలో బిస్కెట్లు, కాఫీలు వచ్చాయి. అక్షర కోసం పైనాపిల్ జ్యూస్ తెప్పించారు.

అక్షర జ్యూస్ తాగేసి, ప్రిన్సిపాల్ గారికి థ్యాంక్స్ చెప్పి కిషన్‌రావు వైపు తిరిగి, “సర్... నేను మీ ఛాంబర్లో వెయిట్ చేస్తాను” అంది.

“ఓకే, జస్ట్ టెన్ మినిట్స్” అన్నాడు కిషన్‌రావ్.

అక్షర బైటికొచ్చింది. చెట్ల కింద జట్లు జట్లుగా విడిపోయి మాట్లాడుకుంటున్నారు.

కిరణ్ ఇందాక తనకు గులాబీ పూలిచ్చిన చోటే నిలబడి ఉన్నాడు. అతని పక్కన రమణ. ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు. అక్షర మనసులోనే నవ్వుకుని ప్రొఫెసర్ కిషన్‌రావుగారి ఛాంబర్ వైపు కుర్చీని తిప్పింది. కారిడార్ నిర్మానుష్యంగా ఉంది. ఓ చివరికి వెళ్ళి బాల్కనీలో వీల్ ఛెయిర్ని ఆపుకుని, కుర్చీకి అమర్చిన లెదర్ పౌచ్‌లో ఉన్న సెల్ ఫోన్ తీసి యింటికి ఫోన్ చేసింది.

అమ్మ ఫోనెత్తడమే తరువాయి, “అక్షరా... కాలేజీ ఫస్ట్ నీదే కదూ. ఈ గుడ్ న్యూస్ చెప్పడానికేగా ఫోన్ చేశావు?” అంది.

అక్షరకు కన్నీళ్ళు తిరిగాయి. “ఎంత నమ్మకం మమ్మీ నామీద! మీ నమ్మకాల్నెప్పుడూ వమ్ము చేయను మమ్మీ... కాలేజీ ఫస్టే కాదు... యూనివర్శిటీ ఫస్ట్ కూడా నాదే”

“వావ్ గ్రేట్... ఐ ఫీల్ ప్రౌడ్... నువ్వు తొందరగా రా... మనం సెలబ్రేట్ చేసుకుందాం. చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయాల్సిన న్యూస్ తెలుసా?”

“నాన్నగారికి నువ్ చెప్పకు మమ్మీ... నేనే ఫోన్ చేసి చెప్తాను”

“సరే తల్లీ... తొందరగా చెప్పు. చాలా సంతోషపడ్తారు”

“దేనికీ కొరగాని జీవితం అని మన బంధువులూ స్నేహితులూ జాలిపడిన నా జీవితాన్ని ఎంత గొప్పగా మలిచారు మమ్మీ... నేను తల ఎత్తుకుని నా జీవితానికి కూడా ఓ అర్థం, ఓ సార్థకత ఉన్నాయని నిరూపించేలా చేశారు. ఏం చేసి మీ రుణం

తీర్చుకోవాలో తెలీటం లేదు మమ్మీ" అక్షరలో అప్పటి వరకూ బిగపట్టుకున్న ఏడుపు కట్టలు తెగిన నదిలా పొంగుకొచ్చింది.

"మేం చేసింది తక్కువే తల్లీ... నిన్ను నువ్ నిరూపించుకోడానికి ఎంత హింస పడ్డావో కళ్ళారా చూసిన తల్లిని. నువ్వు పడిన కష్టం వృధా పోలేదు. దేవుని దయ వల్ల..."

"మమ్మీ నీకెన్ని సార్లు చెప్పాను దేవుడి ప్రస్తావన నా దగ్గర తీసుకు రావొద్దని. దేవుడు లేడు మమ్మీ... ఉంటే నన్నూ నాలాంటి కొన్ని వేల మందిని యిలా ఎందుకు తయారు చేసి శిక్షిస్తాడు? నేనేం పాపం చేశానని ఆ దేవుడు నన్ను నడవడానికి వీల్లేకుండా చక్రాల కుర్చీకి అతుక్కుపోయేలా చేశాడు? ఒకవేళ నిజంగానే దేవుడుంటే వాడు దుర్మార్గుడై ఉంటాడు. నాలాంటి వాళ్ళని పుట్టించి మేము కష్టపడ్తుంటే చూసి నవ్వుకునే శాడిస్ట్ అయి ఉంటాడు"

"తప్పమ్మా... అలా అనకూడదు"

"ప్లీజ్ మమ్మీ... దేవుడి దయ అనకు... దయలేని దేవుడనుకో. నాకు తెల్సిన దేవుళ్ళు యిద్దరే మమ్మీ... నువ్వూ నాన్న. రోజూ నాన్న నన్నెత్తుకెళ్ళి క్లాస్‌లో కూచోబెట్టడం గుర్తొస్తోంది మమ్మీ. నువ్వు నా కోసమని ఉద్యోగాన్ని కూడా మానేసి యిప్పటికీ పసిపిల్లకు స్నానం చేసి బట్టలు తొడిగినట్టు అన్నీ నువ్వే చేస్తున్నావే... అవన్ని గుర్తుకొస్తున్నాయి మమ్మీ"

"చాలా సంతోషపడాల్సిన సమయంలో అవన్నీ ఎందుకు గుర్తు చేసుకుంటావు బంగారు తల్లీ. నువ్వలా వెక్కి వెక్కి ఏడుస్తుంటే నేనెంత దిగులు పడ్తానో తెలీదా?"

"తెలుసు మమ్మీ. యిది సంతోషపడాల్సిన సమయం కాబట్టే అన్నీ గుర్తుకొస్తున్నాయి. నేను లా గ్రాడ్యుయేట్ ఐన శుభ సందర్భం కాబట్టే జరిగిన సంఘటనలన్నీ రీళ్ళలా కళ్ళముందు కదుల్తున్నాయి. నేను గర్వంగా తలెత్తుకుని నిలబడటానికి కారణమైన వ్యక్తుల్ని ఈ సమయంలో తల్చుకోకపోతే నేను మనిషినే కాదు. మరుజన్మ ఉందో లేదో నాకు తెలీదు మమ్మీ. ఉంటే నేను మీ యిద్దరికే మళ్ళా కూతురిగా పుట్టాలని కోరుకుంటాను"

"ఎందుకురా బంగారు తల్లీ... అంత ఎమోషనల్ ఐపోతున్నావు? నువ్వు త్వరగా యింటికిరా... నేను రానా? యిద్దరం కలిసి వచ్చేద్దాం"

"వద్దు మమ్మీ... ఐ యాం ఆల్ రైట్... నేనే వచ్చేస్తాను. మా ప్రొఫెసర్ గారు వస్తున్నారు. మళ్ళా కాల్ చేస్తాను. బై" అని ఫోన్ కట్ చేసింది.

ప్రొఫెసర్ గారితో మాట్లాడి బైటికొచ్చాక మళ్ళా ఆలోచనలు ప్రభంజనంలా అక్షరని చుట్టుముట్టాయి. ఈ విజయం వెనక ఎంత సుదీర్ఘమైన ప్రయాణం ఉందో... అలుపే ఎరుగని ఎంత ప్రయాస ఉందో... తన తల్లిదండ్రుల ఎన్ని త్యాగాలు దాగి ఉన్నాయో...

జ్ఞాపకాలు... ఒక్కటొక్కటిగా... ఎన్ని జ్ఞాపకాలు... ఎన్ని చేదు జ్ఞాపకాలు... వాటితో మిళితమై అమ్మానాన్నల అపురూపమైన ప్రేమకు గుర్తుగా ఎన్ని తీపి జ్ఞాపకాలో...

రమణ వెళ్ళిపోయినట్టున్నాడు. కిరణ్ ఒక్కడే నిలబడి ఉన్నాడు.

అక్షరను చూడగానే ఆమెకు ఎదురెళ్ళి, ఆమె పక్కనే మెల్లగా నడుస్తూ "ఏదీ నా ఉత్తరం... తొందరగా ఇచ్చేయి" అన్నాడు.

"ఇక్కడేనా... అన్నీ తొందరే నీకు" అంది విసుక్కుంటూ.

"తొందరా... ఎక్కడి తొందర లాయరమ్మా... ఈ ఉత్తరం కోసం ఎన్ని నెలలుగా ఎదురు చూస్తున్నానో నీకు తెలీదా? ఇప్పటికే చాలా ఆలస్యం చేశావని చెప్పు"

ఇద్దరూ కాంపౌండ్ దాటి మెయిన్ రోడ్డు మీదికొచ్చారు.

"ఇక్కడ మన కాలేజీవాళ్ళెవరూ లేరు. ఇప్పటికైనా ఇస్తావా లేక మీ ఇంటిదాకా నడిపిస్తావా?"

అక్షర వీల్ ఛెయిర్ని ఓ పక్కకు ఆపింది. తన హ్యాండ్ బ్యాగ్ లోంచి పొడవాటి బ్రౌన్ కలర్ కవర్ని తీసింది. "నేను రాసింది జాగ్రత్తగా చదువు... ఇది కథ కాదు జీవితం... ఆ సీరియస్‌నెస్తోనే చదువు. తొందరలేదు. ప్రశాంతంగా ఆలోచించుకున్నాకే నీ అభిప్రాయం చెప్పు" అంది.

***

కిరణ్ తన చేతిలో ఉన్న కవర్ని విప్పి చూశాడు. చాలా పేజీలున్న ఉత్తరం... కాగితాల్ని మళ్ళా కవర్లో పెట్టేసి జేబులో పెట్టుకున్నాడు.

మధ్యలో వేరే పనులేం పెట్టుకోకుండా నేరుగా ఇంటికెళ్ళి తన గదిలో కూచుని

ఉత్తరాన్ని చదవటం ప్రారంభించాడు.

"కిరణ్... నా జీవితం గురించి చెప్పాలంటే ఎక్కడ మొదలెట్టాలో తెలీటం లేదు.

నా బాల్యం ఎంత మధురంగా గడిచిందో... వూహ తెల్సినప్పటినుండీ అమ్మా నాన్నలు ప్రేమలో ముంచేయడమే తెలుసు. నాన్నకు అమ్మన్నా ఎంతిష్టమో... వాళ్ళది మేనరికం. అమ్మ పుట్టగానే నాన్నకు పెళ్ళాం పుట్టిందని అమ్మమ్మ తరపు వాళ్ళు నాయనమ్మ తరపు వాళ్ళు నిర్ణయించేసుకున్నారట. అమ్మకు చదువంటే చాలా యిష్టం. పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేయాలని తాపత్రయపడేదట. అందుకే పదో తరగతి కాగానే పెళ్ళి చేసేస్తామంటే ఎదురు తిరిగి మరీ తన మాటని నెగ్గించుకుందట.

ఎవరైనా సరదాకి 'వాడికేమే మగాడు. ఎన్ని రోజులని నీ కోసం ఎదురు చూస్తాడు? నువ్వేమో డిగ్రీ పూర్తి కాందే చేసుకోనంటున్నావు. వాడు యింకెవర్నో యిష్టపడితే నీ కొంప కొల్లేరే' అంటే 'ఎందుకు కొల్లేరౌతుంది? నన్ను కాదని యింకెవర్ని చేసుకున్నా మామయ్య బతుకే బండలౌతుంది. నా అంత మంచి పిల్ల ఆ మొహానికి దొరకొద్దూ... డిగ్రీతో అపుతాననుకుంటున్నారా... పీజీ చేస్తాను... తర్వాతే పెళ్ళి' అనేదట.

'అమ్మో... పాపమే. యిప్పటి వరకూ బాధపెట్టింది చాల్లే. లెక్చరర్‌గా ఉద్యోగంలో కూడా చేరాడు. వూరుగాని వూరు. తిండీ తిప్పలు ఎవరు చూసుకుంటారు? పెళ్లో పెళ్లో అంటూ తపించి పోతున్నాడే' అంటే

'నాకవన్నీ తెలీదు. నేనంటే ప్రాణమని, ఇష్టమనీ చెప్పాడుగా. నిజమైన ప్రేమయితే ఎన్నేళ్ళయినా నా కోసం ఎదురు చూస్తాడు. అలా చూళ్ళేదనుకో. మామయ్య ప్రేమలో నిజాయతీ లేదన్మాట. అటువంటప్పుడు నేను వెంపర్లాడటంలో అర్థం లేదు. నేను కూడా వేరే అబ్బాయిని చేసుకుని హాయిగా కాపురం చేసుకుంటాను' అనేదట.

సైకాలజీలో అమ్మ యం.ఏ. చేశాక సెక్రటేరియట్లో ఉద్యోగంలో చేరింది. ఉద్యోగంలో చేరిన నాలుగు నెల్లకు పెళ్ళి జరిగింది.

పెళ్ళయిన రెండేళ్ళకు అమ్మ గర్భవతి ఐతే అమ్మమ్మ వాళ్ళు ఘనంగా సీమంతం చేశారట. నేను పుట్టాక 'యింట్లో మహలక్ష్మి పుట్టిందని' అందరూ మురిసిపోయారట. ఏడేళ్ళ వయసొచ్చే వరకు నేను ఆడింది ఆట పాడింది పాటలా సాగింది.

ఓ రోజు స్కూల్లో ఉన్నపుడు విపరీతంగా జ్వరం వచ్చింది. అమ్మకు ఫోన్ చేస్తే

ఆఫీసుకి శెలవ పెట్టొచ్చి యింటికి పిల్చుకెళ్ళింది. నాలుగు రోజులైనా జ్వరం తగ్గకపోతే హాస్పిటల్లో జాయిన్ చేసారు. అప్పుడు చేసిన రకరకాల పరీక్షల్లో నాకు జెనెటిక్ డిసార్డర్ ఉందని డాక్టర్లు నిర్ధారించారు. న్యూరో మస్కులార్ డిసార్డర్ అన్నారట. అది రోజు రోజుకూ పెరుగుతుందనీ, కొన్నాళ్ళు పోతే చేతులూ కాళ్ళూ పని చేయవనీ, చివరికి బ్లాడర్ మూవ్‌మెంట్ పైనా బవెల్ మూవ్‌మెంట్ పైనా కంట్రోల్ తప్పి పోతుందని చెప్పారట. నాన్నకీ అమ్మకీ వీటన్నిటికన్నా ఎక్కువ దుఃఖాన్ని కలుగచేసిన విషయం మరొకటుందట. నేను పదిహేను పదహారేళ్ళొచ్చేవరకే బతుకుతాననీ ఇలాంటి జబ్బున్నవాళ్ళు అది దాటి బతికిన దాఖలాలు లేవనీ డాక్టర్లు చెప్పారట. ఈవిషయం నా చిన్నప్పుడు నాకు తెలీకుండా జాగ్రత్తపడినా పెద్దయ్యాక తెలిసింది.

అప్పటినుండీ యింటి వాతావరణమే మారిపోయింది. ఎప్పుడూ సరదాలు, షికార్లు, నా అల్లరీ, ఆటలు... నవ్వులూ కేరింతలూ తుళ్ళింతలూ ఉండే యింట్లో ఒక్కసారిగా సీరియస్ వాతావరణం నెలకొంది. శ్మశాన నిశ్శబ్దమేదో రాజ్యమేలుతున్నట్లు... నాలో కూడా నాకు తెలీకుండానే మార్పొచ్చింది. ఒక్కసారిగా పెద్దదాన్నయిపోయినట్టు... అకస్మాత్తుగా నా బాల్యాని ఎక్కడో పోగొట్టుకున్నట్టు... ఆ వయసులో అమ్మానాన్న నాకేమీ చెప్పకున్నా ఏదో జరక్కూడనిది జరగబోతోందని నా చిన్న మనసుకి అర్థమైంది. పిల్లలకు చాలా విషయాలు తెలీవని పెద్దలనుకుంటారుగానీ యింట్లోని ప్రతి వస్తువునీ ప్రతి వ్యక్తినీ వాళ్ళ హావభావాల్ని ప్రతిక్షణం పరిశీలిస్తూ వాటిని మెదళ్లో భద్రంగా నిక్షిప్తం చేసుకుంటారు పిల్లలు.

నేను థర్డ్ క్లాస్‌లో ఉన్నపుడు మొదట కాళ్ళు పని చేయటం మానేశాయి. యింట్లో కాళ్ళీడ్చుకుంటూ పాకేదాన్ని. స్కూలుకి రోజూ నాన్న ఎత్తుకెళ్ళేవాడు. మళ్ళా స్కూలు వదిలాక తన భుజాల మీద వేసుకుని యింటికి తెచ్చేవాడు. యింటర్వెల్ సమయంలో పిల్లలందరూ పొలోమని క్లాస్ రూం బైటికి పరుగెత్తినపుడు ఎంత దుఃఖం వచ్చేదో. మధ్యాహ్నం అమ్మ వచ్చేవరకు అక్కడే కదలకుండా కూచునేదాన్ని. అమ్మ వచ్చాక అన్నం తిన్పించేది. నన్ను బాత్రూంలో కెత్తుకెళ్ళి మళ్ళా తెచ్చి క్లాస్ రూంలో కూచోబెట్టి వెళ్ళేది.

మధ్యలో బాత్రూంకి వెళ్ళే అవసరం రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకునేదాన్ని. నీళ్ళు తక్కువ తాగేదాన్ని. లంచ్ సమయంలో తప్ప మళ్ళా ఆ అవసరం రాకుండా

శరీరానికి అలవాటు చేయడానికి దాదాపు ఆర్నెల్లు పట్టింది. సాయంత్రాలు పిల్లలు ఆడుకుంటుంటే చూసి ఏడుపొచ్చేది. అపుడు అమ్మ చెప్పిన మాటలు నా జీవితానికి సంబంధించిన కొన్ని నిర్ణయాలు తీసుకోడానికి ఉపయోగపడ్డాయి. జీవితాన్ని ఎన్ని కోణాల్లోంచి చూడొచ్చో నాకు నేర్పింది మా అమ్మే.

'నీకో విషయం తెలుసా తల్లీ. ఒకప్పుడు నీకున్నటువంటి శారీరిక లోపం ఉన్న వాళ్ళని ఫిజికల్లీ డిసేబుల్డ్ అనేవాళ్ళు. యిపుడు వాళ్ళనలా పిలవటం తప్పు' అంది.

'మరిప్పుడు ఏమని పిలుస్తారు' అని అడిగా.

'ఫిజికల్లీ ఛాలెంజ్డ్ అంటారు. జీవితంలో ఛాలెంజెస్ లేకపోతే ఏం బావుంటుంది చెప్పు... చప్పగా ఉంటుంది. అన్నీ సవ్యంగా ఉన్నవాళ్ళు ఏం సాధించినా గొప్పేముంది? వాళ్ళు సాధించకపోతే అవమానం గానీ సాధిస్తే ఆశ్చర్యమేముంది? అదే నీలాంటి వాళ్ళనుకో... నువ్వు ఏ చిన్న విజయం సాధించినా అది గొప్పే తల్లీ. యికనుంచీ నీ మనసంతా నువ్వు సాధించాల్సిన విషయాల మీద కేంద్రీకరించు. వాళ్ళు ఆటలాడే సమయంలో నువ్వు బాగా చదువు. నీ క్లాస్‌లో నువ్వే ఎప్పుడూ ఫస్ట్ ఉండాలి... ఏ అవరోధాన్నయినా ఎలా అధిగమించాలో ఆలోచించు. దానికోసం ప్రయత్నించు. ఓ వేళ అధిగమించలేనిదైతే దాంతో సమాధానపడు. నీ జీవితంలో దాన్నీ ఓ భాగం అనుకో. మనస్ఫూర్తిగా దాన్ని అంగీకరించు. నువ్వు దాంతో విరోధం పెట్టుకోకపోతే అది నిన్ను బాధించదు' అంది.

అప్పటినుండీ నా వైకల్యాన్ని అంగీకరించడం ప్రారంభించాను. తమాషాగా అది ఎక్కువగా బాధించటం తగ్గింది.

అమ్మకు ఆఫీసులో పని వత్తిడి పెరిగింది. రోజూ మధ్యాహ్నాలు నా దగ్గరకు రావటం వల్ల ఒక్కోసారి తిరిగి ఆఫీసుకెళ్ళటానికి లేటయ్యేది. రెండు మూడుసార్లు సెక్షన్ ఆఫీసర్ విసుక్కున్నాడట. అమ్మ ఓ రోజు సీరియస్‌గా ఆఫీసునుంచి వచ్చేసింది.

'నీకు ఆఫీసు పని ముఖ్యమా... నీ కూతురు ముఖ్యమా తేల్చుకో... పని చేయకుండా తేరగా జీతం కావాలంటే కుదర్దు. ఏదో ఒకట్రెండు రోజులంటే సర్దుకుపోవచ్చు. యిలా ప్రతి రోజూ ఏదో ఓ సాకుతో ఆలస్యం చేస్తే ఒప్పుకునేది లేదు' అన్నాడట.

'నాకు నా కూతురే ముఖ్యం. ఈ బోడి ఉద్యోగం... దాని వల్ల వచ్చే జీతం కాదు'

అని పోట్లాడి వచ్చేసిందట. నాన్న కాలేజీ నుంచి రాగానే యిద్దరూ చాలాసేపు ఉద్యోగం చేయాలా మానేయాలా అనే దాని గురించి చర్చించుకున్నారు. ఆర్థిక భారాన్ని తట్టుకోగలరా లేదా అనే విషయం గురించే ఎక్కువగా ఆలోచించారు.

'మనకున్నది ఒక్కటే నలుసు. కొద్దిగా పొదుపుగా వాడుకుంటే మీ జీతం చక్కగా సరిపోతుంది. నేను మాత్రం ఉద్యోగానికెళ్ళనండీ. చాలా వత్తిడి అన్పిస్తోంది. ఆఫీసులో ఉన్నంత సేపూ పిల్ల ఎలా ఉందో... ఏమైనా యిబ్బంది పడ్తుందో అనే ఆలోచన... పిల్ల దగ్గరికొస్తే ఆఫీసులో పరిస్థితి ఎలా ఉందో ఎవరేం అంటారో అనే ఆలోచన... ఈ హింసను భరించలేనండీ. నాకు నా కూతురి బాగోగులే ముఖ్యం. యింట్లో ఉండి దాని అవసరాలు చూసుకుంటా' అంది.

దానికి నాన్న కూడా మనస్ఫూర్తిగా తన అంగీకారాన్ని తెలిపాడు. మరునాడే ఆఫీసుకెళ్ళి ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు రాసిచ్చి యింటికొచ్చేసింది.

నెల గడవక ముందే అమ్మకు మరో ఆలోచన వచ్చింది. నేను చదివే స్కూల్లో పన్లో చేరితే ఏదో కొంత జీతమూ వస్తుంది... పిల్లకు దగ్గరగా ఉన్నట్టూ ఉంటుందన్న ఆలోచన.

నాన్నకు చెప్తే 'చాలా మంచి ఆలోచన... నువ్వు యం.ఏ. సైకాలజీలో గోల్డ్ మెడలిస్ట్‌వి. నువ్వడగాలే గానీ కళ్ళకద్దుకుని ఉద్యోగం యిస్తారు. రేపే వెళ్ళి ఆ స్కూల్ ప్రిన్సిపాల్తో మాట్లాడతాను. పిల్లని స్కూల్లో అలా వదిలి వస్తుంటే నాకూ టెన్షన్‌గానే ఉంటోంది. నువ్వా స్కూల్లో చేరితే నేనూ నిశ్చింతగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించగలను' అన్నాడు.

అమ్మ మా స్కూల్లో టీచర్‌గా చేరిన రోజు నాకెంత సంతోషం వేసిందో... గుండెమీంచి యిన్నాళ్ళూ మోస్తున్న కొండనెవరో తీసేసినట్టు... ఎవరో ఏంటి... మా మమ్మీనే... ఎక్కువగా మమ్మీ మా క్లాస్‌కే వచ్చి పాఠాలు చెప్పేది. వేరే క్లాసుల్లో పాఠాలు చెప్పాల్సి వచ్చినా పీరియడ్ కాగానే నా దగ్గరకొచ్చి 'ఎలా ఉన్నావు తల్లీ... ఏమైనా కావాలా' అని అడిగేది. నాకేమీ అవసరం లేకున్నా అమ్మ వచ్చి అలా అడగాలని ఎదురు చూసేదాన్ని. అమ్మ అలా అడిగి వెళ్ళాక మనసు ప్రశాంతంగా మారిపోయేది.

మిగతా పిల్లలు ఆడుకుంటున్నపుడు అమ్మ నా దగ్గర కూచుని యిండోర్ గేమ్స్

ఆడించేది. చెస్, క్యారమ్స్, వర్డ్ గేమ్, అంత్యాక్షరీ... అమ్మే నాకు బెస్ట్ ఫ్రెండ్. యింట్లో నాన్న వచ్చాక ముగ్గురం కలిసి పేకాట ఆడేవాళ్ళం. మిగతా పిల్లల మాదిరి నేను ఆడుకోలేకపోతున్నాననే ఆత్మన్యూనతా భావాన్ని అమ్మ సాయంతో పూర్తిగా జయించాను.

కాళ్ళు స్వాధీనంలో లేకున్నా చేతులు బాగానే ఉండటం వల్ల చదువుకి ఆటంకం కావడం లేదని సంతోషపడేదాన్ని. ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. నేను ఆరో తరగతిలో ఉన్నపుడు ఆ జబ్బు చేతులకు పాకటం ప్రారంభించింది. మొదట్లో చేతులు ఎత్తడం... దేన్నయినా గట్టిగా పట్టుకోవడం యిబ్బందిగా అన్పించేది. రాను రాను వేళ్ళు తమ పట్టుని పూర్తిగా కోల్పోయాయి. చేతులు కదపలేకపోయేదాన్ని.

హోం వర్క్ అంతా అమ్మే చేసిపెట్టేది. నాకు చదువు దెబ్బతింటుందన్న దిగులు పట్టుకుంది. యిలా ఉంటే పరీక్షలెలా రాస్తాను అనేదిగులు. అప్పుడు కూడా అమ్మే ధైర్యం చెప్పింది. పరీక్ష రాయడానికి చేతులు సహకరించని వాళ్ళకోసం వేరే వాళ్ళు పరీక్ష రాసి పెట్టే వెసులు బాటు ఉందని చెప్పింది.

'నువ్వు ఆరో తరగతిలోనేగా ఉన్నావు. పదో తరగతి పరీక్ష రాయడానికి యింకా నాలుగేళ్ళ సమయం ఉంది. నీ చేతులకొచ్చిన సమస్య కాళ్ళకొచ్చినంత తీవ్రంగా లేదని డాక్టర్లు చెప్పారు. ఫిజియో థెరపీ వల్ల పరిస్థితి బాగు పడొచ్చనికూడా చెప్పారు. నాకు చాలా నమ్మకంగా ఉంది తల్లీ. అప్పటికి నీకు నువ్వే పరీక్ష రాసే స్థితిలో ఉంటావు' అంది అమ్మ.

'ఓ వేళ పరిస్థితిలో మార్పులేకపోతే...' అన్నాను.

'నేనెప్పుడూ పాజిటివ్ గానే ఆలోచిస్తానని నీకు తెల్సుగా. జరగబోయే విషయాల గురించి మంచిగానే అనుకుంటే కనీసం అది జరిగేవరకైనా మనశ్శాంతిగా ఉంటుందిగా. ఓ వేళ అలా జరగలేదనుకో. అప్పటికీ మనకొచ్చే నష్టమేమీ లేదు. నీ చేత టెన్త్ క్లాస్ పరీక్షలు రాయించే పూచీ నాది. నువ్వు ఇవన్నీ నాకూ నాన్నగారికి వదిలేసి హాయిగా చదువుకో' అంది.

అమ్మ ఆశించినట్టే ఫిజియోథెరపీ వల్ల కొన్ని వేళ్ళను కదిలించే స్థితి కొచ్చాను. పదో తరగతి కొచ్చే సమయానికి నా పరీక్షను నేనే రాసుకోగలనన్న నమ్మకం వచ్చింది. స్పీడ్‌గా రాయటం ప్రాక్టీస్ చేయటం కోసం గంటలు గంటలు నా చేత రాయించేది

అమ్మ. నాన్న కాలేజీ నుంచి రాగానే నన్ను ఫిజియోథెరపీకి పిల్చుకెళ్ళేవాడు. యింటికి పిల్చుకొచ్చాక కూడా వాళ్ళు చెప్పినట్టు నాచేత ఎక్సర్‌సైజులు చేయించేవాడు.

నా కోసం అమ్మా నాన్న పడ్తున్న శ్రమ చూసి ఏడుపొచ్చేది. వాళ్ళ బతుకుని వాళ్ళు బతకటం మర్చిపోయి ఎన్నో ఏళ్ళయినట్టు... వాళ్ళు బతుకుతున్నదే నా కోసమన్నట్లు ప్రతిక్షణం నా కోసం తపన పడేవాళ్ళు. ప్రతిక్షణం నా గురించే ఆలోచించేవాళ్ళు.

నా దురదృష్టం చూశావా... బతుకులో విరుచుకు పడ్తున్న సమస్యలను అర్థం చేసుకుని వాటి సాహచర్యంలోనే వీలైనంత నాణ్యతగా, గౌరవంగా బతకడానికి అలవాటు పడిన కొద్దిరోజులకే మరో కొత్త సమస్య వచ్చి పడేది.

పదో తరగతి క్వార్టర్లీ పరీక్షల తర్వాత ఓ రోజు యింట్లో చదువుకుంటున్నాను. అమ్మ వంట గదిలో డిన్నర్ తయారు చేయటంలో బిజీగా ఉంది. నాన్న టీవీలో న్యూస్ చూస్తున్నారు. నేను కూచున్న కుర్చీ తడిగా అన్పించింది. ఏమిటా తడని తడిమి చూసుకుంటే నా పైజమా కూడా పూర్తిగా తడిచిపోయి ఉంది. ఒక్కసారిగా భయమేసింది. అంటే నాకు తెలీకుండానే పాస్ పోసేసుకున్నాను.

దగ్గరగా నాన్న కూచుని ఉన్నా ఆయనతో చెప్పడానికి సిగ్గనిపించింది. అమ్మను కేకేసి ఆమె దగ్గరగా వచ్చాక మెల్లగా చెవిలో చెప్పాను. నాకు తెలీకుండానే కన్నీళ్ళు వచ్చేసాయి. అమ్మ ఆందోళన పడలేదు. అలాంటిదేదో జరుగుతుందని ముందే తెలిసినదానిలా ప్రవర్తించింది. నాన్నా అమ్మా కొద్దిసేపు ఈ విషయం గురించి మాట్లాడుకున్నారు.

అమ్మ నాకు స్నానం చేయించి బట్టలు మార్చింది. బకెట్తో నీళ్ళు ఫినాయిల్ తెచ్చి నేలంతా శుభ్రం చేసింది.

'అమ్మా... నువ్వలాంటి పనులు చేస్తుంటే దిగులేస్తోందమ్మా. సిగ్గనిపిస్తోంది. చచ్చిపోవాలనిపిస్తోంది' అన్నాను.

'ఎందుకు తల్లీ... చిన్నప్పుడు నేనివన్నీ చేసిందాన్నేగా... యిపుడూ చేస్తాను. నాకేమీ ఇబ్బంది లేదమ్మా. నువ్వలా అనుకుని హింస పడకు' అంది.

'అపుడు నాకు వూహ తెలీదమ్మా... యిపుడు నాకు పదహారేళ్ళు'

'పిల్లలకు ఎన్నేళ్ళొచ్చినా తల్లిదండ్రులకు వాళ్ళెప్పుడూ చిన్న పిల్లలుగానే కన్పిస్తారు తల్లీ' అంది.

మరునాడు నాన్న నన్ను డాక్టర్ దగ్గరకు పిల్చుకెళ్ళాడు.

నడుం కింది నుంచి మొత్తం చచ్చుబడిపోయే సమస్య మొదలైందనీ... యిక ముందు బ్లాడర్ మూవ్‌మెంట్ పైనా, బవెల్ మూవ్‌మెంట్ పైనా నియంత్రణ ఉండదనీ, ఆ విషయంలో తల్లిదండ్రులే సరైన జాగ్రత్తలు తీసుకోవాలనీ చెప్పాడు.

నాకు మరో భయం పట్టుకుంది. అమ్మతో అదే చెప్పాను. 'మొన్న యింట్లో ఉన్నపుడు అలా జరిగింది కాబట్టి నీ దగ్గరా నాన్న దగ్గరే అవమానమనిపించింది. మీరు నా తల్లిదండ్రులు కాబట్టి నన్నేమీ కించపర్చకుండా అంతా శుభ్రం చేశారు. కానీ మమ్మీ... ఇటువంటి హారిబుల్ ఎక్స్‌పీరియన్స్ స్కూల్లో ఎదురైందనుకో. అప్పుడా అవమానాన్ని తట్టుకోలేను మమ్మీ. చచ్చిపోవాలనిపిస్తుంది.'

'తప్పమ్మా అలా అనకూడదు. జీవితం దేవుడిచ్చిన వరం'

'కాదమ్మా... నాకు శాపం'

'జీవితాన్ని శాపంగానో వరంగానో మార్చుకోవడం మన చేతుల్లోనే ఉందమ్మా. నీకటువంటి అనుభవం మళ్ళా ఎదురుకాకుండా ట్రెయిన్ చేస్తానుగా. మన శరీరంలో కూడా ఓ గడియారం ఉంటుంది. దాన్నే బయోలాజికల్ క్లాక్ అంటారు. మనం శరీరాన్ని ఎలా మలిస్తే అలా రూపు దిద్దుకుంటుంది. టాయిలెట్‌కి ఎపుడెళ్ళాలి ఎన్నిసార్లు వెళ్ళాలి అనేది నియంత్రణలో పెట్టుకుంటే చాలు. దానిక్కావల్సింది మనో నిబ్బరం... పట్టుదల... మనం విజయం సాధిస్తామన్న నమ్మకం' అంది అమ్మ.

అన్నట్లే నా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంది. నాకు సెన్సేషన్ లేకున్నా నిర్ణయించిన టయానికి బాత్రూం కెళ్ళటం అలవాటు చేసింది. నన్ను యిబ్బంది పెడ్తున్న మరో సమస్య మీద విజయం సాధించానని మురిసిపోయాను.

అమ్మానాన్నల మనసుల్లో నా చావుకి సంబంధించిన భయం వేళ్ళూనుకుంది. చిన్నప్పుడు తెలీకున్నా నాకు నా అనారోగ్యానికి సంబంధించిన నిజాలు ఒక్కటొక్కటిగా తెలియసాగాయి. నేను పదిహేను పదహారేళ్ళు వచ్చేలోపలే చచ్చిపోతానని డాక్టర్లు చెప్పిన విషయం కూడా తెలిసింది. నాకు తెలుసని అమ్మా నాన్నలకు తెలీదు. రాత్రుళ్ళు పదకొండో

పన్నెండో దాటాక నేను నిద్రపోయాననుకుని దాని గురించి మాట్లాడుకునే వాళ్ళు. అమ్మ వెక్కిళ్ళు పెట్టి ఏడ్వటం స్పష్టంగా విన్పించేది.

చావంటే ఏమిటి? చావు తర్వాత ఏముంటుందీ? అని తీవ్రంగా ఆలోచించేదాన్ని. దేవుడు లేడని వాదించేదాన్ని కాబట్టి చావు తర్వాత స్వర్గనరకాలో లేక మరుజన్మ సిద్ధాంతమో నచ్చేది కాదు. చావు తర్వాత అనంతమైన శూన్యం ఉంటుందనిపించేది. లేదా ఆలోచనలు చొరబడని చిక్కటి చీకటి... గాఢాంధకారం ఉంటుందేమో... భయంకరమైన నిశ్శబ్దం కూడా ఉంటుందనుకుంటా... ఇవన్నీ తల్చుకుంటే భయమనిపించేది.

నిజంగానే చనిపోతానా... మరి నేను సాధించాలనుకున్న విషయాలో... ఏమీ సాధించకుండానే చచ్చిపోతానా... మరి ఎందుకు పుట్టినట్లు... అమ్మానాన్నలను కష్టపెట్టడానికే పుట్టానేమో. వాళ్ళను మానసికంగా హింస పెట్టడానికే పుట్టానేమో... నా బతుక్కి అర్థమే లేకుండా అర్ధాంతరంగా చచ్చిపోవటం ఎంత దురదృష్టం?

చదువు మీద శ్రద్ధ తగ్గింది. ఎలాగూ చనిపోయేదానికి ఎందుకు కష్టపడి చదవాలీ అన్పించేది. చదివి సాధించేదేముంది? టెన్త్‌లో ఐదువందల యాభయ్యో అరవయ్యో తెచ్చుకోవటం వల్ల ఒరిగేదేమిటి? ఎలాగూ యింటర్ చదవలేను. ఓ వేళ యింటర్లో చేరినా అది పూర్తయ్యేవరకు బతకనని తెల్సినపుడు ఎందుకీ ఆరాటం? అమ్మకూ నాన్నకు అనవసరమైన కష్టం తప్ప ఏంటి ప్రయోజనం? కనీసం నేను బతికినన్ని రోజులైనా వాళ్ళిద్దరికీ కొంత మనశ్శాంతిని, విశ్రాంతినీ యివ్వొచ్చుగా.

యిలాంటి ఆలోచనల వల్ల గ్రేడ్‌లు తగ్గడం ప్రారంభమైనాయి. అమ్మ ఎంత చెప్పినా చావు భయం ముందు అవేవీ పని చేసేవి కావు.

ప్రీ ఫైనల్ పరీక్షలు మరో పది రోజుల్లో ఉన్నాయనగా జరిగిందా సంఘటన. మాష్టారు ఫిజిక్స్ పాఠం చెప్తున్నారు. క్లాస్ రూంలో ఉన్న పిల్లలందరూ జాగ్రత్తగా వింటున్నారు. ఆసక్తి లేకున్నా చెవులక్కడ అప్పగించేసి మనసుని మాత్రం విహాయసంలా పైకెగరేసి కూచున్నా.

వెనక బెంచీలో కూచున్న అమ్మాయిలు ఆశ్చర్యంతో 'ఆ' అనటం విన్పించింది. ఓ అమ్మాయి నా వీపుని వేలితో గుచ్చుతూ 'కింద చూసుకోవే' అంది. పెన్సిలో పెన్నో పడేసుకోనుంటానని బెంచీ కింద చూసుకున్నాను. కిందంతా నీళ్ళు... నీళ్ళెక్కడనుంచి

వచ్చాయో అర్థం కాలేదు. వాటర్ బాటిల్ ఒలికి పోయిందా... యింకెవరైనా నీళ్ళని ఒలకబోశారా... చప్పున నాలో పాకుతూ భయం... ఒకవేళ అలా ఏమైనా జరిగిందా... జరగడానికి అవకాశం లేదే... అనుమాన నివృత్తి కోసం పైజమా తడిమి చూసుకున్నా... అంతా తడి... క్లాస్ రూం అంతా తెలిసిపోయింది. మాష్టారు 'ఏమిటా గొడవ' అని అరుస్తూ కిందికొచ్చారు. పిల్లలు చెప్పింది విని నా వైపు జాలిగా చూసి బైటికెళ్ళారు. తనతోపాటు స్వీపర్ని కూడా పిల్చుకొచ్చి గదిని శుభ్రం చేయమని పురమాయించారు. మరో క్లాస్ రూంలో పాఠం చెప్తున్న అమ్మకు కబురంది పరుగు పరుగున వచ్చింది. రూం తుడవడానికని పిల్లలందరూ బైటికి నడిచారు. అమ్మ వచ్చే వరకు నేనొక్కదాన్నే సీటుకి అతుక్కుపోయి కూచున్నా.

మొదటిసారి అప్పుడనిపించింది... చచ్చిపోతే బావుంటుందని. చావంటే ఆ క్షణం వరకున్న భయం ఒక్కసారిగా పారిపోయింది. చావు త్వరగా రాకూడదా... ఎందుకింత ఆలస్యం చేస్తుందనిపించింది. అమ్మ వచ్చి ఎత్తుకోగానే పెద్దగా ఏడ్చేశాను. యింటికెళ్ళాక అమ్మ ఎంత ప్రయత్నించినా నేను మాట్లాడలేదు. ఒకటే ఆలోచన... చనిపోవాలి... ఎలా చనిపోవాలి? ఉరేసుకుని చావాలా... నిద్ర మాత్రలు మింగాలా... నీళ్ళలో పడి చావాలా...

అమ్మకు నా మనసులో చేలరేగుతున్న తుఫాను గురించి కొంత తెల్సినట్టుంది. జరిగిన దాంట్లో నా తప్పేమీ లేదనీ, అందులో అవమానపడాల్సిన విషయం అసలు లేదని నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూనే ఉంది. 'ఆరోగ్యంగా ఉండే మనుషులక్కూడా ఒక్కోసారి అలా జరుగుతో ఉంటుంది. నీ విషయంలో అలా జరిగితే బాధపడాల్సింది ఏముంది? నువ్వు చేసింది సిగ్గు పడాల్సిన విషయం కాదు'

'జాలి పడాల్సిన విషయం అంటావు. నాకు వేరేవాళ్ళు జాలిపడేలా బతకటమంటే అసహ్యం వేస్తోంది' అన్నాను కోపంగా.

'అది జాలిపడే విషయమూ కాదు. అర్థం చేసుకోవాల్సిన విషయం. సంస్కారం ఉన్న వాళ్ళు సవ్యంగా అర్థం చేసుకుంటారు. సంస్కార హీనులనుకో... వాళ్ళేమనుకున్నా మనకనవసరం' అంది అమ్మ.

నాకవసరమే. యిలాంటి హీనమైన బతుకు నాకొద్దు. నన్ను చూసి గేలిచేసేలా

బతకటం నాకిష్టం లేదు. ఎలాగూ ఈ యేడు చస్తానని కదా డాక్టర్లు చెప్పారు. ముందుగానే చచ్చిపోతాను. చావు వచ్చేదాకా ఆగి దానికోసం ఎదురుచూసే ఓపిక చచ్చిపోయింది. నేనే దానికి ఎదురెళ్ళి స్వాగతిస్తాను.

ఆ రాత్రి ఎలాగైనా సరే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను.

రాత్రి భోజనాలయ్యాక అమ్మ నాకు నైటీ తొడిగి బెడ్ మీద పడుకోబెట్టాక ఆశ్చర్యపడేలా నా పక్కనే పడుకుంది. నా వైపు తిరిగి పైన చేయి వేసింది.

'ఏంటి మమ్మీ... ఆ విషయం గురించేనా... నేనేమీ బాధపడటం లేదులే. వదిలేయి' అన్నాను.

'నీకో విషయం చెప్పాలనుకుంటున్నానమ్మా. జీవితం చాలా విలువైంది. ఈ ప్రపంచంలో నిరర్థకమైన జీవితాలంటూ ఏవీ ఉండవు. చిన్న చిన్న వైఫల్యాలకే ఓటమినంగీకరించే మనస్తత్వం గలవాళ్ళే జీవితం నుంచి పారిపోవాలనుకుంటారు. ఆత్మహత్య మహాపాపంలాంటి మాటలు నేను మాట్లాడను. అది తప్పకుండా పిరికి చర్య అని మాత్రం అనగలను. పలాయనవాదం... సమస్యల్ని ఎదుర్కొనే ధైర్యం లేక పారిపోవటం.

చాలామంది ఏమనుకుంటారు తెలుసా... చావడానికే ధైర్యం కావాలని. చాలా తప్పు మాట. ఓ క్షణం కళ్ళుమూసుకుంటే చాలు... చావు సునాయాసంగా వచ్చేస్తుంది. ధైర్యం కావాల్సింది బతకడానికి. జీవితం మనిషిని ఎన్ని రకాలుగా హింస పెట్టాలో అన్ని రకాలుగా పెడ్తుంది తల్లీ. అనూహ్యమైనదే జీవితం... ఏ క్షణం ఏం జరుగుతుందో తెలీదు. తప్పకుండా జరుగుతుందనుకున్నది జరక్కపోవచ్చు. అసలెప్పటికీ అలా జరగదనుకున్నది జరిగిపోవచ్చు. దాన్ని ఎదుర్కొనేవాళ్ళే ధీరోదాత్తులు. జీవితమంటే పోరాటమే... మనలో ప్రాణమున్నంత వరకు పోరాడితేనే వీరత్వం... జయం ఎప్పుడూ వీరులకే తల్లీ. పిరికివాళ్ళు జీవితంలో ఏదీ సాధించలేరు.

నీకు మరో విషయం చెప్పాలనుకున్నాను. ఎవరో ఏదో అనుకుంటున్నారని బాధపడటం మంచి లక్షణం కాదు. వాళ్ళు నిజంగా అలా అనుకుంటున్నారో లేదో మనకు తెలీదు. అదంతా కేవలం మన వూహ మాత్రమే. మన భయంలోంచి, మన అభద్రతలోంచి మన ఆత్మన్యూనతలోంచి పుట్టిన వూహ... మన గురించి ఆలోచించే తీరికా, ఆసక్తి ఎదుటి వ్యక్తికుండదన్న చిన్న లాజిక్ని మనలో చాలా మంది విస్మరిస్తారు.

మనం ఎప్పుడూ మన గురించే ఆలోచిస్తుంటాం. మిగతావాళ్ళు కూడా వాళ్ళ గురించే ఆలోచిస్తుంటారు.

నాలుగు నెలల క్రితం మీ మాస్టారొకరు కుర్చీ విరగడం వల్ల కింద పడ్డారు. కొంత మంది విద్యార్థులు నవ్వారనీ, కొంత మంది అయ్యో పాపమని బాధపడ్డారనీ నువ్వారోజు చెప్పావు. ఆ తర్వాత మళ్ళా ఎప్పుడైనా ఆ సంఘటన నీకు గుర్తొచ్చిందా? లేదు. అదే సంఘటనని పట్టుకుని మీ మేస్టారు అవమానంగా భావించి, అందరూ తనకు జరిగిన పరాభవాన్ని తల్చుకుని తల్చుకుని ప్రతిరోజూ నవ్వుకుంటుంటారని అనుకుంటే ఆయనంత మూర్ఖుడు ఈ లోకంలోనే ఉండడంటాను. జీవితం చాలా విస్తారమైంది తల్లీ. ఓ చిన్న సంఘటనో... చిన్న అవమానమో... పరాభవమో జీవితాన్ని మొత్తాన్ని శాసించకూడదు. దేనికెంత ప్రాముఖ్యత యివ్వాలో అంతకు మించి యిసుమంతైనా ఎక్కువ ప్రాముఖ్యతని అంటగట్టడం విజ్ఞత అన్పించుకోదు. గెలుపుని కోరుకునేవాళ్ళు యిటువంటి విషయాల్లో స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం అవసరం కాబట్టి యివన్నీ నీకు చెప్తున్నా. ఎందుకంటే నువ్వు జీవితంలో ఎప్పుడూ గెలవాలని కోరుకుంటాను కాబట్టి.'

'అమ్మా! నాకేమీ తెలీదనుకోకు. ఎవరి కోసం గెలుపు అని అడిగితే నువ్వు మాకోసం అని సమాధానం చెప్పొచ్చు. కానీ ఎందుకోసం గెలవాలమ్మా? పదహారో యేడు దాటకుండానే చచ్చిపోయేదాన్ని. అల్పాయుష్కురాల్ని... నాకెందుకమ్మా ఈ ఆరాటాలు'

అమ్మ కొన్ని క్షణాలు నా వైపు దీర్ఘంగా చూసింది.

'ఏదో ఓ రోజు నీకీ విషయం తెలుస్తుందని వూహించానమ్మా. ఈ ప్రశ్న నువ్వేస్తావని ఎదురు చూస్తున్నా. డాక్టర్లు దేవుళ్ళు కాదమ్మా. మానవమాత్రులు. తప్పకుండా బతుకుతాడని డాక్టర్లు భరోసా యిచ్చిన పేషంట్లు కొన్ని గంటలకే చచ్చిపోయిన వాళ్ళున్నారు. ఆశ వదిలేసుకోండి... కొన్ని గంటలు దాటి బతకలేదు అని సర్టిఫై చేసిన పేషంట్లు పది కాలాలపాటు బతికిన సందర్భాలూ లేకపోలేదు.'

'అమ్మా... నన్ను మాటల్తో మభ్య పెట్టడానికి ప్రయత్నించకు. నాకున్న జబ్బు గురించి నాకు బాగా తెలుసు. దీనికి మందు లేదు. రోజు రోజుకూ పెరిగేదే తప్ప తగ్గే

అవకాశమే లేని జబ్బు. నెట్లోకెళ్ళి చాలా సమాచారాన్ని సేకరించాను మమ్మీ. టీన్స్ దాటి బతికినవాళ్ళు లేరు మమ్మీ. ఈ సంవత్సరం కాకున్నా రెండు మూడేళ్ళకి నా చావు ఖాయం మమ్మీ' అంటూ అమ్మను అల్లుకుని ఏడ్చేశాను.

అమ్మ నన్ను సముదాయించలేదు. నేను ఏడుపు ఆపేవరకు నిశ్శబ్దంగా సీలింగ్ వైపు చూస్తూ ఉండిపోయింది. నేను కొద్దిగా స్థిమిత పడ్డాక 'నీకో కథ చెప్తాను వింటావా... నా చిన్నప్పుడు విన్న కథ. మీ అమ్మమ్మ చెప్పిన కథ. ఎన్నో ఏళ్ళుగా నన్ను ముందుకు నడిపిస్తున్న కథ' అంది.

ఇంత సీరియస్‌గా చావు గురించి మాట్లాడుకుంటుంటే అమ్మ కథ చెప్తానంటుందేమిటో అర్థం కాలేదు.

నా అంగీకారం కోసం ఆగకుండా అమ్మ కథ చెప్పటం ప్రారంభించింది.

'ఒక రాజు గారికి ఎగిరే గుర్రం ఎక్కి ఆకాశంలో విహరించాలనే కోరిక కలిగింది. రాజు గారు తల్చుకుంటే దెబ్బలకు కొదవా? ఆ ఆలోచన రావడమే తరువాయి సభను ఏర్పాటు చేసి రాజ్యంలో ఉన్న శ్రేష్ఠమైన పనివాళ్ళందర్ని మరునాటికి ప్రవేశపెట్టమన్నాడు.

మీలో ఎవరైనా ఎగిరే గుర్రాన్ని తయారు చేయగలరా? అలా తయారు చేసి యిచ్చినవాళ్ళకి లక్ష వరహాలు బహుమానంగా యిస్తాను. మీకెంత మందీ మార్బలం కావాలన్నా యిస్తాను. ఎంత సమయంలో ఎగిరే గుర్రాన్ని తయారు చేసి యివ్వగలరు? అని అడిగాడు. సభలో ఉన్న వాళ్ళు మొహామొహాలు చూసుకున్నారు. ఎగిరే గుర్రమా... సాధ్యమయ్యేపనేనా... రాజుగారి కోరిక ఎంత వింతగా ఉందో... కానీ ఆ మాట రాజుగారితో ధైర్యం చేసి ఎవ్వరు చెప్పగలరు? చాలా సేపు మథనపడ్డాక జయంతుడనే వ్యక్తి ముందుకొచ్చి 'మహారాజా... ఎగిరే గుర్రం చేయటం అసాధ్యం' అన్నాడు.

రాజు గారికి బాగా కోపం వచ్చింది. 'నువ్వు మా రాజ్యంలో ఉన్న వడ్రంగులందరిలోకి గొప్పవాడివి. నీ నోటి నుండి అసాధ్యం అనే మాట రాకూడదు. రాజుగా ఆజ్ఞాపిస్తున్నాను. ఆర్నెల్లలోపల ఎగిరే గుర్రాన్ని తయారు చేసి ఇవ్వాలి. ఇవ్వలేదో నీకు శిరచ్ఛేదమే' అన్నాడు.

జయంతుడు వేగంగా ఆలోచించాడు. రాజు పిచ్చివాడని ప్రజలందరికీ తెలుసు. మరీ వెర్రివాడని ఇపుడే అర్థమైంది. అతన్తో వాదించడంవల్లో వేడుకోవటంవల్లో ప్రయోజనం

ఉండదు. తనకు మొదట కావాల్సింది సమయం... బాగా ఆలోచించుకునే సమయం.

'సరే మహరాజా... మీ ఆజ్ఞను శిరసావహించటమే నా కర్తవ్యం. నేను తప్పకుండా మీ కోరిక తీరుస్తాను. ఎగిరే గుర్రాన్ని తయారు చేసి యిస్తాను. ఎటొచ్చీ మీరిచ్చిన గడువు సరిపోదు. కనీసం రెండు సంవత్సరాల సమయం కావాలి. మొదటి విడతగా యాభైవేల వరహాలు యిప్పించండి. పని మొదలు పెడ్తాను' అన్నాడు. రాజు అందుకు సమ్మతించి కోశాధికారికి చెప్పి ధనాగారం నుంచి యాభైవేల వరహాలు యిప్పించాడు.

అందరూ జయంతుడిది మూర్ఖత్వమనీ చావుని కొని తెచ్చుకుంటున్నాడనీ జాలి పడ్డారు.

కానీ జయంతుడు చాలా సంబరపడ్డాడు. యాభైవేల వరహాలతో తన పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన ఆస్తిపాస్తులు కొనడంలో బిజీ ఐపోయాడు. బెంగెట్టుకున్న భార్యతో 'రెండేళ్ళ సమయం ఉంది. ఈ రెండేళ్ళలో ఏమైనా జరగొచ్చు. రాజుగారు అనారోగ్యంతో చనిపోవచ్చు. నాకు అరవై యేళ్ళు దాటాయి. నేనే పోవచ్చు. ఓ యేడాది తర్వాత మిగతా యాభైవేల వరహాలు కూడా తీసుకుంటా. యింత మంచి అవకాశాన్ని వదులుకున్న వాడే మూర్ఖుడు. లక్ష వరహాలు... మన తర్వాత రెండు మూడు తరాలకు సరిపడేంత డబ్బు... నువ్వు కంగారు పడకు. ఏమీ జరగదు' అన్నాడు నింపాదిగా.

ఓ సంవత్సరం గడిచిపోయింది. జయంతుడు చెక్కతో తయారు చేసిన గుర్రాన్ని రాజుగారికి చూపించి మరో యాభైవేల వరహాలు తీసుకున్నాడు. భార్యకు దిగులు పట్టుకుంది. 'బెంగపడకు. యింకా ఏడాది సమయం ఉంది. ఈ ఏడాదిలో ఏమైనా జరగొచ్చు. గుర్రం ఎగరనూ వచ్చు' అన్నాడు నవ్వుతూ. ఆర్నెల్లు గడిచాక రాజుగారు పిలిచి అడిగితే గుర్రానికి రెక్కలు తయారుచేస్తున్నానన్నాడు. భయపడ్తోన్న భార్యతో 'యింకా ఆర్నెల్ల సమయం ఉంది. మనకొచ్చిన డబ్బుల్తో హాయిగా సుఖపడక ఎందుకు ఆందోళన పడ్తావు? ఏమో... ఎవరు చూడొచ్చారు... రెక్కలు తొడిగాక గుర్రం ఎగరనూ వచ్చు' అన్నాడు.

యింకా నెల రోజుల సమయమే మిగిలింది. అతను కంగారు పడలేదు. ఎప్పటిలా ప్రశాంతంగానే ఉన్నాడు. 'నీ తల ఎగిరిపోవడం ఖాయం' అన్నారు స్నేహితులు. 'నెల్రోజులే మిగిలిందండీ' అంటూ కన్నీరు కారుస్తున్న భార్యతో 'యింకా నెల రోజుల సమయం

ఉంది. ఏమైనా జరగడానికి ఓ క్షణం చాలు. దిగులు పడకు' అన్నాడు నిబ్బరంగా. రాజు గారు పిలిచి అడిగితే రెక్కలు అమర్చడం పూర్తయిందనీ ఎగరడానికి అవసరమైన యంత్రం తయారు చేస్తున్నానని చెప్పాడు. యింకా రెండు రోజుల గడువే మిగిలింది. భార్యా పిల్లలూ ఏడుస్తున్నారు. 'ఎందుకేడుస్తున్నారు? యింకా రెండు రోజుల సమయం ఉందిగా.' అన్నాడతను. యింకా ఒక్క రోజు గడువే మిగిలింది. 'యింకా ఇరవై నాలుగ్గంటల సమయం ఉంది' అన్నాడతను ప్రశాంతంగా. ఆ రోజు తృప్తిగా భోంచేసి హాయిగా నిద్రపోయాడు. అదే రోజు రాత్రి పొరుగునున్న రాజు అకస్మాత్తుగా మెరుపు దాడి చేసి రాజుని వధించి రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు. జయంతుడు తను తయారు చేసిన రెక్కల గుర్రాన్ని తన మనవళ్ళకు బహుమతిగా యిచ్చాడు. ఈ కథ నీకెందుకు చెప్పానో ఆలోచించుకో.

చివరిగా ఓ మాట చెప్తాను. నువ్వేం చేయాలనుకున్నా నీ ఇష్టం. కానీ ఈ విషయాన్ని మాత్రం గుర్తుంచుకో. ఎవరో ఏదో అనుకుంటారనేది ముఖ్యం కాదమ్మా. నీ మీదే ప్రాణాలు నిలుపుకుని బతుకుతున్న అమ్మానాన్న ఏమనుకుంటారో ఆలోచించు. నువ్వు చేసే పనివల్ల వాళ్ళకు సంతోషం కలుగుతుందా దుఃఖం కలుగుతుందా అనేది ఆలోచించు. నాకూ మీ నాన్నకు మాత్రం నువ్వు సంతోషంగా ఉండటమే ముఖ్యం. దాని కోసం ఏమైనా చేస్తాం. ఎవరేమనుకున్నా మాకు లెక్క లేదు. మేమూ... మా కూతురు... దాని ఆనందం... యిదే మా ప్రపంచం. గుడ్ నైట్ తల్లీ' అని నా తల మీద చేయి వేసి జుట్టుని ప్రేమగా నిమిరి వెళ్ళిపోయింది.

నేను ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నానని అమ్మకెలా తెలిసిందో... ఎంత సూటిగా చెప్పిందీ... నిజమే కదా... ఎవ్వరికోసమో నేనెందుకు చావాలి? చచ్చి మా అమ్మానాన్నని ఎందుకు బాధ పెట్టాలి? నా సంతోషం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అమ్మానాన్నకు సంతోషాన్ని కలుగచేయకున్నా పర్లేదు. వాళ్ళ దుఃఖానికి నేను కారణం కాకూడదని ఆ రోజు బలంగా నిర్ణయించుకున్నాను.

అమ్మ చెప్పిన కథ ఎంత బావుందో... ఆశని ఎప్పుడూ చంపుకోకూడదు. చావు వచ్చేప్పుడే రానీ... ముందే ఎందుకు చావాలి? అసలు చావు రావాలని ఎక్కడుందీ... ఆ లోపల ఈ జబ్బుకి మందు కనుక్కోవచ్చు... మాకు తెలీని ఏ మూలికా వైద్యమో

ఇటువంటి రోగానికి అమోఘంగా పనిచేస్తుందని తర్వాతెప్పుడైనా తెలియవచ్చు. జీన్స్ ఒక్కోసారి మ్యుటేట్ అవుతాయట. అలా నాలోని డిఫెక్టివ్ జీన్ మ్యుటేషన్‌కి లోనై బాగు పడిపోవచ్చు. నిజమే... గుర్రం ఎగురా వచ్చు... ఆ రాత్రి ప్రశాంతంగా నిద్ర పోయాను.

కలలో నేను గుర్రం వీపు మీదెక్కి 'ఎగురూ... ఎగురూ' అంటున్నా. చెక్క గుర్రం ఎగుర్తుందా ఎక్కడైనా అని మా క్లాస్‌లోని విద్యార్థులంతా చుట్టూ మూగి గేలి చేస్తున్నారు. 'తప్పకుండా ఎగుర్తుంది. నాకు నమ్మకముంది' అన్నాను వాళ్ళతో. గుర్రాన్ని చేత్తో చరుస్తూ 'ఎగురూ... ఎగురూ' అన్నాను. ఒక్కసారిగా గుర్రంలో కదలిక... దాని మెడని గట్టిగా పట్టుకున్నాను. గుర్రం ఆకాశంలోకి ఎగిరింది. అందరూ 'ఆ' అంటూ నోళ్ళు వెళ్ళబెట్టారు. గుర్రం ఆకాశంలో నాలుగు రౌండ్లు కొట్టింది. కింద నుంచి అందరూ చప్పట్లు కొడ్తున్నారు. నాలో ఉప్పెనలా ఉత్సాహం... గుర్రం మీద కూచుని అలా మేఘాల్లోకి తేలుతూ వెళ్తున్నట్లు కల...

మరునాడు స్కూల్‌కి వెళ్ళనని చెప్పాను. 'ఓ నాలుగు రోజులాగి వెళ్తానమ్మా. క్లాస్‌మేట్స్ అప్పటికి జరిగినదాన్ని కొంతైనా మర్చిపోతారు' అన్నాను.

'నిన్న చెప్పింది అప్పుడే మర్చిపోయావా... నువ్వు క్లాస్‌కి వెళ్ళి చూడు. ఆశ్చర్యపోతావు' అంది అమ్మ.

అమ్మ మాటను కాదనలేక బిక్కుబిక్కుమంటూనే క్లాస్ రూంలో కూచున్నాను. చుట్టూ ఉన్న విద్యార్థులవైపు పరిశీలనగా చూశాను. ఎవరి లోకంలో వాళ్ళున్నారు. నా గురించి, నిన్న జరిగిన విషయం గురించి ఎవ్వరూ ఆలోచిస్తున్నట్టు లేదు. అమ్మ చెప్పింది కరెక్టే... నేనే అనవసరంగా ఏదేదో వూహించుకుని భయపడ్డాను.

అన్నీ మర్చిపోయి ఫైనల్ ఎగ్జామ్స్‌కి చదవడం మొదలెట్టాను. అమ్మ నా పక్కనే కూచుని సాయపడేది. కొన్ని జవాబులు చదివి విన్పించేది. అర్థమయ్యేలా వివరించేది. పరీక్షలు ప్రారంభమైనాయి. రెండు పరీక్షలు ఐపోయాయి. మూడో పరీక్ష యింగ్లీష్.. ఆ రాత్రి పన్నెండు వరకు చదివాను. మరునాడు నాన్న రెడీ అయి నన్ను పరీక్ష హాలు దగ్గరకు తీసుకెళ్ళబోతున్నపుడు కళ్ళు తిరిగి స్పృహ తప్పి పడిపోయాను. అమ్మానాన్న కంగారు పడి హాస్పిటల్‌కి పిల్చుకెళ్ళారు. అప్పుడు డాక్టర్లు చెప్పారట. 'అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయి. మహా ఐతే మూడు నాలుగు రోజులు బతకొచ్చు' అని.

అమ్మానాన్న నా పైన ఆశలు వదిలేసుకున్నారట. మానసికంగా నా చావుని తట్టుకోడానికి సన్నద్ధమైనారట. డాక్టర్ల నమ్మకాన్ని వమ్ముచేస్తూ నేను బతికాను. 'ఇదేదో మిరకిల్‌లా ఉంది. ఎనీ వే యూ ఆర్ లక్కీ... మీ అమ్మాయికి ప్రస్తుతానికి ప్రమాదం తప్పిపోయినట్లే' అన్నారట.

'ప్రస్తుతానికి అంటున్నారేమిటి' అని నాన్న అడిగితే 'మీకు ముందే చెప్పాంగా... ఒకట్రెండేళ్ళు లైఫ్ స్పాన్ పొడిగించబడొచ్చు. కానీ చావుని మాత్రం ఆపటం సాధ్యం కాదు' అన్నారట.

యింటర్లో కూడా మరోసారి ఆరోగ్యం బాగా దెబ్బతింది. కాలేజీ మానేసి మూడు నెలలు హాస్పిటల్లో ఉండాల్సి వచ్చింది. ఎటొచ్చీ ఆ సంవత్సరం పరీక్షలు రాయగలిగాను.

యిపుడు నాకు యిరవై మూడేళ్ళు. రెండుసార్లు చావుని తప్పించుకున్నా అది నన్ను వెన్నాడుతూనే ఉందన్న విషయం ఎప్పుడూ మర్చిపోను. చావు తరుముతున్న నన్ను కావాలనుకోవటం నీ మంచితనమో మూర్ఖత్వమో అర్థం కావటం లేదు. నువ్వు చాలా మంచివాడివి. మనసున్నవాడివి. బాగా తెలివి గలవాడివి. నీకు మంచి భవిష్యత్తుంది. ఏ రోజు చస్తానో తెలీని నా కోసం ఎందుకు బంగారంలాంటి జీవితాన్ని పాడు చేసుకుంటావు?

బాగా ఆలోచించు. జీవితం చాలా విలువైంది. ఎమోషన్స్‌ని ఆదర్శాలనుకుని భ్రమపడి జీవితాన్ని నరకం చేసుకోవద్దు. మనిద్దరం మంచి స్నేహితుల్లా ఉండిపోదాం. నాకెపుడైనా జీవితంలో తట్టుకోలేని కష్టమెదురైతే నా తల్లిదండ్రుల తర్వాత నిన్నే తల్చుకుంటానని మాటిస్తున్నా. ఉంటాను మరి... నీ స్నేహితురాలు... హితురాలు... అక్షర.

ఉత్తరం పూర్తిగా చదివాక మనసంతా సంక్షుభిత సంద్రంలా మారిపోయింది. అతని కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయాయి.

***

యింటర్ ఫైనలియర్... పరీక్షలు మరో పదిహేను రోజుల్లో ఉన్నాయి. ప్రిపరేషన్ శెలవలు...

ప్రసాద్ చదవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నా అతని వల్ల కావటం లేదు.

పుస్తకం తెరిస్తే చాలు అక్షరాలు అదృశ్యమైపోయి రమ్య నవ్వు మొహమే కన్పిస్తోంది. రమ్య... అలా ఒక్కసారి తల్చుకున్నా తన్మయత్వంతో ఒళ్ళు పులకరిస్తుంది. ఎన్నేళ్ళ స్నేహం యిద్దరిదీ... ఎన్నేళ్ళ అనుబంధం...

ఎల్కేజీ నుంచి కలిసే చదువుకున్నారు... కలిసి ఆడుకున్నారు... సరదాగా పోట్లాడుకున్నారు... పంతాలకు పోయారు... అలిగారు... మళ్ళా కలిసిపోయి కబుర్లు చెప్పుకున్నారు... ఎన్నెన్ని మధురమైన జ్ఞాపకాలో...

ఇప్పటికే తను ఆలస్యం చేశాడు. రమ్యకు 'ఐ లవ్ యూ' అని ఎప్పుడో చెప్పాల్సింది. ఇంజనీరింగ్‌లో చేరేలోపల తన మనసులో మాటని చెప్పేయాలి. ఇప్పటివరకూ ఒకేక్లాస్... కానీ ఇంజనీరింగ్‌లో బ్రాంచి మారిపోవచ్చు. ఓసారి మాటల సందర్భంలో తను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చదువుతానంది.

'ఎంచక్కా కంప్యూటర్ సైన్స్ తీసుకోవచ్చుగా. నేనూ అదే బ్రాంచ్‌లో చేరాలనుకుంటున్నా. డిగ్రీ పూర్తయ్యాక అమెరికాలో యం.యస్. చేద్దాం. అక్కడే పెద్ద ఉద్యోగం తెచ్చుకుని హేపీగా సెటిలైపోవచ్చు' అన్నాడు.

'టాప్ ర్యాంకులు సాధించిన వాళ్ళ మొదటి ఛాయిస్ ఎప్పుడూ ఇ.సి.ఈ.నే ఉద్యోగావకాశాలు కూడా దానికే ఎక్కువ. నాకు తప్పకుండా యంసెట్లో మంచి ర్యాంక్ వస్తుంది. బాగా పేరున్న యింజనీరింగ్ కాలేజీలో ఫ్రీ సీటు గ్యారంటీ' అంది.

రమ్య కోసం తను కూడా ఎలక్ట్రానిక్స్ తీసుకుంటే ఎలా ఉంటుందీ అని చాలా రోజులు ఆలోచించాడు. రమ్యకోసం ఆ మాత్రం త్యాగం చేయలేనా అని మనసుని సమాధానపర్చుకోడానికి ఎంత ప్రయత్నించినా వీలు కాలేదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావటమనేది తన కల. రమ్యని పెళ్ళి చేసుకోవడమనేది తన మరో కల.

అమ్మ రమ్య గురించి తరచూ అనే మాటలు గుర్తొచ్చాయి. 'ఆ పిల్ల ఏ యింటి కోడలౌతుందోగాని వాళ్ళు చాలా అదృష్టవంతులు. బంగారంలాంటి పిల్ల... ఆ కళ్ళు చూశావా ఎంతందంగా ఉంటాయో... నా అరచేయంత... మన కుండీల్లో పెంచుతున్న తెల్ల గులాబీల్లా... అందానికి అందం. చదువుకి చదువు... మంచితనానికి మంచితనం... ఎవడు చేసుకుంటాడో గాని ఇటువంటి సద్గుణ సంపన్నురాలైన భార్య దొరకాలని పూర్వ జన్మలో బంగారు పూలతో దేవుణ్ణి పూజించి ఉంటాడు'.

'అలా పూజ చేసింది నేనే మమ్మీ' అని మనసులో ఎన్ని వందలసార్లు అనుకున్నాడో. ఆమె అందం, తెలివి, మంచితనం అన్నీ తన స్వంతం. రమ్య పుట్టిందే తన కోసం. ఆ అదృష్టవంతుడు తనే.

అటువంటి రమ్యకోసం బ్రాంచ్ మారొచ్చుగా... ఒకే బ్రాంచ్ ఐతే ఎప్పుడూ తన పక్కనే ఉండొచ్చు. ఇద్దరూ కలిసి ఎసైన్‌మెంట్స్ చేసుకోవచ్చు. కలిసి ప్రాక్టికల్స్ చేయవచ్చు... ప్రాజెక్ట్ వర్క్ చేయవచ్చు. ఆ ఆలోచనే చాలా అద్భుతంగా రసరమ్యంగా అన్పించింది.

చివరికి ఒక నిశ్చయానికొచ్చాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడం, రమ్యని చేసుకోవడం అనే రెండు కలలూ చాలా బలమైనవి. రెండూ రెండు కళ్ళలాంటివి. అందుకే కంప్యూటర్ సైన్స్ చదవడానికే నిర్ణయించుకున్నాడు. ఎటొచ్చీ రమ్య ఏ కాలేజీలో చేరితే అదే కాలేజీలో చేరాలని బలంగా తీర్మానించుకున్నాడు. తనూ రమ్య ఎప్పటిలానే కలిసి కాలేజీ కెళ్ళొచ్చు. ఇంటర్ పూర్తయ్యాక అమ్మ తనకు బైక్ కొనిపెడ్తానని మాటిచ్చింది. ఆ బైక్ మీద రమ్యని కూచోబెట్టుకుని రయ్ రయ్ మని షికార్లు కొట్టొచ్చు. హ్యాపిడేస్ సినిమాలో అలానే చూపించారుగా... ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుమీద కన్నా ప్రేమించుకోడాలకే అధిక ప్రాధాన్యత ఇస్తారని... అప్పటివరకూ ముకుళించుకుని ఉన్న ప్రేమలన్నీ క్యాంపస్‌లోకి అడుగుపెట్టగానే వేయి రేకుల్తో వికసిస్తాయని ఆ సినిమా చూశాకే తెల్సింది.

ఆ రోజు సాయంత్రం యింటికి రమ్య వస్తుందని ఎదురుచూశాడు. రాలేదు. వారంలో కనీసం రెండు మూడు సార్లయినా యింటికొచ్చి తనతో కొద్దిసేపు మాట్లాడి పోతుంది. తనకేమైనా డౌట్స్ ఉంటే ఆ సమయంలో ఆమెనడిగి నివృత్తి చేసుకుంటాడు.

టైం చూసుకున్నాడు... ఏడుంపావు...

ప్రసాద్‌కి అసహనంగా ఉంది. పుస్తకం మూసేసి అటూ ఇటూ పచార్లు చేశాడు. కొద్దిసేపు టీవీ ఎదురుగా కూచున్నాడు. ఎవరో యాంకర్ 'హాయ్ సురేష్... నువ్వు యింటర్ ఫస్టియర్ కదా. ఎంతమంది అమ్మాయిలకు లైనేశావు' అని అడుగుతోంది. నేను లైనేయలేదు. ప్రేమించాను. ఒక్కర్నే... అనుకున్నాడు. టైం చూసుకున్నాడు. ఏడున్నర...

మామూలుగాఐతే రమ్య ఆరు ఆరున్నర మధ్య వచ్చి అరగంటో గంటో కూచుంటుంది. ఇదంతా తనేసిన ప్లాన్ ఫలితమే. నేరుగా అడక్కుండా అమ్మ చేత

అడిగించాడు.

'నువ్వే క్లాస్ ఫస్ట్ అటగా... సాయంత్రాలు ఓ గంట వచ్చి మావాడికి అర్థంకాని పాఠాలు చెప్పిపో రమ్యా... ముఖ్యంగా లెక్కలు... వీడు కొద్దిగా వీక్. నీకు రావడం ఇబ్బందైతే చెప్పు, మావాణ్ణి మీ ఇంటికి పంపించమన్నా పంపిస్తాను' అంది అమ్మ.

'వద్దాంటీ... నేనే వస్తాను. ఉదయం నుంచి సాయంత్రందాకా చదువుకుంటాగా. నాకూ కొద్దిగా రిలీఫ్‌గా ఉంటుంది. ఐతే రోజూ రాలేనాంటీ... నా మూడ్‌ని బట్టి వస్తాను' అంది రమ్య.

'మూడ్ అంటే ఎలాగమ్మా... అసలే మీరు టీనేజర్లు. మీ మూడ్లు మీ ఆధీనంలో ఉండవుగా. వీడు కనీసం ఫస్ట్ క్లాస్‌లోనైనా పాస్ కావాలిగా. ఐనా నీ ఫ్రెండ్ నీ ఇష్టం' అంది అమ్మ.

'అయ్యో... నా ఉద్దేశం అది కాదాంటీ. వారంలో రెండు మూడు సార్లు తప్పకుండా వస్తాను. ఐనా మీరు ప్రసాద్‌ని తక్కువ అంచనా వేస్తున్నారు. నేను హెల్ప్ చేయకున్నా డిస్టింగ్షన్ తెచ్చుకునే తెలివితేటలున్నాయి' రమ్య తన వైపు అభిమానంగా చూస్తూ అంది. అభిమానంగానా... కాదు. ప్రేమగా...

'పోన్లే... నీ వల్ల మరో పది శాతం మార్కులు పెరిగేలా సాయపడు' అంది అమ్మ నవ్వుతూ.

'ష్యూర్ ఆంటీ...' అంది రమ్య.

కానీ ఈ రోజెందుకో రాలేదు... నిన్నామొన్నా కూడా రాలేదు. టైం చూశాడు. ఏడూ ముప్పావు.

ఈ రోజుకి యింక రాదేమో. తనకు మాత్రం రమ్యని చూడాలనిపిస్తోంది. రెండు రోజులుగా ఉగ్గబట్టుకున్నాడు. ఇక తన వల్ల కాదు. రమ్యను వెంటనే చూడాలి.

"అన్నం వడ్డించేయనా" అంది అమ్మ.

"ఆకలిగా లేదమ్మా" అన్నాడు. టీవీ బోర్ కొడ్తోంది. స్విచాఫ్ చేశాడు.

"అన్నం చల్లబడిపోతుంది నాన్నా. తొందరగా తిని చదువుకోడానికి కూచోవచ్చుగా"

"ఫిజిక్స్‌లో క్వాంటం థియరీ అర్థం కావటం లేదమ్మా. రమ్య వస్తే

చెప్పించుకుందామనుకున్నా. అది అర్థమైతే కానీ బండి ముందుకు కదిలేలా లేదు"

"అలాగంటే ఎలా నాన్నా... టెన్త్ క్లాస్‌లో నీకు మంచి మార్కులొచ్చాయిగా. కావాలని రమ్యని ఎక్కువ చేసి చూస్తున్నావేమో. మరోసారి చదివి చూడు. అర్థమౌతుంది"

"లేదమ్మా. ఆ పాఠం నేను విన్లేదు. ఆ రోజెందుకో కాలేజీకి వెళ్ళలేదు. నేనే రమ్య వాళ్ళింటి కెళ్ళి చెప్పించుకోనొస్తానమ్మా"

"సరే నాన్నా... తొందరగా రా. భోజనానికి ఆలస్యమౌతుంది"

పుస్తకం తీసుకుని రమ్య వాళ్ళింటికెళ్ళాడు.

హాల్లో వాళ్ళమ్మ కన్పించి "బావున్నావా బాబూ" అంది.

"ఆ ఆంటీ" అన్నాడు రమ్య కోసం వెతుక్కుంటూ.

"భోంచేశావా?"

"లేదాంటీ. ఫిజిక్స్‌లో ఓ పాఠం అర్థం కావటం లేదు. రమ్య చేత చెప్పించుకుందామని వచ్చాను"

"రమ్య తన గదిలో కూచుని చదువుకుంటోంది. లోపలికెళ్ళు బాబూ" అందామె.

ప్రసాద్ తలుపు మీద మెల్లగా తట్టి లోపలికి వెళ్ళాడు.

"హాయ్ ప్రసాద్" అంది రమ్య పుస్తకంలోంచి తలయెత్తి.

ఆమె పక్కన కూచుంటూ "నాకు క్వాంటం ఫిజిక్స్ చెప్పవా? అర్థం కావటం లేదు" అన్నాడు.

రమ్య తను చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి ఫిజిక్స్ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని పాఠం చెప్తోంది. అతను మాత్రం వినటంలేదు. కదుల్తోన్న ఆమె గులాబీ రంగు పెదవుల్ని చూస్తున్నాడు. గుండ్రంగా ఉన్న విశాలమైన కళ్ళవైపు చూస్తున్నాడు. అందంగా వంపు తిరిగిన చుబుకంవైపు చూస్తున్నాడు.

ఆమెను చూసేకొద్దీ ఆలస్యం చేయకుండా తన మనసులో మాట చెప్పాలని ఆరాటం...

"రమ్యా. నీ బర్త్ డే ఎల్లుండే కదా" అన్నాడు.

పాఠం చెప్తున్న రమ్య మధ్యలో ఆపి, అతని వైపు ఆశ్చర్యంగా చూసింది.

“అర్థం కావటం లేదని కదా వచ్చావు. శ్రద్ధగా వినకుండా నా బర్త్ డే ప్రసక్తి తెస్తావేం” అంది. ఆమె మొహంలో కొద్దిగా చిరాకు...

“నీ బర్త్ డే ప్లాన్స్ ఏంటి? సినిమాకెళ్తావా?”

“పది రోజుల్లో పరీక్షలు పెట్టుకుని సినిమాలకా... పిచ్చా ఏమైనా? నో ఛాన్స్”

“మరి ఆ రోజు ఎలా సెలబ్రేట్ చేస్కుంటావు?”

“తలంటి స్నానం చేస్తాను. అమ్మ చేసే పాయసం తింటాను. చదువుకుంటాను. సింపుల్”

“అంతేనా... అయ్యో. ఆ రోజు నీకో స్పెషల్ గిఫ్ట్ ఇద్దామనుకున్నానే”

“ఇవ్వు... సంతోషంగా తీసుకుంటా. అందుకు అడ్డేముంది?”

“ఇంట్లోనా... ఎన్ని రోజుల్నుంచి నీ బర్త్ డే కోసం ఎదురుచూస్తున్నానో తెలుసా? ఓ సుందర ప్రదేశంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆ గిఫ్ట్ ఇద్దామని”

“అబ్బో... అంత స్పెషలా?”

“నువ్వే చూస్తావుగా. చాలా స్పెషల్. ఆ రోజు ఏదైనా పార్క్కెళ్ళి ఓ గంట కూచుని వద్దామా ప్లీజ్” చేతులు జోడిస్తూ అన్నాడు.

“అంత చిన్న విషయానికి ఇంతగా ప్రాధేయపడాలా” అంటూ నవ్వింది రమ్య. “పార్క్కేగా. డన్. గంట కూచోటం కాదు గానీ అరగంటైతే ఓకే. వెళ్ళిరావడానికి ఓ అరగంట ఎలాగూ పడ్తుందిగా. సాయంత్రం ఐదున్నరకెళ్దాం, ఆరున్నరకల్లా తిరిగి వచ్చేద్దాం. సరేనా”

“థ్యాంక్యూ... థ్యాంక్యూ వెరీ మచ్” అన్నాడు పుస్తకాన్ని ఆమె చేతుల్లోంచి లాక్కుంటూ.

“పాఠం పూర్తిగా చెప్పనీ. సగమేగా చెప్పాను” పుస్తకాన్ని వెనక్కి తీసుకోడానికి ప్రయత్నిస్తూ అంది.

“అక్కడదాకే అర్థం కానిది. మిగతాది నాకొచ్చులే. థ్యాంక్స్ వన్స్ ఎగైన్” ఉరకలు వేసే ఉత్సాహంతో ఒక్కంగలో యింట్లోకొచ్చి పడ్డాడు.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఏం గిఫ్ట్ కొనాలనేది తెగని ఓ ఆలోచనైతే తన ప్రేమ గురించి ఎలా చెప్పాలనేది మరో అంతులేని ఆలోచన.

మరునాడు షాపులన్నీ తిరిగి గంటలు గంటలు వెదికాడు. ఏం ఇవ్వాలి? ఎర్రటి రంగులో హార్ట్ షేప్‌లో ఉండే గిఫ్టా? ఔట్ డేటెడ్ సింబాలిజమ్. తాజ్ మహల్ ఇస్తేనో... ప్రేమకు ప్రతీక కదా... ఎంత పాత ఆలోచనో. తన ప్రేమను కొత్తగా చెప్పాలి. ఎవ్వరూ చెప్పనంత కొత్తగా... విభిన్నంగా... పొయిటిక్‌గా... థాట్ ప్రొవోకింగ్‌గా... మెస్మరైజింగ్‌గా... మిస్టిక్‌గా...

ఒక ప్లాంక్ మీద రాసి ఉన్న మెసేజ్ అతన్ని బాగా ఆకర్షించింది. నల్లటి ప్లాంక్ మీద బంగారపు రంగు ఇంగ్లీష్ అక్షరాలతో ఉన్న మెసేజ్. 'నువ్వెంత నిజమో నీమీద నాప్రేమ అంత నిజం. నీ నవ్వులో తెల్లటి గులాబి పువ్వులా వికసించేది నాప్రేమే. నీ నడకలో రాజహంసలా హొయలు పోయేది ఆ ప్రేమే. నీ కళ్ళలో విరిసే వేయి సూర్యుల కాంతి... నీ శ్వాసలో ఎగసిపడే సుగంధ పరిమళాల కెరటాలు... నీ హృదయఫలకం మీద చెక్కిన వేనవేల మధురాక్షరాలు... ఇవన్నీ నా అనంత అద్వితీయ అలౌకిక ప్రేమకు సాక్షి సంతకాలు...'

తన మనసులో ఎలాంటి భావాలు కదలాడుతున్నాయో వాటికి అక్షర రూపం ఇచ్చినట్టు... తన గుండెని పరిచి భావాలుగా మలిచినట్టు... తన ప్రేమను వ్యక్తపర్చడానికి అంతకన్నా అర్థవంతమైన బహుమతి మరొకటుండదు.

దాన్ని గిఫ్ట్ ప్యాక్ చేయించుకున్నాడు.

***

ఆ రోజే రమ్య బర్త్ డే..

ఉదయం నుంచీ చాలా అసహనంగా... ఉక్కు చట్రంలో బిగించేసినట్లు అన్పించింది ప్రసాద్‌కి.

'మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే' అని మెసేజ్ పెట్టాడు. 'థ్యాంక్స్' అని జవాబొచ్చింది. తన జీవితం మొత్తంలో ఎంతకీ సాయంత్రం కాని రోజు అదే అవుతుందేమోనన్న భయం... ఇంత మెల్లగా సమయం కదుల్తుందేమిటన్న కోపం...

నాల్గింటికే ట్రిమ్‌గా తయారయి కళ్ళని గోడగడియారంలోని నిముషాల ముల్లుకు అతికించేసి కూచున్నాడు. బ్లాక్ కలర్ ప్యాంట్‌లో గులాబీ రంగు చొక్కాని టక్ చేశాడు. బూట్లని నిగనిగా మెరిసేలా అరిగిపోయేంతగా రుద్దీ రుద్దీ తొడుక్కున్నాడు.

ఐదింటినుంచీ సెల్ ఫోన్లో మెసేజ్ కోసం కళ్ళు చెవులు సెల్‌కి అంకితం చేసి ఎదురుచూసాడు. ఇక బయల్దేరొచ్చు అని రమ్య నుంచి మెసేజ్ రావటమే తరువాయి గిఫ్ట్ ప్యాక్‌ని జేబులో పెట్టుకుని ఎక్కుపెట్టి వదిలిన బాణంలా బైటికి పరుగెత్తాడు.

రోడ్డు మలుపు దగ్గర అప్పటికే రమ్య ఎదురుచూస్తోంది.

పరుగెత్తుకు రావటం వల్ల ఆయాసపడ్తూనే రమ్యని చూసి “హాయ్” అన్నాడు.

“ఐదున్నర అనుకున్నాం కదా. నువ్వు నాలుగు నిముషాలు లేట్” అంది రమ్య తన సెల్లో టైం చూసుకుంటూ.

“నువ్వు మెసేజ్ ఇవ్వటం లేట్ చేశావు. వెంటనే వచ్చేశాను” అంటూ నవ్వాడు.

“బర్త్ డే విషెస్ చెప్పవా?” అంది ముందుకు నడుస్తూ.

“ఇక్కడ కాదు. ఇందిరా పార్కులోని పచ్చని చెట్ల మధ్య రంగురంగుల పూలమధ్య చెప్తాను”

ఆటో మాట్లాడుకుని ఇందిరా పార్క్ చేరుకున్నారు. లోపలికి ప్రవేశించాక ఖాళీగా ఉండే బెంచీ కోసం వెదికాడు.

సరస్సు చుట్టూ వేసి ఉన్న బెంచీలు నిండిపోయి ఉన్నాయి. ఒక్కో బెంచీ మీద ఒక్కో జంట... పావురాల జంటలు కువకువలు పోయినట్లు గుసగుసలుగా కబుర్లు కలబోసుకుంటూ...

ఒక బెంచీ మీద కూచున్న జంట శృతి మించి సరాగాల్లోకి దిగారు. ఆ అబ్బాయి తన పక్కనే ఉన్న అమ్మాయిని కౌగిలించుకుంటున్నాడు. ముద్దులు పెట్టుకుంటున్నాడు.

మరి కొన్నాళ్ళు పోయాక రమ్య తనకు మరింత దగ్గరైనాక తామిద్దరూ ఇలానే ఏదో ఒక బెంచీ మీద కూచుని... రమ్యని తన బాహువుల్లో బంధించి... ఆ ఆలోచనకే అతని వళ్ళు వేడెక్కింది.

“ఛీ... పార్కుల్లో ఈ చండాలాలేమిటి? ఇది పబ్లిక్ పార్క్ కదా... ఇలాంటి

బహిరంగ ప్రదేశాల్లో అలా ప్రవర్తించటం తప్పుకదా. ఎవ్వరూ చెప్పరా? పార్కుకొస్తే ఇలాంటి అసహ్యమైన దృశ్యాలు చూడాల్సి వస్తుందని తెలిస్తే అస్సలు వచ్చేదాన్ని కాదు. ఎంత సంస్కారహీనులో... అందరూ చూస్తున్నారన్న సిగ్గు, యింగితం లేని నీచమైన మనుషులు" నిరసనగా అంది రమ్య.

అమ్మో... రమ్యకిలాంటివి ఇష్టం ఉండవన్మాట. యింకానయం. తెలీకుండా తొందరపడిఉంటే తిరస్కారాన్ని మొహంమీదికి విసిరేసి వెళ్ళేది. ఇంజనీరింగ్‌లో చేరాక ఎప్పుడైనా పార్కుకి తనతో కలిసి వెళ్తే తగలనంత దూరంగా కూచుని కబుర్లు చెప్పుకోవాలి తప్ప దగ్గరకు తీసుకునే తప్పు పని మాత్రం చేయకూడదనుకున్నాడు.

మరికొంత లోపలికెళ్ళి ఓ చెట్టు కింద కూచున్నారు.

"వూ. ఇప్పుడు చెప్పు. ఎన్ని సబ్జెక్టులు పూర్తి చేశావు? ఎన్ని రివిజన్ చేశావు?" అంది రమ్య

"అయ్యో... ఇక్కడ కూడా చదువుల గొడవేనా? మాట్లాడటానికి ఇంకేం టాపిక్ దొరకలేదా?" అన్నాడు ప్రసాద్ విసుగ్గా.

"ఏం... ఇక్కడికి రాగానే మనమేమన్నా స్పెషల్ మనుషులుగా మారిపోయామా? నువ్వు ప్రసాద్ నేను రమ్య... మరోవారంలో ఇంటర్ ఫైనలియర్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులం. మనం ఎదుర్కోబోతున్న పరీక్షలకు మించిన ముఖ్యమైన టాపిక్ ఇంకేం ఉంటుంది?"

"నిజమే. ఒప్పుకుంటున్నా. ఇంతకూ బర్త్ డే రిజల్యూషన్ ఏమిటి?"

"బాగా చదివి, యంసెట్లో మంచి ర్యాంక్ తెచ్చుకుని, పెద్ద ఇంజనీర్నై, దేశానికి నా వంతు సేవ చేయడం... ఇంతకూ నా బర్త్ డే గిఫ్ట్ ఏదీ? ఏదో స్పెషల్ గిఫ్ట్ అని తెగ వూరించావుగా"

"ఇస్తానుండు. ఇక్కడికంటే మనం ఆ పూల్ దగ్గరున్న బెంచీ మీద కూచుంటే బావుంటుందేమో" నవ్వుతూ అన్నాడు. బెంచీమీద రమ్య కూచుంటే తను మోకాళ్ళ మీద కూచుని 'ఐ లవ్యూ రమ్యా' అని చెప్పాలని కోరిక... సినిమాల్లో అలానేగా చూపిస్తారు.

"ఖాళీగా లేవుగా"

"ఇపుడయి ఉండొచ్చుగా. ఓ సారి చూద్దాంపద"

"సరే... నీ ఇష్టం" అంటూ లేచింది రమ్య.

రమ్య పక్కన నడుస్తున్నాడు. ఆమె చేయి పట్టుకుని నడవాలని కోరిక... ఇపుడు కాకున్నా తొందర్లోనే ఆ కోరిక తీరుతుందన్న ఆశ...

అప్పటివరకూ కౌగిలింతల్తో గడిపిన జంట లేచి వెళ్తున్నారు.

"రమ్యా... అదుగో ఆ బెంచ్ ఖాళీ ఐంది. ఎవరైనా కూచునేలోపల మనం కూచోవాలి. రన్" అంటూనే రమ్య సమాధానం కోసం ఆగకుండా అటు వైపుకి వేగంగా పరుగెత్తాడు.

"ఏయ్... మెల్లగా..." వెనకనుంచి రమ్య అరుస్తోంది.

ఇంకా పదడుగులేస్తే చాలు... బెంచీని చేరుకోవచ్చు.

వెనక్కి తిరిగి చూశాడు. రమ్య నవ్వుతూ మెల్లగా నడుచుకుంటూ వస్తోంది.

చుట్టూ చూశాడు. అదే బెంచ్ కోసం పోటీ పడ్తున్నవాళ్ళెవరూ కన్పించలేదు.

పరుగుని ఆపేసి, మెల్లగా అడుగులేశాడు. మూడడుగులు వేయగానే ధడాల్న పడిపోయాడు.

"ప్రసాద్ !" అంటూ పెద్దగా అరిచింది రమ్య.

లేవడానికి ప్రయత్నించాడు. లేవలేకపోయాడు. కాళ్ళు సహకరించడం లేదు. నడుం సహకరించడం లేదు.

రమ్య పరుగెత్తుకుంటూ వచ్చి చేయందించింది.

ఆమె చేయి ఆసరాగా చేసుకుని లేవబోయి మళ్ళా పడిపోయాడు.

"దెబ్బ తగిలిందా... కాలేమైనా బెణికిందా? అందువల్ల లేవడం కష్టంగా ఉందా?" అంటోంది రమ్య...

ఆమె మాటలు తనకు స్పష్టంగా విన్పిస్తున్నాయి. ఆమె తనకు కన్పిస్తోంది. తన వైపు జాలిగానో ఎగతాళిగానో చూస్తున్న వాళ్ళందరూ తనకు కన్పిస్తున్నారు. తన ఆలోచన సవ్యంగానే ఉంది. కాబట్టి కళ్ళు తిరిగి పడిపోలేదు తను. పోనీ పరుగెత్తుతూ ఏదో

అడ్డుపడి పడిపోలేదు. ఎందుకంటే తను చాలా నెమ్మదిగా నడుస్తున్నపుడు పడ్డాడు. మరి ఎందుకు పడ్డాడు? తను పడ్డ చోటుని జాగ్రత్తగా పరిశీలించాడు. ఎగుడు దిగుడుగా లేదు. కాలికి తట్టుకునేలా రాయీ రప్పా ఏమీ లేవు. మరి ఎందుకు పడ్డాడు? పడినాక ఎందుకు లేవలేకపోయాడు? నడుం లేనట్లు... నడుం కిందినుంచి చచ్చుబడిపోయినట్లు... అసలు నడుమే అకస్మాత్తుగా అదృశ్యమైపోయినట్లు...

రమ్య తన బలమంతా ఉపయోగించి రెండు చేతుల్తో అతన్ని పైకి లేపడానికి ప్రయత్నించింది. గుండ్రంగా తిరిగాడు తప్ప పైకి లేవలేదు.

రమ్య కంగారు పడింది.

అప్పటికే ముగ్గురు నలుగురు చుట్టూ చేరారు.

ప్రసాద్‌కి చాలా అవమానంగా ఉంది. సిగ్గుగా ఉంది. ఏడుపు వస్తోంది.

"ప్లీజ్ కొద్దిగా హెల్ప్ చేయరా" చుట్టూ మూగిన వాళ్ళతో అంది రమ్య.

నలుగురు తమ చేతుల మీద ఎత్తుకుని బెంచ్ మీద కూచోబెట్టారు.

రమ్య వాళ్ళకు థ్యాంక్స్ చెప్పి అతని పక్కన కూచుంటూ "ఏమైంది ప్రసాద్? కాలేమైనా మడత పడిందా? బాగా నొప్పిగా ఉందా" అని అడిగింది.

ప్రసాద్ కళ్ళలో నీళ్ళు... "ఏమో రమ్యా... నాకేమీ అర్థం కావటం లేదు."

కాళ్ళు కదిలించి చూశాడు... బాగానే పని చేస్తున్నాయి. భయపడ్తూనే లేచి నిలబడ్డాడు. నడుం మామూలుగానే పని చేస్తోంది.

అతనికి వెంటనే అంతకు క్రితం జరిగిన అటువంటి అనుభవాలన్నీ గుర్తొచ్చాయి. మొదటి సారి అతనికి తన ఆరోగ్యం గురించి భయమేసింది. తన శరీరంలో జరక్కూడనిదేదో జరుగుతోంది. చాలా స్పష్టమైన సంకేతాల్తో తన శరీరం స్పందిస్తోంది.

"ఐయాం సారీ రమ్యా... నామీద నాకే కోపం వస్తోంది. సిగ్గుగా ఉంది" అన్నాడు తలొంచుకుని.

"ఇట్స్ ఓకే. మర్చిపో. నా బర్త్ డే రోజే ఇలా జరగటం నాకు బాధగా ఉంది. ఐనా పడటం సిగ్గుపడే విషయం కాదు. ఎంత మంది పడటం లేదూ... లైట్ తీస్కో" అంది రమ్య.

"ఇంటికెళ్దాం రమ్యా" అన్నాడు ప్రసాద్.

రమ్య టైం చూసింది. ఆరు గంటలు కావడానికింకా పది నిముషాలుంది.

"మనం అనుకున్న టైం ఇంకా ఉందిలే. నువ్వు రిలాక్స్ అయ్యేవరకు కొద్దిసేపు కూచుందాం"

"వద్దు రమ్యా... వెళ్ళిపోదాం" అంటున్న ప్రసాద్ మొహంలోకి చూసింది. భయంతోనో బాధతోనో మొహమంతా తెల్లగా పాలిపోయి... రక్తమంతా ఎవరో తోడేసినట్లు... జీవశక్తిని ఎవరో లాగేసినట్లు...

"సరే. వెళ్దాం పద. నడవగలవుగా"

ప్రసాద్ రమ్య చేతిని పట్టుకుని లేచి నిలబడ్డాడు.

మొదట మెల్లగా నడిచాడు. రమ్య వైపు తిరిగి "పర్లేదు... నడవగలను" అన్నాడు.

రమ్య భుజాన్ని ఆసరాగా చేసుకుని బైటి వరకూ నడిచాడు.

***

రమ్య చెప్పిన విషయం విన్నపుడు సరోజ కంగారు పడలేదు. ఏదో తట్టుకుని పడిపోయి ఉంటాడనుకుంది. రమ్య చూస్తుండగా పడటం వల్ల ఎక్కువగా బాధపడ్తున్నాడేమోననుకుంది.

"చూసి నడవాలని తెలీదా నాన్నా" అంది దిగులుగా ముడుచుకు పడుకున్న కొడుకుతో.

"చూసే నడిచా మమ్మీ. అక్కడ తట్టుకుని పడిపోవడానికి రాళ్ళూ రప్పలేం లేవు. నేల కూడా ఎగుడు దిగుడుగా లేదు"

"ఏమోలే వదిలేయి... చాలా చిన్న విషయం"

"కాదు మమ్మీ... నా శరీరంలో ఏదో జరుగుతోంది"

"శరీరంలో జరిగేదేమిట్రా... నేనూ మనింట్లో ఒకట్రెండు సార్లు జారి పడలేదా?"

"పడటం వరకూ ఓకే మమ్మీ... కానీ లేవడానికి ప్రయత్నించినా లేవలేకపోయానే... దానికి భయమేస్తోంది. నడుంకిందినుంచి అస్సలు పనిచేయనట్టు... కాళ్ళు నా స్వాధీనంలో

లేనట్టు... మమ్మీ నీకో విషయం గుర్తుందా... ఓ రోజు రమ్య వచ్చినపుడు కుర్చీలోంచి లేవలేకపోయానని చెప్తే నువ్వు నవ్వావు. అప్పుడూ అంతే... నాకేదో ఔతోంది మమ్మీ"

ఆమెకు కొద్దిగా భయమనిపించింది.

"ఈ మధ్య చాలా సార్లు వూర్కేవూర్కే పడిపోతున్నాను. ఎవరో కాలడ్డంపెడితే పడిపోతారు చూడు. అలా"

ఆమెకు వెంటనే తన కొలీగ్ కృష్ణవేణి గుర్తొచ్చింది. కృష్ణవేణి భర్త డాక్టర్. ప్రైవేట్ ప్రాక్టీస్ ఉంది. మేడమీద యిల్లు... కింది ఫ్లోర్‌లో ప్రాక్టీస్... టైం చూసుకుంది. యింకా అరున్నర కూడా కాలేదు కాబట్టి క్లినిక్‌కి దిగి ఉండడు... తప్పకుండా యింట్లోనే ఉంటాడని నిశ్చయించుకుని ఫోన్ చేసింది.

"మా బాబు గురించి మీ వారితో మాట్లాడాలి. ఆయనకిస్తావా ఫోన్" అని అడిగింది.

అతను ఫోన్ తీసుకుని హల్లో అన్నాక ప్రసాద్ చెప్పిన విషయాలన్నీ అతనికి చెప్పింది. "మీ సలహా కోసం ఫోన్ చేశాను డాక్టర్. యిలా ఎందుకు జరుగుతోంది? యిదేమైనా సీరియస్ విషయమా లేక మామూలు బలహీనతా?"

"న్యూరోలాజికల్ సమస్య ఏమైనా ఉందేమో ననిపిస్తోంది. ఈ వయసులో అటువంటి లక్షణాలు కన్పించటం మంచిది కాదు. ఆలస్యం చేయకుండా న్యూరో ఫిజీషియన్కి చూపించండి" అన్నాడు.

మరునాడు బ్యాంక్‌కి శెలవ పెట్టింది.

తొమ్మిదిన్నరకు కొడుకుతో పాటు అపోలో హాస్పిటల్ చేరుకుంది.

సంతలో ఉన్నట్లు జనం... రెండు గంటలు వేచి ఉన్నాక డాక్టర్ నుంచి పిలుపొచ్చింది.

డాక్టర్ సతీష్‌రావు... బైట పేరు చూసి కుర్రడాక్టరనుకుని పొరబడింది. అతని వయసు అరవైకి దగ్గరగా ఉండొచ్చనిపించింది. జుట్టు బాగా తెల్లబడింది. తెల్లటి దేహచాయ. ఆత్మీయంగా అన్పించే నవ్వు...

"చెప్పమ్మా సమస్యేమిటో... నీకా బాబుకా" అని అడగ్గానే మొదట ఆమెకేడుపొచ్చింది.

తమాయించుకుని బాబు చెప్పిన విషయాలు చెప్పి "డాక్టర్... మాకు వీడొక్కడే కొడుకు. లేక లేక కలిగిన సంతానం. వీడికేమైనా ఐతే నేను తట్టుకోలేను" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"ముందే ఏదో వూహించుకుని ఎందుకమ్మా కంగారు పడ్తావు? శరీరంలో వచ్చే రుగ్మతలకి ఎన్నో కారణాలుండవచ్చు. యిది కేవలం బలహీనత వల్ల కావచ్చు. మీరు చదువుకున్నవారు. ఉద్యోగం చేస్తున్నారు. మీరే అలా అధైర్యపడిపోతే ఎలా" అన్నాడు డాక్టర్.

ప్రసాద్‌ని అటూ యిటూ నడవమన్నాడు. అతని నడకలో ఏదో తేడా... ఈ సారి నిశితంగా పరిశీలించాడు. మడమలు నేలకు తగలకుండా కాలి వేళ్ళని నేలమీద ఆనించి నడుస్తున్నాడు.

కాళ్ళని పరీక్షించాడు. పిక్కలు మామూలుగా కన్నా లావుగా ఉన్నాయి.

"నీకు గుర్తున్నంతవరకు మొదటిసారి ఇబ్బందిగా ఎప్పుడనిపించింది?" అని అడిగాడు.

"ఎనిమిదో తరగతి చదువుతున్నపుడు బస్‌లో సీట్ కోసం పరుగెత్తుతూ పడిపోయాను. ఎవరో కాలడ్డంపెట్టడం వల్ల పడిపోయాననుకున్నాను. ఆ తర్వాత కూడా కొన్ని సార్లు అలా జరిగినా పెద్దగా పట్టించుకోలేదు. ఓ సారి సైకిల్ పెడల్ని తొక్కలేకపోయాను. మీకింకో విషయం చెప్పటం మర్చిపోయాను డాక్టర్. రెణ్ణెల్ల క్రితం మా స్కూల్లో ఓ ఫంక్షన్ జరిగింది. ఆ అరేంజ్‌మెంట్స్ కోసం కొన్ని బల్లల్ని జరపాల్సి వచ్చింది. నేనారోజు ఎంత ప్రయత్నించినా బల్లని ముందుకు నెట్టలేకపోయాను. ఫ్రెండ్సందరూ ఎగతాళి చేశారు" ప్రసాద్ మొహంలో అప్పటి అవమానాన్ని తల్చుకుని దిగులు స్పష్టంగా కన్పించింది.

"మీ కుటుంబాల్లో అంటే మీ తరఫున కానీ మీవారి తరఫున కానీ ఎవరికైనా యిటువంటి సమస్య ఉందా?" సరోజనడిగాడు.

"ఎటువంటి సమస్య?"

"యిలా చేతులూ కాళ్ళూ కొన్నిసార్లు పనిచేయకపోవటం... పట్టు తప్పటంలాంటి సమస్య"

"నాకు గుర్తుండి ఎవ్వరికీ లేదు. మా అత్తగారికి మాత్రం కీళ్ళనొప్పులుండేవి"'

"మీది మేనరికమా?"

"కాదు... ఎందుకు డాక్టర్ యిలా అడుగుతున్నారు?"

"ఏం లేదమ్మా. కొన్ని అనుమానాల్ని నివృత్తి చేసుకోటం కోసం అడుగుతున్నా. ప్రస్తుతానికి బలం కోసం టానిక్, మల్టీ విటమిన్ క్యాప్సూల్స్ రాసిస్తున్నా. కొన్ని టెస్టులు రాస్తున్నా. ఆ రిపోర్టులు తీసుకుని రండి. అవి చూశాక మందులు రాస్తాను" అన్నాడు.

సరోజ యిచ్చిన ఫీజు తీసుకుంటూ "ప్రసాద్... నువ్వు బాగా చదివి నాలా డాక్టర్ కావాలనుకుంటున్నావా లేక యింజనీరౌతావా?" అని అడిగాడు.

అప్పటివరకూ ఉదాసీనంగా ఉన్న ప్రసాద్ మొహం ఒక్కసారిగా వెలిగింది. "లేదు డాక్టర్. నేను ఐ.ఏ.యస్. పాసై కలెక్టర్నవుతా" అన్నాడు.

"బెస్టాఫ్ లక్ మై బోయ్" అంటూ డాక్టర్ కరచాలనం చేశాడు.

మరో గదిలోకెళ్ళి అక్కడి టెక్నీషియన్‌కి డాక్టర్ రాసిన టెస్టులు చూపించింది. అతను సిరంజి ద్వారా అవసరమైనంత రక్తం నమూనాని తీసుకుని రిపోర్టులు తీసుకోవడానికి ఎప్పుడు రావాలో చెప్పాడు.

రెండ్రోజుల తర్వాత ప్రసాద్‌ని పిల్చుకుని అపోలో హాస్పిటల్ కెళ్ళింది. ఎప్పట్లానే యిసుకేస్తే రాలనంత జనం... మొదట కౌంటర్లో రిపోర్టులు తీసుకుంది. డాక్టర్ పిలుపు కోసం ఎదురుచూస్తూ వాటిని తీసి చదువుకుంది. ఆమె కేమీ అర్థం కాలేదు. ఒక రిపోర్ట్ సీరం క్రియాటిన్ కినేస్ లెవెల్స్‌కి సంబంధించింది. మరోటి డిస్ట్రోఫీన్ లెవెల్స్‌కి సంబంధించింది.

ఆమె తన వంతు వచ్చాక లోపలికెళ్ళి డాక్టర్కి రిపోర్టులు చూపించింది. వాటిని శ్రద్ధగా పరిశీలించి "బాబుని కొద్దిసేపు బైట కూచోమని చెప్పమ్మా" అంటూనే ప్రసాద్ వైపు తిరిగి "నిన్ను మళ్ళా పిలుస్తాను యంగ్ మాన్. కొద్దిసేపు బైట వెయిట్ చేయి" అన్నాడు.

సరోజకు గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. అంటే విషయం సీరియస్సా... ప్రసాద్ వినకూడని విషయమా? తన జీవితంలో ఎన్ని తుఫాన్లని ఎదుర్కోవాలి? భర్త చనిపోయిన షాక్ నుంచి యింకా తేరుకోనేలేదే... యిపుడే ఉపద్రవం ముంచుకు రాబోతుందో... డాక్టర్ ఏం చెప్తాడోనని భయం భయంగా అతని వైపు చూసింది.

"నా అనుమానం నిజమైందమ్మా. మీరు ధైర్యాన్ని చిక్కబట్టుకుని నేను చెప్పే విషయాన్ని వినాలి" అన్నాడు డాక్టర్.

"అలా అనకండి డాక్టర్. నాకు భయమేస్తుంది. వాడికేమైనా ఐతే నేను తట్టుకోలేను"

"యిపుడు తప్పదమ్మా. నేను చెప్పే విషయాల్ని సావధానంగా వినండి. బాబుకి ఉన్న జబ్బుని మస్కులార్ డిస్ట్రాఫీ అంటారు"

ఆ మాటని ఎప్పుడూ వినని సరోజ "అంటే ఏంటి డాక్టర్" అని అడిగింది.

"జెనెటిక్ డిసార్డర్ వల్ల వచ్చే జబ్బుమ్మా. దీన్ని నయం చేసే మందులేమీ లేవు. దీనివల్ల గ్రాడ్యుయల్‌గా శరీరంలోని కండరాలు బలహీనపడ్తుంటాయి. చేతులూ కాళ్ళతో పాటు నడుం కూడా పనిచేయని స్థితి రావొచ్చు. శ్వాస తీసుకునే వ్యవస్థ దెబ్బతినొచ్చు"

సరోజ దిగ్భ్రాంతికి లోనైంది. తన బాబుకి జెనెటిక్ డిసార్డరా... అందంగా ఆరోగ్యంగా రాకుమారుడిలా కన్పించే తన కొడుక్కి యిలాంటి జబ్బు రావడమేంటి? ఏదో ఎక్కడో పొరపాటు జరిగుంటుంది. రిపోర్టులు తప్పొచ్చి ఉంటాయి. ఆ రోజు రక్తం నమూనా తీసుకున్న అబ్బాయిని చూసిందిగా... వాడు సెల్ ఫోన్లో పాటలు వింటూ ఎంత అనాసక్తిగా శాంపిల్ తీసుకున్నాడో... అసలు శాంపిలే మారిపోయి ఉంటుంది ఆ వెధవ్వల్ల. తమ యింటా వంటా యిటువంటి రోగం ఎవ్వరికీ లేదే. మరి తన రాజా బాబుకెందుకుంటుంది... నెవ్వర్...

"డాక్టర్... మరోసారి టెస్టులు చేయడం మంచిదేమో... ఏదో పొరపాటు జరిగినట్టుంది. మా బాబుకి జెనెటిక్ డిసార్డర్ ఏమిటి? నేనూ మావారూ యిద్దరం ఆరోగ్యవంతులమే. యాక్సిడెంట్ వల్ల పోయారు తప్ప లేకపోతే డెబ్బయ్ యేళ్ళ వరకు ఆరోగ్యంగా బతకడానికి అవసరమైన ఉక్కులాంటి శరీరం ఆయనది. నాకూ అంతే డాక్టర్... యిప్పటివరకు అనారోగ్యమంటే ఏమిటో ఎరుగను. మా అమ్మానాన్నగానీ అత్తామామలు గానీ ఎవ్వరికీ జన్యుపరమైన వ్యాధులు లేవు"

డాక్టర్ ఆమె వైపు సాలోచనగా చూసాడు. “టెస్టుల్లో తప్పేం లేదమ్మా. మీ ఆవేదనని అర్థం చేసుకోగలను. యిటువంటి జెనెటిక్ డిసార్డర్స్ ఎందుకొస్తాయో చెప్పలేమమ్మా. వంశపారంపర్యంగా రావాలని లేదు. జీన్స్ మ్యుటేట్ కావడం వల్ల కూడా రావొచ్చు. శరీరంలోని కండరాలు ఆరోగ్యంగా బలంగా ఉండాలన్నా వాటికి సంబంధించిన విధుల్ని నిర్వర్తించాలన్నా డిస్ట్రోఫీన్ అనే ప్రొటీన్ అవసరమౌతుంది. జన్యుపరమైన సమస్య వల్ల లేదా జెనెటిక్ యిన్ఫర్మేషన్లో వచ్చిన లోపం వల్ల ఈ ప్రొటీన్ని తయారు చేయడానికవసరమైన సంకేతాలు శరీరానికి అందనపుడు మస్కులర్ డిస్ట్రోఫీ అనే జబ్బు వస్తుంది. దీంట్లో కూడా చాలా రకాలున్నాయమ్మా. మరికొన్ని పరీక్షలద్వారా బాబుది ఏ రకమైన మస్కులార్ జబ్బో నిర్ధారించాల్సిన అవసరం ఉంది. అవి రాసిస్తాను. తొందరగా చేయించండి”

“డాక్టర్ గారూ... నా కొడుక్కోసం నేనెంత కష్టమైనా పడ్తాను. ఎంత ఖర్చయినా భరిస్తాను. యిక్కడ వీలుకాకపోతే అమెరికా పిల్చుకెళ్ళమంటారా? అక్కడ మెరుగైన వైద్యం అందే అవకాశం ఉందంటారా?”

“లేదమ్మా... ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా దీనికి మందు లేదు. మీరు బాబుని జాగ్రత్తగా చూసుకోవాలి. పసిపిల్లాడప్పుడు ఎలా చూసుకున్నారో అలాగన్మాట. రాబోయే కాంప్లికేషన్స్ని బట్టి డాక్టర్లుగా మా వంతు కృషి మేం చేస్తాం. మీకు బాధ కలిగించినా సరే ఓ విషయం ఖచ్చితంగా చెప్పాలమ్మా. యిలాంటి జబ్బు వచ్చిన వ్యక్తుల జీవితకాలం చాలా తక్కువ”

“చాలా తక్కువనా... అంటే ఎంత డాక్టర్... నా భర్తని కోల్పోయినట్లే నా కొడుకుని కూడా కోల్పోతానా? నేనేం పాపం చేశానని దేవుడు నాకీ శిక్ష విధించాడు?” ఆమె వెక్కిళ్ళు పెట్టి ఏడ్చింది.

“మరికొన్ని పరీక్షల తర్వాత అది ఏ రకమైన మస్కులర్ డిస్ట్రోఫీనో నిర్ధారిస్తే తప్ప చెప్పలేనమ్మా. ఏది ఏమైనా మరో పది పదిహేనేళ్ళు... అంతే. ఈ సమయంలోనే మీరు ధైర్యంగా ఉండాలి. ఓ డాక్టరుగా శక్తివంచన లేకుండా నేను సపోర్ట్ చేస్తాను. సరేనా” అన్నాడతను.

ఆమెకేం మాట్లాడాలో తెలీలేదు. కదుల్తోన్న శిలలా లేచి బైటికొచ్చింది.

“మమ్మీ... డాక్టర్ ఏం చెప్పాడు? ఏంటంట సమస్య? మందులు రాసిచ్చాడా?” అమ్మను చూడగానే ప్రసాద్ ఒక్కంగలో ఆమెను చేరుకుని ప్రశ్నల వర్షం కురిపించాడు.

“ఏం లేదట నాన్నా... చిన్న సమస్య. నువ్వు సరిగ్గా తినటం లేదు కదా... వీక్‌నెస్ వల్ల అలా జరుగుతోందట. మరికొన్ని పరీక్షలు చేయించమన్నాడు. అంతే” తనలో అమాంతంగా కొండలా పెరిగిపోయిన దిగుల్ని కన్పించనీకుండా జాగ్రత్తపడ్తూ అంది.

“యింకా టెస్టులా ? మళ్ళా రక్తం యివ్వాలా... చిన్న సమస్యన్నావుగా... యిన్ని టెస్టులు దేనికి మమ్మీ... నాకా సూదంటేనే భయం. యింక చాల్లే మమ్మీ... వెళ్ళిపోదాం. నాకు బాగానే ఉందిలే. యిక నుంచి నువ్వు చెప్పినట్టు బాగా తింటాగా... ప్రామిస్”

“అలా అనకూడదు నాన్నా... డాక్టర్ గారు చెప్పినట్టు వినకపోతే ఆయనకు కోపం వస్తుంది. మళ్ళా మనల్ని యిక్కడికి రానివ్వడు”

“రానివ్వకపోతే ఆయనకే నష్టం మమ్మీ... ఆయనకు రావాల్సిన ఫీజే పోతుంది. మనకేంటి? ఈయనకాకపోతే మరో డాక్టర్. హైద్రాబాద్‌లో డాక్టర్లకేం కొదువ? మన వీధిలోనే నలుగురున్నారు?”

“నిజమే. కానీ ఈయన చాలా మంచి డాక్టర్... బాగా పేరున్న డాక్టర్. నా బంగారు కొండను అలాంటిలాంటి డాక్టర్లకు చూపిస్తానా ఏంటి? ది బెస్ట్ డాక్టర్‌కేగా చూపిస్తాను”

ప్రసాద్ హాయిగా నవ్వాడు.“అవును కదా... నేనూ ది బెస్టే గదా”

సరోజ యింటికొచ్చాక తలనొప్పిగా ఉందంటూ తన గదిలో పడుకుని చాలాసేపు దిండు తడిసేలా ఏడ్చింది. ఆమెకో విషయం స్పష్టంగా అవగాహనకొచ్చింది. యిది ఏడ్చే సమయం కాదు. ఎదురైన సమస్యని తన శక్తులన్నింటినీ కూడగట్టుకుని ఎదిరించాల్సిన సమయం. తన భర్త బతికున్న రోజుల్లో ఇతను లేకుండా క్షణమైనా బతగ్గలనా అనుకునేది. అతను పోయినా తట్టుకుని నిలబడగలిగింది. ఈ సమస్యా అంతే. తప్పని సమస్య. తను తప్పకుండా ఎదురొడ్డి పోరాడాల్సిన సమస్య...

ఆ సాయంత్రం ఆమె కళ్ళు తుడుచుకుని, వంట చేయడానికి సన్నద్ధమయ్యే సమయానికి తన కొడుకు ఆరోగ్యసమస్యని సర్వశక్తులూ ఒడ్డి ఎదుర్కోడానికి మానసికంగా సమాయత్తమైంది.

***

ఎల్.ఎల్.యం. క్లాసులు ప్రారంభమైన మొదటి రోజు.

మొత్తం ఇరవైకి మించని విద్యార్థులు...

యూనివర్సిటీ వాతావరణం కోలాహలంగా ఉంది. క్లాస్ రూంలో ఉన్న విద్యార్థుల వైపు పరిశీలనగా చూసింది అక్షర. చాలా మటుకు కొత్త మొహాలే. కొందరు దగ్గరకొచ్చి పలకరించి పరిచయం చేసుకున్నారు.

అక్షర కళ్ళు కిరణ్ కోసం వెతుకుతున్నాయి. ఎన్నాళ్ళయిందో కిరణ్‌ని చూసి... కిరణ్ పీ.జీ. కి అప్లయ్ చేయలేదా? వేరే కాలేజీలో చేరాడేమో? డిగ్రీతో ఆపేసి ప్రాక్టీస్‌లో చేరాడా? అంత ప్రతిభ గల విద్యార్థి డిగ్రీతో ఆపేయటం మంచిది కాదని తెలీదా? ఎవ్వరూ చెప్పలేదా? తనకు చెప్పే అవకాశం కూడా ఇవ్వ లేదే... అందులో అతని తప్పు లేదు. తనెప్పుడో అతన్ని క్షమించేసింది.

రమణ క్లాస్‌రూంలోకి రావడం చూడగానే ఆమె కళ్ళు మెరిశాయి. హమ్మయ్య... తన క్లాస్‌నుంచి ఒక్కరైనా పీజీలో తనకు తోడున్నారనుకుంది.

"హాయ్ రమణా" అంటూ విష్ చేసింది.

రమణ ఆమె పక్కనున్న కుర్చీలోనే కూచున్నాడు.

ప్రొఫెసర్ గారింకా రాలేదు.

"మన క్లాస్‌మేట్స్‌లో నువ్వూ నేనేనా పీ.జీ.లో చేరింది?" అని అడిగింది.

రమణ ఆమె ఆంతర్యం అర్థమైనట్లు నవ్వాడు. "ఏం... ఇంకెవరైనా చేరి ఉంటే బావుండేదనిపిస్తుందా?" అన్నాడు.

అక్షర కంగారు పడింది. "అబ్బే... అలా ఏం లేదు. వూరికే అడిగా. మనకు తెల్సినవాళ్ళు ఇంకెవరైనా చేరారేమో తెల్సుకుందామని"

"ఎందుకు భుజాలు తడుముకుంటావ్... నాకు తెలుసులే... కిరణ్ గురించేగా నీ ఆతురత"

అక్షర వేగంగా ఆలోచించింది. "నువ్వు చెప్పింది నిజమే. పీ.జీ.లో కూడా యూనివర్సిటీ ఫస్ట్ తెచ్చుకోవాలని ఆశ. కిరణ్ చాలా తెలివిగలవాడు. అతను చేరాడనుకో. నేను మరింత శ్రమపడాల్సి వస్తుంది" అంది తమాషాగా నవ్వుతూ.

'ఎంత తెలివిగా సమర్థించుకుంటుందో... ఇన్నాళ్ళూ కిరణ్ ప్రేమ ఓ వైపు నుంచే అనుకున్నా. ఈ అమ్మాయిలో కూడా ఏ మూలో కిరణ్ మీద ప్రేమ నిద్రాణమై ఉంది. దాన్ని జాగృతం చేస్తే చాలు' అనుకున్నాడు.

క్లాస్ ప్రారంభమైంది.

మొదటి రోజు మొదటి పీరియడ్ కాబట్టి పరిచయాలు... ఫ్యాకల్టీ... ఎల్.ఎల్.యం. లో ఉన్న సిలబస్... మంచి మార్కులు తెచ్చుకోవాలంటే ఎలా చదవాలి... లైబ్రరీ... వీటి గురించే చెప్తున్నారు.

అక్షర అన్యమనస్కంగా వింటోంది. డిగ్రీ ఫైనలియర్ రిజల్ట్స్ రోజు తను రాసిన సుదీర్ఘమైన ఉత్తరాన్ని కిరణ్‌కి అందచేసింది.

తను ఇంటికి చేరుకునేలోపలే తన సెల్లో మెసేజ్ వచ్చింది.

'నువ్వు రాసిందంతా ఆసాంతం చదివి అర్థం చేసుకున్నాను. నీ గురించి పూర్తిగా తెలిశాక నీమీది ప్రేమ రెండింతలయింది. ఆదివారం బైటికి రాగలవా... నీతో చాలా మాట్లాడాలి. ఎక్కడ ఎప్పుడు కలవాలో నీకు మళ్ళా మెసేజ్ చేస్తాను. ప్లీజ్ రాకుండా ఉండకు. నీ కోసం ఎదురు చూస్తాను' అని మెసేజ్...

'ఎంత పిచ్చివాడు! అంత మొండితనమేంటి? హాయిగా ఆనందంగా ఉండాల్సిన జీవితాన్ని చేతులారా కష్టాలపాలు చేసుకోవాలనుకుంటున్న మూర్ఖుడు' మెసేజ్ చదవగానే చిరాకు పడింది.

కానీ ఆలోచించేకొద్దీ 'మూర్ఖుడు కాదు... తనంటే నిజమైన ఇష్టమేమో. ఓ వేళ అతని ప్రేమలో నిజాయతీ ఉన్నా తను మాత్రం తొణక్కూడదు. అతను తనకో మంచి మిత్రుడు. చూస్తూ చూస్తూ ప్రేమ పేరుతో ఓ స్నేహితుడి జీవితాన్ని కాలరాసేంత

కర్కశత్వం తనలో లేదు' అనుకుని ఆ విషయాన్ని అంతటితో మర్చిపోయింది.

శనివారం రోజు అతన్నుంచి మెసేజ్ వస్తుందనీ, ఏం చెప్పి తప్పించుకోవాలా అని ఆలోచించింది. కానీ ఆ రోజు మెసేజ్ రాలేదు. రాత్రి పది దాటాక కూడా సెల్లో చెక్ చేసుకుంది. రాలేదు. ఆదివారం ఉదయం వస్తుందేమో, సాయంత్రం ఎక్కడైనా కలవమని మెసేజ్ పంపుతాడేమోనని అనుకుంది. మధ్యాహ్నం దాటినా మెసేజ్ రాలేదు.

ప్రతి నిముషం తన చూపు సెల్లో కన్పించని మెసేజ్ వైపుకే లాగుతోంది. రాత్రి దాకా ఎదురు చూసింది. మెసేజ్ రాలేదు.

అతను మెసేజ్ ఇచ్చి ఫలానా చోటికి రమ్మంటే అక్కడికి వెళ్ళకూడదనే అనుకుంది. తీరా మెసేజ్ రాకపోయేటప్పటికి అనంతమైన నిరాశ ఆమెను కమ్మేసింది. తృణీకారం వల్ల కలిగే గాయం... అక్కరలేని వస్తువులా గిరాటు వేశాడన్న బాధ... ముట్టుకుంటే ముప్పొస్తుందని వదిలించుకున్నాడన్న వ్యధ...

తన ఉత్తరం చదివిన వెంటనే ఎమోషన్లో అలాంటి మెసేజ్ ఇచ్చి ఉంటాడు. ఆ తర్వాత ప్రశాంతంగా ఆలోచించి ఉంటాడు. నడవలేని, నడుం కింది నుంచి చచ్చుబడిపోయిన అమ్మాయితో అందునా ఎపుడు చచ్చిపోతుందో తెలీని వ్యక్తితో జీవితం పంచుకోవడం తెలివి తక్కువతనమని అర్థమై మనసు మార్చుకుని ఉంటాడు.

అలా అనుకోగానే మోయలేనంత బాధతో మనసు విలవిల్లాడింది. అతని ప్రేమను పొందే అర్హత తనకు లేదు నిజమే. అతను సహృదయంతో తనను పెళ్ళి చేసుకున్నా అతన్ని ఏ రకంగానూ సుఖపెట్టలేదన్నదీ నిజమే. కానీ తన జీవితంలో కూడా ఓ ప్రేమికుడున్నాడన్న భావన... తనకు కూడా నిజమైన ప్రేమలోని మాధుర్యాలు పంచడానికి ఓ వ్యక్తి ఉన్నాడన్న ఆలోచన... ఇన్నాళ్ళూ ఎంత కమ్మదనాన్ని ఇచ్చిందో... ఆ తలపే ఎంత హాయినిచ్చిందో... తనకు బతుకుమీది తీపిని వందరెట్లు పెంచిన అనుభూతి..

ప్రేమ రాహిత్యం తన జీవితంలో లేదు. తేనెకన్నా తీయనైన అమ్మ ప్రేమను పొందింది. నిఖార్సయిన నాన్న ప్రేమనూ పొందింది. కానీ ఈ ప్రేమలో మరేదో కొత్తదనం... తన అనుభవంలోకి ఇప్పటివరకూ రాని అద్భుతమైన మాధుర్యం...

కిరణ్ తనకళ్ళకు చాలా బావుంటాడు. ఐదడుగుల ఆరంగుళాల పొడవు... పెద్దకళ్ళు... స్లిమ్గా ఉండటం వల్ల మరింత పొడవనిపిస్తాడు. తనకు అతని కళ్ళంటే

ఎంతిష్టమో... ఆ కళ్ళలో ఆరాధన... ఆ కళ్ళలో తడితడిగా మెరిసే ప్రేమ... వెన్నెలని కురిపించే చందమామల్లా కళ్ళు... వరాలిచ్చే వనదేవతలా చల్లగా అన్పించే కళ్ళు... వలపు నిండిన కళ్ళెపుడూ అలానే ఉంటాయేమో...

ఎన్నిసార్లు తనలో సముద్రంలా పొంగిన కోరికని బలవంతంగా ఆపుకుందో... ఆ కళ్ళల్లోకి చూస్తూ గంటలు గంటలు గడిపేయాలన్న కోరిక... కిరణ్ తన ప్రేమను వ్యక్తపరిచాకే తనకు తెలిసింది-ప్రేమించబడటంలో ఇంతానందం ఉందని... కోరుకోబడటంలో ఇంత తృప్తి ఉంటుందని...

కానీ కిరణ్ నుంచి ఆ రోజు మెసేజ్ రాకపోవడం... ఆ తర్వాత కూడా ఎటువంటి కబురు లేకపోవడం తనను గాఢాంధకారం నిండిన తీవ్ర నిరాశలోకి నెట్టేసింది.

తను ఇంటర్ చదువుతున్న రోజుల్లో యువతీ యువకుల మధ్య చిగురించే ప్రేమగురించి చాలా విషయాలు తెలిసేవి. రకరకాల గాసిప్స్ వింటూ ఉండేది. క్లాసులో ఎవరు ఎవరి వెంట పడ్తున్నారూ... ఏ అమ్మాయి ఏ అబ్బాయితో తిరుగుతోందీ... ఎవరి బైక్ వెనక ఎవరు కూచుని షికార్లు కొడ్తున్నారూ... ఏ సినిమా హాల్లో ఏ జంట కన్పించారూ... ఏమేం చేస్తూ కంటపడ్డారూ లాంటి వార్తలు చెవిన పడేవి.

తను అందరిలా ఆడుకోలేకపోతున్నందుకు బాధపడ్తున్నానని తెలిసి అమ్మ తనతో కలిసి రకరకాల ఇండోర్ గేమ్స్ ఆడేది. కానీ ఈ విషయంలో అమ్మ ఏం చేయగలదు? టీనేజ్‌లో తన తోటి విద్యార్థుల ప్రేమవ్యవహారాలు చూసి ఎంతటి డిప్రెషన్‌కి లోనైందో తనకు మాత్రమే తెలుసు. అమ్మతో కూడా పంచుకోలేని బాధ అది.

చచ్చిపోవాలనిపించేది. ఎందుకీ బతుకు అన్పించేది. తనను ఏ అబ్బాయీ ప్రేమించడు. తన జీవితంలో అలాంటి ప్రేమకు చోటు లేదు. తనకు పెళ్ళి కూడా కాదు. బతికినంత కాలం ఒంటరిగానే బతకాలి.

అటువంటి ఆలోచనల తీవ్రతని తట్టుకోలేక విపరీతమైన నిస్పృహకు లోనైన సమయంలో... అమ్మకెలా అర్థమైందో... తనను బుజ్జగించింది... మరుగుతున్న తన మనసుని చల్లబరిచింది.

'ఈ వయసులో అటువంటి ఆలోచనలు సహజం. శరీరంలో ప్రవహిస్తూ రక్తాన్ని లావాలా మండించే హార్మోన్లు... నీ సహ విద్యార్థుల మాటల్లో తరచూ వినబడే బాయ్

ఫ్రెండ్ల కబుర్లు... సెక్స్ అనుభవం ఎలా ఉంటుందోనన్న కుతూహలం... దాన్ని వీలైనంత త్వరగా స్వంతం చేసుకోవాలన్న ఆరాటం... వీటి ప్రభావం నీమీద తప్పకుండా ఉంటుంది.

కానీ ఓ విషయం చెప్తాను వినమ్మా. ఈ వయసులో ఆడా మగా మధ్య ఉండేది ఆకర్షణ మాత్రమే. శృంగార వాంఛలోంచి పుట్టిన ఆకర్షణ... సెక్స్ అనేది బ్రహ్మ పదార్థం కాదమ్మా. ఈ ప్రపంచంలో అతి సులువుగా అతి చౌకగా దొరికేది నా ఉద్దేశంలో సెక్స్ ఒక్కటే. కలెక్టరైనా కూలివాడైనా వాడి స్థాయికి తగ్గ సెక్స్ దొరుకుతుంది. అడుక్కునేవాళ్ళు... కుష్టు రోగులు మరో అడుక్కునేవాడితో, కుష్టు రోగితో జత కడ్తారు.

సినిమాల్లో చూపించినట్లు, పుస్తకాల్లో రాసినట్లు సెక్సనేది అద్భుతంగా ఏమీ ఉండదు. మొదట్లో కొత్తదనం వల్ల ఏమీ తెలీదు... రానురాను పాతబడటం వల్ల చప్పగా రొటీన్‌గా... అంతే.

అటువంటి తుచ్ఛమైన, సాధారణమైన విషయంకోసం నువ్వు ఆరాటపడి, దొరకదేమోనని నిరాశపడి నీ లక్ష్యాన్ని విస్మరించడం విజ్ఞత అన్పించుకోదు.

సెక్స్‌ని పొందడంలో గొప్పేముంది? పశు పక్ష్యాదులూ పనికిమాలిన వెధవలూ అందరికీ దొరికే అతి మామూలు విషయం అది. అరుదైన వాటిని అందుకుంటేనే ఘనత. నువ్వు సుప్రీంకోర్టు జడ్జిగా కీలకమైన తీర్పులిస్తుంటే... ఓహ్ ఎంత గొప్పగా ఉంటుందో ఆలోచించు. నీ తల్లిగా నేను గర్వపడ్తాను. నిన్ను కన్నందుకు మా జన్మ ధన్యమైందని నేనూ నాన్న సంతోషపడ్తాం. అటువంటి అపురూపమైన అవకాశాలు నీకు దక్కాలంటే కొన్నిటిని వదులుకోక తప్పదు' అంది అమ్మ.

'అబ్బాయి అమ్మాయిల మధ్య ఉండే ప్రేమ...'

'ఏ ప్రేమైనా ఒక్కలానే ఉంటుందమ్మా. తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని వాళ్ళే అలాంటి ప్రేమలకోసం ప్రాకులాడ్తారు. నాకూ నాన్నకు నువ్వంటే ఎంత ప్రేమో నీకు మాత్రం తెలీదా? వేరే ప్రేమని కోరుకుంటున్నావంటే మా ప్రేమలో లోపం ఉందన్నాట' అని అమ్మ అలిగినట్లు మొహం పెట్టగానే...

'అయ్యో అలా అనకమ్మా. మీ ప్రేమ చాలా గొప్పది. నాకెటువంటి అసంతృప్తి లేదమ్మా' అంటూ అమ్మను చుట్టుకుని ఏడ్చేసింది.

ఆ తర్వాత ఎప్పుడూ మనసులోకి అబ్బాయిల ప్రేమగురించో... శారీరిక ఆకర్షణ గురించో ఆలోచన రానివ్వలేదు.

కాని కిరణ్ తనని ప్రేమించటం మొదలెట్టాక ప్రేమ విషయంలో అమ్మ సుభ్య పెట్టిన విషయం అర్థమైంది. కిరణ్ ప్రేమకూ అమ్మ ప్రేమకూ చాలా వ్యత్యాసముంది.

అమ్మ ప్రేమ చల్లగా ఉంటే కిరణ్ ప్రేమలో చలికాలంలో నెగడు దగ్గర కూచుంటే కలిగే వెచ్చని హాయి ఏదో ఉంది. అమ్మ ప్రేమ కమ్మగా ఉంటే కిరణ ప్రేమలో మత్తుగొలిపే మాధుర్యం ఏదో ఉంది.

కిరణ్ తనకు మెసేజ్ పెట్టకుండా తన నుంచి దూరంగా వెళ్ళిపోయాడని కోపంగా లేదు. అతను స్వార్థపరుడిగా మారిపోయాడని నింద వేయదు. కిరణ్‌ని తను సరిగ్గానే అర్థం చేసుకుంది. సాధారణంగా ఎవరైనా అలానే ప్రవర్తిస్తారు. కిరణ్ అసాధారణ వ్యక్తి కాదు.

అతనెలాంటివాడైనా తనకు మాత్రం ప్రియమైన వ్యక్తి... రెండు సంవత్సరాలు ప్రేమలోని మాధుర్యాన్ని చవి చూపిన మనిషి. ప్రేమించబడటంలో ఉండే అలౌకికమైన ఆనందాన్ని తనకు స్వంతం చేసిన మగాడు. అందుకే అతనికి జీవితాంతం రుణపడి ఉంటుంది.

కిరణ్ తనని ప్రేమించకున్నా పర్లేదు. పీజీలో చేరితే చాలు... తనకు రోజూ క్లాస్‌లో కన్పిస్తే చాలు. అతన్ని రోజుకొక్కసారైనా చూడటం తప్ప మరేమీ కోరుకోదు.

"ఈ లోకంలో ఉన్నట్టు లేవు... ఎక్కడ విహరిస్తున్నావు... మిస్! ఎక్కడ మిస్సయినావు?" ప్రొఫెసర్ తన వైపే చూస్తూ అడుగుతున్నాడు.

మొదట అక్షరకు అర్థం కాలేదు.

"హలో మిస్... నిన్నే అడుగుతోంది" అంటున్నాడు.

ఆలోచనల్లోంచి బైట పడి చుట్టూ చూసింది. మిగతా విద్యార్థులందరూ తనవైపే ఆశ్చర్యంగా చూస్తున్నారు.

పక్కన కూచున్న రమణ "అక్షరా నిన్నే" అంటూ భుజం మీద పెన్తో పొడుస్తున్నాడు.

కిరణ్ గురించి ఆలోచిస్తున్న అక్షర కళ్ళలో అప్పటికే నీళ్ళు ఉబికాయి.

అది గమనించిన ప్రొఫెసర్ కంగారు పడి “ఎందుకేడుస్తున్నావు? ఎనీ ప్రాబ్లెం” అని అడిగాడు.

“నథింగ్ సార్... కళ్ళలో ఏదో పడినట్లుంది. నలిపేటప్పటికి నీళ్ళొచ్చాయి” అంది.

“ఓకే ఓకే. యూనివర్శిటీ ఫస్టొచ్చింది నువ్వే కదా. వాట్స్ యువర్ నేమ్”

“అక్షర”

“కీపిటప్. పీజీలో కూడా ఫస్ట్ రావాలి. ఆల్ ది బెస్ట్” అన్నాడు.

రెండు పీరియడ్స్ కాగానే మరింక క్లాసులు లేవని చెప్పారు.

వెళ్ళబోతున్న రమణని అక్షర ఆపేసింది. “కిరణ్ క్లాస్‌కి రాలేదేం... తప్పకుండా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తానని నాతో చాలా సార్లు చెప్పాడు. వేరే యూనివర్శిటీలో చేరాడా?”

“లేదు. కిరణ్ చదువాపేసి ఓ లాయర్ దగ్గర అప్రెంటిస్‌గా చేరాడు”

“ఔనా... అలా ఎందుకు చేశాడు?”

“నీకు తెలీదా... కిరణ్ వాళ్ళ నాన్న చనిపోయారు”

“కిరణ్ వాళ్ళ నాన్న గారు చనిపోయారా... అయ్యో నాకు తెలీదే... ఎప్పుడు? ఎలా చనిపోయారు?”

“మన ఫైనలియర్ రిజల్ట్స్ వచ్చాయి గుర్తుందా... ఆ రోజు నువ్వొ వచ్చావుగా కాలేజీకి. అదే వారంలో... శనివారం రోజు సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కి ఫురేసుకుని చచ్చిపోయాడు”

“అయ్యో... అంత ఘోరం జరిగినా నాకెవ్వరూ చెప్పలేదెందుకు? ఆత్మహత్యకు పాల్పడేంత కష్టం ఆయనకేమొచ్చింది?”

“ఆయన చేసేది షేర్స్ బిజినెస్ కదా. బాగా నష్టాలొచ్చాయి. తీర్చలేక... అప్పులోళ్ళకి మొహం చూపించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ భారమంతా కిరణ్ మీద పడింది”

“కిరణ్ షాక్‌కి లోనై ఉంటాడు. నువ్వయినా నాకు ఫోన్ చేసి ఉండొచ్చుగా. కనీసం మెసేజ్ ఇచ్చి ఉండొచ్చుగా”

"కిరణ్ నాకు ఫోన్ చేసి చెప్పగానే వాడింటికి పరుగెత్తాను. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇద్దరికీ వూపిరాడలేదు. ఆత్మహత్య కాబట్టి పోలీసులొచ్చారు. పోస్ట్ మార్టం చేస్తేగాని బాడీని అప్పగించేది లేదని పట్టుపట్టారు. కిరణ్‌కి అదిష్టం లేదు. చనిపోయే ముందు మానసికంగా వేయి ముక్కలుగా తెగిపడిన వాళ్ళ నాన్న శరీరాన్ని మళ్ళా ముక్కలుగా నరకటాన్ని భరించలేనన్నాడు. ఈలోపల అప్పులోళ్ళు ఇంటిమీదికొచ్చారు. తమ బాకీలు తీరిస్తేగాని శవాన్ని కదిలించడానికి వీల్లేదని భీష్మించుకు కూచున్నారు. ఈ సమస్యల్నుంచి సామరస్యపూర్వకంగా బైటపడే సమయానికి మంగళవారం మధ్యాహ్నమైంది. ఆ తర్వాత కిరణ్ ఎన్నిసార్లు నీకు ఫోన్ చేశాడో తెలుసా? నో రెస్పాన్స్. ఎన్ని మెసేజ్‌లు ఇచ్చాడో... నో రెస్పాన్స్. నేనూ నా మొబైల్ నుంచి ట్రై చేసాను... ఎన్నిసార్లు ప్రయత్నించినా నాట్ రీచబుల్ అనే వచ్చింది"

"అయ్యో అలానా... ఎంత పొరపాటు జరిగిపోయింది? కిరణ్ అపార్థం చేసుకుని ఉంటాడు. ఇప్పుడెలా?" అక్షర మెల్లగా ఏడుస్తోంది.

"కిరణ్‌కి నువ్వంటే చాలా ఇష్టం. నీ గురించి ఎప్పుడూ తప్పుగా మాట్లాడడు. నువ్వు రాసిన ఉత్తరం గురించి చెప్పాడు. ఐనా నువ్వంటే ఇష్టమని మెసేజ్ ఇచ్చాడట కదా. నీకిష్టం లేకుండా నీ వెంట పడ్తున్నందుకు నీకు బాగా కోపం వచ్చి ఉంటుందనీ. అందుకే ఫోన్ చేసినా రెస్పాన్స్ ఇవ్వడం లేదని అనుకున్నాడు. ఆ తర్వాత కూడా నీ నంబర్‌కి చాలా సార్లు ఫోన్ చేశాడట."

"అయ్యో... చెప్పటమే మరిచాను. మంగళవారం ఉదయం నా ఫోన్ పోయింది. ఆ రోజు కూరగాయలు కొంటానికి అమ్మ బజారుకెళ్తుంటే మనసు బాగోలేక ఏదో బాధలో ఉన్న నేను తోడొస్తానని గొడవ చేసాను. అమ్మ నా బలవంతం మీద సరేనంది. ఇద్దరం మార్కెట్ కెళ్ళి కూరగాయలు కొనుక్కుని ఇంటికొచ్చాం. తీరా చూసుకుంటే నా సెల్ ఫోన్ కన్పించలేదు. ఎలా పోయిందో ఎక్కడపోయిందో తెలీలేదు. ఎలాగూ ఆ ఫోన్ పోయింది కాబట్టి కొత్త నెంబర్ తీసుకున్నాను. ఎంత పొరపాటు చేశానో... చిన్న మిసండర్‌స్టాండింగ్"

"నువ్వే వాడికి చేసి ఉండొచ్చుగా"

"చెప్పానుగా... మిసండర్‌స్టాండింగ్ అని. నా ఉత్తరం చదివాక కిరణ్ మెసేజ్

ఇచ్చాడు. ఆదివారం కలుద్దామన్నాడు. ఎక్కడ కలవాలో ఎప్పుడు కలవాలో మెసేజ్ ఇస్తానన్నాడు. ఎంతగా ఎదురు చూసినా మెసేజ్ రాలేదు. సోమవారం కూడా ఎదురుచూశాను. కిరణ్ నుంచి ఫోన్ కూడా లేదు. మనసు మార్చుకున్నాడనుకున్నా. నా గురించి అన్ని విషయాలు తెలిశాక నాకు దగ్గర కాకూడదని నిర్ణయించుకుని ఉంటాడని... నాకు నేనుగా ఫోన్ చేసి అతన్ని ఇబ్బంది పెట్టకూడదని చేయలేదు రమణా" అక్షర ఇపుడు బిగ్గరగా ఏడుస్తోంది.

"బాగానే ఉంది మీ ఇద్దరి వ్యవహారం! నీక్కోపం వచ్చి ఉంటుందని వాడు బాధపడ్తున్నాడు. వాడి మనసు మారిపోయి ఉంటుందని నువ్వు అపోహ పడ్తున్నావు. మీ ఇద్దరికీ ఒకరిమీద మరొకరికి ఎంత ప్రేమ ఉందో దీన్ని బట్టే అర్థమౌతోంది. ప్రేమని గుండెల్లో దాచుకుంటే ఇలానే ఇద్దరూ బాధపడ్తుంటారు. ఇపుడేం చేద్దామనుకొంటున్నావు?"

"నేను అర్జంట్‌గా కిరణ్‌ని కలవాలి. వాళ్ళనాన్న చనిపోయినందుకు మొదట సానుభూతి తెల్పాలి. నా ఫోన్ పోయిన విషయం చెప్పాలి"

"దాంతో పాటు తన ప్రేమని అంగీకరిస్తున్నట్లు ఒక్క మాట చెప్పు అక్షరా! తీవ్రమైన డిప్రెషన్లో ఉన్నాడు. నువ్వు మాత్రమే అతన్ని ఆ డిప్రెషన్లోంచి బైటికి తీసుకు రాగలవు"

"నువ్వూ కిరణ్‌లా అసాధ్యమైన విషయాల గురించి మాట్లాడ్తావెందుకు? నా జీవితంలో ప్రేమకూ పెళ్ళికీ చోటు లేదు"

"ఎందుకు అక్షరా మనసులో ఉన్న ప్రేమని దాచేసి నిన్ను నువ్వు మోసం చేసుకుంటావు? నీ ఆరాటం చూస్తేనే తెలుస్తోంది కిరణ్ అంటే నీకిష్టమని"

"ఇష్టం లేదని ఎపుడన్నాను? కిరణ్ అంటే చాలా ఇష్టం. అది ప్రేమ కాదు. కిరణ్ నాకు మంచి స్నేహితుడు. చెప్పాగా నా జీవితంలో ప్రేమా పెళ్ళీ వూహించలేని విషయాలని"

"ఇలా ఎంతకాలం ఆత్మవంచన చేసుకుంటూ బతుకుతావు అక్షరా! నీ జీవితంలో ప్రేమ ఇప్పటికే ఉంది. రెండేళ్ళుగా కిరణ్ నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాడన్న విషయం నాకూ తెలుసు నీకూ తెలుసు... ప్రేమలో నిజాయితీ ఉన్నప్పుడు పెళ్ళెందుకు ఉండదు?"

"ప్లీజ్ రమణా... ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దాం. కిరణ్‌ని ఇపుడు కలవడానికి వీలవుతుందా? నన్ను పిల్చుకెళ్ళవా ప్లీజ్"

"ఈ సమయంలో కోర్టులో ఉంటాడు అక్షరా. సాయంత్రం ఆరింటికి మినర్వా హోటల్ దగ్గరకు వచ్చేసెయ్. ఇద్దరం కలిసి కిరణ్ వాళ్ళింటికెళ్దాం. మనం వస్తున్నట్లు నేను వాడికి మెసేజ్ ఇస్తాను"

అక్షర సరేనంది. ఇంటికెళ్తే కిరణ్ వాళ్ళమ్మని కూడా పరామర్శించొచ్చు.

సాయంత్రం ఆరున్నరకి ఇద్దరూ కిరణ్ వాళ్ళిల్లు చేరుకున్నారు. వీళ్ళ కోసం గుమ్మం దగ్గరే ఎదురు చూస్తున్న కిరణ్ అక్షరని చూడగానే ఎదురెళ్ళి "హాయ్ అక్షరా... బావున్నావా" అన్నాడు.

అక్షర అతని రెండు చేతులు పట్టుకుని "సారీ కిరణ్... మీ నాన్నగారు పోయిన విషయం నాకు తెలీదు. ఐ యాం రియల్లీ సారీ... నా సెల్ ఫోన్ పోయింది. అది పోకుండా ఉన్నా మనమధ్య ఈ అపార్థాలు ఉండేవి కాదేమో" అంది.

"జరిగిందంతా నాకు రమణ ఫోన్లో చెప్పాడ్లే. ఐనా ఆత్మీయతలున్న చోట అపార్థాలెందుకుంటాయి అక్షరా" అంటూ లోపలికి పిల్చుకెళ్ళాడు.

హాల్లో ఉన్న సోఫాలో కిరణ్, రమణ కూచున్నారు. సోఫాకి ఎదురుగా తన వీల్ ఛెయిర్లో అక్షర...

కిరణ్ వాళ్ళమ్మ గదిలోంచి బైటికొచ్చింది. అక్షరతో "మా అమ్మ" అన్నాడు కిరణ్... "అమ్మా! తను అక్షర. నేనెపుడూ చెప్తుంటానే మా క్లాస్ ఫస్ట్ అని"

"క్లాస్ ఫస్ట్ కాదు బాబూ... యూనివర్శిటీ ఫస్ట్" సరిదిద్దాడు రమణ.

అక్షర రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది.

"ఎప్పుడూ నీ గురించే చెప్తుంటాడమ్మా మా కిరణ్. ఎన్ని సార్లడిగానో ఒక్కసారి యింటికి పిల్చుకురారా చూస్తానూ అని. వింటేగా... పోన్లెమ్మా. ఈ విధంగానైనా వచ్చావు" అందామె.

అక్షరకు చాలా ఇబ్బందిగా అన్పించింది. ఎటువంటి పరిస్థితుల్లో ఆ యింటికొచ్చిందో తల్చుకుంటే బాధేసింది. ఇటువంటప్పుడు ఏం మాట్లాడాలో ఏం మాట్లాడకూడదో తెలీని సంకటస్థితి...

"కిరణ్ చాలా తెలివిగలవాడండీ. అసలు యూనివర్శిటీ ఫస్ట్ కిరణ్‌కే రావాల్సింది.

కొద్ది మార్కుల్లో తప్పిపోయి నాకొచ్చింది" అంది.

"విధి మా మీద పగబట్టిందమ్మా. ఇంకా పై చదువులు చదవాలని ఎంత కోరికో మావాడికి. అర్థాంతరంగా ఆపేసి మా పోషణ భారాన్ని నెత్తిమీద వేసుకోవాల్సి వచ్చింది. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన ఈ వయసులో వాడు ఉద్యోగం చేస్తుంటే చూసి నాకడుపు తరుక్కుపోతుందమ్మా" చీర చెంగుతో కళ్ళొత్తుకుంటూ అందామె.

జాగ్రత్తగా మాట్లాడాలనుకుంటూనే తను తప్పు మాట్లాడిన విషయం అక్షరకు అర్థమైంది.

"తను రాకరాక మనింటికొస్తే ఇప్పుడా మాటలన్నీ దేనికమ్మా" అన్నాడు కిరణ్.

ఆమె కళ్ళు తుడుచుకుంటూ "ఏమనుకోకమ్మా... గుండెల్ని పిండేస్తున్న బాధని దాచుకోలేకపోయాను" అంటూ లోపలికెళ్ళి కాఫీలు తెచ్చిచ్చింది.

"చెప్పటం మరిచాను. అక్షరకు కాఫీలు టీలు అలవాటు లేదు" కిరణ్ ఓ కప్పునందుకుంటూ అన్నాడు.

ఆమె వంట గదిలోకెళ్ళి చిక్కటి మజ్జిగను గ్లాసునిండా తెచ్చిచ్చింది.

"మా వాడు చెప్పినట్లే నువ్వు చాలా అందంగా ఉన్నావమ్మా. చిదిపి దీపం పెట్టుకోవచ్చు" అందామె అక్షర వైపు ఆపేక్షగా చూస్తూ.

ఆ తర్వాత ఏం మాటలొస్తాయో అక్షరకు అనుభవమే.

'పిల్ల మొహం చక్కగా ఉంది... పాపం కాళ్ళే... అయ్యో... ఏం జబ్బు... అసలు నడవలేవా అమ్మా... ఎప్పటినుంచీ... లాంటి సానుభూతి మాటలు... జాలిపడే మాటలు...

తనను చూసి జాలి పడేవాళ్ళంటే అస్సలిష్టం ఉండదు.

కానీ ఆమె అటువంటి ప్రస్తావనే తీసుకు రాలేదు.

రమణ వెళ్దామన్నట్టు లేచి నిలబడ్డాడు.

"మావాడి బదులు నువ్వయినా బాగా చదువు తల్లీ... మావాడు పీజీ చేయలేదన్న దిగులు నాకుండదు" అందామె.

ఎంత గొప్ప సంస్కారం ఈమెకు అనుకోకుండా ఉండలేకపోయింది అక్షర.

"అమ్మా! అక్షరను బైటిదాకా దిగబెట్టి వస్తాను" వాళ్ళతో పాటు బయల్దేరబోతూ అన్నాడు కిరణ్.

'అవసరం లేదు' అన్నట్టు చూసింది అక్షర.

"ఐ మీన్ కొంత దూరం తోడొస్తాను... నీకు అభ్యంతరం లేకపోతే" అన్నాడు.

అక్షర నవ్వింది.

"అపుడపుడైనా వస్తో ఉండు తల్లీ... సంతోషపడ్తాను" అంది కిరణ్ వాళ్ళమ్మ.

యింటినుండి బైటికొచ్చాక "అక్షరకు నువ్వు తోడున్నావుగా. నేను వెళ్తాను" అని రమణ వెళ్ళిపోయాడు.

అక్షర పక్కన కిరణ్ మెల్లగా నడుస్తున్నాడు. ఇద్దరూ మౌనంగా ఉన్నారు. కాని ఆ నిశ్శబ్దాన్ని భరించటం ఇద్దరికీ దుస్సహంగానే ఉంది. ఎటొచ్చీ ఎదుటి వ్యక్తి తమ మధ్య మంచు గడ్డలా పేరుకు పోయిన నిశ్శబ్దాన్ని బద్దలు కొడ్తే బావుంటుందని ఎవరికి వారు ఎదురుచూస్తున్నారు.

తండ్రి చనిపోయిన బాధలో ఉన్నాడు కాబట్టి తను మొదట మాట్లాడటమే సంస్కారం అనుకుంది అక్షర. "నువ్వు పీజీ చదవకపోవటం చాలా బాధగా ఉంది కిరణ్" అంది.

"నా బదులు నువ్వు చదువుతున్నావుగా. అమ్మకే కాదు నాకూ సంతోషమే"

"ఆ రెండూ ఒకటెలా అవుతాయి? నీ చదువు నీదే. నీలాంటి తెలివి గల విద్యార్థి డిగ్రీతో ఆపేయటం దురదృష్టం"

"పీజీని అంత తేలిగ్గా వదుల్తానని ఎలా అనుకున్నావు అక్షరా? నో ఛాన్స్. ఈవెనింగ్ కాలేజీలో చేరుతున్నా. నీకు పోటీ ఇవ్వకుండా వదుల్తాననుకోకు"

"దటీజ్ ది స్పిరిట్" కుడిచేతి బొటనవేలిని పైకెత్తి చూపిస్తూ అంది.

"నేను కోరుకున్న దేన్నయినా సిన్సియర్‌గా కోరుకుంటాను అక్షరా! దాన్ని పొందటం కోసం నా సర్వశక్తులూ ధారపోస్తాను"

"నువ్వేదో నర్మగర్భంగా మాట్లాడ్తున్నావు"

"నర్మగర్భమా... అంటే ఏంటి? నీకున్నంత తెలుగు పాండిత్యం నాకు లేదు. అర్థం చెప్పు"

"అంటే మనసులో ఉన్న దాన్ని సూటిగా చెప్పకుండా డొంక తిరుగుడుగా చెప్పటం అన్మాట"

"ఇందులో డొంకతిరుగుడేం లేదు. నాకు నువ్వు కావాలి. ఆలోచించు అక్షరా. నువ్వంటే నాకు నిజంగా ఇష్టం... సిన్సియర్‌గా ప్రేమ"

అక్షర మాట్లాడలేదు.

"ఏం మాట్లాడవు? నీ పీజీ పూర్తయ్యేవరకు ఎదురుచూడమంటావా... చూస్తాను. పీజీ అయ్యాక కూడా కొన్నేళ్ళు ఎదురుచూడమంటావా... చూస్తాను. జీవితాంతం ఎదురుచూడమన్నా చూస్తాను"

"జీవితాంతమా... నా జీవితం ఎప్పుడు అంతమవుతుందో నాకే తెలీదు కిరణ్. అర్ధాయుష్కురాలిని. ఎన్నాళ్ళు బతుకుతానో తెలీదు. నీ నిండు నూరేళ్ళ జీవితాన్ని నాకోసం పణంగా పెడ్తావా?"

"అబ్బా... చెప్పిందే చెప్పి బోర్ కొడ్తున్నావు అక్షరా... ఇవన్నీ నాకు తెల్సిన విషయాలేగా. సరే ఐతే. నేను చెప్పేది కూడా విను. ఐదేళ్ళు బతుకుతావా... మూడేళ్ళా... ఏడాదేనా... నీ ప్రేమ నా స్వంతమైతే కొన్ని నెలలైనా చాలు నాకు. మిగతా జీవితమంతా నీతో గడిపిన ఆ క్షణాల్ని తల్చుకుంటూ... నీ ప్రేమను నెమరువేసుకుంటూ బతికేస్తాను"

"డైలాగ్ బాగుంది. జీవితమంటే సినిమా అనుకున్నావా?"

"సినిమాలు కూడా జీవితాల్లోంచే వస్తాయి. కూల్‌గా ఆలోచించు అక్షరా. నిజం చెప్పు. నేనంటే నీకు ఇష్టం లేదా?"

"చాలా ఇష్టం కిరణ్. అందుకే అంటున్నాను. నడవలేని అవిటిదాన్ని చేసుకుని నువ్వేం సుఖపడ్తావ్?"

"నేను నిన్ను కోరుకుంటుంది సుఖపడిపోదామని కాదు. సుఖం భౌతికమైంది. నువ్వు నా దానివైతే అనంతమైన సంతోషం నాదవుతుంది"

"ప్రపంచంలో ఎవరైనా ఇలాంటి కోరిక కోరి ఉంటారంటావా? నన్ను భార్యగా చేసుకుంటే నువ్వు తేడా అని అనుకునే ప్రమాదముంది కిరణ్"

"ఎవ్వరూ చేయని పనిని మనం చేస్తున్నామని అనుకోవడం పొరపాటు. చరిత్ర

పుటలు తిరగేస్తే ఎంత మంది గొప్ప వ్యక్తులో... చేతులెత్తి మొక్కాల్సిన మహానుభావులెందరో... స్టీఫెన్ హాకింగ్ గురించి విన్లేదా? ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త. అతను ఎన్నోఏళ్ళుగా చక్రాల కుర్చీకి అంకితమై బతుకుతున్నాడు. సరిగ్గా మాట్లాడలేడు. కంప్యూటర్ సాయంతో మీటలద్వారా చెప్పాలనుకున్న విషయాన్ని చెప్తాడు. తన స్టూడెంట్ అతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. వాళ్ళకు పిల్లలు కూడా."

"ప్లీజ్ కిరణ్... నా మనసుకు నచ్చని పనిని నా చేత చేయించాలని ఎందుకు బలవంత పెడ్తావు?"

"సారీ... నిన్ను బలవంత పెట్టను. అలాగని నిన్ను ప్రేమించకుండా ఉండలేను. నువ్వు ప్రేమించకున్నా పర్లేదు. ప్రేమిస్తూనే ఉంటాను. నీ నుంచి పాజిటివ్ సమాధానం వచ్చేవరకు ఎదురు చూస్తాను అక్షరా"

"సర్లే... నేనప్పటివరకూ బతికుంటే ఆలోచిద్దాం" అదోలా నవ్వుతూ అంది అక్షర. అందులో విషాదం లేదు. నిజాల్ని ఎదుర్కొనే నిర్భయత్వం ఉంది.

"పాజిటివ్‌గా ఆలోచించాలని నువ్వేగా చాలా డిబేట్స్‌లో బల్లగుద్ది మరీ చెప్పావు"

"పాజిటివ్‌గా ఆలోచించడం వేరు... ప్రాక్టికల్‌గా ఆలోచించడం వేరు. నేనిపుడు ప్రాక్టికల్‌గా ఆలోచిస్తున్నాను"

"నువ్వెట్లా ఆలోచించుకున్నా ఒక్క విషయం మాత్రం మర్చిపోకు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఐ లవ్ యూ"

అక్షర మనసులో 'ఐ టూ' అనుకుంది. దాంతో పాటు 'థ్యాంక్యూ' అని కూడా అనుకుంది.

***

ఆ రోజు డాక్టర్ సిద్ధార్థకి నైట్ డ్యూటీ. లైఫ్ లైన్ హాస్పిటల్లో డాక్టర్‌గా నెలరోజులక్రితం జాయినయ్యాడు. ఈ నెల రోజుల్లో పాత పేషంట్స్ వెళ్ళిపోతున్నారు. కొత్త పేషంట్స్ చేరుతున్నారు. ఆపరేషన్లు జరుగుతున్నాయి. కొన్ని ఫెయిలవుతున్నాయి. కొంతమంది నవ్వుతూ డాక్టర్లని అపర దేవుళ్ళని మొక్కుతూ వెళ్ళిపోతుంటే మరికొంత మంది ఏడుస్తూ వెళ్తున్నారు. చక్కటి హాస్పిటల్ వాతావరణం. తనకు బాగా తెలిసిన, పరిచయమైన

వాతావరణం. కానీ ఒక పేషంట్ మాత్రం తను చేరిన రోజెలా ఉందో యిప్పటికీ అలానే ఉంది.

మొదటి రోజు ఆ పేషంట్ గురించి విన్నపుడు చాలా జాలేసింది. ఆమె గురించి డాక్టర్ వలీ చెప్తూ, 'నేనీ హాస్పిటల్లో జాయినై రెండేళ్ళు. రెండేళ్ళనుంచీ చూస్తున్నాగా. ఈ పేషెంట్ పరిస్థితిలో ఏమార్పూ లేదు. మీకింకో విషయం తెలుసా డాక్టర్... ఈ హాస్పిటల్ ప్రారంభించిన కొత్తలో ఈపేషెంట్‌ని యిక్కడ చేర్చారట. అప్పటినుంచీ యిక్కడే ఉంది. అంటే దాదాపు పదేళ్ళు దాటిపోయింది' అన్నాడు.

'పదేళ్ళా' నోరెళ్ళబెట్టాడు సిద్దార్థ.

'ఔను పదేళ్ళే... పేషెంట్ పరిస్థితి చూశారుగా. ద్రవాహారమే యిస్తున్నారు. అన్నాన్ని మెత్తగా గ్రైండ్ చేసి గొట్టంపెట్టి కడుపులోకి పంపిస్తూ యిన్నాళ్ళుగా బతికించుకుంటూ వస్తున్నారు'

'రోగి పరిస్థితిలో అసలు యింప్రూవ్‌మెంటే లేదా... మందులేమీ పని చేయడం లేదా''

'ఏమైనా రోగముంటే కదా మందులకు లొంగడానికి? మెదడుకి ఆక్సిజన్ అందక మనిషి పర్మినెంట్ వెజిటేటివ్ స్థితిలోకి మారిపోయింది. జీవచ్ఛవంలా బతికుంది అనేకంటే బలవంతంగా బతికిస్తున్నారనొచ్చు.'

'అసలేం జరిగింది? వివరంగా చెప్పండి వలీ భాయ్'

'ఈ అమ్మాయి పేరు కిరణ్మయి. యింజనీరింగ్ చదివే రోజుల్లో ప్రేమించానంటూ యింటి దగ్గరుండే నరేష్ అనే వ్యక్తి వెంటబడేవాడట. వాడు జులాయిగా తిరుగుతూ జీవనం కోసం ఆటో నడిపేవాడు. ఈ అమ్మాయి వాళ్ళ నాన్న గవర్నమెంట్ స్కూల్లో హెడ్ మాష్టారు. వాడి వేధింపులు భరించలేక పోలీస్ కంప్లెయింట్ యిచ్చారు. వాణ్ని స్టేషన్‌కి లాక్కెళ్ళి నాలుగు తగిలించి రిమాండుకి పంపించారు. వాడిలో యింకా కసి పెరిగింది. నాకు దక్కనిది ఎవ్వరికీ దక్కడానికి వీల్లేదు, అందుకే నీ అందమైన మొహం మీద యాసిడ్ పోసి వికృతంగా మార్చేస్తానంటూ కస్టడి నుండి బైటికి రాగానే బెదిరింపులు ప్రారంభించాడట.

తల్లిదండ్రులు భయపడిపోయి అమ్మాయిని హాస్టల్లో జాయిన్ చేశారు. ఐనా వాడు విసిగించటం మానలేదు. రాత్రుళ్ళు హాస్టల్ రూంలోకి జొరబడి, 'ఒకసారి నీ వల్ల జైలుకెళ్ళాను. నీకోసం ఎన్ని సార్లు వెళ్ళటానికైనా రెడీనే. పిలువ్ ఎవర్ని పిలుస్తావో... నిన్ను పొందటం కోసం ఉరితాడు మెళ్లో వేసుకోమన్నా నవ్వుతూ వేసుకుంటాను. పెళ్ళి చేసుకోకపోతే మానే నాతో ఒక్క రాత్రి గడుపు. నీ అందాన్ని నేనే మొదట అనుభవించాలి. ఆ తర్వాత నీ జోలికి రాను. కనీసం దీనికైనా ఒప్పుకో. లేకపోతే నిన్నూ నీ తల్లిదండ్రుల్ని చంపేస్తాను' అని బెదిరించేవాడట.

'సినిమాల ప్రభావం... విలన్లనీ రౌడీల్ని అసాంఘిక వ్యక్తుల్నీ హీరోలుగా చేసి చూపిస్తున్న దర్శకుల్నీ రచయితల్నీ నడిరోడ్డులో నిల్చోబెట్టి రాళ్ళతో కొట్టాలి. అప్పటిగ్గాని సమాజం బాగుపడదు. తర్వాతేమైందో చెప్పండి'

'ఆ అమ్మాయి యింజనీరింగ్ ఫైనలియర్లో ఉన్నపుడు రాత్రి ఒకటిన్నర రెండు మధ్య హాస్టల్ వెనకున్న పైపులు పట్టుకుని ఆమె రూం చేరుకుని, నిద్రపోతున్న ఆమెనెత్తుకెళ్ళి బాత్రూంలో మానభంగం చేశాడట. ఆ సమయంలో అరవకుండా ఆపడం కోసం గొంతుకు తాడు బిగించాడట. దాని వల్ల కొన్ని నిముషాల వరకు మెదడుకి ఆక్సిజన్ సప్లయ్ ఆగిపోయింది. కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న అమ్మాయిని ఈ హాస్పిటల్లో జాయిన్ చేశారు. ప్రాణాలైతే నిలపగలిగారుగానీ మన ఎదురుగా ఉన్నది గుండె కొట్టుకుంటున్న శవమే'

'వాణ్ణి ఏం చేశారు?'

'వాణ్ణి అరెస్ట్ చేసి జైలుకి పంపించారు. టీవీలో చూపిస్తే నేనూ చూశాను వాణ్ణి. ఏ రకమైన పశ్చాత్తాపం లేకుండా తానేదో గొప్ప ఘన కార్యం చేసినట్టు ఏమన్నాడో తెలుసా? దాన్ని మొదట అనుభవించే మగాడు నేనే కావాలనుకున్నాను. సాధించాను. నాకు చాలా తృప్తిగా ఉంది. యిపుడు మీరు నన్నేం చేసుకుంటారో చేసుకోండి. నన్ను ముక్కలుగా నరుకుతారా... నరుక్కోండి అన్నాడు నవ్వుతూ'

'ఎంతటి దారుణం... ఎంతటి రాక్షసత్వం... అలాంటివాళ్ళని ఒకేసారి చంపటమో, ఉరి తీయడమో చేయకూడదు. క్షణక్షణం నరకం చూపిస్తూ వాణ్ణి చిత్రవధ చేయాలి. చావుకోసం వాడు తపించాలి. సమాజం యింత వికృతంగా ఎందుకుంది వలీ భాయ్...

వాడెవడో జులాయి వెధవ ప్రేమించమంటే ప్రేమించాలా... లేకపోతే చంపేస్తాడా... రేప్ చేస్తాడా... యాసిడ్ పోస్తాడా... ఆ అమ్మాయి మనసుమీద కానీ శరీరం మీద కానీ వాడికేం అధికారముంది?'

'మనం బాధపడి ప్రయోజనమేముంది? సమాజంలో నైతిక విలువలు ఎక్కడేడ్చాయిప్పుడు? అమ్మాయిలూ అలానే ఉన్నారు. ఈ రోజు పేపర్ చూశ్శేదా... ఒకమ్మాయి ఐదేళ్ళనుంచి ఒకతన్ని ప్రేమిస్తోందట. అలానే రెండేళ్ళనుంచి మరొకతన్ని ప్రేమిస్తోందట. యిద్దరూ యిష్టమేనట. మరి పెళ్ళెవర్ని చేసుకుంటావని యిద్దరూ నిలదీస్తే అది మీరిద్దరూ తేల్చుకోండి... మీలో ఎవరు గెలిస్తే వాణ్ణి పెళ్ళి చేసుకుంటానందట. యిద్దరూ కత్తులు పట్టుకుని కలబడ్డారు. ఒకడు కత్తిపోట్లతో చచ్చిపోతే మరొకడు జైలుకెళ్ళాడు. అదీ జరిగింది'

'జీవితం అంటే సినిమా అనుకుంటున్నారు. రాకుమారికోసం యిద్దరు యోధులు పోటీపడి పోరాడి ఎవరు గెలిస్తే వాడి మెడలో వరమాల పడ్తుంది చూడండి అలా అనుకుందేమో ఆ అమ్మాయి. చివరికా అమ్మాయి జీవితం కూడా నాశనమైందిగా'

'ఒకప్పుడు ఆడపిల్లలు పుడ్తే బోలెడు కట్నాలు పోసి పెళ్ళిళ్ళు చేయటం కష్టమని భయపడేవారు. ఈ రోజు పరిస్థితి మారిపోయింది. పెళ్ళిచేసి పంపించే వరకు ఆడపిల్లల్ని కాపాడుకోవటం తల్లిదండ్రులకు పెద్ద సమస్యలా పరిణమించింది' అన్నాడు డాక్టర్ వలీ.

ఆ రోజు నుంచి సిద్దార్థకు డ్యూటీ ఉన్నపుడల్లా అవసరం ఉన్నా లేకున్నా కిరణ్మయి బెడ్ దగ్గరకెళ్ళి కొన్ని నిముషాలు నిలబడి పరిశీలించటం అలవాటుగా మారింది. డాక్టర్ వలీ ఈ పేషంట్‌ని అమ్మాయి అన్నాడు కానీ ఆమెకు దాదాపు ముప్పయ్యేళ్ళుంటాయి. చూడ్డానికి మాత్రం ప్రస్తుతం యాభయ్ యేళ్ళు పైబడినదానిలా కన్పిస్తోంది. ఆమెకు ప్రస్తుతం వినపడదు. చూపు కూడా దెబ్బతింది. కంఠనాళాలు పాడవటం వల్ల మాట్లాడలేదు. మెదడు దెబ్బతినటం వల్ల ఎవ్వర్నీ గుర్తుపట్టే స్థితిలో లేదు. అలాగని బ్రెయిన్ డెడ్ కేస్ కాదు. మెదడు పాక్షికంగా పని చేస్తోంది.

ఆమెను చూసినపుడల్లా సిద్దార్థకి తన చిన్నప్పుడు పిల్లులు గాయపర్చిన తెల్లటి పావురమే గుర్తుకొస్తోంది. ఆమె బెడ్ పక్కన నిలబడి తదేకంగా మొహంలోకి చూసినపుడు మూగగా 'నన్నీ శారీరిక బాధనుంచి విముక్తురాల్ని చేయవా' అని ప్రాధేయపడ్తున్నట్లుంది.

రౌండ్లు పూర్తిచేసి రెసిడెంట్ డాక్టర్ కోసం నిర్దేశించిన గదిలో పడుకున్నాడు. గాఢంగా నిద్రపట్టింది. కల... గాయపడిన తెల్లటి పావురం... తన అరచేతుల్లోకి ఎత్తుకున్నాడు. ఎర్రటి రక్తం చేతుల నిండా... ఎర్రటి పావురం... నాకు మరణాన్ని వరంగా ప్రసాదించవా అంటూ దీనంగా వేడుకుంటున్న కళ్ళు... పావురం కళ్ళు కావని... కిరణ్మయి కళ్ళు... గాజు గోళీల్లా జీవం లేని కళ్ళు... చూపులేని కళ్ళు... దైన్యం నిండిన కళ్ళు... వేడుకుంటున్న కళ్ళు... కిరణ్మయి బలహీనమైన శరీరం మొత్తం రెండు చేతులుగా మారి... విన్నవించుకుంటున్న ముకుళిత హస్తాలై... కాళ్ళను చుట్టుకుంటున్న కన్నీళ్ళయి...

చప్పున మెలకువొచ్చింది. దాహంగా ఉంది. లేచి ఫ్రిజ్ లోంచి బాటిల్ తీసి నీళ్ళు తాగాడు. 'నీది దయార్ద్ర హృదయం నాన్నా... అతి సున్నితమైన మనసు. అందరికీ అర్థం కాదు' అన్న నానమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. ఔను... తనది సున్నితమైన మనసు. ఎదుటి వ్యక్తి బాధ పడ్తుంటే చూడలేడు. కిరణ్మయి పడ్తున్న హింసనుంచీ వేదననుంచి రక్షించాల్సిన బాధ్యత తనమీద ఉంది.

సమయం చూశాడు. ఒకటిన్నర... గదిబైటికొచ్చి వార్డంతా పరికించాడు. పేషంట్లు రకరకాల నిద్రావస్థల్లో ఉన్నారు. కిరణ్మయి బెడ్‌ని సమీపించాడు. ఆమె కళ్ళు సగం తెరిచి ఉన్నాయి. మొహంలో అనంతమైన వేదనని అనుభవిస్తున్నదానికి గుర్తుగా గజిబిజిగా ఏర్పడిన ముడతలు... అమాంతం దాడి చేసి సగానికి పైగా నమిలేసి వదిలేసిన ముసలితనపు మృగం... కృత్రిమ శ్వాస నందచేయడానికి ముక్కులోకి ఓ ట్యూబు వెళ్తోంది. ఆమె బతికుందనడానికి ఒకేఒక నిదర్శనం శ్వాస తీసుకుంటున్న దానికి గుర్తుగా ఛాతీలో కన్పిస్తున్న కదలికలు.

సిద్ధార్థ యింకొంత జరిగి ట్యూబుమీద చేయి వేశాడు. దాన్ని లాగేస్తే చాలు శ్వాస ఆడక కొన్ని నిముషాల్లో చచ్చిపోతుంది. చుట్టూ మరోసారి నిశితంగా చూశాడు. ఎవ్వరూ తనని గమనించటం లేదని నిర్ధారించుకుని ట్యూబు లాగేయబోయాడు. ఎవరో చేయి పట్టి ఆపేసినట్టు ఆగిపోయాడు. మనసులో ఎక్కడో వ్యతిరేక భావన... మనస్సాక్షా... తను చేస్తుంది మంచి పనేగా... మనిషి ప్రాణం తీయటం తప్పు కాదా... తప్పేనేమో...

చిన్నప్పుడు సునాయాసంగా పావురాన్ని బండకేసి బాదిన తన చేతులిప్పుడెందుకు పట్టు తప్పుతున్నాయి? పావురాన్ని చంపినంత సులభమా మనిషిని చంపటం? సాటి

మనిషి కదా... ప్రాణమున్న మనిషి... కానీ ఈ మనిషిలో ప్రాణం తప్ప ఏముంది? సమాజానికి ఏ రకంగానూ పనికిరాని మనిషి... నాజీలు శారీరిక వైకల్యం గలవాళ్ళనీ, ముసలీ ముతకా మనుషుల్ని సమాజానికి పనికిరారనే నెపంతో చంపేయటం దారుణమని లోకమంతా ఎలుగెత్తి చాటింది కదా. తను చేయబోయేదీ దారుణమేనా... సమాజానికి పనికిరానివాళ్ళు ఎంత మంది లేరూ... అందర్నీ చంపటం సాధ్యమా... సమాజానికి ఉపయోగపడకున్నా ప్రమాదం లేదుగానీ సమాజానికి హాని చేసే దుర్మార్గులు ఎంత మంది లేరూ... వాళ్ళని చంపినా సమాజానికి కొంతైనా మేలు జరుగుతుందేమో...

కాదు. కిరణ్మయిని చంపటం వల్ల మేలు జరిగేది కిరణ్మయికే. మనిషి జీవితంలో ముఖ్యమైన ఏ సంతోషమూ, సుఖమూ లేని నిరర్థకమైన బతుకునుంచి విముక్తి. నిజమే. సమాజానికి పనికిరాకున్నా పర్లేదు. తనకు తానుకూడా పనికిరాని జీవితం... వ్యర్థమైన జీవితం. మృతప్రాయమైన జీవితం... ఎన్నేళ్ళని ఈ శిక్షని అనుభవించాలి? బతుకే ఆమెకు శిక్ష. యిప్పటివరకూ అనుభవించిన ఈ నరకం చాలు. చావుకీ బతుక్కీ మధ్య అడ్డుగా ఉన్న ఆక్సిజన్ ట్యూబుని లాగేస్తే చాలు.

మరోసారి ఆ ట్యూబుమీద చేయి వేసి లాగబోయి ఆగిపోయాడు. డాక్టర్ వలీ ఎదురుగా నిలబడి 'మీరు చేస్తున్నది పాపం డాక్టర్... దేవుడు మిమ్మల్ని శిక్షిస్తాడు' అన్నట్లనిపించింది. కళ్ళు నలుపుకుని మళ్ళీ చూశాడు. వలీ లేడు. ఉత్త భ్రమ...

వెనక్కొచ్చి తన గదిలో మంచం మీద పడుకున్నాడు. నిద్ర రావటం లేదు... ఆలోచనలు... సూదుల్లా గుచ్చుకుంటూ... గునపాల్లా మారిపోయి గుండెని ఛిద్రం చేస్తూ ఆలోచనలు...

రెండు వారాల క్రితం డాక్టర్ వలీతో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది.

'యిలా ఎన్నేళ్ళు? బలవంతంగా ప్రాణం నిలిపి ఉంచటం వల్ల ఒరిగేదేమిటి? హాలండ్‌లో మెర్సీ కిల్లింగ్‌కి చట్టబద్ధత కల్పించినట్లు మన చట్టాల్లోకూడా మార్పు రావల్సిన అవసరం ఉంది' అన్నాడు సిద్దార్థ.

'చంపటం అనేది క్రూరమైన చర్య. దయతో చంపటం ఏమిటి? మనిషి పుట్టుకలానే చావుకూడా ఆ అల్లా చేతిలోనే ఉండాలి. అల్లా సృష్టించిన మనుషులకు ఎదుటి వ్యక్తి మృత్యువుని శాసించే హక్కు లేదు'

'అలాగని వైద్య రంగం నయం చేయలేని రోగంతో బాధాకరమైన ఘడియల్ని నెలల తరబడి మోస్తూ మృత్యువుని ప్రతిక్షణం కోరుకుంటూ... మనుషులు బతికుండగానే నరకం అనుభవించటం ఏం న్యాయం? యిక్కడ మనం ఆలోచించాల్సింది మతం ఏం చెప్తుందనేది కాదు. మానవత్వం ఏం చెప్తుందనేది... మన మనస్సాక్షి ఏం చెప్తుందనేది'

'మతాన్ని మనుషుల జీవితాల్లోంచి విడదీసి ఎలా చూస్తారు? అది మనుషుల జీవితాల్లో మమేకమైన ఓ భాగం. మా ఖురాన్ ప్రకారం ఆత్మహత్య మహాపాపం. మరో మనిషి ప్రాణం తీయటం మహా పాపం. మన ప్రాణాలకు అధిపతి అల్లా. న్యాయ రక్షణ కోసం తప్ప మనిషి ప్రాణం హరించటం తప్పని ఖురాన్‌లో ఉంది.'

'వ్యర్థమైన నిరర్థకమైన ప్రాణాన్ని హరించటం తప్పు కాదు. మనం ఆ ప్రాణికి చేసే గొప్ప ఉపకారం. బాధ నుంచి శాశ్వత విముక్తి.'

'ఇస్లాం ప్రకారం బతకడానికి అర్హతలేని ప్రాణి అంటూ ఏదీ లేదు. శారీరిక బాధనుంచి తప్పించుకోడానికి మరణాన్ని కోరుకోవటం ఇస్లాం సాంప్రదాయాలకు విరుద్ధం'

'మరేం చేయాలీ? బతికినన్ని రోజులు యాతన పడాలా? క్యాన్సర్ పేషంట్లని వాళ్ళ అంతిమ ఘడియల్లో చూస్తే మీకేమీ అన్పించదా... నాకైతే వెంటనే ఏ లీథల్ యింజక్షనో యిచ్చి వాళ్ళకు ప్రశాంతతని ప్రసాదించాలని ఉంటుంది'

'మీ ఆలోచనలో తప్పుంది డాక్టర్. నొప్పినీ బాధనీ మనం మందుల్తో చాలా వరకు నియంత్రించవచ్చు. డాక్టర్లుగా మన బాధ్యత ప్రాణం నిలపటమేగాని ప్రాణాలు తీయటం కాదు. ఒకవేళ ఏదైనా జబ్బుకి ఈ రోజు మందు లేకున్నా ఏదో ఓ రోజు మందు కనుక్కోవచ్చు. మందు లేదు కాబట్టి మరణం తథ్యం కాబట్టి ఎపుడో రావాల్సిన మరణాన్ని యిపుడే ప్రసాదించడానికి మనం ఎవ్వరం? మనకేం అధికారం ఉంది? మనం చేసే ప్రతి పనినీ అల్లా గమనిస్తుంటాడని మర్చిపోవద్దు'

'నేను దేవుణ్ణే నమ్మను భాయ్'

'అది మీ స్వవిషయం. నేను దేవుడున్నాడని వాదించదల్చుకోవటం లేదు. మంచితనం మానవత్వమే దైవత్వమనికూడా నమ్మరా... ఏదో సాకులు చెప్పి మనుషుల్ని చంపటం మానవత్వమా? రాక్షసత్వం... క్రూరత్వం... అమానుషం... నేరం' అంటూ విసురుగా వెళ్ళిపోయాడు డాక్టర్ వలీ.

డాక్టర్ వలీ చెప్పినట్టు అల్లానో దేవుడో గమనిస్తుంటాడా... అసలు దేవుడనే వాడున్నాడా? స్వర్గనరకాలున్నాయా? పాపపుణ్యాల్ని బేరీజు వేసి శిక్షలు అమలు జరిపే మరణానంతర వ్యవస్థ నిజంగా ఉందా?

అంతా ట్రాష్... మనిషి కల్పించిన అభూత కల్పనలు... దేవుడనేవాడే ఉంటే అశుభంశుభం తెలీని పసిపిల్లలు కూడా క్యాన్సర్ బారినో ఎయిడ్స్ బారినో పడి ఎందుకు చనిపోతున్నారు? దుర్మార్గులు దర్జాగా ఎలా బతుకుతున్నారు? పిడుగులు కురిపించి దేవుడు వాళ్ళనెందుకు నాశనం చేయడం లేదు? దేవుడి నగల్నీ, దేవుడి ఆదాయన్ని దోచుకుంటున్న వాళ్ళు కూడా హాయిగా ఎలా ఉండగలుగుతున్నారు? అంతా మిథ్య... మరణానంతర జీవితం మిథ్య...

డాక్టర్‌గా తను ఎంతోమంది రోగుల్ని బాధల నుంచీ రుగ్మతలనుంచి కాపాడాడు. కిరణ్మయిని కూడా కాపాడాల్సిన బాధ్యత తన మీద ఉంది. తను మాట్లాడగలిగితే కొన్ని వేల సార్లు వేల రకాలుగా ప్రాధేయపడి ఉండేది... తనకు మరణం ప్రసాదించమని... తను చూడగలిగి ఉంటే వేల రకాలుగా చూపుల్తో వేడుకుని ఉండేది... తన ప్రాణాన్ని తీసేసుకోమని. మనిషిలా కాకుండా గాలి పీలుస్తున్న బొమ్మలా బతుకుతున్న ఈ హీనమైన, దుర్భరమైన బతుకునుంచి తనను దూరం చేయమని కోరుకునేది.

సిద్దార్థ లేచి మళ్ళా కిరణ్మయి మంచం దగ్గరకొచ్చి నిలబడ్డాడు. 'తొందరగా మరణాన్ని ప్రసాదించవా ప్లీజ్... ఈ బాధను తట్టుకోలేకుండా ఉన్నాను. నాకిలాంటి బతుకు వద్దు. పగవాడికెక్కూడా ఇలాంటి బతుకు వద్దు. దుర్భరమైన బతుకు... పందులూ కుక్కలు కూడా గౌరవంగానే వాటి పరిమితులకు లోబడి బతుకుతున్నాయే... నా బతుకేమిటి... నోటిలో గొట్టం ద్వారా ద్రవాహారాన్ని లోపలికి తీసుకోవటం... కొన్నివ్యర్థాల్ని విసర్జించడం... యిదేనా జీవితం... భగవంతుడి సృష్టిలో మనిషి జీవితం ఉత్కృష్టమైందంటారే... మరి నా జీవితాన్ని ఏమంటారు... నా కుటుంబానికి భారం... ఈ భూమికి భారం... నాకు నేనే భారం' అంటూ చేతులు జోడించి ప్రార్థిస్తున్నట్లు అనుభూతి...

ఆక్సిజన్ ట్యూబుని పట్టుకుని మెల్లగా లాగాడు. రాలేదు. బలంగా లాగబోయి ఆగిపోయాడు.

మెర్సీ కిల్లింగ్ అనుమతిస్తున్న దేశాల్లో కూడా దానికి కొన్ని ఖచ్చితమైన నియమాలున్నాయి. మానసికంగా స్వంత నిర్ణయాలు తీసుకునేంత ఆరోగ్యంగా ఉండి, మందులే లేని, ఉన్నా పని చేయని స్థితిలో... చావు అనివార్యమని తెల్సినపుడు, శారీరిక బాధనుంచి విముక్తి పొందటం కోసం స్వచ్ఛంద మరణాన్ని ఆ వ్యక్తి కోరుకుంటే అప్పుడు మెర్సీ కిల్లింగ్ అమలు చేయవచ్చు. ఆ వ్యక్తి తన అంగీకారాన్ని తెలుపలేని స్థితిలో ఉన్నపుడు దగ్గరి బంధువుల కోరిక మేరకు మరణాన్ని త్వరిత పరిచే చర్యలు చేపట్టవచ్చు... అంటే ప్రాణాన్ని నిలపటానికి వాడుతున్న మందుల్ని, పరికరాల్ని తొలగించడం ద్వారానో... ఆహారాన్ని నీటిని అంద చేయకుండా ఆపేయడంద్వారానో లేదా ఓ యింజక్షన్ ద్వారానో ప్రాణాల్ని హరించవచ్చు. కానీ యిక్కడ ఎవ్వరూ కిరణ్మయిని చంపమని తమ సమ్మతిని తెలియచేయలేదే. అటువంటప్పుడు ఈమెని చంపేయటం మెర్సీ కిల్లింగ్ అవుతుందా... హత్య అవుతుంది. ఒకవేళ పేషెంటో ఆమె తరఫు బంధువులో సమ్మతి తెలియచేసినా దాన్ని అమలు పర్చడానికి తనెవరు? అది చేసే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉంది. తను ప్రభుత్వం కాదుగా. చివరికి ప్రభుత్వం చేత నియమించబడిన ప్రతినిధి కూడా కాదే...

మనసు ద్వైదీభావంతో సతమతమౌతోంది. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. హామ్లెట్ నాటకంలో టు బీ ఆర్ నాట్ టు బీ లాంటి సందిగ్ధం... అస్పష్టత...

ట్యూబ్ వదిలేసి వెనక్కి రెండడుగులు వేసాడు. ఎవరో పేషంట్ దగ్గుతున్నాడు. దగ్గి దగ్గి లేచి కూచున్నాడు.

సిద్దార్థ చప్పుడు చేయకుండా వెనక్కొచ్చి తన మంచం మీద పడిపోయాడు. అతనికి చాలా నిస్సత్తువగా అన్పించింది. తను చేయబోయేది మెర్సీ కిల్లింగా లేక హత్యా... మెర్సీ కిల్లింగే ఐతే తన్ను తాను క్షమించుకోగలడు... తన ఉద్దేశంలో అది తప్పు కాదు కాబట్టి క్షమించడం అనే మాటే రాదు. పేషంట్‌కి మేలు చేసినందుకు తన్ను తాను అభినందించుకుంటాడు.

అతనికి వారం క్రితం కలిసిన కిరణ్మయి వాళ్ళ నాన్న గుర్తొచ్చాడు. తను హాస్పిటల్లో డాక్టర్‌గా చేరాక కిరణ్మయివాళ్ళ నాన్నని చూడటం అదే మొదటి సారి. అరవై యేళ్ళుంటాయేమో... మనిషి బద్దలా సన్నగా ఉన్నాడు. మొహంలో గూడుకట్టుకున్న

వైద్యం... భుజాలమీద రెండు కొండల్ని మోస్తున్నట్లు వంగిపోయాడు.

'పదేళ్ళుగా ఈ హాస్పిటల్లో ఉంచి మీ అమ్మాయి ప్రాణాన్ని కాపాడుకొస్తున్నారు. సరే. యింత ఖర్చు ఎలా భరిస్తున్నారు? బాగా ఆస్తిపాస్తులున్నాయా?' అని అడిగాడు తను.

'అంత ధనవంతులం ఏమీ కాదు బాబూ. అలాగని అసలు లేనోళ్ళం కాదు. ఉండటానికో యిల్లు, పదెకరాల పొలం మా తండ్రి నుంచి నాకు సంక్రమించాయి. టీచర్‌గా గవర్నమెంట్ ఉద్యోగం. నా పిల్లల్ని కష్టమంటే ఏంటో తెలీకుండా అల్లారు ముద్దుగా పెంచుకున్నాం. అబ్బాయి కిరణ్మయికంటే రెండేళ్ళు పెద్ద. సాఫ్ట్‌వేర్ యింజనీర్. అమెరికాలో బోస్టన్‌లో ఉన్నాడు. వాడికిద్దరు పిల్లలు. కిరణ్మయికిలా జరక్కుండా ఉంటే హాయిగా పదవీ విరమణ తర్వాత జీవితాన్ని నా మనవలు మనవరాళ్ళతో గడిపేసేవాణ్ణి. ఆ భగవంతుడు మరోలా తలిచాడు బాబూ'

'యిప్పటివరకూ ఎంత ఖర్చుచేసి ఉంటారు?'

'చాలా ఖర్చయిపోయింది బాబూ. కోర్టుల చుట్టు తిరగడానికి, వాడికి శిక్షపడేలా చేయడానికి కొంత ఖర్చయితే దీని వైద్యం కోసం లక్షలకు లక్షలు ఖర్చయింది. అవుతూనే ఉంది. నా యింటిని అమ్మేసి ప్రస్తుతం అద్దె కొంపలో నేనూ నాభార్య ఉంటున్నాం. పదెకరాల మాగాణి ఎప్పుడో హారతి కర్పూరంలా హరించుకు పోయింది. బ్యాంకులో దాచుకున్న కొద్దిపాటి సొమ్ము కూడా ఖర్చయిపోయింది.'

'మరి ఖర్చుకి యిపుడెలా తట్టుకుంటున్నారు?'

'కొన్ని ఆర్గనైజేషన్స్ ద్వారా కొంత ఆర్థిక సాయం అందింది. యింకా వాళ్ళనడగడానికి మొహం చెల్లటం లేదు'

'మీ అబ్బాయి సాయం చేయడా?'

'వాడే సాయం అందిస్తే నాకిలా పదిమంది ముందు చేయి చాపాల్సిన అవసరం ఏమొస్తుంది? చెల్లెలు చావుబతుకుల్లో ఉన్నా వాడు దులపరించుకుని పోగలిగాడు గాని కన్న ప్రాణం కదా... నాకూ నా ముసల్దానికి మాత్రం తప్పదు కదా బాబూ. కష్టమో నష్టమో మా కంఠంలో ప్రాణమున్నంత వరకు కూతుర్ని కాపాడుకుంటాం'

'యిలా హాస్పిటల్లో పెట్టే బదులు యింటికి పిల్చుకెళ్ళి ఏ నర్సునో పెట్టుకుంటే మీకు బోలెడు ఖర్చు కలిసి వస్తుందిగా'

'ఖర్చుకి భయపడి అంత రిస్కు తీసుకోలేం బాబూ. ఏ క్షణం ఏమవసరమొస్తుందో ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో తెలీదు కదా. ఆస్పత్రిలో ఉంటే ఇరవైనాలుగ్గంటలూ ఎవరో ఒకరు చూస్కుంటూ ఉంటారన్న నమ్మకం. అదీ గాక ఈ హాస్పిటల్ కట్టించిన వెంకటరెడ్డి నా స్టూడెంట్. లాభాపేక్ష లేకుండా వైద్యం చేస్తున్నాడు. లేకపోతే ఈ పాటికి బిచ్చమెత్తుకుంటూ ఉండేవాళ్ళం'

'యిలా ఎన్నేళ్ళు?'

'మన చేతుల్లో ఏముంది బాబూ... భగవంతుడు దాని ఆయుష్షు ఎన్నేళ్ళు రాసిపెట్టి ఉంటే అన్నేళ్ళు'

'నేనడిగేది ఆ విషయం కాదు... మీరు ఖర్చుని ఎలా భరిస్తారనే విషయం... ఉన్న ఆస్తులన్నీ అమ్ముకున్నారు. తెల్సిన సంస్థలన్నింటి ద్వారా సాయం పొందటం ఐపోయింది. మరిప్పుడేం చేస్తారు?'

'ఏమైనా చేస్తాను బాబూ... ఈ వయసులో మేమిద్దరం కూలిపని చేయడానికైనా సిద్ధమే. యింకా అవసరమైతే పదిమంది ముందు దేహీ అని చేయిచాపి బిచ్చమెత్తుకునైనా నా కూతుర్ని బతికించుకుంటాను' అంటూ భోరుమని ఏడ్చాడు.

సిద్దార్థ చెవుల్లో అతని ఏడుపు ప్రతిధ్వనించింది. బిచ్చమెత్తుకునైనా కాపాడుకుంటానన్న మాటలు గింగురుమంటున్నాయి. ఓ దృఢ నిశ్చయంతో లేచి కిరణ్మయి బెడ్ దగ్గరకెళ్ళాడు. యిది తప్పకుండా మెర్సీ కిల్లింగే. ఈమెను చంపడం ద్వారా తను ముగ్గురికి మేలు చేస్తున్నాడు. ఈ వ్యక్తికి బాధల్నుంచి విముక్తి ప్రసాదిస్తున్నాడు. ఈమె తల్లిదండ్రులను బిచ్చగాళ్ళు కాకుండా కాపాడ్తున్నాడు.

ఆక్సిజన్ ట్యూబు లాగేసేముందు మరోసారి ఆమె మొహంలోకి చూశాడు. 'మీకెలా ధన్యవాదాలు చెప్పాలో తెలీటం లేదు. కొన్నేళ్ళ క్రితమే ఎవరైనా ఈ సాయం చేసి ఉంటే నా తల్లిదండ్రులకు తినడానికి తిండి ఉండేది. పాపిష్టిదాన్ని.. వాళ్ళకు నిలువ నీడలేకుండా చేశాను. కనీసం మీరైనా వాళ్ళని బిచ్చగాళ్ళు కాకుండా కాపాడుతున్నందు మరీమరీ కృతజ్ఞతలు' అంటున్నట్లనిపించింది.

అతను వెంటనే బలంగా ఆ ట్యూబుని లాగాడు. పది నిముషాల సేపు అక్కడే నిలబడి ఆమె శరీరంలో చలనం నిలిచిపోయాక మరలా ట్యూబుని యథా స్థానంలో అమర్చి తన గదిలోకొచ్చి పడుకున్నాడు.

యిపుడతని మనసు ప్రశాంతంగా ఉంది. తుఫానులాంటి ఆలోచనల అలజడి ఓ కొలిక్కి వచ్చాక ఏర్పడే ప్రశాంతత... 'చాలా మంచి పని చేశావు నాన్నా' అంటూ నానమ్మ దీవిస్తున్నట్లనిపించింది. హాయిగా నిద్రపోయాడు... గాధ నిద్ర... కలలో తెల్లపావురం కన్పించింది... దాని రెక్క మళ్ళా అతుక్కుంది... మెడ వయ్యారంగా తిరుగుతోంది. గాయాలేమీ లేవు... ఆకాశంలోకి హాయిగా ఎగిరిపోతూ... పోతూ... మబ్బుల్లో మాయమయ్యేముందు కిరణ్మయిలా మారి అదృశ్యమైంది.

***

ఆ రోజు శనివారం... ఆఫీస్ పనితో యింటి పనితో క్షణం తీరికలేకుండా సతమతమౌతున్న సరోజకు మరికొంత సేపు పడుకోవాలనిపించింది. కానీ వెంటనే ప్రసాద్ గుర్తొచ్చాడు. వాడి చిన్నప్పుడు అన్నీ మంచంలోనే కానిస్తే శుభ్రం చేసి బట్టలు మార్చేది. యిప్పుడు మళ్ళా తన కొడుకు పసిపాపలా మారిపోయాడు... ఇరవై మూడేళ్ళ పసిపాప... అలా అనుకోగానే ఆమెకు దుఃఖం వచ్చింది. రేపెలాగూ ఆదివారం... బ్యాంక్ పని ఉండదు కాబట్టి కొద్దిగానైనా విశ్రాంతి దొరుకుతుంది. రోజూ లేచిన వెంటనే ప్రసాద్ రూంలోకెళ్ళి అతని బాత్రూంకెళ్ళాల్సిన అవసరాల్ని తీర్చాకే మిగతా పనుల్లో పడిపోతుంది. బ్యాంకుకి వెళ్ళేముందు స్నానం చేయించి, బట్టలేశాక అన్నం తిన్పించి అప్పుడు బ్యాంక్‌కి వెళ్తుంది.

ఈ రోజూ రొటీన్ తప్పదు అనుకుంటూ లేవబోయింది. వళ్ళు సహకరించలేదు. సలపరంగా ఉంది. తలనొప్పి కూడా మొదలైంది. జ్వరం వచ్చిందేమో... ప్రస్తుతం లేకున్నా ఆ లక్షణాలు కన్పిస్తున్నాయి కాబట్టి జ్వరం వస్తుందేమోనని భయం పట్టుకుంది.

అమ్మో... జ్వరం వస్తే ఏమైనా ఉందా... తను పడకేస్తే ప్రసాద్‌ని ఎవరు చూసుకుంటారు? వాడి అవసరాలు ఎవరు తీరుస్తారు?

పుట్టినపుడు ముద్దుగా బొద్దుగా ఎంతందంగా ఉండేవాడో... ఎంత అపురూపంగా పెంచిందో వాణ్ణి... వాడు పుట్టాక వాడి తోడిదే లోకమన్నట్టు మెలిగింది. తన భర్త

ఎన్నిసార్లు అలిగేవాడో... 'నేనంటూ ఒకడ్ని ఉన్నానని మర్చేపోయావు సరూ... నీ కొడుకు ముద్దు ముచ్చట్లు తప్ప మరో ప్రపంచమే లేనట్టు చేస్తున్నావే... అప్పుడప్పుడైనా నా గురించి పట్టించుకో... లేకపోతే కొన్ని రోజులు పోయాక నన్ను యింట్లోకి రానివ్వకుండా ఆపేసి 'ఎవర్నువ్వు' అనే ప్రమాదముంది' అన్నప్పుడు తను ఎలా పడీపడీ నవ్విందో...

తన జీవితంలో మధురమైన రోజులు అవే... ప్రపంచం తన పాదాల దగ్గర ఉన్నట్లు గర్వంగా ఉండేది. ప్రేమించే భర్తా... ముద్దులొలికే కొడుకు... మంచి ఉద్యోగం... యింతకన్నా ఏ స్త్రీ ఐనా ఏం కోరుకుంటుంది?

భర్త మరణంతో తనకు సమస్యలు మొదలైనాయి. జీవితాంతం కలిసి ఉంటానని పెళ్ళినాడు ప్రమాణాలు చేసిన వ్యక్తి అర్థాంతరంగా తనని వదిలేసి ఎలా వెళ్ళిపోయాడో... ఆ సంఘటన తల్చుకుంటేనే భయంతో వళ్ళు జలదరిస్తుంది.

జరిగిన దారుణాన్ని తట్టుకుని... జీవితంతో సమాధానపడి బతకటం నేర్చుకుంది. భర్తలేకున్నా తన కొడుక్కోసం బతకాలనుకుంది. కానీ ఆ కొడుకే ఇపుడు మంచానికి పరిమితమైపోయి... జీవచ్ఛవంలా బతుకుతున్నాడు. వాణ్ణి ఆ పరిస్థితిలో చూసినపుడల్లా కడుపు తరుక్కుపోతోంది. అన్నీ సవ్యంగా ఉండి ఉంటే ఈ పాటికి వాడు సాఫ్ట్‌వేర్ యింజనీర్‌గా పెద్ద ఉద్యోగంలో ఉండేవాడు. తనకు తోడుగా యింట్లో కోడలు పిల్ల ఉండేది. బ్యాంక్ నుంచి యింటికి రాగానే కబుర్లు చెప్పే మనవడో మనవరాలో ఉండేవారు.

రిటైరైనాక మనవడూ మనవరాలికి చదువు చెప్తూ, హోంవర్కులు చేయిస్తూ వాళ్ళతో కలిసి ఆడుకుంటూ.... ఓహ్... ఎంత తీయని అనుభవాలు... అన్నీ కలలుగానే మిగిలిపోయాయి. బతుకు మోడువారిపోయింది. చిగురించే ఆశ ఏ కోశానా కన్పించటం లేదు.

ఆమెనిపుడు కొత్త దిగులు బాధిస్తోంది. తను బతికినన్నాళ్ళు కొడుకుని పసిబిడ్డలా చూసుకుంటుంది. కాని తన తదనంతరం వాడినెవరు చూసుకుంటారు? ఈ ఆలోచన ఆమెని తీవ్రంగా భయపెడ్తోంది. తన కొడుక్కోసం తను బతకాలి. కొడుకు బతికినన్నాళ్ళూ తనూ బతకాలి. కాని చావు తన చేతుల్లో ఉందా... తన భర్త అలా చనిపోతాడని తనెప్పుడైనా వూహించిందా... తను కూడా అలా ఏ యాక్సిడెంట్లోనో చనిపోతే...

అందుకే తను రోడ్డుమీద నడిచేటపుడు చాలా జాగ్రత్తగా నడుస్తుంది. ప్రాణభయం కన్నా తను పోతే తన కొడుకేమైపోతాడోనన్న భయం.

వళ్ళు నొప్పులుగా ఉన్నా తప్పదు కాబట్టి లేచింది. ప్రసాద్ పడుకునే గదిలోకెళ్ళి చూసింది. అప్పటికే చాలాసేపటినుండి ప్రసాద్ అమ్మ రాక కోసం ఎదురుచూస్తున్నాడు. అమ్మను చూడగానే మొదట అతని కళ్ళు సంతోషంతో మెరిశాయి... క్షణమే... మరుక్షణం కళ్ళని ఆక్రమిస్తూ అనంతమైన దిగులు...

"రాత్రి బాగా నిద్రపట్టిందా నాన్నా" అని అడిగింది

అమ్మ వైపు దీనంగా చూశాడు. "నిద్రెలా పడ్తుంది మమ్మీ... ఎప్పటిలానే పట్టలేదు."

"మరేం చేశావు నాన్నా"

"ఆలోచనలు మమ్మీ... భయపెట్టే ఆలోచనలు... కలత నిద్ర పట్టినా వెంటాడే పీడకలలు"

"జరిగినదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి తప్ప పిచ్చిపిచ్చి ఆలోచనల్తో మనసు పాడు చేసుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాలి?" అంటూనే మంచానికి కింద అమర్చిన టాయిలెట్ ప్యాన్‌ని తీసి బాత్రూంలోని కమ్మోడ్‌లో పోసి ఫ్లష్ చేసింది. ప్యాన్‌ని నీళ్ళతో శుభ్రం చేసి మళ్ళా బెడ్ కింద అమర్చింది.

బ్రష్ మీద పేస్ట్ వేసి పళ్ళను తోమి తలకు పక్కగా పెట్టిన చిన్న బకెట్లో అతను పుక్కిలించి వూసిన నీళ్ళను బాత్రూంలో పడేసి బకెట్‌ని కడిగి పెట్టింది. మొహాన్ని పొడిగుడ్డతో తుడిచింది.

ఈ వయసులో కూడా అమ్మ చేత అలాంటి పనులు చేయించుకోవడం ప్రసాద్‌కి మరణ సదృశంలా ఉంది. రోజుకి ఎన్నిసార్లు తను చనిపోతున్నాడో... అవమానంతో... సిగ్గుతో... అసహనంతో... దిగుల్తో ... బాధతో భయంతో... ఎన్ని కారణాల్తో చనిపోతున్నాడో... అలా జరిగిన ప్రతిసారీ అనుకుంటాడు... ఎందుకీ బతుకు... చచ్చిపోతే నాకూ నా తల్లికీ ఈ హింస నుంచి విముక్తి లభిస్తుంది కదా అని.

ప్రసాద్‌కి అమ్మని తల్చుకుంటే చాలు జీవితం మీద విరక్తి పుడ్తోంది. తన బతుక్కి అర్థం లేదు. అమ్మను కష్టపెట్టడానికి తప్ప తానెందుకు బతికున్నట్టు? తన భారాన్ని

పంచుకోడానికి చివరికి నాన్న కూడా లేడు. అంతా అమ్మే భరించాలి. ఎంత కష్టమని భరిస్తుందీ తనైనా... ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే... ఆర్థిక పరిస్థితీ బాగోలేదు. అందువల్ల ఉద్యోగం మానడానికీ లేదు.

చదువుకునే రోజుల్లో ఎన్నెన్ని రంగుల కలలో... ఉద్యోగం వచ్చాక లక్షలకు లక్షలు సంపాయించి అమ్మను సుఖపెట్టాలని... అమెరికా, స్విడ్జర్‌ల్యాండ్, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు పిల్చుకెళ్ళి చూపించాలనీ... కానీ యిపుడు తనే అమ్మకు మోయలేనంత భారమైపోయాడు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా తను అమ్మను సుఖపెట్టగల ఒకేఒక అవకాశం ఉంది. అది తన చావు. తను ఎంత త్వరగా చచ్చిపోతే అమ్మకంత వెసులుబాటు...

అన్నం వండటం పూర్తయ్యాక వేడినీళ్ళ గిన్నె, డెట్టాల్ లిక్విడ్ సోప్ తెచ్చి కాటన్ గుడ్డని నీళ్ళలో ముంచి శరీరమంతా శుభ్రం చేసింది. టవల్తో శరీరాన్ని పొడిగా తుడిచి చొక్కా తొడిగింది. లుంగీని చుట్టింది.

అతన్ని కూచోబెట్టి వీపు వెనక సపోర్ట్‌గా రెండు దిండ్లు పెట్టి అన్నాన్ని మెత్తగా పిసికి పప్పు కలిపి చిన్న చిన్న ముద్దలు చేసి తిన్పించింది.

అతను బరువు పెరిగిన విషయం ఆమెకు స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయం గురించి డాక్టర్ రావు గారు ముందుగానే హెచ్చరించారు. ఈ జబ్బుకు యిచ్చే స్టిరాయిడ్ ప్రెడ్నిసోన్ వల్ల కండరాలు బలహీనపడే ప్రక్రియ నెమ్మదిస్తుందనీ కానీ బరువు పెరగడం, ఎముకల సాంద్రతని తగ్గించడం వల్ల ఎముకలు పెళుసుగా మారి విరిగిపోవడం లాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని చెప్పాడు.

బ్యాంక్‌కి వెళ్ళేముందు “యింకేమైనా కావాలా?” అని అడిగింది.

“ఏమీ వద్దు మమ్మీ” అన్నాడు.

“పూర్ణించి రమ్య వస్తుందని ఆంటీ చెప్పింది. బహుశా నిన్ను చూట్టానికి రమ్య వస్తుందేమో.” ఓ కుర్చీని ప్రసాద్ తలవైపుకు జరిపింది. “ఒకవేళ ఇపుడు రావడానికి కుదరకపోతే నేను ఆఫీస్ నుంచి వచ్చాక రావొచ్చు. అపుడు నేనుంటాను కాబట్టి నో ప్రాబ్లెం. సరేనా... నేను వెళ్ళిరానా” అంది. సరే నన్నట్లు తల వూపాడు.

రమ్య పేరెత్తగానే తన కొడుకు కళ్ళలో పొంగుకొచ్చిన వెల్తురు... ఆ వెంటనే కమ్ముకొచ్చిన దిగులూ... రెండింటినీ ఆమె గమనించింది.

అమ్మ బ్యాంక్‌కి వెళ్ళాక, ప్రసాద్ ఆలోచనలు రమ్య చుట్టూ తిరగసాగాయి.

రమ్య... తన జీవితంతో గాఢంగా పెనవేసుకున్న పేరు... అమ్మ తర్వాత తనిష్టపడిన మరో స్త్రీ రమ్య. అందమైన రూపం... రూపానికి తగిన పేరు... అన్నిటినీ మించిన మంచితనం... మానవత్వం.

పదో తరగతిలో ఉన్నపుడు మొట్టమొదటిసారి అన్పించింది... తను రమ్యని ప్రేమిస్తున్నాడని. ప్రేమంటే ఏమిటో తెలీని వయసు... సినిమాల్ని చూసి అదే ప్రేమ అనుకునే వయసు. రమ్య చూపే శ్రద్ధ వల్ల తనలా అనుకుని ఉంటాడని యిపుడనిపిస్తోంది. తరచూ డాక్టర్ల చుట్టూ తిరగాల్సి రావడం వల్ల క్లాసులు కొన్ని మిస్సవాల్సి వచ్చేది. అలా మిస్ ఐన ప్రతిసారీ రమ్య యింటికొచ్చి తను తయారు చేసుకున్న నోట్స్ యిచ్చిపోయేది. పాఠాలు అర్థం కాకపోతే దగ్గర కూచుని వివరంగా చెప్పేది.

యింటర్ పాసైనాక రమ్య యింజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ యింజనీరింగ్‌లో చేరింది. తను కూడా అదే కాలేజీలో చేర్తానని ఎంత ఏడ్చాడో... అమ్మయితే అసలు యంసెట్టే రాయొద్దని చెప్పింది, తనే గొడవపడి యంసెట్ రాసాడు. రమ్యకు మంచి ర్యాంక్ రావడం వల్ల ఫ్రీ సీట్ దొరికింది. తనకు మాత్రం నలభై వేలల్లో ర్యాంక్ వచ్చింది.

'సాఫ్ట్‌వేర్ యింజనీర్ కావాలనేది నా డ్రీం మమ్మీ... నీకు తెల్సుగా. రమ్య చేరబోతున్న కాలేజీలో ఎన్నారై సీట్లు ఉన్నాయట. నాలుగు లక్షలు కడ్తే చాలు మమ్మీ... సీటిస్తారు. లాస్ట్ యియర్ ఇదే బ్రాంచ్లో సీటు ఏడెనిమిది లక్షలు పలికిందట. ఈ సంవత్సరం నాలుగు లక్షలే మమ్మీ... ఎంత చీపో... సాఫ్ట్‌వేర్ బూమ్ తగ్గింది కాబట్టి ఆ బ్రాంచ్‌కి డిమాండ్ కూడా తగ్గిందట. ప్లీజ్ మమ్మీ. నేను యింజనీరింగ్ కోర్సయితేనే చదువుతాను' అన్నాడు.

'వద్దు నాన్నా... నేను చెప్పేది విను. మనింటికి దగ్గరే ఉన్న కాలేజీలో డిగ్రీలో చేరిపో' అంది మమ్మీ.

'ఎందుకు మమ్మీ అలా అంటావు? ఈ రోజుల్లో డిగ్రీలో ఎవరు చేరుతున్నారో తెలుసా... తెలివి లేని వాళ్ళు... యింజనీర్ కోర్సులు చదివే తాహతు లేని వాళ్ళు మాత్రమే అటువంటి కాలేజీల్లో చదువుతారు. నాకు తెలివుంది మమ్మీ. నాకీ జబ్బు రాకుండా ఉంటే తప్పకుండా మంచి ర్యాంక్ వచ్చి ఉండేది. అసలీ రోజుల్లో యింజనీర్

కోర్సు కామనైపోయింది మమ్మీ... మీ రోజుల్లో మామూలు డిగ్రీ ఎలానో యిపుడు యింజనీరింగ్ గ్రాడ్యుయేట్ అంటే అలా అన్మాట'

'నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను బాబూ. నువ్వు డిగ్రీలో చేరు. ఏ గ్రూప్ అనేది నీ యిష్టం. నువ్వు సి.ఈ.సి. తీసుకున్నా యిష్టమే. కంప్యూటర్ సైన్స్ అంటే ఇష్టమన్నావుగా. డిగ్రీలో కూడా కంప్యూటర్ సబ్జెక్ట్ తీసుకోవచ్చు. బి.సి.ఏ. తీసుకో’’

'వద్దు మమ్మీ... నేను యింజనీరింగ్ కోర్సే చదువుతాను. నాలుగు లక్షలు ఖర్చవుతాయని వద్దంటున్నావా మమ్మీ. నీకు నేనొక్కడినే సంతానం కదా. నువ్వెన్నిసార్లు చెప్పావో గుర్తుకు తెచ్చుకో. ఈ ఆస్తులూ నీ సంపాదనా అంతా నాకోసమే అని చెప్పలేదా... నాలుగు లక్షలేగా మమ్మీ... నాకు ఉద్యోగం వచ్చాక యింతకు పదింతలు సంపాయించి యిస్తా మమ్మీ' అన్నపుడు అమ్మ తన వైపు చూసిన చూపు యింకా గుర్తుంది. ఆమె కళ్ళలో అనంతమైన దిగులు...

'డబ్బు కోసం కాదు నాన్నా... నీ సంతోషం కోసం నాలుగు లక్షలేం ఖర్మ... మనకున్నదంతా ఖర్చు చేయాల్సి వచ్చినా మరో ఆలోచన లేకుండా ఖర్చు చేస్తాను. నేనాలోచిస్తున్నది నీ గురించే. యింజనీరింగ్ కాలేజీలన్నీ సిటీకి పాతిక ముప్పయ్ కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అంత దూరం ఎలా వెళ్తావు బాబూ? అందరూ కాలేజీ బస్సుల్లోనో స్కూటర్లమీదో వెళ్తారు. కొన్నాళ్ళు పోతే వీల్ ఛెయిర్ వాడాల్సి వస్తుందని డాక్టర్ చెప్పిన విషయం మర్చిపోయావా? అలాంటి పరిస్థితి వస్తే అంత దూరం వెళ్ళటం సాధ్యమా... అంత శ్రమని తట్టుకోగలవా... ఎంత సమయం పడ్తుందో ఆలోచించావా? ఈ కాలేజీ మనింటికి చాలా దగ్గరగా ఉంది. మనకన్ని విధాలా సౌకర్యంగా ఉంటుంది బాబూ' అంది అమ్మ.

తనకేడుపు వచ్చింది. తన గురించే ఆలోచించే అమ్మ... తన కోసమే తపించే అమ్మ... కానీ అమ్మకర్థమయ్యేలా ఎలా చెప్పటం... తనకు యింజనీరింగ్ కోర్సు ముఖ్యం కాదు. రమ్య ముఖ్యం... రమ్యకు సమీపంగా ఉండటం ఇష్టం... రమ్య చెత్త కాలేజీలో చేరినా తనూ అక్కడే చేర్తాననేవాడు. కాలేజీ దాకా రమ్య కబుర్లు చెప్తూ తన పక్కన నడుస్తూ ఉంటే జీవితం ఎన్ని రంగుల్లో కన్పిస్తుందో... హరివిల్లులా... రమ్యని చూడకపోతే బతుకంతా అంధకారంలా అన్పిస్తుంది. యిదంతా తల్చుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న తనని

కౌగిలించుకుని 'నువ్వలా ఏడిస్తే నేను తట్టుకోలేనురా. నీ ఇష్ట ప్రకారమే యింజనీరింగ్‌లో చేర్పిస్తాలే. కాలేజీకి దగ్గర్లో అద్దెకు యిల్లు తీసుకుందాం. సరేనా... నువ్వు ఏడ్వకు' అంది.

ఆ మాట వినగానే తనకు మరింత దుఃఖం పొంగుకొచ్చింది. తనకోసం స్వంత యింటిని వదిలి కాలేజీకి దగ్గరగా అద్దె యింట్లో ఉండటానికి సిద్ధపడ్తున్న అమ్మ....

'నువ్వు బ్యాంక్‌కి ఎలా వస్తావమ్మా? నీకు దూరమౌతుందికదా' అంటే

'పర్లేదులే నాన్నా... ఏవో బస్సులు పట్టుకుని వస్తాలే' అన్న అమ్మ.

చివరికి తను యింటి దగ్గర్లో ఉన్న కాలేజీలో బి.సి.ఏ.లో చేరాడు.

డిగ్రీలో కాళ్ళు దాదాపుగా స్వాధీనం తప్పాయి. అమ్మ చక్రాల కుర్చీ కొనిచ్చింది. తను వీల్ ఛెయిర్లోనే కాలేజీకెళ్ళేవాడు. రమ్యకు వాళ్ళ నాన్న స్కూటీ కొనిచ్చాడు. తను కాలేజికి వెళ్తూ దార్లో రమ్యకు కన్పిస్తే చాలు స్కూటర్ దిగి తనతోపాటు నడిచేది.

'ఎందుకలా శ్రమపడ్తావు? నువ్వెళ్ళిపో... నేను మెల్లగా వెళ్తాను' అనేవాడు.

'పర్లేదు. మీ కాలేజీవరకు కబుర్లు చెప్పుకుంటూ వెళ్దాం. నీకు కంపెనీ కావాలిగా' అనేది.

రమ్యతో మాట్లాడుతూ మధ్య మధ్యలో రమ్య అందమైన నవ్వుని వింటూ కాలేజికి వెళ్తుంటే తను చక్రాల కుర్చీలో నడవలేని స్థితిలో ఉన్న విషయమే మర్చిపోయేవాడు. అందమైన పార్కులో రమ్య చేతిని తన చేతిలోకి తీసుకుని యిద్దరూ హాయిగా కబుర్లాడుకుంటూ నడుస్తున్న తీయని అనుభూతి... అలా జరిగిన రాత్రి తను కలల్లో తేలిపోయేవాడు.

కానీ వెంటనే భయం గుప్పెట్లో విలవిల్లాడిపోయేది మనసు. నిజంగానే రమ్యకు తనంటే యిష్టమా... నడవలేని తనని రమ్య ప్రేమిస్తుందా? అసలు తనలాంటి వాళ్ళని ఎవరైనా ప్రేమిస్తారా? రమ్య చూపించేది ప్రేమ కాదేమో? జాలి వల్ల అలా ప్రవర్తిస్తుందేమో...

తను చూసిన కొన్ని సినిమాల్లో కళ్ళు లేనివాళ్ళని కాళ్ళు లేని వాళ్ళని హీరోయిన్లు ప్రేమించడం తల్చుకుని మళ్ళా కలల్లో తేలిపోయేవాడు.

రమ్య వారానికి ఒక్కసారైనా వచ్చి పల్కరించిపోయేది. మెల్లగా ఆ రావటం నెలకోసారిగా మారింది. 'వారానికొక్కసారైనా కన్పించు రమ్యా... నీతో మాట్లాడితే బావుంటుంది' మనసులోఉన్న మాటను దాచుకోలేక అన్నాడోసారి.

'సారీ ప్రసాద్... యింజనీరింగ్ కోర్సు కదా... బోల్డు అసైన్‌మెంట్స్ ఉంటాయి. ఫస్ట్ సెమిస్టర్ నుంచీ నేను క్లాస్ టాపర్ని. దాన్ని నిలుపుకోవాలంటే బాగా కష్టపడాలి కదా. టైం సరిపోవటం లేదు' అంది.

డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు రాశాక కదలటం కష్టంగా మారింది. మంచానికే పరిమితమైన తన చేత అమ్మ యం. ఏ తెలుగు ప్రైవేట్‌గా చదవమని ఫీజు కట్టించింది.

రమ్య యింజనీరింగ్ ఫైనలియర్లో ఉన్నపుడే క్యాంపస్ యింటర్వ్యూలో విప్రోలో సెలక్టయింది. బెంగుళూరులో ఉద్యోగం. నెలకు పాతిక వేల జీతంతో విప్రో లాంటి పెద్ద సంస్థలో ఉద్యోగం వచ్చిందని విని తనకొచ్చినంతగా సంబరపడ్డాడు. వూరెళ్ళేముందు చెప్పడానికొచ్చినపుడైతే ఏడుపొచ్చింది. అమ్మ తర్వాత తనకు తెలిసిన ఒకే ఒక ఆత్మీయురాలు దూరంగా వెళ్ళిపోతున్నదన్న బాధ...

'దూరంగానేగా వెళ్తున్నాను. దూరమై పోవటం లేదుగా. బెంగుళూరెంత దూరం? మా యింటికి వచ్చినపుడల్లా నిన్ను తప్పకుండా కలిసే వెళ్తాను సరేనా' అని రమ్య అన్నాక మనసు కొద్దిగా స్థిమిత పడింది,

బెంగుళూరు వెళ్ళిన నాలుగు నెలలకి రమ్య హైద్రాబాద్ వచ్చింది. వచ్చిన రెండో రోజు తనని చూడటానికొచ్చింది.

తప్పిపోయిన ప్రియురాలు తిరిగి దొరికినంత సంతోషం... జాతర్లో అమ్మ నుంచి విడివడి కొన్ని రోజుల వేదన తర్వాత తిరిగి అమ్మను కలుసుకున్నంత ఆనందం...

రమ్య కొద్దిగా వళ్ళు చేసింది. యింకా రంగు తేలింది.

'ఉద్యోగం ఎలా ఉంది' అని అడిగాడు.

'చాలా బావుంది. ఐ యాం ఎంజాయింగ్ యిట్. నేను చాలా హేపీగా ఉన్నానని నన్ను చూస్తే తెలీటంలా? నేనుండే వర్కింగ్ విమెన్స్ హాస్టల్ చాలా కన్వీనియంట్‌గా ఉంటుంది. భోజనం కూడా బాగానే ఉంటోంది. మా యింట్లో

భోజనంలానే. ఉదయాన్నే క్యాబ్ వచ్చి పికప్ చేసుకుంటుంది. మళ్ళీ రాత్రి పనైపోయాక హాస్టల్ దగ్గర డ్రాప్ చేస్తుంది. బాగా సుఖపడిపోతున్నా. రెండు కేజీల బరువు పెరిగాను తెలుసా' అంది రమ్య తన అద్భుతమైన చిర్నవ్వుని వెదజల్లుతూ.

'నాలుగు నెలల జీతం తీసుకున్నావుగా. ఏం చేశావు అంత డబ్బు' అని అడిగాడు.

'నా ఖర్చులకు పోగా మిగిలింది మా డ్యాడీ ఎకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేసాను. నాన్న వద్దన్నారు. నేనే పంపించా. భలే ఉంటుంది తెలుసా ఆ ఫీలింగ్... ఇన్నాళ్ళూ మనం అమ్మానాన్నల సంపాదనతో బతికాం. మనక్కావల్సినవి వాళ్ళిచ్చిన డబ్బుల్తో కొనుక్కున్నాం కదా. మనకు ఉద్యోగం వచ్చాక మన జీతాన్ని అమ్మానాన్నలకిస్తుంటే ఎంత థ్రిల్లింగా ఉంటుందో తెలుసా... అది ఎవరికి వారు అనుభవించి తెలుసుకోవాల్సిందే తప్ప మాటల్లో చెప్పలేని అనుభూతి. యిపుడు వచ్చేటప్పుడు బెంగుళూరు నుంచి అమ్మకో పట్టుచీర తెచ్చాను. నాన్నకోసం బట్టలు తెచ్చాను. వాటిని తీసుకుంటున్నపుడు వాళ్ళ కళ్ళలో ఎంత అద్భుతమైన వెలుగు కన్పించిందో తెలుసా' అంటూ తన మొహంలోకి చూసి చప్పున ఆపేసింది.

తన కళ్ళలో దిగులు స్పష్టంగా కన్పించి ఉంటుంది. కానీ తను వెంటనే స్పందిస్తూ అన్నాడు 'నేనిపుడు యం.ఏ. తెలుగు చదువుతున్నాగా. అది పూర్తి కాగానే ఉద్యోగంలో చేర్తాను. టీచింగ్ ప్రొఫెషన్ బావుంటుందిగా. నేను చేయగలను. అప్పుడు నాకొచ్చే మొదటి జీతంతో అమ్మకో పట్టుచీరా నీకోసం మంచి డ్రెస్ కొంటాను' అన్నాడు.

'నాకోసం కూడా డ్రెస్ కొంటావా' అంది నవ్వుతూ.

'తప్పకుండా కొంటాను. అమ్మ తర్వాత నన్ను అంత బాగా చూసింది నువ్వేగా మరి' అన్నాడు

'ఓ థ్యాంక్స్... వెరీ స్వీట్ ఆఫ్ యూ... నేనూ నీకోసం ఓ గిఫ్ట్ తెచ్చాను తెలుసా... యిక్కడికొచ్చే తొందర్లో యింట్లోనే మర్చిపోయి వచ్చాను. యిపుడే వస్తానుండు' అని బైటికి పరుగెత్తింది.

రమ్య తిరిగొచ్చేవరకు తనలో పురుడుపోసుకున్న ఎన్నెన్ని తీయని వూహలో... రమ్య తన కోసం ఏం తెచ్చి ఉంటుందీ... టైటాన్ వాచా... ఉంగరమా... రెడీమేడ్ బట్టలా... ప్రేమించిన వ్యక్తి కోసం ఆడపిల్లలు ఎటువంటి బహుమానాలు తెస్తారో అన్నీ

తన వూహల్లో మెదిలాయి. పది నిమిషాల్లో రమ్య తిరిగొచ్చింది. ఆమె చేతిలో యింగ్లీష్ పుస్తకం...

'చాలా మంచి పుస్తకం ప్రసాద్... యిది చదువుతున్నప్పుడే నువ్వు గుర్తొచ్చావు. నీకు బాగా పనికొస్తుందని కొని తెచ్చాను. దిస్ ఈజ్ మై గిఫ్ట్ ఫర్ యూ' అంది.

ఆమె యిచ్చిన పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని చూశాడు. డేల్ కార్నెగీ రాసిన 'హౌ టు స్టాప్ వర్రీయింగ్ అండ్ స్టార్ట్ లివింగ్' అనే పుస్తకం. అట్ట తిప్పి మొదటి పేజీలో చూశాడు. 'టు ప్రసాద్ విత్ లవ్' అని ఉంది. ఉప్పెనలా సంతోషం..

'థ్యాంక్యూ రమ్యా. ఐ లవ్ దిస్ గిఫ్ట్' అన్నాడు.

కొద్దిసేపు మాట్లాడాక 'ఆంటీ బ్యాంక్ నుంచి ఎపుడొస్తారు?' అని అడిగింది.

'మామూలుగా ఐతే ఆరున్నర... పని ఎక్కువ ఉంటే ఏడవుతుంది'

'సరే... నేను ఏడున్నరకొస్తాను. ఆంటీని చూసి చాలా రోజులైంది. అదీ గాక ఈ రోజు ఆంటీతో ఓ గుడ్ న్యూస్ చెప్పాలి' అంది.

'గుడ్ న్యూసా... ఏంటది... మొదట నాకు చెప్పవా?"

'అమ్మో ఆశ... యిద్దరికీ ఒకేసారి చెప్తాను'

'ఏంటో ఆ గుడ్ న్యూస్ కొద్దిగా హింట్ ఇవ్వవా'

'సరే... చాలా రోజులుగా నా గుండెల్లో దాచుకున్న సీక్రెట్... ఈ రోజు మొదట మా యింట్లో చెప్తా... డెఫినిట్‌గా తుఫాను మొదలౌతుంది. అది తొందరగా సద్దుమణిగే తుఫాను కాదు. ఆ సమయంలో ఇక్కడికి పారిపోయి వచ్చేస్తా, అప్పుడు ఆంటీకి నీకు ఆ న్యూస్ చెప్తాను. అప్పటివరకూ సస్పెన్స్' అంది.

తనలో ఏదో తెలీని పులకింత... ఆమెకు తన మీద ఉన్న ప్రేమ గురించే అయి ఉంటుంది. ఔను. అదే యిన్నాళ్ళుగా రమ్య తన గుండెల్లో దాచుకున్న సీక్రెట్... కండరాల వ్యాధితో మంచానికి అంకితమైపోయిన ఓ అవిటివాడిని ప్రేమించానూ పెళ్ళి చేసుకుంటాననంటే ఎవరు ఒప్పుకొంటారు? తప్పకుండా వాళ్ళింట్లో పెద్ద గొడవే జరుగుతుంది. అపుడు రమ్య 'ప్రేమకు యివన్నీ తెలీవు నాన్నా. నేను ప్రసాద్‌ని ప్రేమించాను. చావైనా బతుకైనా ప్రసాద్‌తోనే... ప్రసాదే నా భర్త. ఒకవేళ పెళ్ళయినాక నాకే అటువంటి

వ్యాధి వస్తే నా భర్త నన్ను వదిలేయాలని కోరుకుంటారా... లేదుగా... ఇదీ అంతే. గుడ్ బై' అన్చెప్పి యిక్కడికొస్తుంది. రాగానే అమ్మతో తనతో ఆ తీయటి మాటని చెప్తుంది.

తను చాలా సార్లు రమ్యతో తన మనసులోని మాట చెప్పాలనుకున్నాడు. యింటర్లో పార్కులో పడిపోయిన రోజు... కాలేజీ రోజుల్లో రమ్య స్కూటీని నెట్టుకుంటూ తనతోపాటు నడుస్తూ కబుర్లు చెప్తున్నపుడు... రమ్య యింజనీరింగ్ ఫైనలియర్లో ఉన్నపుడు... రమ్యకు ఉద్యోగం వచ్చిందని తెలిసినపుడు... ఆమె ఉద్యోగం కోసం బెంగుళూరు వెళ్తున్నపుడు...

కానీ ధైర్యం చాల్లేదు. నీలో ఏం చూసి ప్రేమిస్తాననుకున్నావు? చదువా అందమా పెద్ద ఉద్యోగమా.... ఏమీ లేవు. నీ కాళ్ళ మీద నువ్వు నిలబడలేవు. నీ పనులు నువ్వు చేసుకోలేవు. పెళ్ళి చేసుకుని ఏం ఉద్ధరిద్దామని మహానుభావా? నీకు సపర్యలు చేయడానికి ఓ దాసీది కావాలి. నేను కాదు కదా ప్రపంచంలో ఏ ఆడపిల్లా నిన్ను ఇష్టపడదు. పెళ్ళి చేసుకుని తన గొంతు కోసుకోదు' అంటుందేమోనని భయం... ఆత్మన్యూనతా భావం... తిరస్కారాన్ని తట్టుకోలేని బలహీనత..

తను చెప్పకపోవడమే మంచిదయింది. ఇప్పుడు రమ్య తనకు తనే ఆ మాటను చెప్పబోతోంది. ఇపుడు తిరస్కారభయం లేదు. తను చాలా అదృష్టవంతుడు. అమ్మా... రమ్య... చాలు తన జీవితాన్ని రాగరంజితం చేయడానికి...

రమ్య వెళ్ళిపోయిన చాలాసేపటివరకు ప్రసాద్ మేఘాలమీద తేలియాడాడు. అమ్మ బ్యాంక్ నుంచి వచ్చాక రమ్య వచ్చిపోయిన విషయం చాలా సంతోషంగా చెప్పాడు.

'మళ్ళా వస్తానందమ్మా. నీకేదో గుడ్ న్యూస్ చెప్పాలట' అన్నాడు.

'బహుశా తన పెళ్ళి విషయం ఐ ఉంటుంది'

'సరిగ్గా నేనూ అదే అనుకున్నానమ్మా' అన్నాడు సంబరపడిపోతూ.

ఆ పెళ్ళి చేసుకోబోయేది తననే అన్న విషయం అప్పుడే అమ్మకు చెప్పదల్చుకోలేదు. అమ్మ ఆ వార్త వినగానే సంతోషంతో మూర్ఛ పోవాలి.

రమ్య రావటం ఆలస్యమయ్యేకొద్దీ తనలో ఎంత అసహనమో... ఎంత చిరాకో...

'అమ్మా రమ్య యింకా రాలేదా' అని ఏ వందసార్లో అమ్మని అడిగి ఉంటాడు.

'రమ్య వస్తే నీకు కన్పించకుండా పోదులేరా నాన్నా' అని అమ్మ ముద్దుగా విసుక్కుంది.

అమ్మకేం తెలుసు... రమ్య ఎలాంటి సమస్యలో ఉందో... తన మనసులో ఉన్న విషయం చెప్పగానే యింట్లో భూకంపమే వచ్చి ఉంటుంది. అసలు రమ్యని గదిలో పెట్టి బంధించారేమో... అయ్యో ఎలా రక్షించుకోవాలి తన ప్రాణాన్ని? తను మంచంమీంచి కదల్లేడే... తనకే మంత్ర శక్తులుంటే ఎంత బావుండేది... అమ్మకు నిజం చెప్పేస్తేనో... పదిమందిని పోగేసి వెళ్ళి రమ్యని రక్షిస్తుంది కదా... పోలీసులకు ఫోన్ చేసి చెప్తేనో...

'హాయ్ ఆంటీ. ఎలా ఉన్నారు? మీ ఆరోగ్యం ఎలా ఉంది?' అన్న మాటలు చెవులకింపుగా...

రమ్య గొంతు... హమ్మయ్య... రమ్య వచ్చేసింది. వచ్చేసింది.

రమ్య లోపలికొచ్చి 'హాయ్ ప్రసాద్' అంది. మొహం నిండా మల్లెలు విరగపూసినట్టు... కళకళలాడుతూ... రమ్యని అంత సంతోషంగా ఎప్పుడూ చూళ్ళేదు. అంటే యింట్లోవాళ్ళు ఒప్పుకున్నారా... తను ఒప్పించిందా... అందుకేనా మొహం వెలిగిపోతోంది.

'ఆంటీ... మీరూ లోపలికి రండి. మీ యిద్దరికీ ఓ శుభవార్త చెప్పాలి' అంది.

అమ్మ లోపలికొచ్చి మంచానికి ఓ పక్కగా కూచుంది.

రమ్య కుర్చీ లాక్కుని కూచుంది.

'చెప్పమ్మా... పెళ్ళి కుదిరిందా?'

'ఔనాంటీ...'

'పెద్దవాళ్ళు కుదిర్చిందేనా... అబ్బాయేం చేస్తుంటాడు?'

'యిది కుదిర్చిన పెళ్ళి కాదాంటీ... నేను కుదుర్చుకున్న పెళ్ళి'

ఆ మాటలు వినగానే ప్రసాద్ గుండె లయ తప్పింది.

తన జీవితాన్ని మలుపు తిప్పే మధురమైన మాటలు కొన్ని క్షణాల్లో తను వినబోతున్నాడు.

'ఎవరమ్మా ఆ అదృష్టవంతుడు?'

రమ్య సిగ్గు పడింది.

'పర్లేదు చెప్పు' అంది అమ్మ.

'కల్యాణ్ ఆంటీ... యింజనీరింగ్‌లో నా క్లాస్ మేట్. తనూ ప్రస్తుతం విప్రోలో నాతోపాటే పన్చేస్తున్నాడు. మా కులం కాదు. యిందాకే యింట్లో డిక్లేర్ చేశా. పెద్ద గొడవౌతుందని భయపడ్డాను కానీ అలా ఏమీ జరగలేదు. అమ్మ కొద్దిగా నసిగింది. నాన్న నన్నే సపోర్ట్ చేశాడు. లైన్ క్లియర్ ఆంటీ... చాలా సంతోషంగా ఉంది ఆంటీ. కల్యాణ్ చాలా మంచి కుర్రాడు... చాలా బావుంటాడు తెలుసా'

'చూస్తే కదా తెలిసేది' అంది అమ్మ నవ్వుతూ.

'నా సెల్లో ఫొటో ఉందాంటీ... చూపిస్తానుండండి' అంటూ సెల్ తీసి టకటకా బటన్లు నొక్కి ఓ ఫొటో చూపించింది. ఫోన్ని తన చేతుల్లోకి తీసుకుని అరనిముషం పాటు చూసి 'నిజంగానే బావున్నాడు. సినిమా హీరోలా... గుడ్ సెలక్షన్. నువ్వు చాలా అదృష్టవంతురాలివి' అంది అమ్మ.

'అలా అంటారేమిటి ఆంటీ... నాలాంటి భార్య దొరకటం అతని అదృష్టం. ప్రసాద్... నువ్వూ చూడు' అంటూ సెల్ ఫోన్ని తన చేతిలో పెట్టి 'ఎలా ఉన్నాడు? జుట్టు చాలా బావుంటుంది తెలుసా... కర్లీ హెయిర్. హ్యాండ్‌సమ్‌గా ఉంటాడు. ఆరడుగుల అందగాడు....' రమ్య ఆపకుండా మాట్లాడ్తూనే ఉంది.

కళ్యాణ్ పేరు విన్నప్పుడే తన గుండె వేయి ముక్కలైంది. మనసు భళ్ళున పగిలింది. ఒక్కసారిగా చీకటి తనని మింగేసింది. నిరాశ కొండచిలువలా తనని చుట్టేసింది.

'ఎలా ఉన్నాడు ప్రసాద్... బావున్నాడు కదా... మంచి మాటకారి తెలుసా... భలేజోకులు వేస్తాడు. పెళ్ళి ఏ రోజో అతనితో కలిసి మాట్లాడాక చెప్తాను. నువ్వూ ఆంటీ తప్పకుండా రావాలి. ముఖ్యంగా నువ్వు మిస్ కాకూడదు. నువ్వు నా బెస్ట్ ఫ్రండ్‌వని కళ్యాణ్‌కి కూడా చెప్పాను తెలుసా'

తన సమాధానం కోసం ఎదురుచూడకుండా ఉత్సాహంగా మాట్లాడుతోంది.

'నీకా అబ్బాయంటే చాలా ఇష్టమని ఇట్టే తెలిసిపోతుంది' అంది అమ్మ.

'నిజంగానే చాలా యిష్టం ఆంటీ... మీకెలా తెలిసిందో చెప్పరా' చిన్నపిల్లలా మారాం చేస్తూ రమ్య.

'గంటనుంచీ కళ్యాణ్ గురించే మాట్లాడ్తున్నావుగా. అందుకన్నాను'

'గంటేమిటి ఆంటీ... కళ్యాణ్ గురించి రోజుల తరబడి మాట్లాడినా యింకా చెప్పాల్సింది మిగిలే ఉంటుంది... సచ్ ఏ గ్రేట్ పర్సనాలిటీ' అంది కించిత్తు గర్వంగా.

మరో పది నిముషాలు మాట్లాడి అమ్మ పెట్టిన స్వీట్ తినేసి, పెళ్ళికి తప్పకుండా రావాలని మరోసారి చెప్పి వెళ్ళిపోయింది.

రమ్య శాశ్వతంగా తన జీవితంలోంచి వెళ్ళిపోయింది. తన కలల్లోంచి వెళ్ళిపోయింది. కాని తన ఆలోచనల్లో మాత్రం ఎప్పటికీ మిగిలిపోయింది.

ఆ రోజు... ఆ బ్లాక్ డే తన మనసులో ఎలా ముద్రించుకు పోయిందంటే రెండేళ్ళయినా యిప్పటికీ అది నిన్న జరిగినంత కొత్తగా...

ఎదురుగా గోడకున్న గడియారం వైపు చూశాడు. ఎపుడొస్తుందో... అసలు వస్తుందా... మర్చిపోదుగా... చూసి యేడాది దాటింది. కళ్యాణ్‌కి ఆస్ట్రేలియాలో ఉద్యోగం వచ్చిందని తనుకూడా అక్కడే ఉద్యోగం వెతుక్కుంటానని చెప్పడానికొచ్చి అప్పుడే యేడాది... యిపుడు రమ్యకు ఇరవై మూడేళ్ళుంటాయి... తన వయసేగా... ఎలా ఉందో చూడాలని తహతహ... వళ్ళు చేసి ఉంటుందా... బాగా రంగొచ్చి ఉంటుందా...

రమ్య తన బర్త్ డేకి గిఫ్ట్‌గా యిచ్చిన హీరో పెన్ గుర్తొచ్చింది. ఎంత అపురూపంగా దాచుకున్నాడో దాన్ని! ఎన్ని కలలుండేవో! రమ్యకు ప్రేమలేఖలు రాస్తే ఆ పెన్తోనే రాయాలని... రమ్య జ్ఞాపకాలు మరీ సతాయించిన రోజు హీరో పెన్నుని చేతిలో పట్టుకుని ఆ చేతిని గుండెలమీద పెట్టుకుని పడుకునేవాడు. రమ్య మరెవర్నో ప్రేమిస్తోందనీ అతన్ని పెళ్ళి చేసుకోబోతుందని తెలిశాక ఆ పెన్నుని బీరువా అడుగున పడేశాడు.

ఎన్నేళ్ళయిందో అలా పడేసి! రమ్య వస్తుందిగా... తనకా పెన్ చూపిస్తే ఎంత సంతోషపడ్తుందో... ఆ ఆలోచన వచ్చిందే తడవుగా రమ్య వచ్చేలోపల హీరో పెన్ను వెతికి పెట్టుకోవాలన్న ఆతురత. మెల్లగా పైకి జరిగి దిండ్ల కానుకుని కూచున్నాడు. పక్కనే ఉన్న చక్రాల కుర్చీని దగ్గరకు లాక్కున్నాడు. స్వాధీనంలో లేని కాళ్ళని మొదట కిందకు జార్చి కుర్చీలో కూచోడానికి దాదాపు ఇరవై నిముషాలు శ్రమ పడ్డాడు. చక్రాల కుర్చీని బీరువా దాకా పోనిచ్చి బీరువా తలుపుల్ని తెరిచాడు. దాన్నిండా తన వస్తువులు... బట్టలు...

పెన్ బీరువా అడుగున పడేసినట్లు తనకు బాగా గుర్తు... కొద్దిగా వంగి బీరువా అడుగున వెదకడానికి ప్రయత్నించాడు. వీలు కాలేదు. కుర్చీ హ్యాండిల్‌ని సపోర్ట్‌గా పట్టుకుని మరికొంత వంగాడు. అప్పటికీ అడుగు భాగం అందలేదు. యింకొద్దిగా వంగితే చాలు... యింకొద్దిగా... తను ముందుకి వంగడం కుర్చీ వెనక్కి జరగడం ఒకేసారి జరిగి ధఢాల్న కింద పడిపోయాడు. పెదవి చిట్లి రక్తం కారుతోంది. ఆ బాధకన్నా రమ్య వస్తుందేమో తననీ స్థితిలో చూస్తుందేమోనన్న ఆందోళన...

ఇపుడు పెన్ వెతకడం కన్నా రమ్య వచ్చేలోపల చక్రాల కుర్చీలో కూచుని ఉండటం ముఖ్యమనిపించింది. నేలమీద పాక్కుంటూ వెళ్ళి కుర్చీని అందుకున్నాడు. మెల్లగా కుర్చీ సాయంతో లేవడానికి ప్రయత్నించాడు. వీలు కాలేదు. మళ్ళా శక్తినంతా వుపయోగించి నడుం కింది భాగాన్ని కుర్చీ సీటు వరకూ లేపడానికి ప్రయత్నించి వీలు కాక కిందపడిపోయాడు. అతనికి ఒక్కసారిగా ఏడుపు తన్నుకు వచ్చింది. కొద్దిసేపు అలాగే నేల మీద బోర్లా పడుకుని ఆయాసం తీర్చుకున్నాడు.

కుర్చీని పట్టుకుని శరీరాన్ని కొద్దిగా లేపాడు. కుర్చీ కదిలి వెనక్కెళ్ళిపోతోంది. చక్రాలు కదలకుండా పట్టుకుని కొద్దిగా పైకి లేచి శరీరాన్ని సీటుమీదకి లాగే లోపల కుర్చీ కదిలి పోతోంది. చక్రాలు కదలకుండా శరీరాన్ని కుర్చీలోకి ఎలా జరపాలో ఎంత ప్రయత్నించినా అతనికి సాధ్యం కాలేదు.

ఆలస్యమయ్యేకొద్దీ రమ్య వస్తుందన్న కంగారు... తను రమ్య ముందు పార్కులో భంగపడిన విషయం ఇప్పటికీ గుండెల్లో పచ్చిగా సలుపుతూనే ఉంది. మరోసారి అసహాయ స్థితిలో ఆమెకు కన్పించకూడదు.

కుర్చీలో కూచోవటం అసాధ్యమనిపించి మెల్లగా పాక్కుంటూ మంచం దగ్గరకు చేరాడు. తను పట్టుకున్నా మంచం కదలదు కాబట్టి మంచం పైకి చేరడమే సులువనిపించింది.

నడుం పైభాగాన్ని కొద్దిగా పైకెత్తి చేతుల్తో మంచం పట్టుకుని బలాన్నంతా ఉపయోగించి మిగతా శరీరాన్ని పైకి లాగాడు. అంగుళం కూడా కదల్లేదు. బరువు పెరగడం వల్ల ముఖ్యంగా శరీరం కింది భాగం ఎక్కువ లావు కావడం వల్ల ఎంత ప్రయత్నించినా మంచంపైకి మొత్తం శరీరాన్ని చేరవేయడం సాధ్యం కావడం లేదు.

ఒకసారి బాగా పట్టుదొరికి సగం శరీరాన్ని మంచం మీదకు చేర్చి కొద్దిసేపు వేలాడాడు. కానీ కొన్ని నిముషాల్లోనే దబ్బున కింద పడిపోయాడు. నిస్పృహ... నిరాశ... నిస్సత్తువ...

ఈసారి ఎట్లాగైనా మంచం మీదికి చేరాలని గట్టిగా పట్టుకుని పైకి లేవబోయాడు. మంచం శబ్దం చేస్తూ జరిగింది. దాంతోపాటు బెడ్ ప్యాన్ వూడి కింద పడిపోయింది.

అమ్మ బ్యాంక్‌కి వెళ్ళే తొందర్లో సరిగ్గా అమర్చి ఉండదు. మెల్లగా రూమంతా పర్చుకుంటూ దుర్వాసన... రమ్య వస్తే ఏం చేయాలి? ఈ వాసనేంటి అంటే ఏం చెప్పాలి? అయ్యో ఇలా జరిగిందేమిటి? రమ్య రాకుండా ఉంటేనే బావుంటుంది. పనిలో పడి మర్చిపోతే బావుంటుంది. సాయంత్రం వెళ్తే ఆంటీని కూడా చూడొచ్చనుకుని ఆగిపోతే బావుంటుంది. అమ్మ రాగానే రూమంతా శుభ్రం చేస్తుంది కాబట్టి సమస్య ఉండదు.

కానీ వస్తేనో... ప్లీజ్ రమ్యా... రావొద్దు... ఏ అవమానాన్నయినా భరిస్తాను కానీ నీముందు భంగపడితే తట్టుకోలేను. సిగ్గుతో చచ్చిపోవాలనిపిస్తుంది. అందుకే రావొద్దు... రావొద్దు... నేనిపుడు శ్లేష్మంలో పడి కొట్టుకుంటున్న పురుగులా ఉన్నాను... రావొద్దు రమ్యా... నువ్వు నన్నీ స్థితిలో చూడగలిగినా నేనున్న స్థితిని నువ్వు చూడటం నేను తట్టుకోలేను.

రమ్య లోపలికొస్తూనే 'హాయ్ ప్రసాద్' అనబోయి ఆగిపోయింది. "అయ్యో... ఏమైంది ప్రసాద్... పడిపోయావా... ఈ నీళ్ళేమిటి?" అంటూ ఒక్కంగలో అతన్ని చేరుకుని లేపడానికి ప్రయత్నించింది. ఆమె వల్ల కాలేదు. ప్రసాద్ చాలా బరువున్నాడని అర్థమై "యిప్పుడే వస్తానుండు" అని బైటికిపరుగెత్తింది. యింటికెళ్ళి అమ్మను పిల్చుకొచ్చింది. యిద్దరూ చెరో రెక్కా పట్టుకుని అతన్ని పైకి లేపిమంచం మీద పడుకోబెట్టారు.

"ఎలా పడ్డావు? ఆంటీ సరిగ్గా పడుకోబెట్టి పోలేదా" అంది రమ్య. కిందపడి ఉన్న బెడ్ ప్యాన్, రూమంతా కాలువలు కట్టి ఉండటం చూసి రమ్య వాళ్ళమ్మకు విషయం అర్థమై "పనమ్మాయిని పంపిస్తానమ్మా. దగ్గరుండి గది శుభ్రం చేయించు" అని చెప్పి వెళ్ళిపోయింది.

పనిపిల్ల వచ్చి గదంతా నీళ్ళతో శుభ్రం చేసి వెళ్ళేవరకు రమ్య ఏమీ మాట్లాడలేదు.

తర్వాత మంచం పక్కన కుర్చీలాక్కుని కూచుని "ఆరోగ్యం ఎలా ఉంటోంది.. మందులు జాగ్రత్తగా వాడ్తున్నావుగా" అంది.

ప్రసాద్ బేలగా తల వూపాడు.

“నీ యం. ఏ తెలుగు ఎలా సాగుతోంది?” అని అడిగింది.

ప్రసాద్ సమాధానం చెప్పలేదు.

“ఇందాక పడిపోయినందుకు బాధపడ్తున్నావా.. కొన్నిటిని జీవితంలో చాలా లైట్‌గా తీసుకోవాలి ప్రసాద్... లేకపోతే బతుకు దుర్భరమైపోతుంది” అంది.

నా బతుకు ఎప్పుడో దుర్భరమైపోయింది అనుకున్నాడతను. కన్నీళ్ళే సమాధానంగా రావడం చూసి అతను మాట్లాడే మూడ్‌లో లేడని అర్థమై “మళ్ళా వస్తాను ప్రసాద్... ఆంటీ వచ్చాక వస్తాలే” అన్చెప్పి వెళ్ళిపోయింది.

రమ్య వెళ్ళిపోయిన మరుక్షణం ప్రసాద్‌కి చచ్చిపోవాలని చాలా బలంగా అన్పించింది.

***

డాక్టర్ సిద్దార్థకు మార్నింగ్ డ్యూటీ... తను వెళ్ళేప్పటికే డాక్టర్ వలీ డ్యూటీలో ఉన్నాడు. పది నుంచీ పన్నెండు వరకు ఓ.పి. యిద్దరూ తమ తమ విధుల్లో బిజీ ఐపోయారు.

సిద్దార్థ చేతులు సబ్బునీళ్ళతో శుభ్రంగా కడుక్కుని తన గదిలోకెళ్ళి కూచున్న పది నిముషాలకు వలీ వచ్చి కలిశాడు.

“యింతమందికి రోగాలెందుకొస్తున్నాయో... మనుషుల్లో సహజంగా ఉండే ఇమ్యూనిటీ తగ్గిపోయిందో లేక మనుషుల దగ్గర డబ్బులెక్కువై ప్రతి చిన్న దానికి హాస్పిటళ్ళకు పరుగెత్తుకొస్తున్నారో అర్థం కావటంలేదు వలీభాయ్” అన్నాడు సిద్దార్థ.

“రెండూ కరెక్టే... పీల్చేగాలి పరిశుభ్రంగా లేకపోవడం... తినే తిండిలో ఉన్న కెమికల్ విషాలు, విటమిన్లు మినరల్స్ లేని జంక్ ఫుడ్‌కి అలవాటు పడటం... వీటన్నిటి వల్ల ఒకప్పుడు మనుషుల్లో ఉండే రోగనిరోధక శక్తి తగ్గిపోయింది. నేను యింటర్ పూర్తయ్యేవరకు మా పల్లెటూరిలోనే ఉన్నాను. ఎపుడూ డాక్టర్ల కోసం వెంపర్లాడిన జ్ఞాపకం లేదు. జ్వరమొస్తే చారన్నమో, ధనియాల కారప్పొడితో అన్నమో తినేవాళ్ళం. బార్లీ నీళ్ళు తాగేవాళ్ళం. అంతే.. రెండు మూడు రోజుల్లో జ్వరం తగ్గిపోయేది. మీరు

చెప్పినట్లు యిప్పుడు మనుషుల్లో ఆరోగ్యం మీద శ్రద్ధ బాగా పెరిగింది. దాంతో పాటు డబ్బులూ పెరిగాయి.”

“ఆరోగ్యం గురించిన అవగాహన ఉండటం మంచిదే. కానీ యిపుడున్నదంతా అనవసరమైన భయాలే”

“కావాలని పని గట్టుకుని ఆ భయాల్ని ప్రజల్లోకి సరఫరా చేసి సొమ్ము చేసుకోవటం కార్పొరేట్ హాస్పిటళ్ళ మార్కెట్ మాయాజాలం. టీవీల్లో డాక్టర్లచేత ఇంటర్వ్యూలు పెట్టించి, ప్రశ్నలు జవాబుల కార్యక్రమాలు పెట్టించి ప్రతి చిన్న రుగ్మతకూ హాస్పిటళ్ళకు వెళ్ళకపోతే చాలా ప్రమాదమనే విషాన్ని ప్రజలకు మెల్లమెల్లగా అలవాటు చేస్తున్నారు”

“నిజమే. ఈ మధ్య టీవిలో ఒక డాక్టర్ చెప్తుండగా విన్నాను. యిరవై యేళ్ళు దాటిన ప్రతి స్త్రీ పాప్ స్మియర్ టెస్టు చేయించుకోవాలట. ఎంతటి దారుణం కదా... అంటే యిరవై యేళ్ళనుంచే క్యాన్సర్ వస్తుందేమోనన్న భయంతో టెస్టులు చేయించుకుంటూ ఉండాలన్మాట. యాభై యేళ్ళు దాటిన వాళ్ళు చేయించుకోవాలని కొన్నేళ్ళ క్రితం చెప్పేవాళ్ళు. అదిప్పుడు యిరవై యేళ్ళకు పడిపోయింది. కొన్నాళ్ళు పోతే పుట్టిన క్షణం నుంచీ టెస్టులవసరం అంటారేమో”

“చిన్నపిల్లలకు కూడా క్యాన్సర్లు వస్తున్నాయిగా... కారణం ఏమని చెప్పగలం... అంతా అల్లా చేతుల్లో ఉంది”

“నేను నమ్మను. అంతా మన చేతుల్లో ఉంది. మన జీన్స్‌లో ఉంది. మన అలవాట్లలో ఉంది. మనం తినే ఆహారంలో ఉంది.”

“ఆహారం అంటే గుర్తొచ్చింది. ఆకలేస్తోంది డాక్టర్ సిద్దార్థ్” అంటూ వాచీ వైపు చూసుకుని “ఒంటిగంట దాటింది. అందుకే కడుపులో అలారం మోగింది” అన్నాడు వలీ.

యిద్దరూ తాము తెచ్చుకున్న టిఫిన్ బాక్సులు తెరచి భోజనం చేస్తున్నపుడు సంభాషణ మెర్సీకిల్లింగ్ వైపుకు మళ్ళింది.

“ఈ రోజు పేపర్ చూశారా... హిమాచల్ ప్రదేశ్‌లో సీమా సూద్ అనే అమ్మాయి ప్రెసిడెంట్‌కి లెటర్ రాసింది... ఆత్మహత్య చేసుకోడానికి పర్మిషన్ యివ్వమని”

"ఆ... నేనూ చదివాను. ఆమె గురించి చదువుతుంటే ఎంత హృదయవిదారకంగా అన్పించిందో... ఎంత బ్రిలియంట్ స్టూడెంటో... అనారోగ్యం వల్ల బతుకెలా మారిపోయిందో పాపం... బిట్స్ పిలానీలో యింజనీరింగ్ కోర్సులో గోల్డ్ మెడలిస్ట్. ఆర్థ్రైటిస్ వల్ల పదమూడేళ్ళనుంచి తన గదిలో బందీగా గడుపుతోందట. అన్ని జాయింట్లు పాడైపోయి కాళ్ళూ చేతులూ కదిలించలేని స్థితి. అమ్మ డెబ్బయ్ యేళ్ళ ముసల్ది... పదేళ్ళ క్రితం మోకాళ్ళ కీళ్ళని రిప్లేస్ చేసారట. మళ్ళా పాడైనాయట. ఆధునిక వైద్యం క్యూర్ చేయలేని రోగాలెన్నో... దుర్భరమైన జీవితం గడపటం కన్నా చావటమే నయం కదా... మన ప్రభుత్వం కూడా మెర్సీ కిల్లింగ్‌ని లీగలైజ్ చేస్తే బావుంటుంది"

"నేనొప్పుకోను. మెర్సీ కిల్లింగ్ అనేది హత్య చేయటం లాంటిదే. అమెరికాలో గిల్బర్ట్ అనే ముసలతను అల్జీమర్స్ వ్యాధితో బాధ పడ్తోన్న తన భార్యని కాల్చి చంపాడు. అతనికి కోర్టులు పాతికేళ్ళ జైలు శిక్షని విధించాయి. అతను కోర్టులో 'నా భార్యంటే నాకు అమితమైన ప్రేమ. అందుకే అదలా బాధ పడ్తుంటే తట్టుకోలేక చంపాను. అది ప్రేమతో, దయతో చేసిన పని. నేను శిక్షార్హుడిని కాను' అన్నాడట. వీళ్ళందరూ మానసిక ఉన్మాదులనిపిస్తోంది. దయతో చంపడమేమిటి వీళ్ళ బొంద? తాము చేసే అమానుష చర్యల్ని, మానసిక రుగ్మతల్ని కప్పి పుచ్చుకునే ప్రయత్నం తప్ప"

"స్విట్జర్లాండ్‌లో డిగ్నిటాస్ అనే ఛారిటబుల్ సంస్థ ఉంది. మనదేశంలో కూడా అలాంటి సంస్థలు పెట్టాల్సిన అవసరం ఉంది."

"డిగ్నిటాసా... నేనెప్పుడూ విన్లేదే... ఏం చేస్తారు వాళ్ళు?"

"ఆ సంస్థని యూథనేషియా చారిటీ అంటారు. వాళ్ళు చేసే పని 'డెత్ ఆన్ వీల్స్.' చావాలనుకునేవాళ్ళకు సాయపడ్తారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునేవాళ్ళు చెప్పిన స్థలానికి వెళ్ళి కార్లో వాళ్ళని కూచోబెట్టి కెమికల్స్‌తో చేసిన కషాయాన్ని యిస్తారు. సదరు క్లయంట్ ఇష్టపూర్వకంగా తాగి చనిపోతాడు. అలా సాయపడినందుకు ఒక్కొక్క క్లయంట్ నుంచి మూడు వేల డాలర్లు కలెక్ట్ చేస్తారు. దాన్ని వాళ్ళు అసిస్టెడ్ సూయిసైడ్ అంటారు"

"అది స్విడ్జర్ల్యాండ్‌లో నేరం కాదా"

"కాదు. ఎవరైతే చావుని కోరుకుంటున్నాడో ఆ వ్యక్తి తనకు తానుగా కషాయాన్ని

తాగేస్తే అది నేరం కిందికి రాదు. బలవంతంగా తాగిస్తే నేరమౌతుంది”

“అసలటువంటి సంస్థ ఉండటమే నేరం. మనదేశంలో యిప్పటికే ఆత్మహత్యలు బాగా పెరిగిపోయాయి. ప్రతి పదినిముషాలకో ఆత్మహత్య చోటు చేసుకుంటోంది. డెత్ ఆన్ వీల్స్ లాంటి సంస్థలో, మెర్సీకిల్లింగో ఉంటే ఇలాంటి అకృత్యాలు మరింత పెరుగుతాయి. శారీరిక బాధల్నుంచి విముక్తి పొందటం కోసం చావుని కోరుకుంటే మానసిక బాధల సంగతేంటి... వాళ్ళూ ఆ బాధలనుంచి విముక్తి కోసం చావాలనుకుంటారు. అప్పుడు చాలా చిన్న చిన్న కారణాలతో మనుషులు చావుని కోరుకుంటారు. అది సమాజానికి ఎంత హాని చేస్తుందో ఆలోచించారా?”

“చావాలనుకునే వ్యక్తుల్ని చావనివ్వకుండా ఈ అవరోధాలేమిటి? ఎవరి బతుకు ఎంత నరకంగా ఉందో అనుభవిస్తున్న ఆ వ్యక్తికి తెలుస్తుంది.. ఈ ప్రభుత్వానికేం తెలుస్తుంది? న్యాయస్థానాలకేం తెలుస్తుంది? బతకటం ఇష్టంలేకున్నా బతకమని బలవంతం చేయటం ఎంత వరకు సబబు? సంతోషంగానూ, దుఃఖ రహితంగానూ బతికే అవకాశం కల్పించలేని అసమర్థ ప్రభుత్వానికి చావొద్దని శాసించే హక్కు ఉండటం మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుంది”

“మీ మాటలు వింటుంటే భయమేస్తోంది డాక్టర్... చివరి క్షణం వరకూ ప్రాణం పోయడానికే తన శాయశక్తులా పోరాడే డాక్టర్‌కు ఉండాల్సిన అభిప్రాయాలేనా ఇవి? మనిషి ప్రాణానికివ్వాల్సిన గౌరవం మీరివ్వటం లేదు. ప్రాణం తీయడానికి మనమెవ్వరం? తన ప్రాణమైనా తను తీసుకునే అధికారం అతనికెవ్వరిచ్చారు?”

సిద్దార్థ సమాధానం చెప్పేలోపల అతని సెల్ మోగింది. హాస్పిటల్ ఓనర్ వెంకటరెడ్డినుంచి ఫోన్.

“ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ గారికి ఆపరేషన్ చేయాల్సింది ఈ రోజే... గుర్తుందిగా... అతని ఎడం భుజంలో పెట్టిన రాడ్‌ని తొలగించాలి. ఆయన్తో మాట్లాడాను. నాలుగింటికి వస్తానన్నారు. మీరు ఆపరేషన్ థియేటర్ని మూడున్నరకల్లా రెడీ చేసి పెట్టండి. ఎనిస్థీషియాలజిస్ట్‌కి ఫోన్ చేశాను. మూడున్నరకల్లా అక్కడ ఉంటానన్నాడు. సర్జన్ గారికి గుర్తు చేయండి. మన కేస్ చూస్తున్న ఆఫీసర్ గారు... జాగ్రత్తగా చూసుకోండి. నథింగ్ షుడ్ గో రాంగ్... మీరు దగ్గరుండి చూసుకుంటారుగా” అన్నాడతను.

"యస్ సర్... నాకు గుర్తుంది. యు నీడ్ నాట్ వర్రీ సార్. ఐ విల్ టేక్ కేర్. నాతోపాటు డాక్టర్ వలీగారు కూడా ఉన్నారు" ఫోన్లో సమాధానమిచ్చాడు.

"ఆపరేషన్ థియేటర్ రెడీ చేయమని హెడ్ నర్స్‌కి చెప్పొస్తానుండండి. మీరు డాక్టర్ శ్రీధర్ గారికి ఫోన్ చేసి ఈ రోజు ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌కు చేయాల్సిన ఆపరేషన్ గుర్తు చేయండి. మిగతా స్టాఫ్‌కి కూడా ముందే చెప్పి పెట్టాను" అన్నాడు సిద్ధార్థ బైటికెళ్ళబోతూ.

మూడున్నరకల్లా ఆపరేషన్‌కి అవసరమైనవన్నీ సిద్ధంగా పెట్టారు. సర్జన్ వచ్చేశాడు. అనీస్థీషియా ఇచ్చే డాక్టర్ వచ్చేశాడు. నర్సులు మిగతా అటెండెంట్లు రెడీగా ఉన్నారు. ఐ.టీ.వో. గారు రావడమే తరువాయి...

సిద్ధార్థ వాచీ చూసుకున్నాడు... మూడున్నర...

"ఇలా విఐపీలకోసం ఎదురుచూట్టం అంటే నాకెంత చిరాకో... వచ్చేవాళ్ళు నిజంగా విఐపీలా? మన దేశంలో ఎవడికి వాడు విఐపీ అనుకునేవాడే... తాటిచెట్టంత ఈగోలు ఒక్కోడికి... మన హాస్పిటల్ కేసు చూసే ఐటీవో కాబట్టి మనం ఇంత హంగామా చేయాలా... ఇది మిస్యూజ్ ఆఫ్ పవర్ కిందికి రాదా? ఎడాపెడా కేసులు పెట్టేయాలి... అప్పటిగ్గాని వీళ్ళకు బుద్ధి రాదు" అన్నాడు డాక్టర్ వలీతో.

"కేసులు పెడ్తే ఏంటి ప్రయోజనం... యేళ్ళకు యేళ్ళు ఎదురుచూసినా తీర్పులు రావుగా... ఈ హాస్పిటల్ నడపటంలో ఎన్ని లొసుగులున్నాయో, అక్రమంగా ఎంత రాబడి ఉందో వెంకటరెడ్డిగారికి బాగా తెలుసు... దొందు దొందే... పరస్పర సహకారం...

సమయం మూడూ యాభై ఐదు... అప్పటికీ పేషంట్ రాలేదు.

'అయ్యా..డాట్టర్ బాబూ... నా పెల్లాన్ని రచ్చించండయ్యా... మీ కాల్మొక్కుతా సారూ... సచ్చిపోయేలా ఉంది సారూ... అది సచ్చిపోతే నేనూ నా బిడ్డలు అన్నేయమై పోతాం సారూ' అంటూ ఏడుస్తూ యాభై యేళ్ళ వ్యక్తి మొదట లోపలికి దూసుకొచ్చాడు. అతని వెనకే ముగ్గురు కుర్రాళ్ళు ఓ స్త్రీని మోసుకొచ్చారు. ఆమె వళ్ళంతా రక్తం... తలలో యిరుక్కుపోయి ఉన్న కొడవలి... రక్తంతో తలస్నానం చేసినట్టు జుట్టంతా రక్తం...

'కోపం తెప్పించింది సారూ... చిత్తుగా తాగున్నా. చేతిలో కొడవలి ఉండినాది. ఒక్క యిసురు యిసిరినా... అది తల తెగ్గోసిన కోడిపెట్టలా గిలగిలా కొట్టుకుంటూ

పడిపోనాది. నా మత్తంతా దిగిపోనాది సారూ... అది లేంది నేను బతకా. యింట్లో ఉన్నదంతా వూడ్సుకొచ్చినా సారూ. యింకా కావాల్నంటే యిల్లు తాకట్టు పెట్టి తెస్తా... నా పెల్లాన్ని బతికించండి సారూ' అంటూ సిద్దార్థ కాళ్ళమీదా వలీ కాళ్ళమీద పడ్డాడు. అంతటితో ఆగకుండా కన్పించిన నర్సుల కాళ్ళమీదా, అటెండర్ల కాళ్ళమీద పడి దొర్లాడు.

"యిది మెడికో లీగల్ కేస్... అంటే పోలీస్ కేస్... ప్రభుత్వాసుపత్రికి పిల్చుకెళ్ళు. యిక్కడ కుదర్దు" అన్నాడు వలీ.

"సారూ... అక్కడికెల్లే లోపలే అది సచ్చిపోద్ది సారూ. మీ ఆస్పత్రి ఎనకే సారూ మేముండేది. ఎంటనే దాన్ని రచ్చించండి... మీ కాల్మొక్త. వుత్త పున్నేనికి సేయమనటం లేదు సారూ. డబ్బులిత్తా... ఎంతడిగితే అంతిస్తా'

"పోలీస్ కేసంటే అర్థం చేసుకోవేం" అన్నాడు వలీ కోపంగా.

"ముందు నా పెల్లాన్ని బతికించండి డాట్రూ... నేను జైలుకెల్లటానికి రెడీగా ఉన్నా. అది సచ్చిపోతే నేనూ సచ్చిపోతా సారూ" అంటూ డాక్టర్ వలీ కాళ్ళను పట్టేసుకుని వలవలా ఏడ్చాడు.

"ఆపరేషన్ థియేటర్ ఖాళీగా లేదు. తొందరగా వేరే హాస్పిటల్‌కి పిల్చుకెళ్ళు. చెప్తుంటే అర్థం చేసుకోవేం... చాలా రక్తం పోయింది. నీ ఆలస్యం వల్ల చచ్చిపోయేలా ఉంది. త్వరగా వెళ్ళు" అన్నాడు వలీ.

"బాబ్బాబు... దయ సూపండి... సచ్చి మీ కడుపున పుడ్తా... నా పెల్లాన్ని బతికించండి"

కాళ్ళను కన్నీళ్ళతో కడుగుతున్నాడతను.

సిద్దార్థ ఫోన్ మోగింది. వెంకటరెడ్డి నుంచి ఫోన్, "ఐ.టి.వో. గారికి అర్జెంట్ పనేదో పడిందట. ఆపరేషన్ రేపు చేయించుకుంటానన్నారు."

ఆ సమాచారాన్ని డాక్టర్ వలీకి చెప్పాడు. యిద్దరూ కళ్ళతో కొన్ని క్షణాలు మాట్లాడుకున్నారు. వలీ దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు. అప్పటికే స్పృహ తప్పిపోయిన ఆమెని స్ట్రెచర్ మీద పడుకోబెట్టి ఆపరేషన్ థియేటర్లోకి తీసుకెళ్ళారు. చకచకా పనులు జరిగిపోతున్నాయి. మరో గంటకల్లా పేషంట్‌ని బైటికి తెచ్చి కామన్ హాల్లోని బెడ్స్ మీద పడుకోబెట్టారు.

"ఆపరేషన్ బాగా జరిగింది. ప్రాణానికేమీ ప్రమాదం లేదు. నువ్వూ నీ భార్యా చాలా అదృష్టవంతులు. నీ భార్య బతికిపోయింది. నీకు ఉరిశిక్ష తప్పిపోయింది" అంటూ అతని భుజం తడ్తూ నవ్వాడు డాక్టర్ వలీ. అతను మరోసారి వలీ కాళ్ళు, సిద్దార్థ కాళ్ళు పట్టుకుని వలవలా ఏడ్చాడు.

యిద్దరూ రూంలోకెళ్ళి సేద తీరుతున్నపుడు వలీ అన్నాడు."చూశారా డాక్టర్ సిద్దార్థ్... ఆమె విషయంలో దేవుడున్నాడని ఎలా రుజువైందో... ఎవరికోసమనో ఆపరేషన్ థియేటర్ రెడీగా ఉంచాం. డాక్టర్లు సర్జన్ అందరం తయారుగా ఉన్నాం. అల్లా ఇదంతా ఆమె ప్రాణాలు కాపాడాలనే చేశాడు. లేకపోతే పేషంట్ వచ్చినప్పటి కండిషన్ చూస్తే మనం ఆపరేషన్ థియేటర్ రెడీ చేసేలోపల, సర్జన్‌కి ఫోన్ చేసి ఆయన వచ్చేలోపల చచ్చిపోయి ఉండేది. అంతా అల్లా లీల కాక మరేమిటి?"

"అంతా ట్రాష్. దేవుని మహిమా కాదు లీలా కాదు. జీవితంలో ఏం జరిగినా అదో ఛాన్స్ మాత్రమే. అదృష్ట దురదృష్టాలంటూ ఉండవు. ఆమె ప్రాణం నిలబడింది కాబట్టి దేవుడున్నాడనుకుంటే... ఒకవేళ ఆ ఐ.టి.వో. వచ్చి ఉంటే ఆమె ప్రాణాలు పోయి ఉండేవి... అప్పుడు దేవుడులేనట్టా? దేవుడనేవాడు ఉంటే ఉండాలి. లేకపోతే లేదు. మనకు మంచి జరిగితే ఉన్నాడనుకుని చెడు జరిగితే లేడనుకోవటం అర్థరహితం"

"మీరు ఎథీయిస్టులు కాబట్టే మెర్సీకిల్లింగ్ లాంటి అమానుష చర్యల్ని సమర్థిస్తున్నారు. హిందువుల్లో శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదంటారు కదా... మా మతం లోనూ అంతే... అల్లా అనుమతి లేకుండా ఏదీ జరగదు. ప్రాణం పొయ్యాలన్నా అల్లానే ప్రాణం తియ్యాలన్నా అల్లానే" అన్నాడు.

"మన హాస్పిటల్లో ఎన్ని అబార్షన్లు జరుగుతున్నాయో మీకు తెల్సిందేగా... మెర్సీ కిల్లింగ్ తప్పయితే అబార్షన్ కూడా తప్పు కావాలి"

"వితండవాదం చేస్తున్నారు డాక్టర్ సిద్దార్థ్... అబార్షన్ అనేది లీగల్లీ పెర్మిటెడ్ కదా"

"అదే నేననేది. లీగల్‌గా పర్మిషన్ యిస్తే మెర్సీ కిల్లింగ్ కూడా తప్పవదు కదా. ఎందుకు ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోలా దాన్ని లీగలైజ్ చేయదు?"

"ఆ రెండూ ఒకటెలా అవుతాయి? మెర్సీ కిల్లింగ్ అంటే ఓ నిండు ప్రాణాన్ని

హరించటం.. ఓ వ్యక్తిని చంపటం. అబార్షన్ అలా కాదే... యింకా జన్మించని... పూర్తిగా రూపు సంతరించుకోని స్థితిలో ఉన్న ప్రెగ్నెన్సీని టెర్మినేట్ చేయడం... యిరవై వారాలు దాటని ప్రెగ్నెన్సీ విషయంలోనే మనం అబార్షన్లని అనుమతిస్తున్నాం. అందులో తప్పేం లేదే"

"ఎంత ఆత్మ వంచన డాక్టర్... మాటల గారడీ తప్ప... అదీ హత్యేగా.. ఓ ప్రాణాన్ని హరించడమే... ప్రాణాల్లో నిండు ప్రాణం సగం ప్రాణం అంటూ తేడాలుండవు. ఏ ప్రాణమైనా ప్రాణమే. మెర్సీ కిల్లింగ్‌లో పేషంట్ అంగీకారంతో అతనికి మరణాన్ని ప్రసాదిస్తారు. యిదలా కాదే, తన కోరికేమిటో చెప్పుకోలేని పసిప్రాణాన్ని దాని అనుమతితో సంబంధం లేకుండా హరించడం అన్యాయం కాదా... పన్నెండు వారాల వయసున్న ఫీటస్‌లో కదలికల్ని ఫిల్మ్ తీసి యింటర్నెట్‌లో పెట్టారు మీరు చూళ్ళేదా... మూడు నెలల ఆ ప్రాణి తన చేతులూ కాళ్ళని కదిలించటం గర్భ కుహరంలో చలనంతో ఉండటం నేను చూశాను. అమెరికాలో యిరవై నాలుగు వారాల ప్రెగ్నెన్సీని టెర్మినేట్ చేయటం చట్టప్రకారం నేరం కాదు. కానీ యిరవై నాలుగు వారాలు పూర్తి కాకుండానే పుట్టిన ప్రిమెచ్యూర్ బేబీలు బతికి బట్టకట్టడం ఎన్ని సందర్భాల్లో జరిగిందో ఒక్కసారి ఆలోచించండి. ఏది నేరం ఏది కాదు అనేది దేశ కాల పరిస్థితుల్ని బట్టి మారిపోతూ ఉంటుంది. ఒకప్పుడు మన దేశంలో అబార్షన్ చేయించుకోవడం శిక్షార్హమైన నేరం... యిపుడు అది చట్ట సమ్మతం."

"మీరు ఈ దేశానికి ప్రెసిడెంటో ప్రైమ్ మినిష్టరో ఐనపుడు మెర్సీ కిల్లింగ్‌ని చట్ట సమ్మతం చేయండి... యిలా మనం శుష్క వాదనలు చేసుకోవటం వల్ల ప్రయోజనం ఏముంది?" అన్నాడు నవ్వుతూ వలీ.

అతనికి రేపు నైట్ డ్యూటీ ఉంది. కానీ రేపతని పెళ్ళి రోజు. ఎలాగైనా సిద్ధార్థని ఒప్పించి తన బదులు అతన్ని నైట్ డ్యూటీ చేయమని అభ్యర్థించాలనేది అతని ఆలోచన. యిటువంటి సమయంలో వాదించి అతని మనసుని నొప్పించడం వల్ల అతను ఒప్పుకోకపోవచ్చనే భయం ఉంది. అందుకే నవ్వుతూ టాపిక్‌ని మార్చాడు.

మరునాడు డాక్టర్ వలీ స్థానంలో సిద్ధార్థ నైట్ డ్యూటీలో దిగాడు.

గత పది రోజులుగా తన మనసులో జరుగుతున్న సంఘర్షణకు ఈ రోజు చరమగీతం

పాడాలనుకున్నాడు. ఆ సంఘర్షణకు కారణం పది రోజుల క్రితం తమ హాస్పిటల్లో చేరిన క్యాన్సర్‌పేషంట్... డెబ్బయ్ యేళ్ళ వయసు. బ్రాందీ విస్కీలు తాగితాగి లివర్ క్యాన్సర్ తెచ్చుకున్నాడు. కీమోథెరపీ, చెడిపోయిన భాగాన్ని తొలగించే ఆపరేషన్... అన్నీ జరిగాయి. క్యాన్సర్ మిగతా శరీర భాగాలకు కూడా పాకింది. చివరి స్టేజ్... డాక్టర్లు కూడా ఏమీ చేయలేని పరిస్థితి.

రోగి నరకతయాతన పడ్తున్నాడు. కొడుకులు ఈ హాస్పిటల్లో పడేసి వెళ్ళిపోయారు. డబ్బులు పడేస్తున్నాం చాలు. ఇంతకంటే ఏం చేయగలం అనేలా ఉంది వాళ్ళ ప్రవర్తన. అతన్ని చూసుకోడానికి భార్య లేదు. కోడళ్ళకు సపర్యలు చేసేంత తీరికా ఓపికా రెండూ లేవు. అందుకే అతన్ని ఆదుకోవాల్సిన బాధ్యత తన మీద ఉందనుకున్నాడు. మరో కారుణ్య చర్య తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందనే నిర్ణయానికొచ్చాడు.

***

సరోజకు రోజూ సాయంత్రమయ్యేటప్పటికి వళ్ళునొప్పులుగా సలపరంగా అన్పిస్తోంది. నిస్సత్తువగా అన్పిస్తోంది. డాక్టర్ దగ్గరకెళ్ళడానికి వారం రోజుల్నుంచీ తాత్సారం చేస్తోంది. ఆ రోజు ఆదివారం కాబట్టి ఒకసారి వెళ్ళి డాక్టర్‌కి చూపించుకుంటే మంచిదనిపించింది. వంట చేసాక ప్రసాద్‌కి తిన్పించి, యింటికి దగ్గర్లో ఉన్న తమ ఫ్యామిలీ డాక్టర్ రాజారావు దగ్గరకెళ్ళింది.

"ఏమ్మా... ఎలా ఉన్నారు? బాబుకెలా ఉంది? చాలా రోజులైంది మిమ్మల్ని చూసి" అన్నాడు డాక్టర్.

"ఈ మధ్య గొంతు కండరాలు బలహీనపడటం వల్ల మాట సరిగ్గా మాట్లాడలేకపోతున్నాడు. అన్నం మెత్తగా చేసి తిన్పించమని డాక్టర్ చెప్పాడు... ముందు ముందు వూపిరి తిత్తులు కూడా సరిగ్గా పని చేయవనీ అపుడు కృత్రిమ శ్వాస పైనే ఆధారపడాల్సి వస్తుందని డాక్టర్లు చెప్పినప్పటినుండి భయమేస్తోంది"

"ఆ జబ్బే అలాంటిదమ్మా. మెల్లమెల్లగా ప్రాణాల్ని హరించే మహమ్మారి. మీరు గుండె రాయి చేసుకుని అన్నిటికీ సిద్ధంగా ఉండాలి" అన్నాడు.

సరోజ చెప్పిన అనారోగ్య లక్షణాలు విన్నాక "వయసు పెరిగింది కదమ్మా... అటు బ్యాంక్ పని, ఇటు అబ్బాయిని చూసుకోవాలి... శారీరక శ్రమతో పాటు మానసికంగా

ఎంతటి వత్తిడి మీకు... వళ్ళు నొప్పులు తలనొప్పి లాంటి చిన్న చిన్న రుగ్మతలు మామూలేనమ్మా. నేను మందులు రాసిస్తాను. ఓ వారం వాడాక చూద్దాం. ఎందుకైనా మంచిది... బ్లడ్ టెస్టు, యూరిన్ టెస్టు రాస్తున్నాను... చేయించండి. ఈ మధ్య కాలంలో ఎపుడైనా పాప్ స్మియర్ టెస్ట్ చేయించారా?"

"లేదు డాక్టర్"

"యాభై దాటాక ఆడవాళ్ళు క్రమం తప్పకుండా ప్రతేడాది పాప్ స్మియర్ టెస్ట్ చేయించాలమ్మా. అదీ రాస్తున్నాను. చేయించాక రిపోర్టులు పట్టుకుని రండి... అవసరమైతే అప్పుడు మందులు మారుస్తాను" అన్నాడు.

సరోజ మరునాడు బ్యాంక్‌కి వెళ్ళేముందు విజయా డయాగ్నొస్టిక్ సెంటర్ కెళ్ళి శాంపిల్స్ యిచ్చి బ్యాంక్‌కెళ్ళి పోయింది.

రెండ్రోజుల తర్వాత బ్యాంక్ నుంచి యింటికెళ్ళే ముందు రిపోర్టులు తెచ్చుకుందామనుకుంది. వెంటనే ప్రసాద్ గుర్తొచ్చాడు. యింట్లో ఏ పరిస్థితుల్లో ఉన్నాడో... ఎప్పుడూ భయమే... వూహించనిదేదైనా జరుగుతుందేమోనని. శ్వాస తీసుకునేదాన్లో యిబ్బందులు యిపుడిపుడే బైట పడ్తున్నాయి. అంచెలంచెలుగా కాకుండా ఒక్కోసారి అకస్మాత్తుగా సమస్య పెద్దది కావచ్చని డాక్టర్లు హెచ్చరించారు. అప్పటినుండీ ప్రతిరోజూ కంగారుపడ్తూనే యింటికెళ్తుంది. తను బ్యాంక్‌లో ఉన్నపుడు రెండు మూడు సార్లు యింటికెళ్ళి ప్రసాద్‌ని చూస్తూ ఉండమని రెండిళ్ళవతల ఉన్న రమ్య వాళ్ళ అమ్మని బ్రతిమాలుకుంది. బ్యాంక్‌లో పనిచేస్తున్నంత సేపూ తనకు ప్రసాద్ ధ్యాసే... ఫోన్ మోగినపుడల్లా గుండె ఝల్లుమంటుంది... రమ్య వాళ్ళమ్మనుంచి ఫోనేమో... ఎటువంటి వార్త వినాల్సి వస్తుందోనని భయం...

రమ్య యింటికొచ్చిపోయినప్పటినుండి తన కొడుకులో వచ్చిన మార్పుని గమనించిందామె. గొంతు కండరాలు మరింతగా దెబ్బతిన్నాయి. మెత్తటి అన్నం కూడా మింగలేక పోతున్నాడు. మాట మరింత తడబడ్తోంది. మాట్లాడుతున్నప్పుడు గొంతులోంచి గురగురమని శబ్దం చేస్తూ గాలి బైటికొస్తోంది. మనిషిలో అస్థిమితం పెరిగింది. చూపులో దిగులు స్థానే ఏదో కసి కన్పిస్తోంది. ఒక్కోసారి తన వైపు కోపంగా చూస్తున్నాడు. బాగా పరిశీలిస్తే అతను చూస్తుంది తనవైపు కాదు... ఎక్కడో అనంతంలోకి చూస్తున్నాడు.

ఎవరిమీద కోపం? తనమీద తనకే కోపమా... తను బతుకుతున్న బతుకుమీద కోపమా... ఆమె చాలా వ్యాకులపాటుకి లోనవుతోంది. దానికి తోడు సతాయిస్తున్న తన అనారోగ్యం...

యింటికి రాగానే మొదట ప్రసాద్ గదిలోకెళ్ళి చూసుకుంది. తనని చూడగానే అతను కళ్ళు తిప్పి ఒకసారి చూసి మళ్ళా సీలింగ్ వైపుకి చూపు తిప్పేసాడు. బెడ్ ప్యాన్‌ని తీసి బాత్రూంలో క్లీన్ చేస్తూ ఆమె ఆలోచిస్తోంది. ఆ చూపు కర్థమేంటి... ఒకప్పుడు తన రాక కోసం ఎదురుచూసేవాడు. తను కన్పించగానే మొహంలో సంతోషం స్పష్టంగా కన్పించేది. కొద్దిసేపు తన పక్కన కూచుని కబుర్లు చెప్పమని సతాయించేవాడు. 'ఉదయం వది నుంచీ ఒంటరిగా ఉన్నాను కదమ్మా... బోర్‌డమ్‌తో చచ్చిపోతానేమోననిపిస్తోంది. కొద్దిసేపు మాట్లాడమ్మా' అనేవాడు.

'ఏముంటాయి నాన్నా కబుర్లు... బ్యాంక్‌లో రొటీన్ వర్క్... వంట చేయాలి కదా... యిప్పటికే ఆలస్యమైంది. ఆకలేయడం లేదా' అనేది తను.

'ఆకలిగా లేదు మమ్మీ... అన్నం ఆకలి లేదు గానీ తోడుకోసం ఆకలిగా ఉంది. ఈ ఒంటరితనాన్ని భరించటం చాలా కష్టంగా ఉంది మమ్మీ. ఈ జబ్బు నన్ను భయపెట్టడం మానేసి చాలా రోజులైంది. కానీ ఒంటరితనం భయపెడ్తోంది. కొద్దిసేపు నా పక్కనే కూచోమమ్మీ... ఏదో ఒకటి మాట్లాడు. నీ గొంతు వినాలి... అంతే చాలు... ఏ గొంతయినా పర్లేదు మమ్మీ... నేను ఒంటరిగా లేనని భరోసా యిస్తూ ఏ గొంతైనా వినిపిస్తుంటే బావుంటుంది' అనేవాడు.

ఓ వారం నుంచి తన పక్కన కూచోమని అడగటం లేదు. అసలీ ప్రపంచంతో సంబంధం లేనట్టు అన్యమనస్కంగా ఉంటున్నాడు.

రిపోర్టులకోసం డయాగ్నొస్టిక్ సెంటర్ కెళ్ళబోతూ "నాకోచిన్న పనుంది. హిమాయత్ నగర్ దాకా వెళ్ళి వస్తాను. వెళ్ళిరానా" అంది.

"ఎంత సేపట్లో వస్తావు మమ్మీ?"

"గంట గంటన్నర పట్టొచ్చు నాన్నా. ఏమైనా కావాలా?"

"కావాలి మమ్మీ... ఏమడిగినా యిస్తావా?"

అతని గొంతులో స్పష్టత లేకున్నా ఆమెకు మాత్రం బాగా అర్థమౌతోంది.

"అడిగి చూడు... యిస్తానో యివ్వనో తెలుస్తుంది"

"యివ్వలేవు మమ్మీ."

"నేను బతికేది నీ కోసమే నాన్నా... ఏం కావాలో చెప్పు. తప్పకుండా తెచ్చిపెడ్తాను. అది నా శక్తికి మించిందైనా పర్లేదు తల తాకట్టు పెట్టయినా తెచ్చిస్తాను"

"నాకింత విషం తెచ్చి పెట్టు మమ్మీ" అన్నాడు ప్రసాద్... అతని కళ్ళలో ఏదో మొండితనం.

"అయ్యో అదేం మాట నాయనా... అలాంటి ఆలోచనే మనసులోకి రానివ్వొద్దు. నువ్వలా మాట్లాడితే నేను బాధ పడ్తానని తెలీదా?" ఆమెకు ఏడుపు తన్నుకొచ్చింది.

"ఈ బాధలన్నీ భరించేకన్నా చావటమే మంచిది మమ్మీ. నాకింక ఓపిక లేదమ్మా... బతకాలని లేదు. ఎందుకమ్మా ఈ బతుకు? వ్యర్థమైన బతుకు... దుర్భరమైన బతుకు... దేనికీ కొరగాని బతుకు. నాకీ హీనమైన బతుకునుంచి విముక్తి ప్రసాదించు మమ్మీ" అన్నాడు. అతని కళ్ళలో నీటి తడి...

"తప్పు నాన్నా... అలా అనకు. నీది వ్యర్థమైన బతుకు ఎందుకవుతుంది?"

"మరి ఎవరికోసం బతుకుతున్నట్టు మమ్మీ?"

"నా కోసం బతుకుతున్నావు... నేను నీ కోసం బతుకుతున్నాను. నువ్వలాంటిదేమైనా చేసుకుంటే నా బతుక్కి అర్థం ఉండదు. నేనూ ఆత్మహత్య చేసుకుంటాను"

"వద్దు మమ్మీ... నువ్వలా అనకు. ఆ వూహనే తట్టుకోలేను?"

"మరి నువ్వలా అంటే కన్న తల్లిని... నేనెలా తట్టుకోగలను"

"నీ చేత చేయిస్తున్న కొన్ని పనులు చూస్తున్నపుడు చచ్చిపోవాలనిపిస్తుంది మమ్మీ. నేను పాస్ కెళ్ళినా రెంటికెళ్ళినా నువ్వే శుభ్రం చేయాలి. స్నానం నువ్వే చేయించాలి. వళ్ళంతా నువ్వే తుడవాలి. బట్టలు తొడగాలి. సిగ్గుతో కుంచించుకు పోతున్నాను మమ్మీ. రోజుకలా ఎన్నిసార్లు చచ్చిపోతున్నానో"

"నీకెన్నేళ్ళొచ్చినా నాకళ్ళకు పిల్లాడివే బాబూ. మనసులోకి అలాంటి భావనల్ని రానివ్వకు. నీకవన్నీ చేస్తుంది మీ అమ్మేగా"

"అందుకే మరింత బాధనిపిస్తుంది మమ్మీ... అమ్మను సుఖపెట్టాల్సిన వయసులో

నా భారం కూడా మోపి కష్టపెడ్తున్నా"

"నా కొడుకు నాకు భారమెందుకవుతాడు? నీలాంటి నలుగురు కొడుకులున్నా నేను భారమనుకోను. నా పిల్లలకోసం వూడిగం చేయమన్నా సంతోషంగా చేస్తాను"

ప్రసాద్‌ని చుట్టుకుని చాలాసేపు ఆమె ఏడుస్తూ ఉండిపోయింది.

"నువ్వెక్కడికో వెళ్ళాలన్నావు కదమ్మా... తొందరగా వెళ్ళిరా" అన్నాడు.

"నా మీద ఒట్టేయి... ఏ అఘాయిత్యమూ చేసుకోనని" ఆమె చేతిని ముందుకు చాపింది.

"ప్రామిస్ మమ్మీ..." అన్నాడు అమ్మ వైపు ఆరాధనగా చూస్తూ.

ఆమె మొదట విజయా డయాగ్నొస్టిక్ సెంటర్ కెళ్ళి రిపోర్టులు తీసుకుంది. అట్నుంచి తమ ఫ్యామిలీ డాక్టర్ దగ్గరకెళ్ళి రిపోర్టులు చూపించింది.

కొన్ని నిముషాలు ఆ రిపోర్టులని శ్రద్ధగా చూశాక "ఏదో సమస్య ఉన్నట్టుందమ్మా. మరికొన్ని టెస్టులు చేస్తే తప్ప నిర్ధారించలేం. ఎందుకైనా మంచిది డాక్టర్ రఘుకి చూపించండి. నేను స్లిప్ రాసిస్తాను. ఆయనైతే ఆ ఫీల్డ్‌లో బాగా అనుభవమున్న వ్యక్తి" అంటూ వాచ్ చూసి "ఈ టైంకి అపోలోలో ఉంటారమ్మా. ఆలస్యం దేనికి? వెళ్ళిరండి" అన్నాడు.

సరోజ అపోలో హాస్పిటల్ చేరుకుని "డాక్టర్ రఘు గారున్నారా" అని రిసెప్షన్‌లో ఎంక్వయిరీ చేసింది.

"ఉన్నారమ్మా... ఫస్ట్ ఫ్లోర్‌లో నాలుగో రూం. యింకో పదినిముషాలైతే వెళ్ళిపోతారు. తొందరగా వెళ్ళండి. నేను ఫోన్ చేసి చెప్తాను" అన్నాడు రిసెప్షనిష్ట్.

ఆమె మెట్లెక్కి ఫస్ట్ ఫ్లోర్ కెళ్ళింది. నాలుగో నంబర్ రూం దగ్గరకెళ్ళి తలుపు మీదున్న బోర్డ్ చూసి టక్కున ఆగిపోయింది.

డాక్టర్ రఘు, ఆంకాలజిష్ట్ అని రాసి ఉంది.

ఆంకాలజిష్ట్ దగ్గరకా తనను వెళ్ళమంది? ఎవరో బాగా పేరున్న యం.డి. దగ్గరకనుకుంది. ఆంకాలజిష్ట్ అంటే క్యాన్సర్ స్పెషలిష్ట్ కదా... యితని దగ్గరకెందుకెళ్ళమన్నాడు? ఆమెకు చప్పున భయమేసింది.

తను ఆరోగ్యంగానే ఉందిగా... ఈ మధ్య కొద్దిగా నీరసంగా ఉంటోంది. వళ్ళు నొప్పులుగా సలపరంగా ఉంటోంది. వైరల్ ఫీవర్ కావొచ్చు... లో జ్వరం... అంతేగా... దానికి ఆంకాలజిస్ట్ దేనికి? ఆలోచిస్తూనే తలుపు మీద మెల్లగా రెండుసార్లు కొట్టి లోపలికెళ్ళింది. డెబ్బయ్ యేళ్ళ వయసుంటుంది డాక్టర్‌కి. మనిషి తెల్లగా దబ్బపండు రంగులో ఉన్నాడు. వెండి జలతారులా తెల్లటి జుట్టు...

రిపోర్టులు చూసి, సరోజ వైపు చూసాడతను.

"మరికొన్ని టెస్టులు చేయించాలమ్మా, రాసిస్తాను... వెంటనే చేయించండి" అన్నాడు.

"యిన్ని టెస్టులు అవసరమా డాక్టర్? ఏమైనా ప్రాబ్లెం ఉందా?" భయం భయంగా అడిగింది.

"ఓ డౌట్ ఉందమ్మా. క్లియర్ చేసుకోవాలంటే ఇవన్నీ చేయించక తప్పదు."

"ఏమిటా డౌట్?"

"యుటెరస్ క్యాన్సర్ అని అనుమానం... అదీ అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉందనిపిస్తుంది. చూద్దాం. భగవంతుడి అనుగ్రహమైనా ఆగ్రహమైనా మహా ప్రసాదమని భరించక తప్పదు కదమ్మా. మన చేతుల్లో ఏముంది? నిమిత్త మాత్రులం" అన్నాడతను.

ఆమె ఏమీ మాట్లాడలేదు. అతనికివ్వాల్సిన ఫీజిచ్చేసి యింటికొచ్చేసింది.

తొందరగా వంట చేసేసి ప్రసాద్‌కి తినిపించింది. తనకేమీ తినాలనిపించలేదు. వెళ్ళిపడుకున్నాక డాక్టర్ చెప్పిన మాటల్ని గుర్తుకు తెచ్చుకుంది. 'యుటెరస్ క్యాన్సరని డౌటుగా ఉందమ్మా' ఆ మాట వినగానే ఆమెకు తన చావు గురించో తనకొచ్చిన ప్రాణాంతక వ్యాధి గురించో దిగులనిపించలేదు. ప్రసాద్‌ని తల్చుకుని దిగులనిపించింది.

తను లేకపోతే ప్రసాద్‌ని ఎవరు చూసుకుంటారు? ప్రసాద్‌కి సపర్యలన్నీ ఎవరు చేస్తారు? ఉన్న స్వంత యింటిని ఎవరిపేరుమీదైనా రాసిస్తే వాళ్ళు చూస్తారేమో... డబ్బు కోసం చేసేవాళ్ళు విసుక్కోకుండా చేస్తారా... కేవలం అమ్మ మాత్రమే చేయగల పనులు వేరేవాళ్ళు చేస్తారా... అయ్యో భగవంతుడా... ఇటువంటి సమస్య పగవాడిక్కూడా రాకూడదు.

తమ ఫ్యామిలీ డాక్టర్ నడిగి ఎవర్నయినా నర్సుని మాట్లాడిపెట్టమంటేనో...

కొంత డబ్బు బ్యాంక్‌లోవేసి నెలకింత జీతమని నర్సుకి యిచ్చే ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది?

తన తమ్ముడి ఫ్యామిలీ అమెరికాలో ఉంది. వాణ్ణి ట్రస్టీగా పెట్టి యిల్లమ్మిన డబ్బు ట్రస్ట్‌లో పెట్టి బెనిఫిషియరీగా తన కొడుకుని పెడ్తేనో... ఆశ్రమంలో వున్న అమ్మని పిలిపించుకుంటేనో... ఈ వయసులో ప్రశాంతత కోసం ఆశ్రమంలో చేరిన అమ్మని ఇబ్బంది పెట్టడానికి మనసొప్పలేదు. పెయిడ్ ఓల్డేజీ హోమ్‌లు ఇపుడు చాలా ఉన్నాయి. తన ఆస్తంతా వాళ్ళకు రాసిచ్చేసి బాబు బతికున్నంత కాలం వైద్య సేవలందించాలని అగ్రిమెంట్ రాయించుకుంటేనో...

ఆలోచనలు తెగడం లేదు. ఏది ఆలోచించినా తృప్తిగా అన్పించడం లేదు.

అమ్మ చేసే సేవకు ప్రత్యామ్నాయాలుంటాయా... ఏదో ఒక మార్గం ఎన్నుకుని దాంతో సమాధానపడటమే తప్ప మరో గత్యంతరం లేదు.

ఓ వారం వరకు రకరకాల పరీక్షలు చేస్తూనే ఉన్నారు. చివరికి యుటెరస్ క్యాన్సర్ అనే విషయాన్ని నిర్ధారించారు.

"ఏ స్టేజ్లో ఉందో దాచకుండా చెప్పండి డాక్టర్... నేను చనిపోయేలోపల చక్కదిద్దాల్సిన పనులు చాలా ఉన్నాయి. అందువల్ల యింకెంతకాలం బతుకుతానో ఖచ్చితంగా చెప్పండి" అంది డాక్టర్ రఘుతో.

"మీరు మీ అరోగ్యాన్ని బాగా నిర్లక్ష్యం చేశారనిపిస్తోందమ్మా. శరీరంలో జబ్బు ఉన్నపుడు మనకు రకరకాల సిగ్నల్స్ ద్వారా తెలియబరుస్తూ ఉంటుంది. అటువంటి హెచ్చరికల్ని నిర్లక్ష్యం చేయకూడదు. మీకు క్యాన్సర్ చాలా రోజుల్నుంచీ ఉంది. ప్రస్తుతం సెకండ్ స్టేజ్‌లో ఉందమ్మా. మహాఅయితే మరో రెండుమూడేళ్ళు జీవితకాలాన్ని పొడిగించవచ్చు."

తను చనిపోకముందే ప్రసాద్ విషయంలో ఏదో ఓ ఏర్పాటు చేయాలి అనీ తీవ్రంగా ఆలోచిస్తోన్న ఆమెకు మొట్టమొదటిసారి ఒక ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనకే ఆమె భయకంపితురాలైంది. తనకేనా అటువంటి ఆలోచన వచ్చింది? కన్న తల్లిగా కాకుండా కసాయిదానిలా ఆలోచిస్తున్నదేమిటి? మనసెలా వచ్చింది తనకు? పరిస్థితులు మనుషుల్ని రాక్షసులుగా మారుస్తాయంటారు... ఇదేనేమో...

తన కంటే ముందు ప్రసాద్ చనిపోతే బావుంటుందన్న ఆలోచన తనకెలా వచ్చింది?

ఆ ఆలోచనని మనసులోంచి తుడిపేసుకుంది. కానీ అది పూర్తిగా అదృశ్యం కాలేదు. మెదడు పొరల్లో ఎక్కడో దాక్కుని మధ్య మధ్యలో అనాయాసంగానే బైటికొచ్చి కలవరపెడుతోంది. తినగ తినగ వేము తీయనుండు అంటారే.. ఆలోచించగా ఆలోచించగా ఆ ఆలోచనే బాగుందనిపిస్తోంది. తనకన్నా ముందు తన కొడుకు చనిపోవటం జరిగితే తను మనశ్శాంతిగా చనిపోతుంది.

కానీ తన చేతుల్లో ఏమీ లేదుగా... అంతా దేవుడి ఇష్టం... భగవంతుడా నా కొడుకుని ముందుగా తీస్కెళ్ళిపో అని వేడుకోవటం తప్ప తనేం చేయగలదు? దేవుడా... తన కొడుకు బాగుండాలని కోరుకోవాల్సిన తల్లే వాడి ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి త్వరగా చచ్చిపోవాలని కోరుకోవటం ఎంతటి దారుణం... అసహాయత.. తప్పో ఒప్పో వాడు ముందు చావటమే మంచిది అనే నిర్ణయానికొచ్చింది.

***

అక్షర లేచే సమయానికే కిరణ్ పేపర్ చదువుతూ కన్పించాడు.

"నాకంటే ముందే లేచావే ఈ రోజు" వస్తున్న ఆవులింతకు వత్తాసుగా చిటికె వేస్తూ అంది అక్షర.

"అసలు విషయం అది కాదు. నువ్వీ రోజు నాకంటే ఆలస్యంగా నిద్రలేచావు. రాత్రి సరిగ్గా నిద్ర పోలేదు కదా"

అక్షర నవ్వింది. "ఈ రోజు ప్రణవి కేసులో జడ్జిమెంట్ చెప్పే రోజు. టెన్షన్ పడ్తానని నీకు తెల్సుగా"

"మొదటి కేస్ వాదించినపుడు తీర్పు ఎలా వస్తుందోనని టెన్షన్ పడటంలో అర్థం ఉంది. ఇప్పటి వరకు ఎన్నో కేసులు వాదించి ఉంటావు. ఐనా టెన్షన్ పడటం చూస్తుంటే నవ్వొస్తోంది"

"నీకు నవ్వొచ్చినా కోపం వచ్చినా ఏమీ చేయలేను కిరణ్. నాకు ప్రతికేసూ ఫస్ట్ కేస్ లానే అన్పిస్తుంది. తీర్పు నాక్లయింట్‌కి అనుకూలంగా వచ్చేవరకూ సరిగ్గా నిద్ర పట్టదు"

"కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన అని భగవద్గీతలో చెప్పింది విన్లేదా? మన శక్తివంచన లేకుండా ప్రయత్నించడమే మన కర్తవ్యం. ఫలితం మన చేతుల్లో ఉండదు"

"ఎందుకీ శుష్క వాదన? నేనే విషయాన్నయినా నా క్లయింట్ కర్మఫలమని వదిలేయలేను. కర్మఫలాలూ విధిలిఖితాలూ అంతా ట్రాష్. నేను కొంత మంది లాయర్లకుమల్లే అన్యాయాలు అక్రమాలు చేసేవాళ్ళ కొమ్ము కాయటం లేదు. నాకు ధనార్జన కన్నా న్యాయం ధర్మం గెలిచేలా చేయటమే ముఖ్యం. నేను న్యాయం ఉన్న వైపే నిలబడి పోరాడుతున్నాను కాబట్టి సహజంగానే తీర్పు మరోలా ఉంటే భరించలేను. న్యాయానికి అన్యాయం జరిగితే మనసు విలవిల్లాడి పోతుంది. నిప్పుకి చెద పట్టినంతగా బాధేస్తుంది"

"ఈ కేస్‌లోనూ గెలుపు నీదే అక్షరా... నువ్వు చాలా బాగా వాదించావు. నేను విన్నానుగా. మొదట లేచి రెడీ అవ్వు... కోర్టుకెళ్ళాలిగా" అన్నాడు.

అక్షర లేచి కూచుని తన కాళ్ళని లాక్కుని కిందికి జారవిడవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు కిరణ్ వెంటనే లేచి అక్షరని ఎత్తుకుని చక్రాల కుర్చీలో కూచోబెట్టాడు.

"నేను చేసుకోడానికి అలవాటు పడ్డ పనుల్ని కూడా నన్ను చేసుకోనివ్వవా?" భర్త వైపు మురిపెంగా చూస్తూ అంది.

"నువ్వు చేయాల్సిన పనులు వేరే ఉన్నాయి అక్షరా... ఇప్పటికే స్త్రీల హక్కుల కోసం పోరాడుతున్న వ్యక్తిగా సంఘంలో పేరు ప్రఖ్యాతులు సంపాయించావు. జడ్జీల దృష్టిలో నంబర్ వన్ లాయర్‌గా నిరూపించుకుంటున్నావు. స్త్రీల సమస్యల గురించో ఫిజికల్లీ ఛాలెంజెడ్ వ్యక్తుల సమస్యల గురించో మాట్లాడమని స్వచ్ఛంద సంస్థలు పిలిచినపుడు అక్కడ మంచి వక్తగా కొనియాడబడ్తున్నావు... నువ్వు అష్టావధానిలా ఇన్ని కార్యాలు చక్కబెడ్తుంటే నీ విజయాల్లో నాకూ భాగస్వామ్యముందని చెప్పుకోడానికైనా కొద్దిగానైనా సాయపడనీ" చక్రాల కుర్చీని బాత్రూంలోకి నెట్టుకెళ్తూ అన్నాడు.

"నా విజయాలకు ఒకప్పుడు కారణం అమ్మానాన్న. కానీ ప్రస్తుతం మాత్రం నువ్వే కిరణ్. నీ మోరల్ సపోర్ట్ లేకపోతే... నీ మమతానురాగాలు లేకపోతే ఏమైపోయి ఉండేదాన్నో. నన్ను బతికిస్తున్న చోదక శక్తి నీ ప్రేమే" అంటున్నప్పుడు ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆమె బ్రష్ చేసుకోవటం పూర్తయ్యాక స్నానం చేయిస్తానంటే “వద్దు కిరణ్. నాకు సిగ్గనిపిస్తుంది. అమ్మను పిలువ్” అంది.

“అబ్బా... రోజూ ప్రహసనం చేస్తున్నావు కదా. అమ్మ దగ్గర సిగ్గుపడవా?”

“ఇప్పటికీ అమ్మ నన్ను పసిపిల్లలా చూస్తుంది. అందుకు”

“పిచ్చిదానా... నాకూ నువ్వు పసిపిల్లలానే కన్పిస్తావు. నీకు స్నానం చేయిస్తున్నప్పుడు నువ్వు పసిపిల్లవే. నీకు అన్నం ముద్దలు కలిపి తిన్పిస్తున్నప్పుడు నాకళ్ళకు చిన్నపిల్లవే. నేనుండగా మీ అమ్మనెందుకు శ్రమ పెట్టడం... నీకు స్నానం చేయిస్తున్నంత సేపు నేనే మీ అమ్మను... మారాం చేయకుండా తొందరగా కానీయ్. ఇప్పటికే ఆలస్యమైంది” అన్నాడు.

ఇద్దరూ తయారయ్యాక డైనింగ్ టేబుల్ దగ్గర టిఫిన్ చేయడానికి కూచున్నారు.

“అమ్మా! తొందరగా రా కోర్టుకి లేటవుతోంది. ఇంతకూ ఈ రోజు బ్రేక్ ఫాస్టకి ఏం చేశావు” అమ్మకు విన్పించేలా గొంతు పెంచి అడిగింది.

“నీకిష్టమని దోశెలూ వేరుశెనగపప్పు పచ్చడి చేశాను తల్లీ. మీరు దిగాక వేడివేడిగా వేద్దామని ఆగాను. ఒక్క రెణ్ణిముషాలు...” వంట గదిలోంచి సమాధానం వచ్చింది.

“కిరణ్... తీర్పు మనం వూహిస్తున్నట్టే ఉంటుందిగా”

“తప్పకుండా... నాకా నమ్మకముంది. ఐనా నీకా అనుమానం ఎందుకొస్తోంది?”

“న్యాయం నడిబజార్లో అమ్ముడు పోతున్న రోజులు కదా. అన్యాయాన్ని న్యాయమని నమ్మించడానికి ఎన్ని ప్రలోభాలో... ఎన్ని వత్తిళ్ళో... ఆర్థిక, రాజకీయ, కుల, ప్రాంత ప్రభావాలు... నేనిప్పటివరకు ఓడిపోయిన కేసుల్ని పరిశీలిస్తే అందులో అధికభాగం ఈ కారణాల వల్లనే... అందుకూ భయం”

“ఈ కేసులో ప్రతివాది అంతకు సమర్థుడే. ఎంత నీచుడు కాకపోతే అమాయకుల్ని, అభాగ్యుల్ని ఆదుకోవాల్సిన ఎస్సయ్ ఉద్యోగం చేస్తూ అభం శుభం తెలీని ఆడపిల్లని మోసం చేస్తాడు?”

“ఆ రోజు నీకు గుర్తుందా... ప్రణవి మన ఆఫీసుకి వచ్చిన రోజు... నాజూగ్గా... అమాయకంగా... అలాంటి అమ్మాయిని మోసం చేయడానికి వాడికి మనసెలా

ఒప్పిందో... ప్రేమించానని వెంటపడి... మాయమాటలు చెప్పి... పెళ్ళి చేసుకుంటానని నమ్మించి... శారీరిక వాంఛలు తీర్చుకుని... చివరికి పదిలక్షల కట్నంతో తన కులం అమ్మాయిని పెళ్ళి చేసుకోడానికి సిద్ధపడ్డాడంటే... వాణ్ణి క్షమించకూడదు. వాడికి శిక్ష పడి తీరాలి"

"ఇందులో మరో కోణం నువ్వు ఆలోచించడం లేదు అక్షరా... ఇన్ని ఘోరాలు జరుగుతున్నాయని తెలిసి కూడా ఆడపిల్లలు ఇలాంటి మోసగాళ్ళ ఉచ్చులో ఎలా పడ్తున్నారు? ప్రణవి విషయమే తీసుకో. ఏడో తరగతితో చదువాగిపోయింది. నాన్నా అమ్మ ప్రైవేట్ సంస్థల్లో చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఆ ఎస్సయ్ వెంటపడి ప్రేమిస్తున్నాననగానే ఎలా నమ్మింది? ఏ భరోసాతో తన్ను తాను అర్పించుకుంది? అతను కోరుకుంటుంది తనతో జీవితాన్ని పంచుకోవటం కాదనీ తన అందాన్ని అనుభవించడమేనని ఎందుకు అర్థం చేసుకోలేకపోయింది?"

"దానికి తగిన వయసూ లోకజ్ఞానం ఆ పిల్లకెక్కడ ఉన్నాయి? సినిమాల ప్రభావం టీనేజర్ల మీద ఎంత భయంకరంగా ఉందో ఈ సమాజాన్ని చూస్తే అర్థమౌతుంది. ప్రేమని ఎలా గ్లోరిఫై చేసి చూపిస్తున్నారో... జీవితానికి అర్థం పరమార్థం ప్రేమించడంలోనే ఉందనీ దాన్ని సాధించడంకోసం ఎంతమందిని నరికినా రక్తపుటేర్లు పారించినా అది హీరోయిజం తప్ప తప్పుకాదనీ రకరకాల మసాలాలు దట్టించి నూరిపోస్తున్నారు. ఆ ప్రేమ అనే అద్భుతమైనదేదో తమకూ స్వంతం కావాలనే టీనేజీ అమ్మాయిలు ప్రేమ పేరు వినగానే లొంగిపోతున్నారు"

"ఈ రోజుల్లో నిజమైన ప్రేమలు ఎక్కడున్నాయి అక్షరా... వీళ్ళ ఉద్దేశంలో ప్రేమంటే కాఫీడేల కెళ్ళటం, సినిమాలకీ పార్కులకీ వెళ్ళి అభ్యంతరకర కార్యాల్లో ఆనందాన్ని అనుభవించడం, పబ్‌లకెళ్ళి తాగి తందనాలాట్టం... ఇదే. ఇది వ్యామోహం తప్ప ప్రేమెలా అవుతుంది? కలికం పెట్టి వెతికినా అసలైన ప్రేమ కన్పించటం లేదు"

"నాకు కన్పిస్తోంది"

"జోక్ చేయకు. ప్రేమలెక్కడ ఏడ్చాయిప్పుడు? అంతా భౌతికాకర్షణ... స్వార్థం... సరదాలు తీర్చుకోవాలనే ఆకాంక్ష... ఆడపిల్లలు కూడా బరితెగించి ప్రవర్తిస్తున్నారు. ఒక్కో అమ్మాయి ఇద్దరు ముగ్గురబ్బాయిల్తో ఒకేసారి క్లోజ్‌గా తిరగడానికి వెనకాడ్డం లేదు.

ప్రేమను కూడా ఎవ్వరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. వీడు కాకపోతే మరొకడన్న ధోరణి. సెక్స్ అనుభవాన్ని కూడా చాలా క్యాజువల్‌గా తీసుకుంటున్నారు. ప్రణవి విషయంలో ఆర్థిక కోణం ఆలోచించావా? తన అవసరాలకోసం సరదాల కోసం డబ్బు కావాలి. ఆ డబ్బు ఎస్సయ్ దగ్గరుంది. ఎస్సయ్‌కి అవసరమైన అందం ఆమె దగ్గరుంది. పెళ్ళి చేసుకోవాలని ఆ అమ్మాయి పట్టుబట్టడంలో కూడా డబ్బే ముఖ్య పాత్ర పోషిస్తోందని నా అనుమానం"

"అబ్బ... ఎంత వివరణ ఇచ్చావూ... నాకూ తెలుసులే. నేను అసలైన ప్రేమ కన్పిస్తోందన్నది నా పక్కనే కూచుని ఉన్న కిరణ్ అనే నిజమైన ప్రేమికుడిలో" అంటూ నవ్వింది అక్షర. "నాకోసం ఎన్ని త్యాగాలు చేశావో తల్చుకుంటే నేనెంత అదృష్టవంతురాల్నో అన్పిస్తుంది కొన్ని సార్లు. కొన్నిసార్లయితే నేనింత గొప్ప ప్రేమకు అర్హురాలినా అనికూడా అన్పిస్తుంది"

అప్పుడే రెండు ప్లేట్లలో దోశెలు, ఓ గిన్నెలో పచ్చడి పెట్టుకుని అక్షరవాళ్ళమ్మ వచ్చింది.

"మళ్ళీ త్యాగాలూ అర్హతలూ అంటూ మాట్లాడుతోందా బాబూ" అంది వాళ్ళెదురుగా ప్లేట్లు పెడ్తూ.

"మీకూ నాకూ అలవాటేగా ఆంటీ. తనలా మాట్లాడటం... మనమేమో తనకున్న అర్హతలన్నీ చెప్పి ఇంతకన్నా ఎక్కువ ప్రేమకే తను అర్హురాలని చెప్పటం... నాకో విషయం అర్థమైంది. అక్షరకు పొగడ్తలంటే ఇష్టం" అక్షరను ఉడికిస్తూ అన్నాడు కిరణ్.

"చాల్లెండి. అత్తా అల్లుడూ కలిసి నన్ను ఆటపట్టిస్తున్నారు కదూ... నిజమే... పొగడ్తలో ఓ మ్యాజిక్ ఉంది. ఐ మీన్ నిజాయతీతో కూడుకున్న పొగడ్త... అది అసాధ్యాల్ని సుసాధ్యాలు చేయగలదు. ఆ పొగడ్త మన ఆత్మీయులనుంచయితే కొండంత బలాన్నిస్తుంది. అమ్మానాన్నల ప్రేమ... నువ్వు చూపించే శ్రద్ధ... చేసిన త్యాగాలు... నిజం చెప్తున్నా. ఒకానొక సమయంలో నా అవిటితనం తల్చుకుని కుమిలిపోయేదాన్ని. నా బతుకు నిరర్థకమనుకునేదాన్ని. ఇపుడు చెప్తున్నా... నా జీవితం సార్థకమైంది. నా బతుకు మీ వల్ల రాగరంజితమైంది. వంద హరివిల్లులు ఒక్కసారిగా నా జీవితంలో వికసించినట్టు...

ఇంతందమైన జీవితాన్ని ప్రసాదించిన మీరుణం ఏం చేసి తీర్చుకోగలను?" ఆమె గొంతు గాద్గదికమైంది.

"ప్రారంభించావు... నువ్వు అనుకున్నది సాధించు చాలు... మా రుణం తీర్చుకున్నట్లే" అంది వాళ్ళమ్మ.

కళ్ళలో ఉబికిన తడిని తుడుచుకుంటూ అక్షర మౌనంగా దోశెలు తినడంలో నిమగ్నమైంది.

మనసు నిండా జడివానలా ఆలోచనలు... జ్ఞాపకాల తుట్ట కదిలి కల్లోల పరుస్తూ... తన పెళ్ళప్పుడు జరిగిన రభసంతా గుర్తొచ్చింది.

పెళ్ళి విషయంలో తను అంగీకారం తెల్పటమే ఆలస్యం కిరణ్ సంతోషం పట్టలేక తన భుజాలు పట్టుకుని వూపేస్తూ 'థ్యాంక్యూ థ్యాంక్యూ' అని ఏ వందసార్లన్నాడో. తను కదా 'థ్యాంక్యూ' చెప్పాలి. వరాలు అందించే దేవతలే తామందించే వరాన్ని స్వీకరించడమే తమకు వరమనుకోవటం ఎంతాశ్చర్యం!

'వెంటనే వెళ్ళి అమ్మకు చెప్పేయాలి. బయల్దేరు' అన్నాడు కిరణ్.

'లేడికి లేచిందే పరుగన్నట్లు ఏమిటా తొందర? నిదానంగా ఆలోచించు. మీ అమ్మ ఒప్పుకుంటుందా? ఓ వేళ ఒప్పుకోకపోతే ఏం చేద్దామనేది కూడా ఆలోచించాలిగా'

'అవసరం లేదు. నీకు మా అమ్మ సంగతి తెలీక అలా అంటున్నావు. చాలా మంచిది. నేను కోరుకున్నదేదీ కాదనదు. అసలు నేను పెళ్ళికి ఒప్పుకున్నానంటే చాలు సంబరపడిపోతుంది తెలుసా'

'మీ అమ్మ మంచితనాన్ని నేను శంకించడం లేదు. ఎటొచ్చీ వీల్ ఛెయిర్కే పరిమితమైపోయిన అమ్మాయిని కోడలిగా చేసుకోడానికి ఆవిడకు వంద అభ్యంతరాలుండొచ్చు. తన కొడుకు మీదున్న ప్రేమతో కోడలి విషయంలో ఆమెకు ప్రత్యేకమైన కోరికలుండటం సహజం. దాన్ని మంచితనానికో చెడ్డతనానికో ముడిపెట్టటం భావ్యం కాదు'

'కోర్టులో వాదించినట్టు వాదించకు. నేను భరోసా ఇస్తున్నాను. మా అమ్మ సంతోషంగా అంగీకరిస్తుంది. నీకు గుర్తుందా నువ్వు మా యింటికొచ్చిన రోజు అమ్మ

ఎంత సంబరపడిందో... నీ అందాన్ని, తెలివిని మెచ్చుకుంది కూడా'

'ఎవరో అమ్మాయి విషయంలో ప్రశంసలు కురిపించడానికీ అదే అమ్మాయి తన కోడలు కాబోతుందని తెలిసి శల్య పరీక్ష చేయడానికీ చాలా తేడా ఉంటుంది'

'నో మోర్ ఆర్గ్యుమెంట్ ప్లీజ్... మా అమ్మను అవమానిస్తున్నావు' చిరుకోపంతో అన్నాడు కిరణ్.

'సారీ... నా ఉద్దేశం అది కాదు. పరిస్థితుల్ని బట్టి అంచనాలు మార్తాయని మాత్రమే హెచ్చరిస్తున్నాను. సరే... నీ ఇష్టప్రకారమే కానీ' తన మాటల వల్ల అతను నొచ్చుకుంటున్నాడని తెలిసి మిన్నకుండిపోయింది.

'మా ఇంటికెళ్దాం పద'

'నేనెందుకు? మొదట నువ్వు మాట్లాడు. తనేం అన్నారో తెలిశాక నేనోరోజొస్తాను'

'తనేం అంటుందో నాకు తెలుసు. ఇంకేం మాట్లాడకుండా నాతో రా. నిన్ను చూస్తే అమ్మ చాలా సంతోషపడ్తుంది. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న మన నిర్ణయాన్ని ఇద్దరం కలిసి అమ్మకు చెప్పినట్లవుతుంది' అంటూ వత్తిడి చేశాడు.

అక్షరకు వెళ్ళక తప్పలేదు. తనకిష్టం లేకున్నా మనసులో ఏదో మూల భయం పీకుతున్నా కిరణ్‌ని బాధపెట్టకూడదన్న ఒకే ఒక కారణంతో తనూ వాళ్ళింటికి వెళ్ళింది.

అక్షరను చూడగానే వాళ్ళమ్మ ఆప్యాయంగా మాట్లాడింది. 'బావున్నావా తల్లీ. చాలా రోజుల తర్వాత మళ్ళా మాయింటికొచ్చావు. నీ ప్రాక్టీస్ బావుందటగా. అబ్బాయి చెప్తూనే ఉంటాడు' అంది. ఆమె మాటలు విన్నాక తను అనవసరంగా భయపడ్డానేమోననిపించింది.

అక్షర కోసం ఏదైనా చేసుకురావడానికి వంటగదిలోకెళ్ళబోతున్న ఆమెతో 'ఇపుడేమీ వద్దమ్మా. మొదట నువ్వొచ్చి ఇక్కడ కూచో. నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి' అన్నాడు కిరణ్. ఆమెను చేయి పట్టి లాక్కొచ్చి సోఫాలో కూచోబెట్టాడు.

'ఏంట్రా అంత ముఖ్యమైన విషయం?' అంటున్నపుడు ఆమె భృకుటి ముడి పడటం అక్షర దృష్టిని దాటిపోలేదు.

'అక్షరకు పెళ్ళి కుదిరిందమ్మా' అన్నాడు కిరణ్.

'ఓహ్... ఎంత మంచివార్త చెప్పావూ...' అంటూ అక్షర వైపు తిరిగి 'అబ్బాయి ఏం చేస్తుంటాడమ్మా... ఏ వూరు? తెలిసిన సంబంధమా?' అని అడిగింది.

అక్షర ఏం సమాధానం చెప్పాలో తెలీక కిరణ్ వైపు చూసింది.

'అబ్బాయిదీవూరేనమ్మా. తెలిసిన సంబంధమే' కిరణ్ సమాధానం చెప్పాడు.

'శుభవార్త చెప్పావు కాబట్టి నీ నోరు తీపి చేయాలి. ఇంతకూ అబ్బాయి ఏం చేస్తాడో చెప్పనేలేదు'

'అబ్బాయి కూడా లాయరేనమ్మా' అన్నాడు కిరణ్.

ఆమె పెదవుల మీద నవ్వు మాయం కావటం అక్షర గమనించింది.

'అమ్మాయిని అడుగుతుంటే జవాబులన్నీ నువ్వే చెప్తున్నావేరా. ఆ అబ్బాయి నీకూ తెలుసా?'

'నీక్కూడా తెలుసు' కిరణ్ ఆమె హావభావాల్ని గమనించకుండా ఉత్సాహంగా చెప్పాడు.

'నాకూ తెలుసా... పేరేంటో చెప్పు. తెలుసో లేదో చెప్తాను'

'కిరణ్. వాడు పుట్టినప్పటినుంచీ నీకు తెలుసు' అన్నాడు నవ్వుతూ కిరణ్.

ఆమెకోక్షణం కిరణ్ ఏమంటున్నాడో అర్థం కాలేదు. అర్థం కాగానే మొహం వివర్ణమైంది. ఐనా అనుమాన నివృత్తి కోసం 'నువ్వేమంటున్నావో నాకర్థం కావటం లేదురా' అంది.

'నువ్వోసారి చెప్పావు కదమ్మా... అక్షర ఏ ఇంటికి కోడలుగా వెళ్తుందో వాళ్ళు అదృష్టవంతులని. ఆ అదృష్టవంతులం మనమే కావాలని నాకోరిక. అక్షరని పెళ్ళికి ఒప్పించడానికి ఆరేళ్ళు పట్టిందమ్మా. అక్షర నీ కోడలు కాబోతోంది'

ఆమె విసురుగా లేచి తన బెడ్రూంలోకెళ్ళి తలుపేసుకుంది.

కిరణ్ అక్షరవైపు షాక్ తిన్నట్లు చూసాడు. అక్షర అప్పటికే శిలలా బిగుసుకుపోయింది.

కిరణ్ దిగ్గునలేచి వాళ్ళమ్మ వెనకే గదిలోకెళ్ళాడు.

'ఏంటమ్మా అలా వచ్చేశావు? నీకీపెళ్ళి ఇష్టం లేదా?'

కిరణ్ గొంతు బైటికి స్పష్టంగా విన్పిస్తోంది.

'నీకేమైనా మతిపోయిందా? నువ్వా పిల్ల మీద జాలిపడ్తున్నావనుకున్నాను తప్ప పెళ్ళి చేసుకుంటావని కలలో కూడా వూహించలేదురా. ఓ అవిటి పిల్లని చేసుకుని నువ్వేం సుఖపడ్తావురా?'

'అమ్మా... ఏంటా మాటలు? అక్షర వింటే బాధ పడ్తుంది'

'విననీరా... అవిటి పిల్లని అవిటి పిల్లంటే బాధెందుకు? నిజమేగా చెప్పాను. సలక్షణంగా ఉన్న నీకిదేం పోయే కాలంరా... నాకా వయసైపోతోంది. ఇప్పుడున్న ఓపిక కూడా కొన్నేళ్ళు పోతే ఉండదు కదా. చలాకీగా ఉండే కోడలు పిల్లని తెచ్చి నాక్కొంత విశ్రాంతినిస్తావని ఆశ పడ్తుంటే ఈ పిల్లని చేసుకుంటానంటావేం? పిచ్చేమైనా పట్టిందా? అలాగైతే నాకొచ్చేది చేసిపెట్టే కోడలు కాదు... నా చేత సపర్యలు చేయించుకుని నేను వండిపెడ్తే తినిపెట్టే అత్తగారు'

'నువ్వేం చేయక్కరలేదమ్మా. అక్షర బదులు అన్నీ నేనే చేసిపెడ్తాను'

'ఏం చేస్తావురా... వంట చేస్తావా... అంట్లు తోమి బట్టలుతుకుతావా? కోర్టుకెళ్ళకుండా ఇంట్లో ఆడంగి దానిలా కూచుని ఇవన్నీ చేస్తావా? ఆ అమ్మాయికి భర్తలా కాకుండా బానిసలా సేవలు చేసుకుంటూ బతుకుతావా... అయ్యో దేవుడా... ఇటువంటి అమాయకుణ్ణి కొడుగ్గా ఇచ్చావేమిటి తండ్రీ' ఆమె పెద్దగా ఏడుస్తోంది.

'పెళ్ళి చేసుకునేది జీవితాన్ని పంచుకోవటం కోసం. వంట చేయడానికీ, అంట్లు తోమడానికీ పరిమితమయ్యే పెళ్ళాల కాలం పోయిందమ్మా. మేమిద్దరం ప్రాక్టీస్ చేస్తున్నాం. బాగానే సంపాదిస్తున్నాం. నీవు చెప్పిన ఆ పనుల కోసమైతే నేను ఇంట్లో ఉండి చేయక్కరలా. పనిమనుషుల్ని పెట్టుకుంటే చాలు. నీకు సేవలు చేయాల్సిన అవసరమే వస్తే నేను చేస్తానన్నాను'

'నాకు సరే. నీ పెళ్ళానికి కూడా చేయాలిగా'

'చేస్తానమ్మా. ఇష్టంగా చేస్తాను. మనస్ఫూర్తిగా చేస్తాను. నాకు అక్షరంటే ఇష్టం. గత ఆరేళ్ళుగా అక్షరని ప్రేమిస్తున్నానమ్మా. ఆమె ఓ విశిష్టమైన స్త్రీ... యుద్ధరంగంలో

వీపుకి బాబుని కట్టుకుని పోరాడిన ఝాన్సీరాణి గుర్తుకొస్తుంది అక్షరని చూస్తుంటే... జీవితంతో తను అలానే పోరాడుతుందమ్మా. ఎప్పుడూ అధైర్య పడలేదు... ఎన్నడూ పట్టుదల వదల్లేదు. తను ధీరోదాత్తవనిత. నాకళ్ళకు తన అవిటితనం ఎప్పుడూ కన్పించలేదు. తనో ఫైటర్. తప్పకుండా గొప్ప స్త్రీగా చరిత్ర సృష్టిస్తుందమ్మా. ఆమె చేస్తున్న పోరాటంలో నేను తోడుండాలనుకున్నా. నావంతు సహకారం అందివ్వాలనుకున్నా. ఈ నిర్ణయంలో మార్పుండదమ్మా'

'నా కంఠంలో ప్రాణం ఉండగా ఒప్పుకోను. నా మాట కాదని ఆ పిల్లని ఈ ఇంటికి కోడలుగా తెచ్చావనుకో... వురేసుకుని చస్తాను'

'అంత కష్టం నీకు రానీయనమ్మా. నువ్వే ఈ ఇంట్లో ఉండు. నేను అక్షరతో పాటు వాళ్ళింటికెళ్ళిపోతాను. నీకోసమని అక్షరని వదులుకోలేనమ్మా. నన్ను క్షమించు'

'నువ్వసలు మగపుట్టుకే పుట్టావా... ఆడదానిలా అత్తవాళ్ళింట్లో ఉంటావా? ఇల్లరికం వెళ్తాననడానికి నీకు సిగ్గులేదురా?'

'నాకవన్నీ తెలీవమ్మా. అక్షర ఎక్కడుంటే నేనూ అక్కడే ఉంటాను'

'నీ ఖర్మ... చేతులారా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావు. నా ప్రారబ్ధం... ఈ వయసులో నన్ను ఒంటరిదాన్నిచేసి క్షోభ పెడ్తావా?'

'లేదమ్మా... ఎప్పటికైనా మనసు మార్చుకుని రావాలనుకుంటే నువ్వు మా వద్దకు నిరభ్యంతరంగా రావొచ్చు. అది నీ హక్కు. ఈ రోజు జరిగింది మనసులో పెట్టుకుని సాధించే మనస్తత్వం అక్షరకు లేదు. తన మనసు వెన్న... మనిషి బంగారం. నువ్వే సరిగ్గా అర్థం చేసుకోవటంలేదు.'

'ఔన్రా... ఈ వయసులో కాబోయే పెళ్ళాం బెల్లంలానే కన్పిస్తుంది. కానీ అది బెల్లం కాదు. దేనికీ పనికిరాని రాయి'

'ప్లీజ్ అమ్మా... ఇంకేం మాట్లాడకు. నేను వెళ్తున్నాను. నెలనెలా నీకవసరమైనంత డబ్బు ఇచ్చి పోతుంటాను' అంటూ కిరణ్ బైటికొచ్చాడు.

'ఆవేశపడొద్దు... కొద్దిగా ఆలోచించు' అంటున్న తనతో 'చాలా ఏళ్ళుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం నాది. పద అక్షరా... మీ ఇంటికెళ్దాం. మీ అమ్మానాన్న కూడా

ఒప్పుకోకపోతే ఇద్దరం వేరే ఇల్లు తీసుకుని ఉందాం' అంటూ తన చక్రాలకుర్చీని నడిపించుకుంటూ బైటికి నడిచిన కిరణ్...

టిఫిన్ తినడం పూర్తయింది. అక్షర ఆలోచనల్లోంచి బైటపడి కిరణ్ వైపు ఆప్యాయంగా, ఆరాధనగా చూసుకుంది. తనతో ఎవరైనా కిరణ్ అనే ఇంత మంచి అబ్బాయి ఉన్నాడంటే నమ్మేది కాదు. తను ప్రత్యక్షంగా చూడబట్టి... కొన్నేళ్ళుగా అతని గురించి తెలుసు కాబట్టి నమ్ముతోంది. చివరికి కథల్లో ఇటువంటి వ్యక్తి గురించి రాసినా 'ఎంత అసహజంగా రాశారో... ఈ రోజుల్లో అంత నిస్వార్థంగా, నిజాయితీగా ప్రేమించేవాళ్ళు ఎక్కడున్నారు? నో ఛాన్స్' అనుకునేది.

"ఏంటీ అదోలా చూస్తున్నావు?" న్యాప్‌కిన్తో చేతులు తుడుచుకుంటూ అడిగాడు కిరణ్.

"అదోలా అంటే ఏదోలా?"

"ఏమో... రకరకాల చూపుల గురించి మీ ఆడవాళ్ళకే తెలుస్తాయి"

"దేవుడు లేడని ఇంకెప్పుడూ అనను కిరణ్. దేవుడున్నాడు"

"గుడ్... మారిపోయావన్మాట"

"ఔను... నా ఇంట్లోనే ముగ్గురు దేవుళ్ళున్నారు. అందుకూ" అంది మనస్ఫూర్తిగా.

***

ప్రసాద్‌కి ఏమీ తోచటం లేదు. ఇలా మంచానికి అతుక్కుని గంటలు గంటలు గడపటం దుర్భరంగా ఉంది. అమ్మతో చెప్తే "నీ గదిలో టీవీ అరేంజ్ చేస్తాను. నీకిష్టమైన ఛానెల్ చూసుకో. రిమోట్ నీ చేతిలో ఉంటే చాలు... కావల్సినంత వినోదం" అంది.

"వద్దమ్మా... టీవీలో వచ్చే సీరియళ్ళు... అందులో చూపించే పగలూ ప్రతీకారాలు నాకొద్దు. సినిమాలు కూడా బోర్ మమ్మీ... వేసినవే వేస్తుంటారు. టీవీ చూడటమంటే సమయాన్ని దారుణంగా ఖూనీ చేయడమే. ఐడిల్‌గా కళ్ళని స్క్రీన్‌కి అంటించి చూస్తుంటే కొన్నాళ్ళకి మెదడు కూడా మొద్దుబారిపోతుంది"

"మరి ఏం చేయమంటావ్?"

"కంప్యూటర్ కొనివ్వు మమ్మీ. అది నాదగ్గర ఉంటే ప్రపంచం అంతా మన

కళ్ళెదుట ఉన్నట్లే ఉంటుంది. ఫ్రెండ్స్‌కి మెయిల్లు పంపించుకోవచ్చు... ఛాటింగ్ చేసుకోవచ్చు. నాకిష్టమైన సినిమాలు డివిడీలో చూసుకోవచ్చు. మంచి మ్యూజిక్ వినొచ్చు"

కొడుకు కోరిక చాలా సమంజసంగా అన్పించింది. సరోజ వెంటనే ల్యాప్‌టాప్ కొనింది. దానికి ఇంటర్నెట్ కనెక్షన్ పెట్టించింది. అప్పటినుండి ఇంటర్నెట్ బ్రౌజ్ చేయటం ప్రసాద్‌కి వ్యాపకంలా మారింది.

ఆ రోజు అమ్మ తొమ్మిదింటికే బ్యాంక్‌కి వెళ్ళిపోయింది.

ల్యాప్‌టాప్‌లో పాటల వీడియో సీడీ పెట్టి కొద్దిసేపు సినిమా పాటలు చూశాడు. ప్రతి పాటా ప్రేమ గురించే... ఓ అబ్బాయి ఓ అమ్మాయి... పార్కుల్లోనో... ఫారెన్ కంట్రీలోనో కురుచ దుస్తులేసుకున్న హీరోయిన్తో హీరో గారి సరసాలు... పాటల్లో ప్రేమకంటే శృంగారానికే పెద్దపీట... కొన్ని పాటలైతే పచ్చి బూతు... వాటిని చూడటం వల్ల దుఃఖం మరింత పెరుగుతోంది. నిరాశ కొండచిలువలా చుట్టేస్తోంది... అందుకే పాటల సీడీని ఆపేశాడు.

అసలు తనకున్న జబ్బు గురించిన సమాచారం తెలుసుకుంటే మంచిదనిపించింది. ప్రపంచాన్ని అరచేతుల్లో ఆవిష్కరించే ఇంటర్నెట్‌ని పాటలకోసమో సినిమాల కోసమో వాడుకోకుండా విషయపరిజ్ఞానం కోసం వాడుకోవటమే విజ్ఞుల లక్షణం కదా అనుకున్నాడు.

తలకింద ఎత్తుగా దిండు పెట్టుకుని కొద్దిగా వెనక్కి జరిగి గూగుల్.కో.ఇన్‌ని క్లిక్ చేశాడు. మస్కులార్ డిస్ట్రోఫీ అని బాక్స్‌లో టైప్ చేశాడు. కొన్ని వందల వెబ్‌సైట్ల నుంచి పది సైట్లు స్క్రీన్ మీద కన్పించాయి. వికిపీడియా సైట్ మీద కర్సర్ పెట్టి వేలితో మెల్లగా నొక్కాడు. తనక్కావాల్సిన సమాచారం వచ్చింది. మెల్లగా చదవటం ప్రారంభించాడు.

'మస్కులార్ డిస్ట్రోఫీ అనేది జన్యుపరమైన వ్యాధి. దీనివల్ల శరీరంలోని అనేక కండరాలు బలహీనపడ్తాయి.'

ఇదంతా తనకు తెలిసిన విషయమే. తర్వాతి పేజీకెళ్ళి చూశాడు. 'మస్కులార్ డిస్ట్రోఫీలో రకాలు' అని రాసి ఉంది. అప్పటివరకూ తనకొచ్చిన వ్యాధి మస్కులార్ డిస్ట్రోఫీ అని దాన్ని యం.డి. అనికూడా పిలుస్తారని తెలుసు కానీ అందులో చాలా రకాలుంటాయని తెలీదు. అలాగైతే తనకున్న వ్యాధి ఏ రకమో తెలుసుకోవటం కోసం

అతను ఆసక్తిగా చదవటం ప్రారంభించాడు.

'డూషెన్ మస్కులార్ డిస్ట్రొఫీ అనేది చాలా సాధారణంగా వచ్చేవ్యాధి. చాలా తీవ్రమైంది కూడా. లక్షణాలు సాధారణంగా ఐదో సంవత్సరంలో ప్రారంభమౌతాయి. కటివలయం దగ్గరున్న కండరాలు మొదట బలహీనపడ్తాయి. పన్నెండేళ్ళొచ్చేసరికి చక్రాలకుర్చీ వాడాల్సి వస్తుంది. శ్వాసకు ఉపయోగపడే కండరాలు బలహీనపడటం వల్ల వెంటీలేటర్ అవసరం రావొచ్చు. ఇరవై యేళ్ళ లోపే చనిపోయే అవకాశం ఎక్కువ.

వ్యాధిలో మరో రకం బెక్కర్ మస్కులార్ డిస్ట్రొఫీ. ఇది అరుదుగా కన్పించే రకం. లక్షణాలు చాలా నిదానంగా కన్పిస్తాయి. యుక్త వయసులో ఉన్నప్పుడే లక్షణాలు కన్పించడం ప్రారంభిస్తాయి. మొదట కటివలయం దగ్గర కండరాలు బలహీనపడి మెల్లగా భుజాలకు వీపుకి పాకుతాయి.

లింబ్ గర్డిల్ మస్కులార్ డిస్ట్రొఫీ అనేది ఆడా మగా పిల్లలకు ఎనిమిది పదిహేనేళ్ళ లోపల సోకుతుంది. ఇది కూడా మెల్లగా పెరిగే వ్యాధి.

మొఖం కండరాల్లో లక్షణాలు ప్రారంభమయ్యే వ్యాధి ఫేషియో స్కాపులో హ్యూమరల్ మస్కులార్ డిస్ట్రొఫీ. రెప్పలు వాల్చటం కూడా కష్టమౌతుంది. ఇది మెల్లగా భుజాలకు చివరికి కటివలయానికి పాకుతుంది'

ప్రసాద్ అప్రయత్నంగానే తన మొహాన్ని తడిమి చూసుకున్నాడు. అమ్మో... ఇంకా నయం... తనది ఆ రకం వ్యాధి కాదు. కనురెప్పలు కదల్చటం కూడా కష్టమైతే... మాట్లాడటం కూడా గగనమైతే ఎంత కష్టమో. అమ్మతో మాట్లాడే ఆ కొద్ది మాటలు కూడా మాట్లాడకపోతే తనకు పిచ్చెక్కిపోదూ..

మరి తనకున్న వ్యాధి ఏ రకంది? డూషెన్ యం.డి. నా... అంటే ఇరవై యేళ్ళ లోపే చావాలిగా. ఏమో... అదేనేమో... ఇరవై యేళ్ళలోపంటే కొద్దిగా అటూఇటుగా అని అర్థమేమో... తనకిప్పుడు ఇరవై నాలుగేళ్ళు... అంటే తను తొందరగా చచ్చిపోతాడా...

అతనికి భయం వేసింది.

కంప్యూటర్ని షట్ డౌన్ చేసి కళ్ళు మూసుకుని పడుకున్నాడు. ఏం జీవితం తనది? ఏమీ సాధించకుండా... ఏమీ అనుభవించకుండా చనిపోవటమేనా జీవితం? నిరర్థకమైన జీవితం...

తన బతుకుని గౌరవప్రదమైన బతుకంటారా? మానవ జీవితంలో అతి సాధారణ నిరుపేద మానవుడికి దొరికే సుఖాలూ సంతోషాలక్కూడా తను నోచుకోలేదు. తన పనులు తను చేసుకోలేడు. ప్రతి దానికీ అమ్మమీద ఆధారపడాలి. నాన్న అర్థాంతరంగా చనిపోయినట్టు అమ్మకేమైనా ఐతే తన గతేంటి? తన గురించి ఎవరు పట్టించుకుంటారు?

ఆ ఆలోచనకే వళ్ళు జలదరించింది.

కొద్దిసేపు కళ్ళు మూసుకుని పడుకోడానికి ప్రయత్నించాడు. నిద్ర రావటం లేదు. రాత్రుళ్ళే రాని నిద్రకు పగటిపూట కనికరం కలుగుతుందా? దుఃఖపూరితమైన జీవితాల్లో సుఖనిద్రకు తావెక్కడుంది?

మనసంతా ముళ్ళకంపల్తో నిండిపోయినట్లు...

మళ్ళా ల్యాప్‌టాప్ ఆన్ చేసి నెట్లోకెళ్ళాడు. వద్దనుకుంటూనే మస్కులార్ డిస్ట్రొఫీ సైట్లో కెళ్ళాడు. అతన్ని ఒక సైట్ అయస్కాంతంలా ఆకర్షించింది.

'మస్కులార్ డిస్ట్రొఫీకి అమోఘమైన మందు... కేవలం ఆరు నెలల్లో మీరు మామూలుగా లేచి నడయాడ్తారు... కోరుకుంటే పరుగెత్తుతారు కూడా. గ్యారంటీ... లేకపోతే మీ డబ్బు వాపస్' అని ఉంది.

అతనిలో ఉవ్వెత్తున ఎగసిపడ్తూ ఆశ...

ఈ వెబ్‌సైట్ని ఇన్ని రోజులూ ఎలా మిస్సయ్యాడు తను... అయ్యో... ఆర్నెల్ల క్రితం చూసి ఉంటే ఈ పాటికి మామూలుగా నడుస్తూ ఉండేవాడు. కనీసం తన పనులు తను చేస్కునేంత వరకైనా ఆరోగ్యం కుదుటపడి ఉండేది కదా అన్న బాధ..

కనీసం ఈ రోజైనా ఆ సైట్ తన కంటపడటం అదృష్టమే...

వళ్ళంతా కళ్ళు చేసుకుని, హృదయం నిండా ఆశని నింపుకుని అందులో రాసిన సమాచారాన్ని చదివాడు.

'గోమూత్రంలో మరికొన్ని మూలికలు కలిపి మాత్రలుగా చేసి, రోజుకు మూడుపూటలా ఆరు నెలలు సేవిస్తే అమోఘమైన ఫలితం కన్పిస్తుంది. ఇవి వాడిన వందమంది పేషంట్లలో అరవై మందికి పూర్తిగా తగ్గింది. మిగతా నలభై మందికి పాక్షికంగా నయమైంది. వీళ్ళందరూ తమ స్వంత పనులు తామే చేసుకుంటున్నారు. వంద టాబ్లెట్లున్న

సీసా ధర పదివేలు మాత్రమే. ఫలితాలు మీకు సంతృప్తిగా లేకపోతే మీ డబ్బు వాపస్ ఇవ్వబడ్తుంది' అని ఉంది.

దాంతో పాటు ఆ మాత్రలు వాడి బాగుపడినవాళ్ళ ఫోటోలు... వాళ్ళు సంతృప్తి చెందినట్టు ఇచ్చిన ఇంటర్వ్యూలు... పొందుపర్చి ఉన్నాయి. బాక్స్ ఐటంగా గోమూత్రం ప్రాముఖ్యతనీ దాని ఔషధ విలువల్నీ తెలిపే శ్లోకాలు, వివిధ గ్రంథాల్లోంచి సేకరించిన వాక్యాలు ఉన్నాయి.

అంతా చదివాక అతని ఉత్సాహం చప్పగా చల్లారి పోయింది. మరో సైట్లోకెళ్ళి చూశాడు. వనమూలికల్తో తయారు చేసిన కషాయం తాగటం వల్ల తనకున్న మస్కులార్ డిస్ట్రోఫీని జయించినట్టు రాసి ఉంది. ఆ వనమూలికలు కావాలంటే ఎవర్ని సంప్రదించాలో ఎంత డబ్బు పంపించాలో కూడా ఉంది.

అతనికి విషాదంతో కూడిన నవ్వొచ్చింది.

ఆ జబ్బుతో కొన్ని వేల మంది బాధపడ్తుంటే దాన్ని ఆసరాగా చేసుకుని డబ్బు దండుకోవాలని చూసే మోసగాళ్ళు అంతకు మించి ఉండటం అతనికి బాధనిపించింది. ఇకచాలనుకుని వెనక్కి రాబోతున్న సమయంలో అతని చూపు మరో వెబ్‌సైట్ మీద పడింది. ఆ సైట్ శీర్షిక అతన్ని అమితంగా ఆకర్షించింది. 'నాకు మస్కులార్ డిస్ట్రోఫీ ఉంది. నీకూ ఉందా?' అనే శీర్షిక...

వెంటనే ఆ సైట్‌లోకి వెళ్ళాడు. యం.డి. తో బాధపడ్తున్న దాదాపు పాతిక మంది తమ అనుభవాల్ని పంచుకున్న సైట్ అది. వాళ్ళ ఫోటో... దానికింద పేరు... వయసు... ప్రాంతం రాసి ఉంది. దాంతర్వాత అతడూ లేక ఆమె రాసిన అనుభవాలు... అభిప్రాయాలూ... కష్టాలు... కన్నీళ్ళు... దానికి స్పందించిన వ్యక్తుల బుజ్జగింపులు... ధైర్య వచనాలు... మెంబర్‌షిప్ ఫ్రీ. ఎవరైనా మెంబర్‌గా చేరి తమతమ అనుభవాల్ని ఇతరులకు చెప్పవచ్చు లేదా వేరేవాళ్ళ మెయిల్స్ చదివి తమ స్పందన తెలియచేయవచ్చు.

చాలామటుకు విదేశీయుల పేర్లే. ఒక తెలుగు పేరు కన్పిస్తే చదవటం ప్రారంభించాడు.

"నా పేరు సుందరం. వయసు ఇరవై రెండేళ్ళు. గత పదిహేనేళ్ళుగా మెక్ ఆర్డిల్స్ వ్యాధితో బాధపడ్తున్నాను. మస్కులార్ డిస్ట్రోఫీలో ఉన్న అనేక రకాల్లో నా కొచ్చిన జబ్బు

చాలా అరుదుగా వచ్చేదని డాక్టర్లు చెప్పారు. నాలో వ్యాధి లక్షణాలు కన్పించిన కొత్తలో ఎదురైన ఓ అనుభవం గుర్తొచ్చి మీ అందరితో పంచుకుందామని రాస్తున్నాను.

ఆ రోజు ఆదివారం... లంచ్‌కి అందరం డైనింగ్ టేబుల్ దగ్గర కూచున్నాం. భోజనాలు పూర్తయ్యాక సింక్ దగ్గరకు వెళ్ళడానికి లేవబోయాను. లేవలేకపోయాను. ఎక్కువ సేపు కూచోవడం వల్ల కాళ్ళు తిమ్మిరెక్కాయేమోనని పక్కనున్న గోడను ఆసరాగా చేసుకుని లేచి నిలబడ్డాను. సింక్ వైపుకి రెండడుగులు వేశాను. మూడో అడుగు వేయబోయి ధడాల్న కిందపడిపోయాను.

అమ్మ పరుగెత్తుకుంటూ వచ్చి లేపబోయింది. ఆమెవల్ల కాలేదు. నేలమీద కూచుని ఎవరైనా ఎత్తుతారేమోనని మా నాన్న వైపు అన్నవైపు చూశా... వాళ్ళు పగలబడి నవ్వుతున్నారు.

అమ్మకు కోపం వచ్చింది. 'పిల్లాడు పడిపోతే వచ్చి చేయందించి లేపాల్సింది పోయి ఇద్దరూ నవ్వుతారేంటండీ... వాడు పడ్తే మీకు ఎగతాళిగా ఉందా' అంటూ కేకలేసింది.

అమ్మ కేకలు విని వాళ్ళు మరింతగా నవ్వారు. నాకు ఉక్రోషం వచ్చింది... సిగ్గనిపించింది... అమ్మ మరోసారి ప్రయత్నించి నన్ను లేపి నిల్చోబెట్టింది. 'దెబ్బ తగిలిందా నాన్నా' అంది. లేదంటూ తల వూపాను. అప్పటికే నాకళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

నాకాళ్ళ వైపు చూసిన అమ్మ 'అమ్మో రక్తం' అంది. నేనూ కాళ్ళ వైపు చూసుకున్నాను. బొటనవేలు చిట్లి రక్తం కారుతోంది. అసలు సగం గోరు లేచిపోయింది. వాళ్ళు నవ్వుతున్నారన్న ఉక్రోషంలో నాకా నెప్పి తెలీలేదనుకుంటా.

అమ్మ కంగారు పడింది. లోపల్నుంచి దూది, డెట్టాల్ తెచ్చి గాయాన్ని శుభ్రం చేసింది.

'మొదట డాక్టర్ దగ్గరకు పిల్చుకెళ్తారా లేదా' అని నాన్నని కోప్పడింది.

అదే రోజు రాత్రి మా యింట్లో విషాదం నింపుకుంది. ఆ రోజే డాక్టర్ నా జబ్బు గురించి అనుమానం వ్యక్తం చేశాడు. అప్పటినుండీ మా యింట్లో రోజూ అమావాస్యలే... పున్నములు లేవు. ఆ రోజు తర్వాత మా నాన్న ఎప్పుడూ నవ్వలేదు. బహుశా నేను పడినప్పుడు తను పగలబడి నవ్వటాన్ని ఇప్పటికీ క్షమించుకోలేకపోతున్నాడేమోననిపిస్తోంది.

అసలెప్పటికైనా క్షమించుకుంటాడా... నాకు మా నాన్న అలా నవ్వినందుకు కోపంలేదు. ఐ లవ్ మై డ్యాడ్... నాకు మా నాన్న నవ్వితే చూడాలని ఉంది"

చదవటం పూర్తి కాగానే ప్రసాద్‌కి ఏడుపొచ్చేసింది. దిగులు మేఘంలా కమ్మేసింది. తను పార్కులో రమ్య చూస్తుండగా పడిపోవటం గుర్తొచ్చింది. రమ్య నవ్వలేదు. కానీ ఆ అవమానం ఇప్పటికీ పచ్చిపుండులా సలుపుతూనే ఉంది. తన అనుభవంలోని బాధలే అవమానాలే ఎదుటి వ్యక్తికి కూడా ఉన్నాయని తెలిసినప్పుడు కలిగే తోడు దొరికిన భావన అతన్లో... తను ఒంటరి కాదన్న భావన... తనలా చాలా మంది ఉన్నారన్న భావంలోంచి పుట్టే ధైర్యం...

తనలానే అది చదివిన కొంత మంది తమ స్పందనని దాని కింద పొందు పరిచారు. వాటినీ చదివాడు. "అంత మంచి నాన్న ఉన్నందుకు నువ్వు అదృష్టవంతుడివి" అని ఒకరు రాస్తే "నీ అనుభవం చదివాక నాకళ్ళలో నీళ్ళు తిరిగాయి" అని మరొకరు రాశారు.

తన అనుభవాల్ని కూడా అందరితో పంచుకోవాలనిపించింది ప్రసాద్‌కి. అందులో మెంబర్‌గా చేరాడు. అప్పటినుండి నెట్లోకెళ్ళి మిగతా సభ్యుల అనుభవాలు, ఆలోచనలు చదవడం... తనూ తనకు తోచింది రాయడం అలవాటుగా మారింది.

***

కిరణ్, అక్షర తమ ఆఫీసులో కూచుని ఓ కేస్ గురించి చర్చించు కుంటున్నారు. యింట్లోనే ఓ గదిని ఆఫీసుకింద వాడుకుంటున్నారు. సమయం రాత్రి ఎనిమిది గంటలు...

"పన్చేసింది చాలు. భోజనానికి రండమ్మా" అక్షరవాళ్ళమ్మ కేకేసింది.

"వడ్డించమ్మా... వచ్చేస్తున్నాం" అమ్మకు వినిపించేలా బదులిచ్చింది అక్షర.

అప్పుడే ఒకమ్మాయి లోపలికొచ్చి "నమస్తే అమ్మా... మీరే కదా లాయర్ అక్షరా" అంది.

"నేనే. కూచో" అంటూనే అక్షర కిరణ్ వైపు చూసింది. కళ్ళతోనే మాట్లాడుకున్నారు. భోజనానికి రావటం లేటవుతుందని అత్తగారితో చెప్పి వచ్చాడు కిరణ్.

"నా పేరు అనిత. మీ సాయం కోరి వచ్చానమ్మా" అందామె.

అనిత వైపు పరిశీలనగా చూసింది అక్షర. వయసు ఇరవైకి మించి ఉండదు. కానీ నలభైపడిలో ఉన్నట్లు కన్పిస్తోంది. మొహంలో గడ్డకట్టిన దిగులు... ఎన్నో రాత్రులు నిద్ర లేనిదానికి గుర్తుగా కళ్ళకింద దట్టంగా పేరుకున్న నల్లటి చారలు... దిగువ మధ్య తరగతి యువతి అనే నిజాన్ని దాచలేని వస్త్రధారణ...

"చెప్పు నీ సమస్యేంటో" అంది.

"పదో తరగతి పరీచ్చలైన ఎమ్మట్నే పెల్లి సేసారమ్మా. సదువుకుంటానన్నా ఇన్లే. యికసాలన్నారు. నా మొగుడు ప్రెబుత్వం నడిపే స్కూల్లో ప్యూనమ్మా. దగ్గిరి సంబందమే... వరసకు బావౌతాడు. రెండు లచ్చలు కట్నం తీస్కున్నాడు. కొన్నాల్లు బానే ఉన్నాడమ్మా. ఈ మద్దినే రోజూ ఏదో సాకుతో గొడ్డుని బాదినట్టు బాదుతున్నాడమ్మా. నానా యాతన పెడ్తున్నాడు"

"ఇంకా కట్నం కావాలని సతాయిస్తున్నాడా?"

"కాదమ్మా. నన్నొదిలేత్తాడట. ఇడాకులు కావల్నటమ్మా"

"ఎందుకు? కారణం చెప్పాడా?"

"పెల్లయి మూడేల్లయినా పిల్లలు పుట్టలేదు కదమ్మా. అదట... ఆడికి పిల్లలు కావాల్నంట. మారు మనువు సేస్కుంటాడంట. పిల్లలు పుట్టకపోతే నేనేం సేత్తానమ్మా... నా సేతుల్లో ఉందా?" అనిత ఏడుస్తోంది.

"అసలు అతన్లోనే లోపం ఉందేమో"

"లేదమ్మా. పరీచ్చలన్నీ సేయించుకున్నాం. లోపం నాలోనే ఉందంట. గర్బసంచిలో ఏదో తేడా ఉందంటమ్మా"

"దానికి తగిన ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చుగా"

"అది మందుల్తో నయం కాదటమ్మా. ఆపరేసన్ సేసినా నాబం లేదన్నారు"

"సరే. నువ్వేం చేద్దామనుకుంటున్నావు?"

"ఆడు నాక్కావాలమ్మా. ఆడంటే నాకు పేనం. ఆడు నేకుండా బతకలేను. అలాగని ఆడు ఇంకోదాన్ని మనువాడినా బరించలేను. మీరే ఆడ్ని పిల్సి ఏం సెప్తారో సెప్పండి. ఇనకపోతే కేస్ పెడ్తానని సెప్పండి. ఇడాకులు మాత్తరం ఇయ్యనని సెప్పండమ్మా"

"నీకున్న ప్రేమలో అతనికి వందో వంతు ఉన్నా అలా మాట్లాడడు. మరో పెళ్ళి కోసం ఆరాటపడడు. అటువంటి మనిషి కోసం ఎందుకు ప్రాకులాడ్తావు?"

"అట్లా అనబాకమ్మా. ఆడికీ నేనంటే పేనమే. ఛనం సూడకుండా ఉండలేడమ్మా"

"మరి విడాకులు ఎందుకడుగుతున్నాడు?"

"ఇడాకులని బెదిరిత్తే సవతిని తీస్కురాడానికి అడ్డు సెప్పనని ఆడి ఆశ. ఆడికి పిల్లలంటే శానా బెమ. తన వల్ల మరో నలుసు పుట్టాలని పెతిమగాడూ కోరుకోటం నాయమే కదమ్మా" అందామె.

ఆమె ఏం కావాలని కోరుకుంటుందో అక్షరకు అర్థం కావట్లేదు. ఓ వైపు విడాకులివ్వనంటోంది. మరో పెళ్ళి చేసుకుంటే కేస్ పెడ్తానంటోంది. మరో వైపు పిల్లలు కావాలని ప్రతి మగాడు కోరుకోవటం న్యాయమే కదా అంటోంది.

"సరే... నీ భర్త పేరూ, పని చేసే స్కూల్ పేరూ, అడ్రసూ చెప్పు" అని కిరణ్ వైపు చూసింది. అనిత చెప్తుంటే ఆమె కేస్ వివరాలు రాసుకున్న నోట్‌ప్యాడ్‌లోనే ఆ వివరాలు కూడా రాసుకున్నాడు.

"రేపు నీ భర్తను పిలిచి మాట్లాడ్తాను. ఏం జరిగిందో నీకు చెప్పాలంటే ఎలా? మళ్ళా ఎపుడొస్తావు?"

"మీరెప్పుడు రమ్మంటే అపుడొత్తానమ్మా. నా సెల్లుకి పోన్ సేత్తే సాలమ్మా. ఎమ్మట్నె వచ్చేత్తా"

"నీకు సెల్ ఫోన్ ఉందా?"

"ఉందమ్మా... ఆడే కొనిచ్చాడు" అంది సిగ్గుపడ్తూ... ఆమె చెప్పిన సెల్ నెంబర్ని కూడా రాసుకున్నాడు కిరణ్.

ఆమె వెళ్ళిపోయినా ఆమె మాటలు మాత్రం ఆ గదిలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అక్షర గుండెల్లో కూడా ప్రతిధ్వనిస్తూ... 'ప్రతి మగాడూ తన వల్ల పిల్లలు పుట్టాలని కోరుకోవటం న్యాయం కదా'. మరి కిరణ్ మనసులో కూడా అలాంటి కోరిక ఉంటుందా? ఎందుకుండదూ... కిరణ్ కూడా మగవాడేగా... తనకోసం ఆ కోరికని నొక్కి పడ్తున్నాడా...

పెళ్ళికి ముందు తను కిరణ్‌ని ఓ కోరిక కోరింది. 'మనకు పిల్లలు వద్దు కిరణ్. బాగా ఆలోచించుకుని నీ నిర్ణయం చెప్పు' అని. దానికి కిరణ్ ఒప్పుకున్నాకే తను పెళ్ళికి అంగీకారం తెల్పింది.

పిల్లలు లేరని కిరణ్ అశాంతికి లోనవుతున్నాడా... దుఃఖాన్ని మనసులోనే దాచుకుంటున్నాడా... వాళ్ళమ్మ మాట వినకుండా తనను చేసుకున్నందుకు పశ్చాత్తాప పడ్తున్నాడా...

మెదళ్ళోకి ప్రవేశించిన అనుమానప్పురుగు ప్రశాంతంగా ఉండనివ్వడంలేదు. ఆలోచనలు భయం గొలిపేలా... హృదయం అగ్నిగోళంలా మండుతోంది.

అన్నం సయించలేదు. కిరణ్ అడిగితే 'ఆకలిగా లేదు' అని సమాధానం చెప్పింది.

రాత్రి పడుకునేముందు కొద్దిసేపు ఏదైనా పుస్తకమో మేగజినో చదువుకుని పడుకోవటం కిరణ్‌కి అలవాటు.

అక్షర నిద్రకోసం ప్రయత్నించింది... రావటం లేదు.

తల పక్కకు తిప్పి చూసింది. కిరణ్ సీరియస్‌గా ఏదో పుస్తకం చదువుతున్నాడు.

తనవైపే అక్షర చూస్తో ఉందని గ్రహించి, పుస్తకాన్ని మూసేసి "ఏం అక్షరా... నిద్ర రావటం లేదా... ఏదైనా మేగజిన్ ఇవ్వనా... చదువుతావా? ఈ నెల భూమికలో నీ గురించి ఎంత బాగా రాశారో చూశావా?" అన్నాడు.

"చదివాను" అందామె... గొంతులోనే కాదు మొహంలో కూడా కొట్టొచ్చినట్టు కన్పిస్తున్న దిగులు చూసి కలవరపడ్డాడు కిరణ్.

"ఆ మాటని అంత నీరసంగా చెప్తావేం... నిన్ను స్త్రీజాతికే మణిదీపం అంటూ ఎంత బాగా చెప్పారో"

"కిరణ్! నాకు పొగడ్తలొద్దు... నిజాలు కావాలి"

"నిజమేగా... వాళ్ళు రాసినదాంట్లో అతిశయోక్తులేమీ నాకు కన్పించలేదు"

"అదికాదు. మనకు సంబంధించిన విషయాల గురించి చెప్తున్నాను"

"మన విషయాలా... నాకు అర్థం కావట్లేదు"

"సరే... డొంకతిరుగుడు లేకుండా సూటిగా విషయంలోకొస్తాను. నిజం చెప్పు. పిల్లలు కావాలని నీకన్పించదా కిరణ్?"

ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఇంత హఠాత్తుగా ఇలాంటి అనుమానం ఎందుకొచ్చింది?"

"అనిత చెప్పింది నువ్వూ విన్నావుగా. ప్రతిమగాడూ పిల్లలు కావాలని కోరుకోవటం సహజమని కదా అంది. దానికోసం రెండో పెళ్ళికయినా సిద్ధపడ్తాడనీ..."

కిరణ్ పెద్దగా నవ్వాడు. పడీ పడీ నవ్వాడు. పొట్టపట్టుకుని మరీ నవ్వాడు....

"ఇది నవ్వులాట విషయం కాదు. చాలా సీరియస్ విషయం"

"అక్షరా... నువ్వు చాలా సక్సెస్‌ఫుల్ లాయర్వి. ప్రతి జనరలైజేషన్‌కి కొన్ని ఎక్సెప్షన్స్ ఉంటాయని తెలీదా... నేనూ ఆ కోవకే చెందుతాను"

"అంటే..."

"పెళ్ళికి ముందు పిల్లలు వద్దని నువ్వు పెట్టిన కండిషన్ నాకు గుర్తుంది. బాగా ఆలోచించాకే ఒప్పుకున్నాను. కొన్ని సంవత్సరాల్లోనే మారిపోయేంత బలహీనమైంది కాదు నామనసు. నేను అప్పటి కిరణ్ణే... నువ్వే అనవసరమైన ఆలోచనల్తో, భయాల్తో మనసు పాడు చేసుకుంటున్నావు"

"నిజం చెప్పు కిరణ్. నేను బాధపడన్లే... ఓ బాబో పాపో ఉంటే బావుండేదని నీకెప్పుడూ అన్పించదా..."

"నాకు నువ్వు కావాలనుకున్నాను అక్షరా... నీ కోసం ఎవర్నయినా వదులుకోడానికి సిద్ధపడ్డాను.... పిల్లల్తో సహా"

"నీకెప్పుడూ ఆ ఆలోచనే రాదా? పిల్లలు లేరని బాధ కలగదా?"

"కోర్టులో సాక్షిని అడిగినట్లు ఒకే ప్రశ్నని తిప్పితిప్పి మార్చిమార్చి అడుగుతున్నావు. నా సమాధానం మాత్రం మారదు. నువ్విప్పుడు గుర్తు చేసేవరకు నాకా ఆలోచనే రాలేదు"

"పిల్లలు లేకున్నా...."

ఆమె మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ అన్నాడు "మాటిమాటికీ అలా అనకు. నాకు పిల్లలు లేరని ఎవరన్నారు?"

"ఏంటీ... నీకు పిల్లలున్నారా?" అందామె ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేస్తూ.

"వూ... ఇదిగో... ఇదే నాకూతురు" అంటూ అక్షరని దగ్గరకు లాక్కున్నాడు. "మనకింకా పిల్లలు దేనికి అక్షరా... నాకు నువ్వూ నీకు నేను పిల్లలమే"

అక్షరకు పట్టలేని సంతోషంతో కన్నీళ్ళు వచ్చాయి.

ఎంత హాయిగా ఉందో వింటుంటే... చెవుల్లో అమృతం పోస్తున్నట్లు... రక్తనాళాల్లోకి మధురమైనదేదో ప్రవహిస్తున్నట్లు... చావునికూడా ధిక్కరించడానికి అవసరమైన బలం తనకు ఎలా వచ్చిందో ఆమెకర్థమైంది.

ప్రేమలూ అనుబంధాలూ... వీటిని మించిన మందు ఏ రోగానికైనా ఉంటుందా? నిజమైన ప్రేమలున్న చోటికి రోగాలే కాదు చావు కూడా రావడానికి భయపడి పారిపోతుంది.

ఆమెకో విషయం స్పష్టంగా అవగాహనకొచ్చిందా క్షణం...

చావబోతున్న వ్యక్తిని కూడా బతికించే సంజీవని... నిజమైన ప్రేమ...

***

ఆ రోజు నిద్రలేచినప్పటినుండీ ప్రసాద్‌కి చిరాగ్గా ఉంది. ఇలా మరొకరి మీద ఆధారపడటమంటే చిరాకు... మంచానికిలా అతుక్కుని ఉండటమంటే చిరాకు... ఈ బతుకంటే చిరాకు... రాత్రి భయంకరమైన కలొచ్చింది. అదింకా వెంటాడుతూ... కళ్ళు తెరిచినా కళ్ళముందు సాకారమౌతూ... కలలో ఉదయం తను నిద్రలేచి పక్క మంచం మీద చూస్తే అమ్మింకా నిద్రపోతూనే ఉంది. అమ్మ ఎప్పుడూ ఇంతసేపు నిద్రపోదు. 'అమ్మా' అని పిలిచాడు. సమాధానం లేదు. పెద్దగా పిలిచాడు. అమ్మలో కదలిక లేదు... అమ్మ చచ్చిపోయిందన్న నిజం షాక్‌లా తెలిసొచ్చింది. అమ్మాఅమ్మా అని ఏడుస్తున్నాడు. పెద్దపెద్దగా అరిచాడు. ఎవ్వరికీ విన్పించలేదు... ఎవ్వరూ రాలేదు. ఒకరోజు... రెండ్రోజులు... మూడ్రోజులు... కుళ్ళిపోతున్న అమ్మ శవం తన మంచం పక్కనే... దుర్గంధం గదంతా వ్యాపిస్తూ... ఏడ్చి ఏడ్చి కాలువలై పారుతున్న కన్నీళ్ళు...

మల మూత్రాదుల్లో నానుతున్న అసహ్యమైన పురుగులా తను... దుర్గంధంలో కుళ్ళిపోతూ తను... పక్కన అమ్మశవం... ఆమె మంచం పక్కనే తొందర్లో శవం కాబోతున్న తను... తొందరగా శవమైతే బావుంటుందని తన అణువణువూ కోరుకుంటూ పరితపిస్తూ...

చప్పున మెలకువొచ్చింది. అప్పటికే అమ్మ లేచి పనులు చేసుకుంటున్న అలవాటైన శబ్దాలు విన్పిస్తున్నాయి. హమ్మయ్య అమ్మ బతికే ఉంది... తనకొచ్చింది కేవలం కల అనే ధైర్యం... మరుక్షణం కల గుర్తొచ్చి భయం... అలా జరిగితే... అమ్మో... అమ్మకంటే ముందు తనే చనిపోవాలి.

అమ్మ బ్యాంకుకెళ్ళిపోయింది. గదినిండా నిరాశ... తన మది నిండా నిరాశ... చచ్చిపోవాలనే కోరిక బలపడ్తూ... ఇంటర్నెట్ తెరిచాడు. తనని వరద ఉద్ధృతితో ముంచెత్తుతున్న ఆ నిరాశని నిస్పృహని అక్షరాల్లో పెట్టే ప్రయత్నం చేశాడు. చివర్లో 'ఇంత హీనమైన బతుకు బతికేకన్నా చావే నయమనిపిస్తోంది. నాకు చచ్చిపోవాలనిపిస్తోంది' అని రాశాడు.

వెంటనే చాలామంది సభ్యులు తీవ్రంగా స్పందిస్తూ మెయిల్స్ పంపించారు.

'విపత్కర పరిస్థితుల్లోనే మనిషి ధైర్యంగా నిలబడాలి. చివరిక్షణం వరకూ పోరాడాలి. నువ్వో పిరికివాడివి' అని కొంత మంది రాస్తే... మరికొంత మంది 'నువ్వు పోస్ట్ చేసే మెయిల్స్‌ని మిగతా రోగులు చదువుతారన్న స్పృహ లేదా... ఇలాంటి మాటలు చదివి మరింత నిరాశకు వాళ్ళని లోను చేయటం ఎంతవరకు సమంజసం?' అంటూ నిష్ఠూరంగా రాశారు.

అలా వచ్చిన ఉత్తరాల్లో ప్రసాద్‌ని ఆకర్షించిన ఉత్తరం నకిరేకల్ నుంచి రాగిణి అనే ఇరవైయేళ్ళ అమ్మాయి రాసిన ఉత్తరం... దానికి రెండు కారణాలు... మిగతా ఉత్తరాలన్నీ వేరే దేశస్థుల నుంచి వేరే రాష్ట్రాల్లో ఉండే మస్కులార్ డిస్ట్రోఫీ రోగులనుంచయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన ఒకేఒక ఉత్తరం అది కావటం ఒక కారణమైతే మరో కారణం మిగతా ఉత్తరాల్లో కన్పించని సాంత్వన అందులో ఉండటమే...

ఆ మెయిల్ని ఎన్నిమార్లు చదువుకున్నాడో... దాన్ని డెస్క్‌టాప్ మీద సేవ్ చేసి పెట్టుకున్నాడు. మరోసారి మెయిల్ని తెరిచి చదవటం ప్రారంభించాడు....

"హాయ్ ప్రసాద్! నా పేరు రాగిణి. చాలా అందమైన పేరు కదూ... నాపేరంటే

నాకెంతిష్టమో... అంత మంచి పేరు పెట్టిన మా అమ్మానాన్నలకు రోజుకోసారి థ్యాంక్స్ చెప్పుకుంటాను తెలుసా...

నువ్వు ఉదయించే సూర్యుణ్ణి ఎన్నిసార్లు చూశావో గుర్తుందా... నేను రోజూ చూస్తాను. రంగురంగుల చీరలు కట్టుకున్న అందమైన అతివలా ఆకాశం ఎన్ని హొయల్లు పోతుందో... తూరుపు దిక్కు నుదుట దిద్దుకున్న ఎర్రటి బొట్టులా సూర్యబింబం... ఎన్నిసార్లు చూసినా రోజూ కొత్తగా అన్పిస్తుంది తెలుసా... సిటీల్లో బతికే మీలాంటి అభాగ్యులకు సూర్యోదయ సూర్యాస్తమయ అందాల్ని కళ్ళారా చూసే అదృష్టం ఎక్కడిది? మా వూరి పేరు చెప్పలేదు కదూ. నకిరేకల్...

వూరికి చివరిల్లు మాది. ఎదురుగా విశాలమైన ప్రాంగణం... మా యింటి వసారాలో కూచుంటే చాలు సూర్యోదయం ఎంత అద్భుతంగా కన్పిస్తుందో... మా పెరట్లో ఎన్ని చెట్లో. అమ్మకు మొక్కలు పెంచటం ఎంతిష్టమో... నాక్కూడా... రకరకాల సీతాకోకచిలుకలు మా అతిథులు... పక్షుల కిలకిలారావాలు మంగళ వాద్యాల్లా విన్పిస్తుంటే నిద్ర మేల్కోవటం గొప్ప అనుభవం...

నేను పదో తరగతి వరకు జిల్లా పరిషత్ గరల్స్ హైస్కూల్లో చదివాను. తర్వాత ప్రైవేట్‌గా ఇంట్లో ఉండే డిగ్రీ పూర్తి చేశాను. స్కూల్ జీవితం బావుంటుంది కదా... ఎన్ని తీపి జ్ఞాపకాలో...

నాకు జీవితాన్ని సంపూర్ణంగా ఎంజాయ్ చేయాలని ఉంటుంది. ప్రతి రోజునీ రోజులోని ప్రతి గంటనీ ప్రతి క్షణాన్ని ఆనందంతో నింపుకోవాలని... అనంతమైన సంతోషాల్ని మూట గట్టుకోవాలని... నీకో విషయం తెలుసా... మనం దోసిళ్ళతో ఎత్తుకోవాలేగానీ మన కళ్ళెదురుగా రాసులుగా పోసి ఉన్న ఎన్నెన్ని సంతోషాలో... అందరూ డబ్బులుంటేనే సంతోషం అనుకుంటారు. ఎంత పొరపాటు అభిప్రాయమో... ప్రకృతి మన విందుకోసం పొందుపర్చిన చిన్నచిన్న అద్భుతాలు కొల్లలు... చాలా మంది వాటిని పట్టించుకోకపోవటం వాళ్ళ దురదృష్టం.

నవ్వులేని నిముషాలన్నీ వృధా అని నా ఉద్దేశం... జీవితం దేవుడిచ్చిన వరమైతే నవ్వు దాన్ని పండించుకునే దివ్య మంత్రం...

నీకో జోక్ చెప్పనా...

మస్కులార్ డిస్ట్రొఫీతో బాధపడ్తున్న అమ్మాయి లైట్ బీరే ఎందుకు తాగుతుంది?

నీకు తెలీదా... నేను చెప్పనా... ఎందుకంటే ఆ అమ్మాయి హెవీ బీర్ మోయలేదు కాబట్టి.

నవ్వొచ్చిందా... నవ్వావా లేదా... నీ సొమ్మేం పోదుగానీ కొద్దిగా నవ్వవయ్యా.

నీకో ముఖ్యమైన విషయం చెప్పటం మర్చేపోయాను. నా పేరుకు తగ్గట్లే నేను చాలా అందంగా ఉంటానని ఎవరు చెప్పారో గెస్ చేయి... ఇంకెవరూ అద్దం బాబూ...

అద్దం అబద్ధం చెప్పదు... నిజం.

నీ మెయిల్ చదివాక నీతో స్నేహం చేయాలనిపించి ఈ మెయిల్ పంపిస్తున్నా.

నన్నెవరైనా 'ఏం చదువుకున్నావు?' అని అడిగితే తడుముకోకుండా 'యం.డి.' అని చెప్తా. గొప్పగా ఉంటుంది తెలుసా అలా చెప్తుంటే... ఆ వ్యక్తి ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి 'యం.డీ.నా... ఇంత చిన్న వయసులో... గ్రేట్' అంటుంటే ఎంత నవ్వొస్తుందో... అమాయకప్రాణులు... యండీ అంటే డాక్టర్ ఆఫ్ మెడిసిన్ అనుకుంటారు.

మనిద్దరం యం.డీ.లమే కదా. యం.బీ.బీ.యస్. చేయకుండానే యం.డీ.లమైపోయినందుకు సంతోషంగా లేదా... ఇప్పటికైనా నవ్వొచ్చిందా... క్రూయల్ జోక్ అనుకుంటున్నావు కదూ.

జీవితమే ఓ క్రూరమైన జోక్... మనం బెదిరి పారిపోతే వేటాడి వేధిస్తుంది. ఎదురు నిలబడి పగలబడి నవ్వామా... ఓడిపోయి కాళ్ళముందు ఒరిగిపోతుంది. దుఃఖాలూ కష్టాలూ కన్నీళ్ళు అన్నీ తోకముడిచి పారిపోతాయి. నువ్వు నాణేనికి ఒకవైపునే చూస్తున్నావు. మరో వైపు చూడు. కొత్త లోకం కళ్ళముందు ఆవిష్కృతమౌతుంది.

నువ్వో చీకటి సొరంగంలోంచి నడుస్తూ నడుస్తూ... ఆగిపోయి... ఈ చీకటి అనంతమనీ ఎన్నటికీ అంతంకాదనీ భ్రమపడి బాధపడిపోతున్నావు. మరికొద్దిగా ముందుకు నడిచి చూడు. వెల్తురు కన్పిస్తుందన్న నమ్మకంతో నడువ్... గుండెనిండా ఆశని నింపుకుని నడువ్... సొరంగం చివర్లో అనంతమైన వెలుగు నీ కోసం ఎదురుచూస్తోంది.

చెప్పటం సులభం అనుకుంటున్నావేమో... నేనా వెలుగుని చూసినదాన్ని కాబట్టి చెప్తున్నా.

నీకు చాతకాకపోతే చెప్పు. నా చేయందించి నడిపిస్తా... వెల్తురు వైపుకి...

నీ స్నేహం కోరుతూ..... రాగిణి"

ఆ ఉత్తరానికి వెంటనే సమాధానం పంపించాడు ప్రసాద్.

"నీవు పంపిన మెయిల్ చదివాక ఎంత హాయిగా అన్పించిందో... ఎడారిలో నడచి నడచి అలసిపోయిన వ్యక్తికి ఒయాసిస్సులా... దాహంతో నాలుక పిడచకట్టుకుపోయిన వ్యక్తి నోట్లో ఒలికిన అమృత ధారలా... నువ్వు రాసింది చదివాక నాకో అనుమానం వచ్చింది. నిజంగా నీవు యం.డీ బాధితురాలివా? సారీ... ఎందుకడిగానంటే ఆ మెయిల్ ఏ రుగ్మతాలేని, ఆరోగ్యంగా చలాకీగా ఉండే అమ్మాయి రాసినట్లుంది. ఏది ఏమైనా ఇలానే ఉత్తరాలు రాస్తూ ఉండవా ప్లీజ్... వూపిరాడక చచ్చిపోబోతున్న వ్యక్తికి ఆక్సిజన్ అందించినట్లు ఉన్నాయి నీ మాటలు... నేనిపుడు బతకాలనుకుంటున్నాను... నువ్వు రాసే అద్భుతమైన మెయిల్స్ చదవడం కోసమైనా..."

మరునాడు దానికి రిప్లయ్ మెయిల్ వచ్చింది రాగిణి నుంచి.

"హాయ్! నీకూ కవిత్వం వస్తుందే... చక్కటి ఉపమానాలు వాడావు. నీకో విషయం తెలుసా... అయ్యో రామ. నేను చెప్తేకదా తెలిసేది. నేను కవిత్వం రాస్తాను. గత నాలుగేళ్ళుగా రాస్తున్నాలే. అప్పుడప్పుడూ పత్రికల్లో అచ్చువుతూ ఉంటాయి. కొన్ని పత్రికలు డబ్బులు పంపిస్తాయి. అవి అందుకున్న రోజు ఎంత సంతోషంగా ఉంటుందో తెలుసా? మేఘాల్లో తేలుతున్నట్లు... నా సంపాదన కదా... పది రూపాయలందుకున్నా పదివేలలా అన్పిస్తుంది.

నేను చలాకీగా ఉండనని ఎవరు చెప్పారు? చాలా అల్లరి చేస్తాను తెలుసా... నా అల్లరిని తట్టుకోవటం కష్టం అంటారు మా ఇంట్లో... చిన్నప్పుడైతే మరీనూ... పిల్లా పిడుగా అనేవాళ్ళు.

నాకు యం.డీ. లేదేమోనని కదా నీ అనుమానం... నీ అనుమానం నిజమే. నాకు యం.డీ. లేదు. ఎందుకంటే ఉన్నా లేనట్లే జీవితాన్ని అనుభవించడానికి ప్రయత్నిస్తుంటాను కాబట్టి. ఈ రోజే తన జీవితంలో చివరి రోజని తెలుసుకున్న వ్యక్తి ఆ రోజులో దొరికే అన్ని రకాల సంతోషాల్ని జుర్రుకోవాలని ఎలా ఆరాటపడ్తాడో అలా

నా చావు రేపేననుకుని ప్రతిరోజునీ మనసారా ఆస్వాదిస్తూ బతికేస్తుంటాను కాబట్టి.

ఇంకా అనుమానంగా ఉందా? ఐతే వచ్చి చూసుకో... ఎపుడొస్తావూ... నా అడ్రస్ కనుక్కోవడం చాలా సులభం. ఇసాయికుంటలో స్టేడియానికి పడమరవైపు ఉండే చివరిల్లే మాది. నాపేరడిగితే ఎవరైనా చెప్తారు. మనం ఈ లొకాలిటీలో అంత పాపులర్ అన్మాట. ఈ మాట రాస్తున్న క్షణంలో కాలర్ ఎగరేసుకుంటున్నా.. నీకు కన్పించిందా..

నీకింకో జోక్ చెప్పనా...

యం.డీ.తో బాధపడ్తున్న అమ్మాయి సీఫుడ్ దొరికే రెస్టారెంట్‌కి ఎందుకెళ్తుంది?

ఆలోచించు... బాగా ఆలోచించు..

తెలీదు కదా... నువ్వు నాకంటే తెలివగలవాడివి కాదులే. నేను చెప్తాను విను...

ఎందుకంటే అక్కడ మజిల్స్ దొరుకుతాయని ఎవరో చెప్పబట్టి.

నవ్వు రాలేదు కదూ. ఇది అర్థం కావాలంటే ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం ఉండాలి బాబూ. నాకు చాలా ఉందిలే. దయచేసి అప్పు అడక్కు ప్లీజ్... ఇవ్వలేను.

మజిల్స్ అంటే కండరాలు అనుకుంది పిచ్చిది. స్పెల్లింగ్ తేడా... మజిల్స్ అంటే సముద్రంలో దొరికే షెల్ ఉండే జీవి... ప్రాన్స్‌లా... చాలా రుచిగా ఉంటుందట. అమెరికాలో హోటళ్ళలో దీన్ని వండి పెడ్తారట... ఇపుడర్థమైందా పదంలో వాడిన పన్...

నాకు నాలుగేళ్ళ వయసున్నపుడు డాక్టర్లు మస్కులార్ డిస్ట్రోఫీ ఉందని నిర్ధారించారు. తొమ్మిదేళ్ళు దాటి బతకడం కష్టమని అమ్మానాన్నల్తో డాక్టర్లు చెప్పారట. నాకిప్పుడు ఇరవై యేళ్ళు. అంటే ఈ డాక్టర్లు విధించిన డెత్ సెంటెన్స్‌ని తప్పించుకుని పదకొండేళ్ళు బతికాను. భయపడకు. తొందరగా చావు నా దాకా రాదులే. ఇంకా చాలా యేళ్ళు బతుకుతానన్న నమ్మకం ఉంది. తీరాల్సిన కోరికలు బోలెడు మిగిలున్నాయిగా... పెళ్ళి చేసుకోవాలీ పిల్లల్ని కనాలీ పెంచి పెద్ద చేయాలీ... అబ్బో... ఎన్నో... అత్యాశ అనుకుంటున్నావా...

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి గీతాసారం చదివావా...

'జరిగేదేదో జరగక మానదు. అనవసరంగా ఆందోళన పడకు. ఆందోళన

అనారోగ్యానికి మూలం. ప్రయత్నలోపం లేకుండా ప్రయత్నించు. ఫలితం ఏదైనా దైవప్రసాదంగా స్వీకరించు. కోట్లు లేవని చింతించవద్దు. కూటికి ఉందికదా సంతోషించు. కాలిలో ముల్లు గుచ్చుకుందని చింతించవద్దు... కంటిలో గుచ్చుకోలేదని సంతోషించు...'

నా ఫిలాసఫీ ఆఫ్ లైఫ్ ఇదే. నాకు లేనిదాన్ని గురించి చింతించను. ఉన్నవాటిని చూసుకుని తృప్తి పడతాను. నాకు కళ్ళున్నందుకు వాటితో అందమైన ప్రకృతి సోయగాల్ని చూడగలుగుతున్నందుకు సంతోషపడ్డాను. నా చెవుల్తో ఇష్టమైన సంగీతం వినగలుగుతున్నందుకు ఆనందపడ్డాను. నా నాలిక్కి రుచులు తెలుస్తున్నందుకు, ఆకలంటే ఏంటో తెలీకుండా పెంచే ఆర్థిక స్థోమత మా నాన్నకున్నందుకు సంతోషపడ్డాను. సాయంత్రాలు వీచే శీతల సమీరాల్ని నా శరీరం ఆస్వాదించగలుగుతున్నందుకు, సుందరమైన సురుచిరమైన ఆలోచనలు చేయగల మనసున్నందుకు, మెదడు అమోఘంగా పనిచేస్తున్నందుకు... ఆనందపడ్డాను. ఇన్ని ఆనందాలు నా స్వంతమైనప్పుడు నేనెందుకు దుఃఖపడాలి?

అర్థమైందా... నువ్వూ శాంతంగా ఆలోచించు. నేను చెప్పేది నిజమేనని ఒప్పుకుంటావు.

రాగిణి స్నేహం ఉండగా నీ చెంత... ఎందుకు నీకీ చింత... మంచి ప్రసాదూ (పిచ్చి ప్రసాదూ అని రాయబోయి హర్ట్ అవుతావని రాయలేదని అర్థం చేసుకోగలవు)

ఇట్లు..... రాగిణి"

ప్రసాద్‌కి రాగిణి నుంచి వచ్చే ఈమెయిల్స్ టానిక్‌లా పని చేస్తున్నాయి. అమ్మ లేని సమయం ఇప్పుడు బోర్‌గా అన్పించడం లేదు. అతని మొహంలో ఎన్నడూ లేని కళ...

అమ్మ ఉద్యోగానికెళ్ళాక రాగిణితో చాటింగ్ చేయడం... ఈ మెయిల్స్ చదవడం... వాటికి సమాధానాలు రాయడం... అమ్మ వచ్చాక ఆ రోజు తామిద్దరూ చెప్పుకున్న కబుర్లని మననం చేసుకుంటూ గడపటం... ఇవన్నీ తన శారీరక బాధల్ని మర్చిపోయేలా చేస్తున్నాయి.

***

రాగిణి పరిచయమై సంవత్సరం కావస్తోంది. ఈ పన్నెండు నెలల్లో ఎన్నెన్ని పండు వెన్నెల్లో. ఎన్నెన్ని తీయటి అనుభూతులో...

రాగిణిని చూడాలన్న కోరిక... బలంగా...

“నిన్ను చూడ్డానికి రావొచ్చా... నేనూ అమ్మా వస్తాం. నీకేమైనా అభ్యంతరమా? మీ కుటుంబ సభ్యులు ఏమీ అనుకోరా? వాళ్ళ అనుమతి తీసుకున్నాక నాకు తెలియబరిస్తే వెంటనే బయల్దేరుతాం” అని ఓ రోజు మెయిల్ పెట్టాడు.

“హాయ్! నువ్వలా రాస్తే ఎంత బావుందో... పెళ్ళి చూపులకొచ్చే అబ్బాయిలా... చదవంగానే నాకు బోలెడు సిగ్గనిపించింది తెలుసా? అవును కదా... ఇన్నాళ్ళూ మనకీ ఆలోచన ఎందుకు రాలేదూ... నువ్వు యం.డి., నేనూ యం.డి... గంతకు తగ్గ బొంత... మనిద్దరం పెళ్ళి చేసుకుంటే ఎలా ఉంటుందంటావూ... ఆలోచించు. కళ్ళముందు రంగురంగుల రెయిన్‌బోలు కదుల్తున్నాయి కదూ.

నువ్వెలా ఉంటావో నాకు తెలీదు. నా వూహల్లో మాత్రం అందమైన యువకుడిలానే వూహించుకున్నా (నిరాశ పడను కదా). నేనైతే చాలా బావుంటానని ముందే చెప్పాగా. నా ఫొటో మెయిల్ చేస్తున్నా చూడు. నేను తప్పకుండా నచ్చుతానన్న నమ్మకం ఉంది. కళ్ళు లేకపోతే చెప్పలేననుకో... సారీ సారీ... నీకు పెద్దపెద్ద కళ్ళు ఉండి ఉంటాయిలే.

అబ్బ... పెళ్ళి గురించి ఆలోచిస్తేనే మనసంతా తీయగా గాల్లో తేలిపోతోంది. నీకూ నాకూ పెళ్ళీడు వచ్చిందని ఈ పెద్దోళ్ళకు అర్థం కాదెందుకో... ఈ పెద్దోళ్ళంతా ఇంతే ప్రసాదూ. ఓ మర్చేపోయా... ఏదో సినిమాలో పెళ్ళికాని ప్రసాద్ ఉంటాడుగా. ఇకనుంచి నిన్ను పెళ్ళికాని ప్రసాద్ అనే పిలుస్తా. ఈ పిలుపునుంచి తప్పించుకోవాలంటే నువ్వెంటనే వచ్చి నన్ను పెళ్ళి చేసుకో. మా అమ్మానాన్న ఒప్పుకోకపోతే... నో ప్రాబ్లెం... నేను నీతో వచ్చేయడానికి రెడీ... నువ్వు రెడీనా...”

ఆ మెయిల్ చదువుకున్నాక ప్రసాద్‌కి ఆనందంతో పాటు దుఃఖమూ పొంగుకొచ్చింది.

ఎంత సరదాగా రాస్తుందో... ఎంత అల్లరిగా రాస్తుందో... అసలంత సంతోషంగా ఉండటం ఎలా సాధ్యం? తను సంతోషంగా ఉండటమే కాదు ఎదుటి వ్యక్తిని కూడా సంతోషంలో ముంచెయ్యటం ఎంత గొప్ప విషయం!

అతనికి ఎట్లాగయినా సరే నకిరేకల్ వెళ్ళి రాగిణిని చూడాలనిపించింది.

కానీ చప్పున అతన్ని చుట్టేస్తూ భయం... ఇంతందమైన కల కళ్ళు తెరిస్తే కరిగిపోతుందేమోనన్న భయం... తీరా వెళ్ళాక అసలు రాగిణి అనే అమ్మాయే ఉండదేమోనన్న భయం... ఓ వేళ ఉన్నా తనుండేది నకిరేకల్ కాదేమోనన్న అనుమానం... నెట్లో ఛాటింగ్ చేసుకునేవాళ్ళు చెప్పేవాటిలో సగానికి పైగా అబద్ధాలుంటాయని కదా పేపర్లో రాశారు... అసలు రాగిణి అమ్మాయి పేరు పెట్టుకున్న అబ్బాయేమో... రాగిణి నిజమే యైనా తనకే జబ్బా లేదేమో... కేవలం తనకు ధైర్యాన్ని సంతోషాన్ని ఇవ్వటం కోసం అలా రాస్తున్న వ్యక్తేమో... ఎన్ని అనుమానాలో... ఎన్ని భయాలో...

రాగిణి నిజం కాకున్నా పర్లేదు. అందమైన భ్రమ... అటువంటి భ్రమలోనే బతకాలని ఉంది తప్ప దాన్ని తొలగించుకోవాలని లేదు.

ఇవన్నీ ఆలోచించుకుని వెళ్ళకూడదనే నిర్ణయించుకున్నాడు.

ఎప్పుడొస్తున్నావంటూ రెండు మూడు ఉత్తరాలొచ్చాయి.

"వస్తున్నావా... ఎపుడొస్తావు... నా ఫొటో నచ్చలేదా? ఫొటోలో కంటే నేరుగా చూస్తే ఇంకా అందంగా ఉంటాను. నిజం... నీ మీదొట్టు" అని ఒక ఉత్తరంలో రాస్తే...

"పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం? వచ్చే నెల్లో చాలా మంచి ముహూర్తాలున్నాయట. అమ్మా నాన్న మాట్లాడుకుంటుంటే విన్నాను. ఆ తేదీల్లో పెళ్ళి చేసుకున్న జంటలు నిండు నూరేళ్ళు కలిసి జీవిస్తారట. మనల్ని యండీ ఏమీ చేయదన్మాట. చావు దరిచేరదన్మాట... ఓహ్... బావుంది కదూ. డాక్టర్లు చేయలేని పనిని శుభ ముహూర్తాలు చేస్తాయన్మాట. పెళ్ళికి సూట్ కుట్టించుకుంటావా? బ్లాక్ కలర్ సూట్ బావుంటుంది. నాకు బ్లూ కలరన్నా ఇష్టమే. నేనేం చీర కొననూ... కలర్ నీకిష్టమైందే కొంటా. పట్టుచీర బరువుగా ఉంటుంది. నాకొద్దు. చీర సెలక్షన్ మా చెల్లికి చెప్తా. దాని టేస్ట్ బావుంటుంది. అది షాపింగ్ రారాణి తెలుసా... డబ్బులు చేతిలో పడ్తే చాలు షాపింగ్ కెళ్ళిపోయి క్షణాల్లో ఖర్చు చేసుకుని వస్తుంది.

అలాగని బ్యాడ్ గర్ల్ అనుకునేవు. బంగారు తల్లి... నాకెంతిష్టమో అదంటే. ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. కాలేజీకెళ్ళేవరకూ తిరిగింటికొచ్చాకా నా పనులన్నీ తనే చేసిపెడ్తుంది. ఏమడిగినా సరే నవ్వుతూ మనస్ఫూర్తిగా చేస్తుంది. అస్సలు విసుక్కోదు.

బజారునుంచి నాక్కావల్సినవన్నీ అడక్కుండానే తెచ్చిపెడ్తుంది.

నీ గురించి దానికి ఆల్రెడీ చెప్పాలే. ఈ మెయిల్ లవ్వా అని ఆట పట్టించింది కూడా. బావగారెలా ఉంటారే నాకోసారి చూపించవా అని అడిగింది. నువ్వు నీ ఫొటో పంపలేదుగా. 'బావుండడేమోనే అక్కా... అందుకే పంపి ఉండడు' అని కూడా అంది. వెంటనే నీ ఫొటో పంపించు. మన పెళ్ళి జరగాలంటే మొదట నువ్వు దానికి నచ్చాలట. ఇదేం ఈక్వేషనో నాకర్థం కాలేదు. నాక్కూడా నచ్చాలి. నీ ఫొటో చూడకుండానే నువ్వు నాకు నచ్చావులే. నువ్వెలా ఉన్నా నాకిష్టమే. నల్లగా ఉంటావా... చప్పిడి ముక్కా... ముందు రెండు పళ్ళు విరిగి ఉంటాయా... బట్టనెత్తా... చీపిరికళ్ళా... పగలు చూస్తే రాత్రి కలలో కొచ్చేలా ఉంటావా... ఎట్లా ఉన్నా నాకు ఓకేనే... ఫొటో పంపవయ్యా బాబూ..." అంటూ రాసింది.

ప్రసాద్ తన ఫొటోని మెయిల్ చేశాడు.

"అబ్బ! ఎంత బావున్నావో. నేనెలా వూహించుకున్నానో అచ్చం అలానే ఉన్నావు. నీ కళ్ళు చాలా బావున్నాయి... ఆడపిల్ల కళ్ళలా విశాలంగా... ఆర్ద్రంగా... మా చెల్లి కయితే పిచ్చపిచ్చగా నచ్చావు. ఇక నువ్వు ముహూర్తాలు పెట్టుకుని రావడమే తరువాయి. నీకోసం ఈ రాగిణి చేత్తో వరమాల పట్టుకుని ఎదురుచూస్తూ గడపలో నిలబడి ఉంటుంది. సారీ సారీ. నిలబడలేనుగా. కూచుని ఉంటుంది... సరేనా... నీదే ఆలస్యం మరి" అని జవాబు వచ్చింది.

ప్రసాద్ వెంటనే మెయిల్ పంపాడు. రెండ్రోజులు ఎదురుచూసినా ప్రత్యుత్తరం రాలేదు. అతన్లో కంగారు... రాగిణి ఎప్పుడూ ఇంతాలస్యం చేయలేదు. రోజుకు కనీసం ఒక్కమెయిలైనా చేయకుండా ఉండదు. మంచి మూడ్‌లో ఉన్నప్పుడైతే రోజులో మూడు నాలుగు మెయిల్లు పంపుతుంది. రాగిణి ఎప్పుడూ మంచి మూడ్‌లోనే ఉంటుంది.

"ఏమైంది నీకు? జవాబు ఇవ్వలేదెందుకు? ఆరోగ్యం బాగోలేదా... జ్వరం వచ్చిందా... డాక్టర్ల దగ్గరకు చెకప్ కెళ్ళావా... వెంటనే మెయిల్ పంపించు" అని రాశాడు.

దానికీ జవాబు రాలేదు.

ప్రసాద్ వెంటవెంటనే మెయిల్స్ పంపించాడు. ఐనా సమాధానం లేదు. అతన్లో

పొరలు విప్పుకుంటున్న భయం... రాగిణికేమైంది? రాగిణి... తనకు ప్రియాతిప్రియమైన స్నేహితురాలు. గత ఏడాదిగా తన హృదయాన్ని మలయమారుతంలా తాకుతున్న మృదుస్పర్శ... మధురంగా విన్పిస్తున్న ఆత్మీయగీతం...

నాలుగు రోజులు... ఐదు రోజులు... నో మెయిల్స్...

ప్రసాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ఆందోళన... ఆకాశంలా విస్తరిస్తోన్న దిగులు... ఎప్పుడూ లేంది అమ్మను ఒకట్రెండుసార్లు విసుక్కున్నాడు కూడా. అమ్మ కళ్ళలో చప్పున వూరిన కన్నీళ్ళను చూసి, పశ్చాత్తాపపడి "నన్ను క్షమించమ్మా... మనసేం బాగోలేదు" అన్నాడు.

"పర్లేదు నాయనా... నిన్ను అర్థం చేసుకోగల్ను... లేకపోతే అమ్మనెలా అవుతాను" అందామె.

వారం రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎదురుచూసిన మెయిల్ వచ్చింది. అతనికి ప్రాణం లేచొచ్చింది. మరికొన్ని రోజులవరకు మెయిల్ రాకపోతే నకిరేకల్ వెళ్దామనే అనుకున్నాడు. మెయిల్‌ని ఆత్రంగా చదివాడు.

"కంగారు పడ్డావు కదూ... ఏదైనా అనారోగ్యానికి లోనై ఉంటానని అనుకున్నావు కదా... నెవ్వర్... నేను గుడ్లురిమి చూస్తే రోగాలు భయపడి పారిపోతాయని చెప్పాగా... సివంగిని...

మెయిల్ బాక్స్ ఓపెన్ చేస్తే నీవు పంపిన మెయిల్లన్నీ కట్టలు కట్టలు జారి కాళ్ళ మీద పడ్డాయి. నేనంటే నీకు చాలా ఇష్టం కదూ. నాకర్థమైపోయిందిలే. నువ్వన్నా నాకిష్టమే...

సారీ... జాప్యానికి కారణం చెప్పలేదు కదూ. నా ల్యాప్ టాప్ పాడైంది. వైరస్... ఈ కంప్యూటర్ వైరస్లేమిటో నాకర్థం కాదు. మనుషుల్ని వైరస్‌లు పట్టి పీడిస్తున్నట్లే కంప్యూటర్లని కూడా వైరస్‌లు ఇబ్బంది పెడ్తాయని నా కంప్యూటర్ మూగబోయాకే అర్థమైంది.

మాది చిన్న వూరు కదా. రిపేరుకిస్తే కాలేదు. కంప్యూటర్ మూగబోవటం కాదట... చచ్చిపోయిందట. అదేలే మదర్ బోర్డ్ పూర్తిగా పాడైందట. హైద్రాబాద్‌కి పంపించి

బాగు చేయాల్సిందేనన్నాడు. లేకపోతే కొత్త ల్యాప్‌టాప్ కొనుక్కోమన్నారు.

ఎంత ఖర్చయినా సరే నాకీ ల్యాప్‌టాపే కావాలని గొడవ చేశాను. 'కొత్తదైతే బాగా పని చేస్తుంది కదమ్మా. ఇది బాగా ఓల్డ్ మోడల్ ఐందట. స్పేర్ పార్ట్స్ దొరకటం కూడా కష్టం అంటున్నాడు షాప్ వాడు' అన్నాడు నాన్న. ఆయనకేం తెలుసు నీ ఉత్తరాలన్నీ ఈ ల్యాప్‌టాప్‌లోనే ఉన్నాయని.

మెయిల్ ఓపెన్ చేస్తే ఏ ల్యాప్‌టాప్ లోనైనా నీ ఉత్తరాలు దొరుకుతాయి కదా అనుకుంటున్నావు కదూ. అదే మగాళ్ళకీ ఆడాళ్ళకీ తేడా. మీకు స్త్రీల సున్నిత హృదయం అర్థం కాదు. నా సెంటిమెంట్ నాది. ఈ ల్యాప్‌టాప్ లోనే కదా నువ్వు పరిచయమైనావు... అందుకే నాకీ ల్యాప్‌టాపే కావాలని గట్టిగా చెప్పాను.

మదర్ బోర్డ్‌ని హైద్రాబాద్‌కి స్పీడ్ పోస్టులో పంపించి మళ్ళా వెనక్కి తెప్పించడానికి ఇంత టైం పట్టింది. బాధ పెట్టానా... మనస్తాపం కలిగించాను కదూ. సారీ... ఏం చేయను చెప్పు... బైటికెళ్ళి నీకు మెయిల్ చేయలేనుగా.

అప్పటికీ చెల్లి నీకు మెయిల్ పంపిస్తానంటే కోప్పడ్డాను. అమ్మో... మనం రాసుకున్న పర్సనల్ విషయాలన్నీ దానికి తెలిసిపోవూ... అదింకా చిన్న పిల్ల కదా...

నీతో కబుర్లు చెప్పి వారం రోజులైంది. చెప్పాల్సిన విషయాలెన్ని ఉన్నాయో... మరో ఉత్తరంలో చెప్తానేం..."

ప్రసాద్ వెంటనే దానికి జవాబు పంపించాడు.

***

కడుపులో ఎవరో కదలినట్లనిపించి గుండె ఓ క్షణం లయ తప్పింది. చేస్తున్న పనిని ఆపేసి ఉబికినట్లున్న తన పొట్టమీదే మనసంతా కేంద్రీకరించి వూపిరి బిగపట్టింది సునీత. మళ్ళా అలాంటిదేమీ జరగలేదు. భ్రమేమో... ఐనా పిల్లలంటే అంత పిచ్చి వ్యామోహం ఏమిటీ తనకు? తన పిచ్చికానీ పిల్లలంటే యిష్టపడని స్త్రీలు కూడా ఉంటారా... అందునా తొలి చూలు. అమ్మో! తనకు పిల్లలంటే ప్రాణం. కిషోర్ ఒప్పుకోడు కానీ తనకైతే డజనుమంది పిల్లల్ని కనాలని ఉంటుంది. గంపెడుపిల్లలు... యింటినిండా గునగునా నడుస్తూ... ముద్దుముద్దుగా మాట్లాడ్తూ... ముద్దుగా విసిగిస్తూ...

సందడి సందడిగా ఎంత బావుంటుందో... ఆ వూహకే నవ్వొచ్చింది దేశ జనాభా గుర్తొచ్చి... 'సరదాగా అన్నాలే. బంగారు బొమ్మల్లాంటి యిద్దరు పిల్లలు చాల్లే... నీలా ఒక పాప నాలా ఒక బాబు... సరేనా కిషోర్' అనుకుంది.

పెళ్ళయ్యాక... కిషోర్ ఎదురుగా లేకున్నా మనసులోనే అతనితో సంభాషించటం ఆమెకో వ్యసనంలా మారింది. అతను ఎదురుగా ఉన్నట్లే... తనతో మాట్లాడుతున్నట్లే... భావన.

'యిదేమైనా పిచ్చా... నువ్వు డాక్టర్‌వి కదా... నిజం చెప్పు' అంటూ ఓ రోజు నిలదీసింది. కిషోర్ పెద్దగా నవ్వాడు. నవ్వితే ఎంత బావుంటాడో!

'మెల్లగా అంటావేమిటి... పెద్ద పిచ్చి' అన్నాడు.

'ఏయ్... ఏడ్పించకుండా చెప్పు... నువ్వు హాస్పిటల్ కెళ్ళినపుడు ఎదురయ్యే ఒంటరితనాన్ని తప్పించుకోవడం కోసం మనసుని మభ్యపెట్టుకుంటున్నానా?'

'నేనూ డిట్టోనే డియర్... హాస్పిటల్లోని నారూంలో ఒంటరిగా మిగిలిపోతే చాలు, ఎదురుగా నువ్వు ప్రత్యక్షం... స్కిజో ఫ్రీనియాలా... కబుర్లు... కవ్వింతలు... ప్రేమరోగం మరి... ముదిరి పాకాన పడ్తోంది' అంటున్నప్పుడు తను లతలా అతన్ని అల్లుకుపోయి 'అందుకే ఓ బాబునో పాపనో తొందరగా కనేస్తా... నువ్వు లేకున్నా వాడు తోడుంటాడు' అంది.

'తొందరగా కంటావా... వద్దు. నిండా తొమ్మిది నెల్లూ ఆగాలి. లేకపోతే ప్రిమెచ్యూర్ బేబీ పుడ్తుంది. అప్పుడు ఐ.సి.యూ.లో ఇంక్యుబేటర్లో పెట్టాల్సి వస్తుంది' అన్నాడతను కొంటెగా.

తనకు బాగా కోపం వచ్చింది... దుఃఖం కూడా... 'డాక్టర్లకు సెన్సాఫ్ హ్యూమర్ ఉండదే అని నా స్నేహితురాలంటే నమ్మలేదు. ఛీ... అవేం మాటలు... అపశకునం మాటలు' అంది.

మరలా కడుపులో ఎవరో కదిలినట్లు... గోడల్ని తన బుల్లి చేతుల్తో తడిమినట్లు... వళ్ళు జలదరించింది... తీయటి పులకింత శరీరం నిండా విద్యుత్ ప్రవాహంలా పాకుతూ... ఐదు నెలలు నిండాయిగా... బాబు తన ఉనికిని చాటుతున్నాడు... 'అమ్మా... యింకో

నాలుగు నెలలు... అంతే... నేను నీ పొత్తిళ్ళలో ఉంటాను' అంటూ సంకేతాలు పంపుతున్నాడు.

కిషోర్ రాగానే అడగాలనుకుంది. యిరవై వారాలు నిండిన ఫీటస్ ఎలా ఉంటుందో చూడాలని తహతహ... కాళ్ళూ చేతులూ ఏర్పడతాయా... తల... మిగతా అవయవాలు... ఆడో మగో తెలుస్తుందా... యిలా అడిగితే కిషోర్ ఆట పట్టిస్తాడు. 'నేను డాక్టర్నయి ఉండి బి.కాం చదివిన అమ్మాయిని యిష్టపడి చేసుకున్నాను చూడు... నా తలరాత... కనీసం బేసిక్ నాలెడ్జ్ కూడా లేదు' అంటాడు. తనూరుకుంటుందా... రిటార్ట్ యివ్వటంలో తనకు తనే సాటి. 'అయ్యో... డాక్టర్ని కట్టుకుని ఎంత పొరపాటు చేశాను? శృంగార సన్నివేశాల్లో కూడా హ్యూమన్ అనాటమీ గురించి ఆలోచించే ప్రబుద్ధుడు దొరికాడే' అంటుంది. అప్పుడు చూడాలి కిషోర్ మొహం... సిగ్గుతో ఎర్రబడి... కళ్ళల్లో రోషం పొటమరించి 'ఏయ్... నిన్నూ...' అంటూ కొట్టడానికి వెంటబడ్డాడు.

ఆలోచనల్లోనే డిన్నర్ రెడీ చేసి, డైనింగ్ టేబుల్ మీద సర్దేసి, టీవీ ఎదురుగా కూచుంది. చూపు టీవీ స్క్రీన్ మీదున్నా సమస్త శరీరమూ కిషోర్ రాకను సూచిస్తూ మోగే కాలింగ్ బెల్ కోసం ఎదురు చూస్తోంది.

కాలింగ్ బెల్ మోగగానే ఎందుకో ఉలిక్కి పడింది. ఈ మధ్య చిన్న చిన్న శబ్దాలకు కూడా ఉలిక్కి పడ్తోంది. కిషోర్ని అడగాలి కారణం ఏమిటో... బిపి చెక్ చేస్తానుండు అంటాడు బహుశా... డాక్టర్లని చేసుకోవటంవల్ల కొన్ని లాభాలున్నాయి. జబ్బు చేస్తే డాక్టర్లని వెదుక్కుంటూ బైటికి పోనవసరం లేదు. అలానే రోగాలూ మందుల గురించి వినీవినీ, ఎంతో కొంత మెడికల్ జ్ఞానం అనాయాసంగానే పట్టుపడ్తుంది...

భోజనాలయ్యాక, కిచెన్ సర్దేసి వచ్చి అతని పక్కన కూచుంటూ అడిగింది. "నాకు ఐదో నెల నిండింది కదా. లోపల బేబీ ఎంత డెవలప్ అయి ఉంటుందో చూడాలనుంది"

కిషోర్ కళ్ళలో అదుగో అల్లరి... "తొమ్మిది నెలలు కాకుండా తొమ్మిది రోజుల్లో బేబీ పుట్టే వీలుంటే బావుండేదనుకుంటున్నావు కదా" అన్నాడు.

"అబ్బ... నామనసులో మాటని ఎంతబాగా కనిపెట్టావో... నువ్వు జనరల్ ఫిజీషియన్ కాకుండా సైకియాట్రిస్ట్ ఐతే యింకా బాగా రాణించేవాడివి" అంది.

“యిప్పుడైనా నా రాణింపుకేం తక్కువ... రాణిగారు తోడుండంగా” అంటూ చురకేశాడు. “పద. నెట్ ఓపెన్ చేసి చూపిస్తాను” అంటూ ల్యాప్‌టాప్ ముందు కూచున్నాడు. “యిర్వై వారాల తర్వాత ఫీటస్ ఎనిమిదంగుళాల నుంచి పదంగుళాల పొడవు ఎదుగుతుంది. తల... కాళ్ళూ చేతులు ఏర్పడతాయి. చూడు... స్క్రీన్ మీద కన్పిస్తున్న ఫొటో... స్కానింగ్ చేస్తే బేబీ అలా కన్పిస్తుంది”

సునీత కళ్ళు విప్పార్చి చూసింది. “యిప్పుడు నేను స్కానింగ్ చేయించుకున్నా మన బేబీ యిలా కన్పిస్తుందా?” అంది చిన్నపిల్లలా సంబరపడిపోతూ.

“తప్పకుండా”

“ఐతే మళ్ళా స్కానింగ్ చేయించుకుంటా... ప్లీజ్ ప్లీజ్... మనం అడిగితే హాస్పిటల్ వాళ్ళు ఓ ఫొటో యిస్తారుగా. దాన్ని ఫ్రేమ్ కట్టించి పెట్టి మన బాబు పెద్దయ్యాక వాడికి ప్రెజంట్ చేస్తా. నువ్వు నా కడుపులో పడిన ఐదోనెలలో యిలా ఉన్నావు తెలుసా అని వాడితో చెప్తా” అంది.

కిషోర్ వెంటనే సమాధానం చెప్పకుండా ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

“ఏం మాట్లాడవు? రేపే వెళ్దాం... సరేనా” అంది అతని తలమీద చేయి వేసి జుట్టుని ప్రేమగా సవరిస్తూ ..

“నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఎనామలీ స్కాన్ చేయించుకుంటే మంచిదేమోనని. యిరవై వారాలు నిండిన ప్రతి గర్భిణి తప్పకుండా చేయించుకోవాల్సిన స్కానింగ్ అది”

“చూశావా... బి.కాం. చదివినా ఎంత బాగా గుర్తు చేశానో... యింతకీ ఎనామలీ స్కానింగ్ అంటే ఏంటో చెప్పు” అతని మెడచుట్టూ పూదండలా చేతులేస్తూ అడిగింది.

“ఎనామలీ స్కానింగ్‌లో బేబీ ఎదుగుదల సరిగ్గా ఉందాలేదా... అవయవాలన్ని సక్రమంగా రూపుదిద్దుకున్నాయా లేదా... ఏమైనా అబ్‌నార్మాలిటీస్ ఉన్నాయా అనేవి తెలుస్తాయి”

సరదాగా ఉన్న మూడ్‌లో యాసిడ్ కుమ్మరించినట్టు... ఆ మాటలు ఆమెని భయపెట్టాయి.

"ఛ... అవేం మాటలు కిషోర్... మన బాబుకి అబ్‌నార్మాలిటీస్ ఎందుకుంటాయి" అంది.

"అయ్యో... నేనలా అనలేదు. మన బాబుకేం... బంగారు కొండలా సలక్షణంగా ఉంటాడు. మ్యాన్యుఫాక్చరింగ్ మనిద్దరిదీ కదా... నో ఛాన్స్ ఫర్ డిఫెక్ట్స్... ఎనామలీ స్కానింగ్ ఎందుకు చేస్తారో చెప్పానంతే"

సునీత మనసు కొద్దిగా వూరట చెందింది. "అందుకోసమే ఐతే నాకా స్కానింగ్ వద్దు"

"యిరవై వారాల బాబు ఫొటో చూడాలన్నావుగా... మనం దానికోసం చేయిద్దాం. రేపే"

"రేపు అష్టమి... ఎల్లుండి నవమి... వద్దు... దశమి రోజు చేయిద్దాం"

కిషోర్ పెద్దగా నవ్వాడు. "నేను డాక్టర్ని... తిథులు, వారాలు వర్జ్యాలు చూసి ఆపరేషన్ చేస్తానంటే పేషంట్ హరీ అంటాడు"

"నీ విషయం నాకు తెలీయదు. నా సెంటిమెంట్... అంతే... నో ఆర్గ్యుమెంట్స్" అంది.

దశమి రోజు కిషోర్ తను పని చేసే హాస్పిటల్‌కి పిల్చుకెళ్ళాడు. అక్కడ డ్యూటీలో ఉన్న డాక్టర్ని పరిచయం చేస్తూ "మీట్ మై కొలీగ్ డాక్టర్ సిద్దార్థ. ఫేమస్ జనరల్ ఫిజీషియన్" అంటూ తన వైపు తిరిగి "షి ఈజ్ మై బెటర్ హాఫ్... సునీత" అంటూ పరిచయం చేశాడు.

సునీత చేతులు జోడించి నమస్కారం పెట్టింది. గైనకాలజిస్ట్ దగ్గరకు చెకప్ కోసం ప్రతినెలా యిదే హాస్పిటల్ కొస్తున్నా ఈ డాక్టర్ని ఎప్పుడూ చూళ్ళేదు తను. అతనూ ప్రతి నమస్కారం చేశాడు.

'మీరు చాలా మంచి పని చేస్తున్నారు డాక్టర్... ఎనామలీ స్కానింగ్ పైన మన ప్రజల్లో ఎవ్వరికీ సరైన అవగాహన లేదు. ప్రభుత్వమూ పట్టించుకోదు. గర్భవతిగా ఉన్న ప్రతి స్త్రీ ఈ స్కానింగ్ చేయించుకుంటే అంగవైకల్యంతో బర్త్ డిసార్డర్స్‌తో జరిగే ప్రసవాల్ని సగానికి పైగా నిరోధించవచ్చు" అంటూ సునీత వైపు తిరిగి "డాక్టర్లని పెళ్ళి చేసుకోవటం

వల్ల ఎన్ని లాభాలో చూశారా సిస్టర్. యూ ఆర్ లక్కీ... డాక్టర్ కిషోర్ ఈజ్ యాన్ ఐడియల్ హజ్బెండ్" అన్నాడు. అతను వెళ్ళబోతూ కిషోర్‌తో చేతులు కలిపి "ఆల్ ది బెస్ట్" అన్నాడు.

స్కానింగ్ చేసే గదికి వెళ్తున్నపుడు సునీతకు కొద్దిగా టెన్షన్ అన్పించినా తెల్సిన హాస్పిటల్...... పక్కనే కిషోర్ ఉన్నాడు కాబట్టి వూరటగా అన్పించింది. స్కానింగ్‌కి ముందు ఓ డాక్యుమెంట్ మీద యిద్దరి సంతకాలు తీసుకున్నారు... కడుపులో ఉన్న బిడ్డ ఆడో మగో తెల్సుకునే ప్రయత్నమేదీ చేయబోమని... సోనోగ్రాఫర్ని ఆ విషయం గురించి అడగమనీ రాసిచ్చిన హామీ పత్రమది.

"అలా తెల్సుకోవటం చట్టప్రకారం శిక్షార్హమైన నేరం. 2002 నుంచి శిక్షని మరింత కఠినం చేశారు తెలుసా" అన్నాడు కిషోర్.

"తెలుసు... యిలాంటి విషయాలు తెల్సుకోడానికి సైన్స్ చదవాల్సిన అవసరం లేదు" అంది ఉక్రోషంగా... కిషోర్ అల్లరిగా నవ్వాడు. ఎంతందమైన నవ్వో... పెళ్ళి చూపులప్పుడు ఈ నవ్వు చూశేగా తను మాయలో పడిపోయింది!

"పుట్టబోయేది ఆడపిల్ల అని తెల్సుకుని అబార్షన్ చేయించుకోవటం దారుణం కదా. నా ఉద్దేశంలో అబార్షనే దారుణం... ఓ ప్రాణాన్ని హరించే హక్కు మనకెవరిచ్చారు?" ఉద్వేగంతో అంటున్నప్పుడు ఆమె గొంతు దుఃఖంతో వణికింది.

కిషోర్ మౌనంగా ఉండిపోయాడు. అబార్షన్ అనివార్యమయ్యే అనేకానేక సందర్భాలు చెప్పాలనిపించినా, అదే సమయంలో సోనోగ్రాఫర్ లోపలికి పిలవటంతో సునీత భుజాల చుట్టూ చేతులు వేసి లోపలికి పిల్చుకెళ్ళాడు.

"రిలాక్స్ మిసెస్ కిషోర్... జస్ట్ పావుగంట... అంతే..." అంది సోనోగ్రాఫర్. కొద్దిసేపైనాక "అదుగో ఆ స్క్రీన్ మీద మీ బేబీని చూడొచ్చు... అది తల... యివిగో చేతులు... యివి కాళ్ళు" అని చూపిస్తుంటే సునీత ఆనందాశ్చర్యాల మధ్య ఉక్కిరిబిక్కిరైపోతూ చూస్తోంది.

"యింటర్నల్ ఆర్గాన్స్ కూడా కన్పిస్తాయి జాగ్రత్తగా చూడండి... తెల్లగా కన్పించేవి ఎముకలు... నల్లగా కన్పిస్తున్నది ఫ్లూయిడ్... బూడిద రంగులో కన్పించేవి సాఫ్ట్ టిష్యూలు...

యిక్కడ కన్పిస్తున్నది గుండె...” పెదవులమీద చిర్నవ్వు చెరిగిపోకుండా ఉత్సాహంగా చెప్పుకుపోతున్న సోనోగ్రాఫర్ ఆగిపోయింది... ఆమె భృకుటి ముడి పడింది.

సునీత కంగారుగా కిషోర్ వైపు చూసింది. అతని చూపంతా స్క్రీన్ మీద కేంద్రీకృతమైంది. మళ్ళీ సోనోగ్రాఫర్ వైపు తిరిగి “ఏమైంది? ఎనీ ప్రాబ్లం” భయపడ్తూనే అడిగింది.

“నథింగ్... రిలాక్స్... కొన్ని డిటెయిల్స్ కోసం జాగ్రత్తగా చూడాల్సిన అవసరం ఉంది. అంతే” ఆమె సునీత వైపోసారి చూసి, నవ్వి మరలా సీరియస్‌గా తన పనిలో నిమగ్నమైంది.

స్కానింగ్ పూర్తయ్యాక సునీతని బైట కూచోబెట్టి కిషోర్ లోపలికెళ్ళాడు. అతను రావటం ఆలస్యమయ్యేకొద్దీ సునీత గుండె కొట్టుకునే వేగం పెరుగుతూనే ఉంది. బైటికొచ్చిన కిషోర్ మొహంలో తనెన్నడూ చూడని దిగులు...

ఏదో జరక్కూడనిది జరిగిందని ఆమెకర్థమైంది. ఎంతగా అర్థించినా కిషోర్ ఏమీ చెప్పటం లేదు. ఆ రాత్రంతా పీడ కలలు... పలవరింతలు... మరునాడు ఆమ్నియోసిన్టసిస్ చేయించాడు.

ఆ రిపోర్ట్ చూడగానే అతని గుండె బద్దలయింది. తన సంతానం గురించి కన్న కలలన్నీ నల్లటి సిరాతో అలికేసినట్లు... సునీత అడిగినా ఏమీ చెప్పకుండా యింటికి పిల్చుకొచ్చాడు.

యింటికొచ్చే వరకు ఓపిక పట్టి తనలో దాచుకున్న అసహాన్నంతా ఒక్కసారిగా వెళ్ళగక్కి కదిలి కదిలి ఏడ్చింది సునీత. “నిజం చెప్పు... ఏం జరుగుతోంది... స్కానింగ్‌లో ఏం కన్పించింది?ఆమ్నియో పరీక్షలో ఏం తెలిసింది? ప్లీజ్ ఏదీ దాచకుండా చెప్పు” అంది అతన్ని పట్టుకుని కుదిపేస్తూ.

“నువ్వు తట్టుకోలేవు సునీతా” అన్నాడతను గద్గద స్వరంతో... అతని కళ్ళలో ఉబికిన కన్నీటి బిందువులు చూసి ఆమె మరింత విచలితురాలైంది.

“తట్టుకుంటాను. చెప్పు. నేను వాడి తల్లిని. వాడి గురించి నాకు తప్పకుండా తెలియాల్సిన అవసరం ఉందని నీకనిపించటం లేదా? ఏమైంది మన బేబీకి?”

"గుండె దిటవు చేసుకో సునీతా... మన బేబీకి జెనెటిక్ డిజార్డర్ ఉంది"

"అంటే ఏంటి? చిన్న సమస్యేనా... ఏంటా సమస్య?"

"దాన్ని ఎడ్వర్డ్ సిండ్రోమ్ అంటారు"

"నీ భాషలో కాదు... నా భాషలో చెప్పు" విసురుగా అంది.

"నీ కర్థమయ్యేలా చెప్పాలంటే ఒక క్రోమోజోమ్ డూప్లికేట్ కాబడి జత ఉండాల్సిన చోట మూడు క్రోమోజోములేర్పడతాయి. యింకా వివరంగా చెప్పాలంటే మనిషిలో యిరవై మూడు జతల క్రోమోజోములుంటాయని తెల్సుగా. యిరవై రెండు జతలు మామూలువి... యిరవై మూడో జత సెక్స్‌ని నిర్ధారించే ఎక్స్ వై లేదా ఎక్స్ ఎక్స్ క్రోమోజోముల జత. ఎడ్వర్డ్ సిండ్రోమ్‌లో పద్దెనిమిదో జత క్రోమోజోముల్లో అదనంగా మరో క్రోమోజోము ఉంటుంది. అంటే రెండుండాల్సిన చోట మూడుంటాయన్మాట"

"నేనడిగింది పాఠం చెప్పమని కాదు. దానివల్ల ఏం జరుగుతుంది? కాంప్లికేషన్స్ ఏమిటి? సమస్య చిన్నదా పెద్దదా... మందుల్తో తగ్గుతుందా?" అప్పటికే ఆమె కన్నీళ్ళ చెలమలా మారిపోయింది.

కిషోర్‌కి ఏం చెప్పాలో అర్థంకాలేదు. కొద్ది సేపు మౌనంగా ఉన్నాక చెప్పాడు. "అది చిన్న సమస్య కాదు సునీతా. తీవ్రమైన సమస్య. చాలా అరుదుగా కన్పించే వ్యాధి. మూడు వేల మందిలో ఒక్కరికి మాత్రమే వచ్చే వ్యాధి. చాలా కేసుల్లో బిడ్డ పుట్టక ముందే కడుపులోనే చచ్చిపోయే అవకాశాలెక్కువ. పుట్టిన బిడ్డల్లో ఎక్కువ మంది మొదటి నెలలోనే చచ్చిపోతారు. ఏది ఏమైనా సంవత్సరం వయసు దాటి బతికే పిల్లలు అరుదు"

సునీత చాలా సేపటివరకు ఏడుస్తూనే ఉండిపోయింది. కొద్దిసేపటి తర్వాత "డాక్టర్లు ఏమీ చేయలేరా? దీనికి మందే లేదా?" అంది.

"దీనికి మందు లేదు సునీతా. ఈ వ్యాధి వల్ల బాబులో రకరకాల లోపాల్తో పాటు అనేక రకాల రుగ్మతలు చోటు చేసుకుంటాయి. కన్పించే కాంప్లికేషన్స్ బట్టి కంప్యాషనేట్ కేర్ తీసుకోవటం తప్ప డాక్టర్లు కూడా ఏమీ చేయలేరు"

"మరి మన బిడ్డ గతేంటి? దేవుడు మనకెందుకు యిలాంటి శిక్షని వేసాడు? నేనేం పాపం చేశానని... అయ్యో భగవంతుడా... మొదటి బిడ్డ గురించి ఎన్ని కలలు

కన్నాను! ఎలా మురిసిపోయానో... నా బతుకిలా ఎందుకైంది దేవుడా" అంటూ శోకాలు పెడ్తున్న సునీతని ఎలా ఓదార్చాలో కిశోర్‌కి అర్థం కాలేదు.

"దీనికి ఒకటే పరిష్కారం సునీతా... అబార్షన్. అబార్షన్ చేయించుకో... మనం రిస్క్ తీసుకోవద్దు. తొమ్మిది నెలలు నిండకముందే దానికదే అబార్షన్ అయ్యే అవకాశమున్నా ఒక్కోసారి బేబీ పుట్టొచ్చు కూడా. అందుకే... రేపే గైనకాలజిస్ట్‌తో మాట్లాడతాను. యిప్పటికే యిరవై వారాలు దాటాయి కాబట్టి అబార్షన్ చేయడాన్ని చట్టం ఒప్పుకోదు. నాకు తెల్సిన హాస్పిటలే కాబట్టి గుట్టుగా పని జరిగిపోయేలా నేను చూసుకుంటాను" అన్నాడు.

సునీత వారం రోజులు మనిషి కాలేకపోయింది. తిండీ నిద్రా మానేసి కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూ కూచుంది.

"సునీతా! అర్థం చేసుకోవెందుకు? ఆలస్యం జరిగేకొద్దీ అబార్షన్ చేయటంలో కాంప్లికేషన్స్ రావొచ్చు" అన్నాడు కిషోర్.

"నేను అబార్షన్ చేయించుకోను. నా బిడ్డ తలరాత ఎలా రాసి ఉంటే అలా జరుగుతుంది. వాణ్ని కంటాను. ప్రేమగా పెంచుతాను. వాడు బతికినంతకాలం నా ప్రాణంలా చూసుకుంటాను తప్ప వాడు పుట్టకముందే హత్య చేసే అబార్షన్‌కి నేనొప్పుకోను" అంది.

"ఎడ్వర్డ్ సిండ్రోమ్ జబ్బుతో పుట్టిన బిడ్డని చూసుకుంటూ ప్రతిక్షణం కుమిలిపోయే శిక్ష చాలా భయంకరమైంది. పగవాడిక్కూడా అటువంటి మానసిక హింస ఉండకూడదని భగవంతుణ్ణి కోరుకుంటాను. నా మాటిను. ఎడ్వర్డ్ సిండ్రోమ్ అంటే ఏంటో నీకు తెలీక మాట్లాడ్తున్నావు. ఓ స్త్రీగా నువ్వు మాట్లాడే మాటల్ని నేనర్థం చేసుకోగల్ను. కానీ ఓ తల్లిగా నువ్వా బిడ్డ పడే బాధని చూళ్ళేవు. నలభై రకాలకు పైగా కాంప్లికేషన్స్ రావొచ్చు తెలుసా... గుండె సరిగ్గా పని చేయకపోవచ్చు. కిడ్నీ జబ్బులు రావొచ్చు. మెంటల్ రిటార్డేషన్ కలగొచ్చు. నడుం కింద నుంచి పని చేయకపోవచ్చు. కళ్ళ జబ్బులు రావొచ్చు. వినికిడి సమస్య రావొచ్చు..."

"నేను విన్లేను. యింక ఆపండి" చెవులు మూసుకుంటూ పెద్దగా అర్చింది.

“రేపు అబార్షన్‌కి రెడీ చేయమని డాక్టర్‌కి ఫోన్ చేసి చెప్తాను” అన్నాడు తన సెల్ ఫోన్లో ఏదో నంబర్ నొక్కుతూ.

“మీరలా భయపెట్టినంత మాత్రాన ఒప్పుకుంటాననుకున్నారా? లేదు. నేను వాడ్ని కంటాను. కనటమే కాదు వాడ్ని అందరు పిల్లలకు మల్లే ప్రేమగా పెంచుతాను”

“నీకేమైనా పిచ్చి పట్టిందా? వాడు పుట్టినా ఎక్కువ కాలం బతకడు”

“అలాగని పుట్టక ముందే చంపేస్తారా? అలా చంపే అధికారం మనకెవరిచ్చారు? మనం స్కానింగ్ చేయించుకోకపోతే మనకీ విషయం తెలిసేది కాదుగా. అప్పుడు కని ఉండే దాన్నిగా”

“సునీతా... చదువుకున్న మూర్ఖురాలిలా మాట్లాడకు. అభివృద్ధి చెందిన విజ్ఞానంవల్ల సాధ్యమయ్యే మెరుగైన జీవనవిధానాన్ని కాలదన్నుకోకూడదు. సెంటిమెంట్స్ వద్దు సునీతా... ప్రాక్టికల్‌గా ఆలోచించు. మన బాబు అనారోగ్యంతో బాధ పడ్తూ ఉంటే చూస్తూ సంతోషంగా ఉండగలవా?”

“వాడికున్న అనారోగ్యాన్ని కారణంగా చూపి వాణ్ణి కళ్ళు తెరవకముందే చంపేస్తే నేను సంతోషంగా ఉండగలననుకున్నారా? అనారోగ్యం మనకు రాకూడదా... మీకో నాకో తీవ్రమైన జబ్బేమైనా చేస్తే మనం ఒకర్నొకరం వదులుకుంటామా... మనల్ని మనం చంపుకుంటామా?”

“అదీ యిదీ ఒకటెలా అవుతుంది?”

“ఎందుక్కాదు? వాడిదీ ప్రాణమే... మనదీ ప్రాణమే... మనం సౌలభ్యం చూసుకుంటున్నాం. వాడింకా పుట్టలేదు కాబట్టి, నోరు తెరిచి తన యిష్టాయిష్టాలు చెప్పలేదు కాబట్టి మన సుఖం కోసం వాణ్ణి చంపేయాలనుకుంటున్నాం. ఎంత దారుణం” అంది.

“సునీతా... కొద్దిగా ప్రశాంతంగా ఆలోచించు. ఈ రోజంతా ఆలోచించు. నిన్ను బలవంత పెట్టను. పిల్లాడ్ని కనడమే నీ నిర్ణయమైతే నీ భర్తగా నేనూ నీతోపాటు ఎటువంటి పరిణామాల్ని ఎదుర్కోడానికైనా సిద్ధమే. ఎటొచ్చీ నా రిక్వెస్ట్ ఒక్కటే. మన యిద్దరి జీవితాలకి ఏది మంచిదో ఏది కాదో ఆలోచించి నిర్ణయం తీసుకో” అంటూ ఆ విషయాన్ని ఆమెకే వదిలేశాడు.

మరో వారం వరకూ సునీత ఏ నిర్ణయమూ చెప్పలేదు. సమస్యని అన్ని కోణాల్నించీ రకరాకలుగా ఆలోచించి, విశ్లేషించుకుని, బాధపడి, భయపడి, మథన పడి, కన్నీరు కార్చి చివరికి అబార్షన్ చేయించుకోడానికి తన అంగీకారాన్ని తెలిపింది.

క్షణమైనా ఆలస్యం చేయకుండా తమ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డా. గీతని సంప్రదించాడు కిశోర్.

"యిరవై నాలుగు వారాల ప్రెగ్నెన్సీని టెర్మినేట్ చేయమంటున్నారా డాక్టర్? అడుగుతుంది మీరేనా? మరెవరైనా సాధారణ వ్యక్తి అలా అడిగితే అర్థం చేసుకోగలను. మీరూ డాక్టరై ఉండి అలా అడగటం భావ్యమా? యిరవై వారాల లోపలైతేనే అబార్షన్ చట్టబద్ధమని మీకు తెలీదా?" అంది గీత.

"అన్నీ తెల్సిన మీరే అలా మాట్లాడితే ఎలా... పుట్టబోయే బిడ్డకి ఎడ్వర్డ్ సిండ్రోమ్ జబ్బు ఉందన్న విషయం మీకు తెలుసు. అది ఎంత ప్రమాదకరమైన వ్యాధో మీకు తెలిసీ చట్టం గురించి మాట్లాడ్తారేమిటి?"

"జన్యుపరమైన వ్యాధులున్నపుడో, శారీరిక వైకల్యం ఉందని తెలిసినపుడో అబార్షన్ చేయించుకోవచ్చని ప్రభుత్వమే చట్టం చేసిందిగా. ఎటొచ్చీ యిరవై వారాలు దాటక ముందైతేనే అలాంటి అవకాశం కల్పించింది. ఆ పీరియడ్ దాటాక కూడా చేస్తే అది చట్ట విరుద్ధమౌతుంది. నేరమౌతుంది. తెలిసి తెలిసి నేను నేరం చేయను"

"మానవత్వంతో ఆలోచించండి డాక్టర్... అది నేరమెలా అవుతుంది? ఎన్నో అవకరాలతో ఆరోగ్య సమస్యలతో పుట్టబోతున్న ప్రాణిని ఆపటం తప్పా... మీకూ తెలుసు అలా పుట్టే బిడ్డ ఎక్కువ కాలం బతకదని... ఎలాగూ చనిపోతాడని తెలిసీ ఆప్రాణిని ఈ లోకంలోకి తీసుకురావడం వల్ల ఒనగూడే ప్రయోజనమేమిటి? వాళ్ళమ్మానాన్నలకు ఎంతటి మానసిక క్షోభో ఆలోచించారా... ఆ బిడ్డకూ ఎంత శారీరిక హింస? గోటితో పోయే సమస్యని గొడ్డలి దాకా తెచ్చుకోమంటారా? మనిద్దరం ఒకే హాస్పిటల్లో పని చేస్తున్న డాక్టర్లం... ఆ మాత్రం ఒకరికొకరం సాయపడకపోతే ఎట్లా చెప్పండి" అన్నాడు అభ్యర్థనగా.

"సెంటిమెంటల్ బ్లాక్ మెయిలింగా? సారీ. నేను లొంగను. ఒకేచోట పని చేస్తున్నాం కాబట్టి మీరు చేయమన్న నేరాన్ని సంతోషంగా చేయమంటారు. అంతేనా... నెవర్.

యిరవై వారాల లోపే బాబుకి జెనెటిక్ డిసార్డర్ ఉందని కనుక్కోకపోవడం మీ తప్పు. మీరు డాక్టరై ఉండి అంత నిర్లక్ష్యంగా ఉన్నందుకు మూల్యం చెల్లించుకోక తప్పదు.”

“యిలాగైతే మన హాస్పిటల్ యం.డి. వెంకటరెడ్డిగారితో చెప్పిస్తాను. అప్పుడైనా ఒప్పుకుంటారా?”

“వెంకటరెడ్డి కాదు కదా బ్రహ్మదేవుడు దిగొచ్చి చెప్పినా నేను చేయను. అవసరమనుకుంటే యిక్కడ ఉద్యోగం మానేసి మరోచోట చేర్తాను”

“అంత మూర్ఖంగా మాట్లాడ్తారేమిటి డాక్టర్?”

“హౌ డేర్ యూ కాల్ మీ లైక్ దట్? నువ్వే మూర్ఖంగా వాదిస్తున్నావు. నన్ను నేరం చేయమని వత్తిడి తెస్తున్నావు. నేరం చేయడమే కాదు నేరం చేయమని ప్రోత్సహించడం కూడా నేరమే. మైండ్ యిట్. యింకా ఎక్కువ మాట్లాడితే నీమీద పోలీస్ కంప్లెయింట్ యివ్వాల్సి ఉంటుంది” అందామె కోపంగా.

“ఈ లోకంలో నువ్వొక్కదానివే గైనకాలజిస్ట్‌వి అనుకుంటున్నావా? హైద్రాబాద్ నగరంలో వందకు పైగా హాస్పిటళ్ళున్నాయి... వందల కొద్దీ గైనకాలజిష్టులున్నారు. డబ్బులు పడేస్తే ఎవరైనా కళ్ళకద్దుకుని అబార్షన్ చేస్తారు” అంటూ లేచాడు కిశోర్.

“నువ్వు ఎక్కడ అబార్షన్ చేయించినా నేను తప్పకుండా కంప్లెయింట్ యిస్తాను. నిన్నూ ఆ డాక్టర్ని జైలుకి పంపిస్తాను. గుర్తు పెట్టుకో” అంది కోపంగా.

కిశోర్ విసురుగా లేచి “అదీ చూస్తాను” అంటూ విసవిసా బైటికి నడిచాడు.

యింటికొచ్చినా మూడ్ మాత్రం పిచ్చిగా ఉంది. మనసంతా పచ్చిగా ఉంది.

డా. గీత మొండిదని విన్నాడు గానీ యింత మొండిగా మూర్ఖంగా ప్రవర్తిస్తుందని వూహించలేకపోయాడు. జరిగిన విషయం సునీతతో చెప్పినపుడు “ఆమె చెప్పింది కూడా నిజమే కదా. మనం చదువుకున్న వాళ్ళమై ఉండి ఓ నేరాన్ని ఎందుకు చేయాలి? ఐనా బిడ్డని కనడమా మానడమా అనేది తల్లి యిష్టం తప్ప మధ్యలో ఈ ప్రభుత్వాల, చట్టాల జోక్యం ఏమిటి? మనం కోర్టుకెళ్దాం. ఈ విషయాన్ని ఇలా వదిలేయకూడదు” అంది.

“గర్భవతిగా ఉన్న స్త్రీ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చట్టాలు చేయడం జరిగింది. యిరవై వారాలు దాటితే అబార్షన్ చేయడం వల్ల పెద్ద ప్రాణానికి ముప్పు ఏర్పడవచ్చని

వైద్య రంగం అభిప్రాయ పడ్తోంది. కాబట్టి మనం గెలిచే అవకాశాలు తక్కువ”

“మీరు వెళ్ళినప్పటి నుండీ నేను యింటర్నెట్లో సమాచారం కోసం వెతికాను. అమెరికాలో యిరవై నాలుగు వారాల వరకూ అబార్షన్ చేయవచ్చు. అక్కడ లేని ముప్పు యిక్కడెందుకొస్తుంది? ఐనా మనది చాలా స్పెషల్ కేస్. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించామని విర్రవీగుతారుగా. బిడ్డని కనగూడదని ఓ స్త్రీ నిర్ణయించుకున్నపుడు ఎన్ని వారాల కడుపైనా అబార్షన్ చేయగలిగేలా మెడికల్ సైన్స్‌ని అభివృద్ధి పర్చాలిగానీ ఇలా అడ్డుపడటం ఏం న్యాయం? రేపు మనకు పుట్టబోయే బిడ్డని ప్రభుత్వమే భరిస్తుందా? వాడు బతికున్నంత కాలం ఆ బాధ్యతని తీసుకుంటుందా? మనం మంచి లాయర్ని కలుద్దాం” అంది దృఢ నిశ్చయంతో.

హైకోర్టులో కేస్ దాఖలైంది. రోజులు గడిచేకొద్దీ అబార్షన్‌కి అవకాశం సన్నగిల్లుతుందని వాది తరఫు లాయర్ వాదించటం వల్ల ధర్మాసనం అందుకు అంగీకరించింది. కేస్ దాఖలైన మరునాడే కోర్టులో వాదోపవాదాలు ప్రారంభమైనాయి.

నాలుగు రోజులు వరుసగా వాదోపవాదాలు విన్నాక అబార్షన్‌కి వ్యతిరేంగా కోర్టు తీర్పు వెలువడింది.

సునీతకు బాబుని కనక తప్పలేదు. పది రోజుల క్రితం అదే హాస్పిటల్లో కాన్పయింది. డా. గీత అప్పటికే ఉద్యోగం మానేసి వేరే హాస్పిటల్‌కి వెళ్ళిపోవటం వల్ల మరో గైనకాలజిస్ట్ కాన్పు చేసింది.

ఆ రోజు హాస్పిటల్లోని అందరూ బాబుని వింతగా చూశారు. అప్పటివరకూ ఆ హాస్పిటల్లో ఎడ్వర్డ్ సింన్రోమ్‌తో ఎవ్వరూ పుట్టలేదు. సిద్దార్థకి కూడా మెడికల్ పుస్తకాల్లో బొమ్మలు చూట్టం తప్ప అటువంటి జన్యు సంబంధిత వ్యాధితో పుట్టిన పిల్లవాణ్ణి చూట్టం అదే మొదటి సారి.

వాడి తల వెనక భాగం బాగా పెద్దదిగా ఉంది. చెవులు చాలా చిన్నవిగా ఉన్నాయి. గుండెలో లోపాలు... కిడ్నీలు సరిగ్గా ఏర్పడలేదు. కటి భాగం ఉండాల్సిన దానికన్నా చిన్నగా ఉంది. గుండె దగ్గర ఉండే ఎముక మాయమైంది. కాలి వేళ్ళు ముద్దగా కలిసిపోయి ఉన్నాయి. కేజీన్నర మించి బరువులేదు. పుట్టిన వెంటనే ఐ.సి.యూ. లో పెట్టారు.

"దయ్యం పిల్లాడిలా ఉన్నాడు" అని బాత్రూంలు శుభ్రం చేసే ఆవిడ అనటం సిద్దార్థ విన్నాడు.

***

రాత్రి పన్నెండున్నర. సిద్దార్థ మెల్లగా ఐ.సి.యూ. గదిలోకి నడిచాడు. పది రోజుల వయసున్న ఆ పిల్లవాడి బలహీనమైన ఛాతి శ్వాస తీసుకున్నపుడు కొద్దిగా ఉబ్బి మళ్ళా తగ్గిపోతోంది. కృత్రిమ శ్వాస....

'నీకు నువ్వే చచ్చిపోతావని పది రోజులు గడువిచ్చాను. ఎందుకు చావలేదు? ఎన్నిరోజులీ హింసని భరిస్తావు' వాడి వైపు చూస్తూ అనుకున్నాడు.

'రోజుకు ఎన్ని మందులిస్తున్నారో... డ్రిప్ ద్వారా ఎన్ని మందులు ఎక్కిస్తున్నారో... నన్ను చావనిస్తేగా... నాకూ చావాలనే ఉంది. బలవంతంగా బతికిస్తున్నారే... ప్లీజ్ నాకు సాయం చేయవా... మా అమ్మ కన్నీళ్ళు చూళ్ళేకుండా ఉన్నాను. ఎలాగూ ఎక్కువ కాలం బతకను. మీరు ఎన్ని మందులు ఎక్కించినా మహా బతికితే మరో యిరవై రోజులు... ఇంత కష్టపడాలా యిరవై రోజుల జీవితంకోసం? నన్ను ఈ బాధలనుంచి దూరం చేయవా ప్లీజ్' అంటూ ఆ పిల్లవాడు బతిమాలుతున్న భావన...

సిద్దార్థకి చాలా బాధేసింది. అనంతమైన జాలి ఒక్కసారిగా ఉప్పెనలా ముంచేసింది.

అసలిలాంటి పిల్లల్ని ఎందుక్కంటారు? అబార్షన్ చేయించవచ్చుగా... కిషోర్ కూడా ఎంత మూర్ఖంగా ప్రవర్తించాడో... గీతతో గొడవలెందుకు? మరో హాస్పిటల్లో గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్ చేయించవచ్చుగా... పట్టుదలకు పోయి న్యాయస్థానం తలుపులు తట్టాడు... ఏమైంది చివరికి?

చట్టాలుకూడా యింత గుడ్డిగా ఎందుకున్నాయి? చస్తాను మొర్రో అంటే బలవంతంగా బతకమంటాయేంటి? నాకీ బిడ్డ వద్దని ఆ తల్లి నెత్తీ నోరు బాదుకుంటూ ఏడ్చినా కనికరించలేదే. నెలో రెండు నెలలో బతికించి హింసించి చంపటం కన్నా పుట్టక ముందే చంపేయటం మంచిదనే విషయం వీళ్ళకెందుకర్థం కాదు?

ఎన్ని లొసుగులో చట్టాల్లో... హత్యలూ మానభంగాలు చేసినోళ్ళు దర్జాగా బైట తిరుగుతున్నారు. వాళ్ళకున్న వెసులుబాటు బిడ్డను కనే తల్లికి లేదా... వుహు... యిక్కడ

మాత్రం చాలా ఖచ్చితంగా చటాల్ని అమలు చేస్తారు. ఎందుకంటే ఇక్కడ బాధితులు బ్లాక్ మార్కెట్ చేసేవాళ్లో గూండాలో రౌడీలో రాజకీయనాయకులో కాదు కాబట్టి... సామాన్య మానవుడంటే చట్టాలకెంత చులకనో... బతకడానికి అవసరమైన తిండీ, బట్టా, గూడు యివ్వరు. గౌరవంగా బతికే అవకాశాలు కల్పించరు. చస్తామంటే నేరం చేశారంటూ జైల్లో పెడ్తారు. యిదేం న్యాయం?

అందుకే తనకు చాతనైనంతగా తనే న్యాయం చేస్తున్నాడు. యిప్పటివరకు పధ్నాలుగు మందికి బాధల నుంచి విముక్తి ప్రసాదించి ఉంటాడు. వీడు పదిహేనోవాడు. తను కరుణ చూపిన వ్యక్తుల్లో వీడే అందరికంటే చిన్నవాడు. పది రోజుల పసి గుడ్డు. ఆక్సిజన్ అందిస్తున్న ట్యూబ్‌ని లాగబోయిన అతని చేయి టక్కున ఆగిపోయింది, సగానికి పైగా వయసైపోయినోళ్ళో ముసలితనంలో జీవితపు చరమ దశలో ఉన్నవాళ్ళో తన దయకు యిన్నాళ్ళు పాత్రులైనారు. కాని యిపుడు తను విముక్తి ప్రసాదించబోతున్న జీవికి జీవితమంటే ఏంటో తెలీదు. తను పడ్తున్న యాతన నరకయాతనలా ఉందనీ దాన్నుంచి తప్పించుకోవాలనుందనీ స్పృహ లేని పసికందు...

అతని మనసు ఎదురు తిరుగుతోంది. చేతులు ఎవరో కట్టేసినట్లు...

తను చంపకున్నా ఎలాగూ చచ్చిపోతాడు. అప్పటివరకూ తల్లిదండ్రులకు గంపెడంత మానసిక క్షోభని మిగిల్చిపోతాడు. దాంతో పాటు ఆర్థికంగా కూడా మోయలేనంత భారాన్ని డాక్టర్ కిశోర్ మీద మోపి పోతాడు. ఐనా కడుపులో ఉన్నపుడే వీడి తల్లిదండ్రులే చంపేయాలనుకున్నారుగా. కోర్టు తీర్పు అడ్డుపడటం వల్ల ఆగిపోయారు. వాళ్ళు అప్పుడు చేయలేక వదిలేసిన పనిని తను పూర్తి చేస్తున్నాడంతే.

మనసుని బుజ్జగించుకుని మళ్ళా ట్యూబుని లాగడానికి చేయి ముందుకు చాపాడు.

***

డాక్టర్ వలీకి చప్పున మెలకువొచ్చింది. ఎవరో ఏడుస్తున్నారు... పక్క బెడ్రూంలోంచి విన్పిస్తోంది ఏడుపు. అందులో తన యిద్దరు కొడుకులు పడుకుంటారు. పెద్దోడికి పదేళ్ళు... రెండోవాడికి ఎనిమిదేళ్ళు. పక్కన భార్య లేదు. లేచి హాల్లోకొచ్చాడు. భార్య మాటలు పిల్లల బెడ్రూంలోంచి విన్పిస్తున్నాయి.

తలుపు తోసుకుని లోపలికెళ్ళాడు. పెద్దోడు అమ్మ వాళ్ళో పడుకుని ఏడుస్తున్నాడు. ఆమె వాడి పొట్ట నిమురుతూ "తగ్గిపోతుంది నాన్నా... అజీర్తి చేసిందేమో... యిప్పుడే ఓ గ్లాస్ వేడి నీళ్ళు తాగావుగా... గ్యాస్ ఉబ్బరమున్నా తగ్గిపోతుంది" అంటోంది.

"వాడు కడుపు నొప్పితో బాధపడ్తోంటే నన్నెందుకు లేపలేదు? ఏదో టాబ్లెట్ యిచ్చేవాణ్ణిగా" అన్నాడు.

"అందుకే లేపలేదు. ప్రతిచిన్న దానికి పిల్లల చేత మాత్రలు మింగిస్తే వాళ్ళ ఆరోగ్యం ఏమైపోద్ది? పిల్లలన్నాక కడుపు నొప్పులు రావా... మరీ నొప్పి ఎక్కువైతే వాములో చిటికెడు ఉప్పు కలిపి తినిపిస్తే తగ్గిపోతుంది."

వలీ భార్య మాట ఖాతరు చేయకుండా వాడి పొట్టని నొక్కి చూశాడు. కుడి వైపు దిగువభాగంలో చేయి తగిల్తేచాలు నొప్పితో మెలికలు తిరుగుతున్నాడు. అపెండిసైటిస్ నొప్పి... అనుమానం లేదు.

ఆలస్యం చేయకుండా బట్టలు మార్చుకుని బాబుని తీసుకుని హాస్పిటల్ చేరుకున్నాడు. అప్పుడు సమయం పన్నెండు ముప్పయ్ ఐదు. బల్ల మీద నిద్రపోతున్న నర్సుని లేపి ఆపరేషన్ థియేటర్ రెడీ చేయమని పురమాయించి బాబుని వార్డులో ఖాళీగా ఉన్న బెడ్ మీద పడుకోబెట్టాడు.

రాత్రి డ్యూటీ డాక్టర్ సిద్దార్థదన్న విషయం అతనికి గుర్తుంది. యింత అలికిడౌతున్నా సిద్దార్థ తన గదిలోంచి బైటికి రాకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. బాగా గాఢ నిద్రలో ఉన్నాడేమో. అపెండిసైటిస్ ఆపరేషన్ తనూ చేయగలడు. కాని తన బిడ్డ కదా... కత్తితో కోయటం చేయగలడా... అసలు కత్తితో గాటు పెట్టగలడా... లాప్రోస్కోపిక్ ఆపరేషన్ చేయటంలో సిద్దార్థ దిట్ట. మొదట సిద్దార్థని లేపాలి. తర్వాత అనీస్తీషియా యిచ్చే డాక్టర్ అందుబాటులో ఉన్నాడో లేడో కనుక్కోవాలి.

నైట్ డ్యూటీ డాక్టర్ విశ్రమించే గదిలో కెళ్ళి చూశాడు వలీ. సిద్దార్థ అక్కడ లేడు. వార్డులో కూడా లేడు కాబట్టి ఐ.సి.యూ.లో ఉన్న పేషంట్స్‌ని చూడటానికి వెళ్ళాడేమోనని వేగంగా మెట్లెక్కి మొదటి అంతస్తులో ఉన్న ఐ.సి.యూ.లోకి ప్రవేశించాడు.

ఎడ్వర్డ్ సిండ్రోమ్‌తో బాధ పడ్తోన్న బాబు బెడ్ పక్కన డాక్టర్ సిద్దార్థ నిలబడి ఉన్నాడు. అతని చేతిలో ఆక్సిజన్ ట్యూబ్... బాబు వైపు చూసాడు. ఆ చిన్న శరీరంలో

కొన్ని క్షణాల కదలిక... మరణ యాతనతో తపించే శరీరంలో కన్పించే అంతిమ కదలిక... వేగంగా బెడ్ దగ్గరకు చేరుకుని "డాక్టర్ సిద్దార్థ... ఏం చేస్తున్నారు మీరు" అంటూనే ఆక్సిజన్ ట్యూబుని అతని చేతుల్లోంచి లాక్కుని బాబు నోటికి అమర్చాడు. గుండె మీద చేతులేసి మెల్లగా నొక్కాడు. బాబులో చలనం లేదు. అప్పటికే బాబు చనిపోయాడు.

వలీ కోపంగా సిద్దార్థ వైపు తిరిగి "మీరేం చేశారో తెలిసే చేసారా? నిర్దాక్షిణ్యంగా ఓ ప్రాణాన్ని తీశారు. కోల్డ్ బ్లడెడ్ మర్డర్..." అన్నాడు.

"నరకయాతన అనుభవిస్తున్న ఈ బాబుకి ఆ బాధలనుంచి విముక్తి ప్రసాదించాను"

"ఎంత తప్పు చేశారు డాక్టర్?"

"తప్పని నేననుకోవటం లేదు. దయతో ప్రవర్తించాను. మీకూ తెలుసు ఈ బాబు ఏడాది మించి బతకడని... బలవంతంగా బతికించటానికి ప్రయత్నించడం వల్ల ఏంటి ప్రయోజనం... భూమికి భారం... తల్లిదండ్రులకు భారం... వాడికి వాడే భారం... అందుకే అలా చేశాను"

"మీరెవరు అలా చేయడానికి? మీరేం దేవుడు కాదే... పుట్టిన ఏ జీవీ భూమికి భారం కాదు. అలా అనుకుంటే దేవుడు వాళ్ళని పుట్టించడు. మీరు చేసిన పాపం క్షమించరానిది. చాలాయేళ్ళుగా మనం కలిసి పని చేస్తున్నాం. మీరు నా స్నేహితులు. అలాగని మీరు చేసిన పాపాన్ని కప్పి పుచ్చి అల్లా దృష్టిలో దోషిని కాలేను. ఐ యాం సారీ డాక్టర్. నేను పోలీసులకు ఫోన్ చేస్తాను. చూసిన చేదు నిజాన్ని అందరికీ చెప్తాను" అంటూ వేగంగా బైటికి నడిచాడు.

***

పోలీసులకు ఫోన్ చేసే ముందు బాధ్యత గల ఉద్యోగిగా వెంకటరెడ్డికి ఫోన్ చేశాడు డాక్టర్ వలీ. ఆ వార్త వినగానే రోజూ రెండు పెగ్గులు తాగి పడుకునే వెంకట రెడ్డికి మత్తంతా ఒక్కసారిగా దిగిపోయింది.

"మీరు తొందరపడి పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇవ్వకండి. ఉదయం అయ్యేవరకైనా ఆగండి. నేను ఆరింటికల్లా హాస్పిటల్లో ఉంటాను. ఎమర్జన్సీ మీటింగ్ పెడ్దాం. మన

హాస్పిటల్లో పన్చేసే మిగతా డాక్టర్లను కూడా పిలుద్దాం... అందరం ఓ నిర్ణయానికొచ్చాక దాన్ని అమలు పరుద్దాం. అప్పటివరకూ మీరెవ్వరితో ఈ విషయం చెప్పకండి ప్లీజ్" అన్నాడు.

"అలా కుదర్దు. ఇక్కడ జరిగింది హత్య. నా కళ్ళముందు జరిగిన హత్య. దాన్ని దాచిపెట్టే ప్రసక్తే లేదు. అల్లా మెచ్చడు"

"దాచిపెట్టమని అనడం లేదు. కొన్ని గంటలు ఆగమంటున్నా. ఇక్కడ మన హాస్పిటల్ పరువు ముడిపడి ఉంది. ఇన్నేళ్ళుగా కాపాడుకుంటూ వస్తున్న గుడ్‌విల్ పోతుంది"

"మాఫ్ కరనా సాబ్. మీరు హాస్పిటల్ పరువు గురించి ఆలోచిస్తున్నారు. నేను ఓ మనిషిగా నా నైతిక బాధ్యత గురించి ఆలోచిస్తున్నాను. ఇంతకు ముందు చాలాసార్లు డా. సిద్దార్థ నాతో మెర్సీ కిల్లింగ్ ఆవశ్యకత గురించి వాదించాడు. టెర్మినల్లీ ఇల్ పేషంట్స్‌ని చంపటంలో తప్పు లేదనీ అది దయతో కరుణతో చేసే మంచి పనని నాతో చెప్పేవాడు. ఇదంతా చూస్తే మన హాస్పిటల్లో సిద్దార్థ చేరిన తర్వాత జరిగిన చాలా మరణాలకు కారణం అతనేనేమోననే అనుమానం బలపడ్తోంది. కిరణ్మయి గుర్తుందిగా. ఆమె చనిపోయినపుడు చాలా ఆందోళనకు గురైనాను. మన హాస్పిటల్లో పదేళ్ళనుంచి జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్న పేషంట్ అకస్మాత్తుగా చనిపోవటం వెనక కూడా సిద్దార్థ కరుణరసం కారణమై ఉంటుంది. మనుషుల ప్రాణాలు తీసే హంతకులు క్షమార్హులు కారు. అతనికి శిక్ష పడాల్సిందే"

హాస్పిటల్లో జరిగిన చాలా మరణాలకు సిద్దార్థ కారణమేమోననే మాట వినగానే వెంకటరెడ్డి గుండె జారిపోయింది. భవిష్యత్తు అంధకారమై కన్పించి భయపెట్టింది. ఈ విషయం బైటికి పొక్కితే ఇంకేమైనా ఉందా? టీవి ఛానెళ్ళ వాళ్ళు కెమేరాలు పట్టుకుని రాబందుల్లా వాలిపోతారు. సిద్దార్థకి శిక్ష పడటం తర్వాత సంగతి. మొదట తనకు శిక్ష పడిపోతుంది... హాస్పిటల్‌ని శాశ్వతంగా మూసేసుకోవాల్సొచ్చే శిక్ష...

"నేనిప్పుడే బయల్దేరి వస్తున్నా. నేనొచ్చేవరకైనా ఆగండి ప్లీజ్" అన్నాడు అభ్యర్థనగా.

"సారీ... మీకేరకమైన హామీలు ఇవ్వలేను. మీక్కోపమొచ్చి ఉద్యోగంలోంచి తీసేస్తారేమో. మీకా అవకాశం ఇవ్వను. నేనే మానేసి మరో చోట ఉద్యోగం వెతుక్కుంటాను.

ఎటొచ్చీ ఖయామత్ తర్వాత తీర్పు చెప్పే రోజు వచ్చినపుడు అల్లా దృష్టిలో దోషిగా నిలబడే ఏ పనినీ చేయలేను”

“మీరు యం.బి.బి.యస్. పాసైన వెంటనే పిలిచి ఉద్యోగం ఇచ్చి, ఇన్నాళ్ళూ మిమ్మల్ని ఆదరించిన సంస్థకే ద్రోహం చేస్తారా... ఆలోచించండి”

“నేను హాస్పిటల్‌కి ఎలాంటి ద్రోహం చేయటం లేదు. ప్రాణాలు కాపాడాల్సిన ఓ డాక్టర్ పేషంట్ల విషయంలో కాలయముడిగా మారి ప్రాణాలు హరిస్తుంటే చూడలేక... ఆ డాక్టర్ చేసిన ద్రోహాన్ని... నమ్మక ద్రోహాన్ని... హత్యని బైటపెట్టబోతున్నానంతే” మరిక వాదనకు అవకాశం ఇవ్వకుండా డా. వలీ ఫోన్ కట్ చేశాడు.

అప్పటికే కిందికి దిగొచ్చిన సిద్దార్థ వలీతో ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా తన గదిలోకెళ్ళిపోయాడు.

అతని మౌనం చూసి మరింత ఆశ్చర్యానికి లోనైనాడు వలీ. తను చేసింది తప్పేననీ పోలీసులకు చెప్పొద్దనీ బతిమాలుకుంటాడేమోనని ఎదురుచూస్తే అసలతని మొహంలో పశ్చాత్తాపం కానీ భయం కానీ కన్పించకపోవటంతో అసహ్యం కూడా కలిగింది.

పదిహేను నిముషాల్లో పోలీసులొచ్చారు. పోలీసులొచ్చిన పది నిముషాలకు వెంకట రెడ్డి వచ్చి తల పట్టుకుని కూచున్నాడు.

హాస్పిటల్లో పన్చేసే ఓ డాక్టరే తన బాబుకి ఆక్సిజన్ అందకుండా చేసి చంపేశాడని తెలుసుకున్న సునీత బాబు నిర్జీవ శరీరం మీద పడి శోకాలు పెట్టి ఏడుస్తోంది. కిశోర్ కూడా షాక్‌కి లోనైనాడు. బాధని దిగమింగి భార్యని ఎంత ఓదార్చినా ఆమె హృదయవిదారకంగా ఏడుస్తూనే ఉంది.

పోలీసులడిగే ప్రశ్నలకు సిద్దార్థ చాలా తాపీగా సమాధానాలు చెప్తున్నాడు. హత్యానేరం కింద అరెస్టు చేస్తారన్న భయం అతన్లో ఏ కోశానా కన్పించటం లేదు. అపెండిసైటిస్ ఆపరేషన్లో అపెండిక్స్‌ని కోసిపడేసిన దాంతో సమానమైన చర్యగా ఆక్సిజన్ ట్యూబ్‌ని లాగేయటాన్ని సమర్థించుకుంటున్నాడు.

“మీరు ఐ.సి.యు.లో ఉన్న బాబుని ఆక్సిజన్ అందకుండా చేసి ఉద్దేశపూర్వకంగా

చంపేశారని మీ కొలీగ్ డాక్టర్ వలీ కంప్లెయింట్ చేశారు. దానికి మీరేమంటారు?" ఇన్‌స్పెక్టర్ తన సహనాన్ని కోల్పోకుండా అలా అడగడం అది నాలుగోసారి.

"అది నిజం కాదు"

"అంటే మీరు హత్య చేయలేదా?"

"లేదు"

"ఆక్సిజన్ ట్యూబు లాగడం తను కళ్ళారా చూశానని, బాబు చనిపోయేవరకు ఆ ట్యూబ్ కొసని మీ చేతుల్లో ఉంచుకున్నారని డా. వలీ అంటున్నారు. అది నిజం కాదా?"

"నిజమే"

ఇన్‌స్పెక్టర్ విసుగ్గా మొహం పెట్టాడు. "మీరు చదువుకున్నవారై ఉండి తలాతోకాలేని సమాధానాలు చెప్తే ఎలా డాక్టర్? చంపలేదంటారు. ఆక్సిజన్ ట్యూబ్ లాగేసింది నిజమేనంటారు. వెంటిలేటర్ మీదున్న పేషంట్‌కి ఆక్సిజన్ అందకుండా చేస్తే చనిపోతాడని మీకు తెలీదా? సమాధానాలు సరిగ్గా చెప్పండి" అతని గొంతులో కరకుదనం...

"ఆక్సిజన్ ట్యూబ్‌ని లాగేసిన మాట మాత్రం వాస్తవమే. నేనలా చేసింది బాబుకు సాయపడ్డామనే. ఎలాగూ చనిపోయే ఆ బాబు పడ్తున్న నరకయాతన చూళ్ళేక త్వరగా చావడానికి నా వంతు సహకారం అందించానంతే"

"అంటే మీరు నేరం చేసినట్టు అంగీకరిస్తున్నారు"

"నేను చేసింది నేరం కాదు. కారుణ్య చర్య. ఎవరైనా బాధపడ్తుంటే చూళ్ళేని బలహీనత నాది. ఆ బాధని తగ్గించడానికి డాక్టర్‌గా అన్ని ప్రయత్నాలూ చేస్తాను. డాక్టర్ల వల్ల, మందుల వల్ల తగ్గని బాధని మరణం ఆసన్నమయ్యే వరకూ అనుభవించే పేషంట్లని చూస్తే మరింత జాలి. ఆ బాబు పడ్తున్న శారీరిక హింసని డాక్టర్లుగా మేము పొడిగిస్తున్నాం తప్ప మా వైద్యం వల్ల ఏ రకమైన ప్రయోజనాన్ని కల్గించటం లేదు. ఈ విషయం బాబు తండ్రి... స్వయానా డాక్టరైన కిశోర్‌కి కూడా తెలుసు. మీకోవిషయం చెప్పాలి. ఆ బాబు తల్లిదండ్రులే బాబు పుట్టకుండా అబార్షన్ చేసుకోడానికి అనుమతించమని కోర్టుకెళ్ళారు. నేను వాళ్ళ కోరికను కొద్దిగా ఆలస్యంగా తీర్చాను.

ఇలా జరిగినందుకు వాళ్ళిద్దరూ తప్పకుండా సంతోషపడ్తారు"

ఆ మాటలంటున్నప్పుడే అక్కడికొచ్చిన సునీత భద్రకాళిలా అతని పైకి లంఘించి చొక్కా పట్టుకుని ఆ చెంపా ఈ చెంపా వాయించింది.

"నా బిడ్డను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నావు కదరా రాక్షసుడా... పసికందుని చంపడానికి నీకు చేతులెలా వచ్చాయిరా... నీ చేతులిరిగిపోను... నువ్వు మనిషివా పశువ్వా" అంటూ పిచ్చిగా కొడ్తూనే ఉంది.

డా. కిశోర్ ఆమెని బలంగా పట్టుకుని ఇవతలకు లాగాడు. ఆమె ఆవేశంతో వూగిపోతోంది. జుట్టంతా చెదరిపోయి... కళ్ళు ఎర్రగా నిప్పుకణికల్లా మారి... చూస్తేనే భయం గొలిపేలా ఉంది.

"నన్ను వదులు... వాణ్ణి చంపేస్తాను. నా బిడ్డని చంపేసిన కిరాతకుడు వాడు. వాణ్ణి వదలను. చంపేసి జైలు కెళ్తాను" పట్టునుంచి విడిపించుకుని ఆమె సివంగిలా ముందుకు దూకింది.

బిడ్డను కోల్పోయిన తల్లిగా ఆమె ప్రథమ కోపాన్ని చూసీచూడనట్లు వదిలేసిన పోలీసులు ఈ మారు అడ్డుపడ్డారు. ఇద్దరు కానిస్టేబుళ్ళు చెరో రెక్కా పట్టుకుని ఆపుతున్నా ఆమె బలమంతా వుపయోగించి విడిపించుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. "వాణ్ణి ఉరితీయండి. వదలొద్దు వాణ్ణి... వాడికి పాతర వేయండి. నాకళ్ళెదురుగా వాడు గిలగిలా కొట్టుకుని చావాలి" అంటూ అరుస్తూనే ఉంది... ఆక్రోశిస్తూనే ఉంది...

కిశోర్‌కి దుఃఖంతో పాటు విపరీతమైన కోపంగా కూడా ఉంది. ఇన్నాళ్ళూ కలిసి పని చేసిన సాటి డాక్టర్ మీద చేయి చేసుకోకూడదన్న సంస్కారం అతన్ని ఆపుతోంది.

"ఎందుకు చేశారీపని డాక్టర్?" అన్నాడు సిద్దార్థ వైపు తీక్షణంగా చూస్తూ.

అప్పటికే సునీత ప్రవర్తనతో పూర్తి సందిగ్ధ స్థితిలో ఉన్న సిద్దార్థ "అదేమిటి కిశోర్... మీరూ డాక్టరేగా... ఎడ్వర్డ్ సిండ్రోమ్‌తో పుట్టిన బాబు ఎలాగూ చచ్చిపోతాడని మీకుమాత్రం తెలీదా? రోజుకి వంద రకాలుగా హింస పెడ్తూ ఆ బాబుని బలవంతంగా కొన్ని రోజులు బతికించి ఉంచటం అవసరమంటారా? బాబు ప్రశాంతంగా చచ్చిపోయే ఏర్పాటు చేశాను. ఇలా చేసినందుకు మీరూ సంతోషపడ్తారనుకున్నాను. మీరూ మీ

భార్య కూడా ఈ బాబుని ఫీటస్‌గా ఉన్నపుడే చంపేయాలనుకున్నారుగా. నేను చేసింది అదేగా. మీ భార్య ఎందుకంత ఉద్రేకానికి లోనవుతుందో అర్థం కావటం లేదు” అన్నాడు.

“ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు అబార్షన్ చేయించుకోవాలనుకుంది నిజమే. కానీ బాబు పుట్టాక నా ప్రాణమంతా వాడిమీదే పెట్టుకుని బతుకుతున్నాన్రా నీచుడా... నీకు మేం చెప్పామా బాబు చచ్చిపోతే సంతోషంగా ఉంటామని? నీలా మేము కర్కోటకులం కాదురా... కన్నపేగురా నాది. నా ప్రాణం ఇచ్చయినా సరే బాబుని బతికించుకోవాలని తాపత్రయపడే తల్లినిరా నేను” పెద్దపెద్దగా అరుస్తూ చెప్పింది సునీత.

సిద్ధార్థకు ఆమె ప్రవర్తన వింతగా అన్పిస్తోంది. పుట్టకముందే చంపేయాలని కోర్టుల చుట్టూ తిరిగి ఇపుడెందుకు తనని తిడ్తోంది?

“ఆ బాబుని చూశారుగా... దయ్యంపిల్లాడిలా ఎన్ని అవకరాల్తో ఆరోగ్య సమస్యల్తో పుట్టాడో. అటువంటి బాబు బతికి ఉండటం కన్నా చావడమే మేలని మీకనిపించడం లేదా? ఇంత చిన్న విషయాన్ని ఎందుకు పెద్ద ఇష్యూ చేస్తున్నారు?” సిద్ధార్థ కోపంగా అన్నాడు.

ఆ మాటలు చెవినపడగానే సునీత పిచ్చిదైపోయింది. ఒక్క విదిలింపుతో కిశోర్ని విదిలించుకుని ఆడపులిలా సిద్ధార్థ మీద పడింది. ఆ విసురుకి తూలి బ్యాలెన్స్ తప్పి కింద పడ్డాడు.

“నా బాబుని దయ్యం పిల్లాడంటావా... నువ్వురా దయ్యం... నువ్వురా భూతం... నాబాబు నాకు ముద్దు... నా బాబు నాకు ప్రాణం. నువ్వు చూళ్ళేకపోతే కళ్ళు మూసుకోరా. కాదు కాదు. నా బాబు నీకళ్ళకు దయ్యంలా కన్పించాడన్నావుగా... ఆ కళ్ళని పీకేస్తా” అప్పటివరకు కిందపడిన సిద్ధార్థని కాళ్ళతో ఇష్టం వచ్చినట్టు కొడ్తున్న సునీత ఒక్కసారిగా అతనిమీద పడి మొహాన్ని గోళ్ళతో రక్కింది. ఇద్దరు పోలీసులు బలవంతంగా ఆమెను పైకి లాగారు.

“ఇక్కడ ఎక్యూజ్డ్ ఉండటం అంత క్షేమం కాదు. మేం అతన్ని స్టేషన్‌కి పిల్చుకెళ్ళి విచారిస్తాం. మీరు కూడా వచ్చి స్టేట్ మెంట్ రాసివ్వండి” కిశోర్తో డా. వలీతో చెప్పి సిద్ధార్థని పిల్చుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్.

“వాణ్ణి ఉరి తీయండి. వదలొద్దు వాణ్ణి. చంపేయండి వాణ్ణి” వెనక నుంచి పిచ్చి

పట్టిన దానిలా అరుస్తూనే ఉంది సునీత.

***

తను మృత్యువుకి దగ్గరౌతున్నానన్న భావన ప్రసాద్‌లో రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ మధ్య కాలంలో గొంతు కండరాలు బాగా బలహీనపడ్డాయి. అన్నం మింగడం కష్టమౌతోంది. ప్రయాసపడితే తప్ప తినలేకపోతున్నాడు. మాట్లాడటం కష్టమౌతోంది. మాట పెగలడానికి యుద్ధం చేయాల్సివస్తోంది. అప్పటికీ అస్పష్టంగా ముద్దముద్దగా శబ్దం బైటికొస్తోంది.

ఛాతీ దగ్గర కండరాలు రోగగ్రస్తమైనదానికి సూచనగా శ్వాస తీసుకోవటం కష్టంగా ఉంటోంది. ఆక్సిజన్ చాలటం లేదు. నోరు తెర్చి గాలి పీల్చినా ఉపయోగం ఉండటం లేదు. డాక్టర్ రావుగారిని సంప్రదిస్తే 'త్వరలోనే వెంటిలేటర్ అవసరం రావొచ్చమ్మా' అని సరోజతో అన్నాడు.

తను చనిపోయేలోపల రాగిణిని చూడాలన్న కోరిక. రాగిణితో పరిచయమై సంవత్సరం దాటి ఆరునెలలు... ఆ అమ్మాయిని చూడకుండా చనిపోతానేమోనని దిగులు పట్టుకుంది.

కొద్దిసేపైనా ఆమెతో మాట్లాడాలి. మోడువారిన తన జీవితాన్ని రాగరంజితం చేసినందుకు మనసారా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అదృష్టం కొద్దీ అమ్మకు తన భాష అర్థమౌతోంది. రాగిణికి అర్థం కాకున్నా అమ్మ విడమర్చి చెప్పే అవకాశం ఉంది. అదే మరికొంత కాలం ఆగితే అసలు మాటేమాట్లాడలేని పరిస్థితి రావొచ్చు.

ఆ రోజు బ్యాంక్ నుంచి సరోజ తిరిగొచ్చి కాఫీ కలుపుకుని తాగుతూ సేద తీరుతున్నప్పుడు తన మనసులోని మాట బైట పెట్టాడు.

"మనం నకిరేకల్ వెళ్దాం మమ్మీ. ఒకే ఒక్కసారి రాగిణిని చూడాలన్న కోరిక"

"తొందరేముంది నాయనా... వీలు చూసుకుని మెల్లగా వెళ్దాంలే" అంది సరోజ.

"ఎందుకు మమ్మీ నన్ను మభ్య పెడ్తావూ... అంత టైం నాదగ్గర లేదని నీకూ తెలుసు. మరో ఏడాదైనా బతుకుతానన్న నమ్మకం లేదు. మాట కష్టమౌతోంది. శ్వాస కష్టమౌతోంది. శరీరం ఇంత హింస పెడ్తున్నా రాగిణి పరిచయమైన ఒకటిన్నర సంవత్సర

కాలంలో సంతోషంగా ఆనందంగా ఉండగలిగానంటే కారణం ఆ అమ్మాయి పంపించిన ఈ మెయిల్సే. నాలో మానసిక స్థైర్యాన్ని నింపి, బతకాలన్న కోరికని పెంచిన ఆ అమ్మాయిని చూడాలనీ, మాట్లాడాలనీ ఎన్నో రోజుల్నుంచి అనుకుంటున్నా మమ్మీ. ఆలస్యంచేస్తే నేను మాట్లాడలేని దుస్థితి రావొచ్చు. ఇంకా ఆలస్యంచేస్తే నేనే లేకుండా పోవచ్చు. నేను చెప్పే థ్యాంక్స్‌ని తను అర్థం చేసుకునేంతగా గొంతు సహకరిస్తున్నప్పుడే వెళ్ళాలి మమ్మీ... ప్లీజ్ నా బాధని అర్థం చేసుకో మమ్మీ"

"అలా మాట్లాడకురా. నాకు ఏడుపొస్తుంది. నేను బతుకుతున్నదే నీకోసం. నీకేం కాదు నాన్నా. చావు గురించి మాట్లాడి నువ్వు బాధ పడి నన్ను బాధ పెట్టకు" ఆమెకు ఏడుపొచ్చేసింది.

"బీ ప్రాక్టికల్ మమ్మీ... నిజాల్నుంచి పారిపోవటం దేనికి? వాటిని ఆమోదిద్దాం"

ఆమెకా సంభాషణ పొడిగించటం ఇష్టం లేక నకిరేకల్ ప్రయాణం గురించి మాట్లాడింది.

"అంత దూరం ప్రయాణించడానికి నీ ఆరోగ్యం సహకరించాలిగా బాబూ" అంది.

"రాగిణిని చూడటం కోసం ఎంత హింసనైనా భరిస్తాను మమ్మీ. నేను చదువుకునే రోజుల్లో రమ్య స్నేహం ఎంతటి సంతోషాన్నిచ్చేదో, ఈ జబ్బుతో మంచానికి పరిమితమైనాక రాగిణి పరిచయం అంతటి ఆనందాన్నిచ్చింది. బతుకుమీద తీపిని పెంచింది. నా దురదృష్టాన్ని తల్చుకుని దుఃఖపడే సమయమే మిగల్చకుండా తన మాటల్తో, మంచితనంతో నా జీవితం నిండా పర్చుకుంది. అంత గొప్ప స్నేహితురాలికి నేనేమివ్వగలను... కళ్ళారా చూసుకుని మనసారా కృతజ్ఞతలు తెల్పుకోవడం తప్ప... కాదనకు మమ్మీ"

సరోజకూ తెలుస్తోంది. తన కొడుకు ఎక్కువ రోజులు బతకడని... రాగిణి పరిచయమైనాక తన కొడుకు మొహంలో వింత వెలుగుని చూసింది. తను ఎన్ని ధైర్య వచనాలు చెప్పినా రాని మార్పు ఓ ఆడపిల్ల మాటల వల్ల వచ్చింది. రాగిణి మాటలు మంత్రంలా పన్చేశాయి. తన కొడుకుని వశీకరణకు లోను చేసిన ఆ పిల్లను చూడాలని ఆమెకూ కోరిగ్గానే ఉంది.

బ్యాంక్‌కు శెలవ పెట్టింది. ఇన్నోవా కారు అద్దెకు మాట్లాడింది. ప్రసాద్‌ని వెనక సీట్లో పడుకోబెట్టి చక్రాల కుర్చీని కారు డిక్కీలో వేసుకుని నకిరేకల్‌కి బయల్దేరింది.

వెనక సీట్లో పడుకున్నాడన్న మాటేగాని ప్రసాద్ మనసునిండా రాగిణి పరిచయమైన తర్వాత ఇద్దరూ కలబోసుకున్న అనేకానేక విషయాలు గుర్తుకు వస్తున్నాయి.

‘మా నకిరేకల్‌కి వచ్చావనుకో. మొదట నిన్ను మా యింటికి దగ్గర్లో ఉన్న సాయిబాబా గుడికి పిల్చుకెళ్తా. చాలా ఫేమస్ తెలుసా ఈ గుడి! మా అమ్మ ప్రతి గురువారం తప్పకుండా గుడికెళ్ళి ‘మా అమ్మాయికి నయం చేయి బాబా’ అని మొక్కుకుంటుంది. పిచ్చమ్మ... ఆ దేవుడే ఇచ్చిన రోగాన్ని నయం చేయమని మళ్ళా ఆయన్నే కోరడంలో ఔచిత్యం ఏంటో నాకైతే అర్థం కాదు. అమ్మకదా.. అమ్మలందరూ ఇంతే అనుకుంటా.

మా వూరికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఛాయాసోమేశ్వరాలయం ఉంది. నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడు స్కూల్‌వాళ్ళు పిల్చుకెళ్తే చూశాను. ఆ ఆలయంలో అద్భుతం ఏంటో తెలుసా... గుళ్లో ఉన్న రెండు స్తంభాల నీడ ఉదయంనుంచీ సాయంత్రం వరకు ఒకేచోట పడ్తుంది. ఎంత గొప్ప సాంకేతిక విజ్ఞానమో కదా... ఆ రోజుల్లో గుళ్ళూ గోపురాలు కట్టిన శిల్పులకు ఆప్టిక్స్‌లో ఎంత అభిరుచీ, అవగాహనా ఉన్నాయో తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

నీతో కలిసి అంతదాకా రావడం కొద్దిగా కష్టమే అనుకో. ఐనా సరే నీకోసం తప్పకుండా వస్తాను. దగ్గరుండి ఆ ఆలయాన్ని చూపిస్తాను సరేనా’ అని రాసిందో సారి. ఎలాగూ కారుంది కాబట్టి రాగిణిని పిల్చుకుని ఛాయాసోమేశ్వరాలయానికెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.

రాగిణి రాసే ఉత్తరాలు ఇంగ్లీష్‌లో ఉండటం వల్ల తను ఎలాంటి యాస మాట్లాడుతుందో తెలీక ఓ సారి అడిగాడు. ‘నువ్వు మాట్లాడుతుంటే వినాలని ఉంది...’ అని రాశాడు. దానికి జవాబుగా రాగిణి ఉత్తరం మొత్తాన్ని ఇంగ్లీష్ అక్షరాల్తోనే తెలుగు మాటల్తో రాసింది. ‘మేమిక్కడ మాట్లాడే భాష జవజీవాల్తో తొణికిసలాడే తెలంగాణా భాష. నాకు మా భాషన్నా, యాసన్నా మా సంస్కృతన్నా చాలా ఇష్టం. చిన్నప్పుడు బతుకమ్మ ఎంత బాగా ఆడేదాన్నో తెలుసా. ఇప్పటికీ బతుకమ్మ పండుగని మా ఇంట్లో

చాలా ఘనంగా చేసుకుంటాం. మా వూళ్లో ఆడపిల్లల్ని 'బిడ్డా' అని ఎంత ఆప్యాయంగా పిలుస్తారో. మేం మాట్లాడే భాషలో రాయనా... గీదినం ఏమైంది ఎర్కనా... నా సెల్లి కాల్లు సేతులు గడుక్కుని, జల్ది జల్ది గింత తిని సైకిల్ తీస్కుని ఇంట్లకెల్లి ఎల్తు 'దినాం గీ కటార సైకిల్ మీద బోవుడేంటి' అనుకుంట మా అవ్వని పిలిసి 'మోటర్ సైకిల్ కొనుండ్రి. నిన్ను బండెన్క కూసోబెట్టి తోల్కపోత' అంది 'తల్కాయ తిర్గుతున్నదా... పెట్రోల్ గొనేతందుకు పైసలెవ్వడిస్తడు. ఎక్వ తక్వ మాట్లాడక ఇగబో' అందవ్వ... బావుందా...' అని రాసింది.

తనకిష్టమైన తెలంగాణా భాషలో మాట్లాడుతుంటే వినాలని మనసు వువ్విళ్లూరుతోంది. పేజీలకొద్దీ మెయిల్స్ పంపించే రాగిణి, మాట్లాడేటప్పుడు కూడా గలగలా వసపిట్టలా మాట్లాడుతుందా?

రాగిణి అభిప్రాయాలూ ఆలోచనలూ ఎంత పరిపక్వంగా ఉంటాయో... ఆమెకు ఇరవైరెండేళ్ళంటే నమ్మ బుద్ధి కానంత...

పరిచయమైన రెణ్ణెల్ల తర్వాత తన సెల్ నంబరిచ్చి ఫోన్ చేయమన్నాడు. ఫోన్ రాలేదు. దాని బదులు మరో మెయిల్ వచ్చింది.

'సెల్‌ఫోన్ల వల్ల హాని జరుగుతుందని తెలిసీ వాటిని వాడటం అవసరమా... అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన వార్తని చేరవేయడానికి వాటిని తప్పకుండా వాడాలి. కబుర్లు చెప్పుకోడానికీ స్వీట్ నథింగ్స్ మాట్లాడుకోడానికి సెల్‌ఫోన్ వాడకూడదు. ఇది నా పాలసీ. అందుకే మనం మెయిల్స్‌తోనే కాలం గడిపేద్దాం. నీ సెల్ నంబర్ నా దగ్గర ఉంది కాబట్టి అవసరమైతే నేనే చేస్తాను' అని రాసింది.

డ్రైవర్ పాటల క్యాసెట్ ఏదో పెట్టాడు. 'ఆకాశం బద్దలైన సౌండ్ గుండెలోన మోగుతుందె నిను చూశాక' అని అబ్బాయి పాడితే 'మేఘాలె గుద్దుకున్న లైటు కళ్ళలోన చేరుతుందె నిను కలిశాక' అని అమ్మాయి అంటోంది.

ఆ పాట చెవిలో పడగానే ప్రసాద్ మళ్ళా రాగిణి జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయాడు.

రాగిణి ఓ మెయిల్లో ఇపుడొస్తున్న సినిమా పాటల గురించి రాస్తూ 'పాత పాటలు విన్నావా ఎంత మధురంగా ఉంటాయో... అవి వింటుంటే ప్రాణం గాల్లో తేలిపోతున్నట్లుంటుంది. ముఖ్యంగా ప్రేమ సన్నివేశాల్లో ఎంతటి లాలిత్యం! ఎంతటి సౌకుమార్యం! నీసుఖమే నేకోరుతున్నా నిను వీడి అందుకే వెళుతున్నా అనడంలో ఎంత

గొప్ప ప్రేమ... ఎంత గొప్ప త్యాగం... కొత్త సినిమాల్లోని పాటలు ఎంత దారుణంగా ఉంటున్నాయో... అలాగని నన్ను మరీ బీసీ అమ్మాయి అనుకునేవు. నాకూ మంచి బీట్ ఉన్న పాటలంటే ఇష్టమే. ఎటొచ్చీ కొన్ని పాటల్లో సాహిత్యమే... ఏదో పాటలో మనం పేడ పురుగుల్లా మారిపోదాం అంటాడు హీరో... ఎంత అసహ్యమైన కోరికో కదా... సీతాకోక చిలుకలై పోదాం అనడానికీ దీనికీ ఎంత తేడా... ఆ పాట రాసినవాడు కన్పిస్తే పేడపురుగుల్లో పడేయాలనిపిస్తుంది.

మరోపాట విన్నావా... ప్రియురాల్ని చూస్తే వీడికి ఆకాశం బద్దలైన శబ్దం గుండెల్లో మోగుతుందట. ఆ పదాలు వాడాల్సింది ప్రమాదాన్నో భయాన్నో సూచించడానికి కదా. ప్రేమించిన అమ్మాయి కన్పిస్తే గుండెల్లో మోగాల్సింది గుడిగంటలు కదా... పోనీ చిరు గజ్జెల సవ్వడి... లేదా సెలయేరు పారేటప్పుడు విన్పించే మృదు మంజుల రవళి...

ప్రేమకు అర్థాలే మారిపోతున్నాయి ప్రసాద్... మనుషుల్లోని మార్దవత... మానవత్వం మరుగైపోతున్నాయి. ఆర్ద్రత లేని బండరాయిలా హృదయాలు కరడుగట్టిపోతున్నాయి. కత్తుల్తో రక్తపాతాల్తో వీళ్ళు సాధించేదాన్ని ప్రేమంటారా? ఆడపిల్లల్ని కూడా ఎంత దుర్మార్గంగా చూపిస్తున్నారో... కసాయివాళ్ళలా లేదా బరితెగించినవాళ్ళలా... సెన్సార్ వాళ్ళు నిద్రపోతుంటారా...

ఇప్పటి పాటల్లో విన్పించే గొంతులు గమనించావా... ఎక్కడైనా తీయదనం కన్పిస్తుందా... మాధుర్యం విన్పిస్తుందా... ఓ ఘంటసాల... ఓ బాలు... ఓ పిబి శ్రీనివాస్... ఓ ఏయం రాజా...! తల్చుకుంటే ఎంత దుఃఖం వస్తుందో’ కారు నకిరేకల్ చేరుకుంది.

“ఇసాయికుంటలో ఉన్న స్టేడియానికి పక్కన ఉన్న ఇళ్ళలో చివరిల్లే రాగిణి వాళ్ళది. తూర్పువైపు వాకిలి ఉండే ఇల్లు” అమ్మతో చెప్పాడు ప్రసాద్.

దార్లో ఇద్దరు ముగ్గుర్ని వాకబు చేసి స్టేడియందగ్గరకు చేరుకున్నారు. అటువైపున్న ఇళ్ళలో కొంతమందినడిగితే “రాగిణి ఎవురో తెల్వద్...” అన్నారు. మరికొంత మందైతే వాళ్ళ నాన్న పేరేమిటి... ఏం చేస్తాడు లాంటి ప్రశ్నలేశారు.

“రాగిణి పేరు చెబితే చాలు ఇల్లు చూపిస్తారన్నావ్” నవ్వుతూ అంది సరోజ.

ప్రసాద్ ఇబ్బందిగా మొహం పెట్టాడు.

మరో నాలుగిళ్ళు దాటాక అక్కడ ఆడుకుంటున్న పన్నెండేళ్ళ అబ్బాయిని పిలిచి అడిగారు.

"రాగిణి అక్క వాళ్లిల్లా... అదుగో ఆ చివర్నున్న ఇల్లే" అని చూపించాడు.

కారు యింటిముందు ఆగ్గానే పదహారు పదిహేడేళ్ళ అమ్మాయి వసారాలోకొచ్చి నిలబడి కారు వైపు ఆసక్తిగా ఒకింత ఆశ్చర్యంగా చూసింది.

సరోజ కారు దిగి "రాగిణి వాళ్ళిల్లు ఇదేనామ్మా" అని అడిగింది.

"ఔనాంటీ... మీరెవరు?" అందా అమ్మాయి.

"నువ్వు రాగిణి వాళ్ళ చెల్లెలివా? నీ పేరేంటి?"

"నా పేరు సుభాషిణి. మీకు రాగిణి తెలుసా... ఎలా తెలుసు? యింతకు ముందెప్పుడూ మిమ్మల్ని చూసినట్టు గుర్తుకు రావడం లేదాంటీ... అందుకడుగుతున్నా"

"ఇలా ప్రశ్నల్తో గుమ్మంలోనే నిలేస్తావా? మమ్మల్ని లోపలికి రానీవా" అంది నవ్వుతూ సరోజ. ఈ లోపల ఆ అమ్మాయి వాళ్ళమ్మ కూడా బైటికొచ్చింది.

"అయ్యో... సారీ ఆంటీ... రండి లోపలికి" అంటూ ఆ అమ్మాయి యింటిలోపలికెళ్ళి రెండు కుర్చీలు తెచ్చి వసారాలో వేసింది.

సరోజ ఓ కుర్చీలో కూచున్నాక "నా పేరు సరోజ... మా అబ్బాయి ప్రసాదూ మీ అక్క రాగిణి ఈమెయిల్ మేట్స్" అంటూ మరోసారి నవ్వింది.

దానికి ప్రతిగా ఆ అమ్మాయి కానీ వాళ్ళమ్మ కానీ నవ్వకపోవడం ఆమెకు ఆశ్చర్యాన్ని కలుగజేసింది. తమ రాక వాళ్ళకెందుకో నచ్చలేదనిపించింది. ఆ అయిష్టాన్ని స్పష్టంగా మొహంలో చూపిస్తున్నారే కొంచెమైనా సంస్కారం లేకుండా అనుకుంది.

"కబురు పెట్టకుండా అధాట్టుగా వచ్చి ఇబ్బంది పెడ్తున్నందుకు సారీ... మీ ఫోన్ నంబర్లు మావాడికి తెలీవట. అడిగినా రాగిణి ఇవ్వలేదట. మెయిల్ చేయమంటే మావాడే వద్దన్నాడు. సర్‌ప్రైజ్ చేద్దామన్నాడు. వాడి సరదాని కాదనలేక... సారీ. మిమ్మల్ని ఇబ్బంది పెట్టంలెండి. పది నిముషాలుండి వెళ్ళిపోతాం" అంది ఇబ్బంది పడిపోతూ సరోజ.

ఆ అమ్మాయి "పర్లేదాంటీ... ఏరీ ప్రసాద్ గారు" అంది. కానీ మొహంలో

చిటికెడు చిర్నవ్వు కూడా కన్పించలేదు. వాళ్ళమ్మయితే కనీసమర్యాదగా పల్కరించనుకూడా లేదు. వెనుదిరిగి లోపలికెళ్ళి పోయింది.

ఎందుకొచ్చాంరా దేవుడా అనుకుంది సరోజ. తీరా తలదూర్చాక రోకటి పోటుకి వెరవటం దేనికి అనుకుని సమాధానపడింది. రాగిణి చాలా సంస్కారవంతురాలని కదా ప్రసాద్ ఎన్నోమార్లు తనతో అన్నాడు. మరి కుటుంబ సభ్యులేంటీ ఇలా ప్రవర్తిస్తున్నారూ... అమ్మేమో మంచినీళ్ళు కావాలా అనికూడా అడక్కుండా లోపలికెళ్ళిపోయింది. చెల్లి మాట్లాడ్తున్నా ముభావంగా ముక్తసరిగానే మాట్లాడ్తోంది. ప్రసాద్ మాటలు విని తొందరపడి వచ్చి పొరపాటు చేశానా... ఇక్కడ ఎక్కువ సేపు ఉంటే మర్యాద దక్కేలా లేదు. రాగిణిని చూసి ఓ రెణ్ణిముషాలు మాట్లాడి వెళ్ళిపోవాలి...

డ్రైవర్ బండిలోంచి చక్రాల కుర్చీని దింపి కింద పెట్టి "బాబుని దింపమంటారా" అని అడిగాడు.

సరోజ ఆలోచనల్లోంచి బైట పడింది. తనిక్కడికి ఇంత ప్రయాసపడి వచ్చింది తన కొడుకు కోరిన కోరిక తీర్చడానికి. ఎన్ని అవమానాలెదురైనా పర్లేదు, ఎవరు మాట్లాడినా మాట్లాడకున్నా పర్లేదు. వాడొక్కసారి రాగిణిని చూసి పల్కరించగలిగితే చాలు. వాడి కోరిక తీర్చాకే తనీ వూర్నించి కదిలేది అనుకోగానే మళ్ళా ఉత్సాహం వచ్చింది.

ప్రసాద్‌ని దింపి చక్రాల కుర్చీలో కూర్చోబెట్టటానికి డ్రైవర్కి సాయపడింది. వసారా మెట్లు ఎక్కించాక కొడుకు పక్కనే కుర్చీ లాక్కుని కూచుంది.

ప్రసాద్ సుభాషిణిని చూసి పల్కరింపుగా నవ్వాడు. ఆమె బదులుగా నవ్వలేదు. లోపలికెళ్ళి రెండు గ్లాసుల్తో మంచినీళ్ళు తెచ్చిచ్చింది. 'ఇంకా నయం... గ్లాసుడు నీళ్ళయినా మొహాన పోశారు. వీళ్ళ వాలకం చూస్తే దీనికీ గతుండదనుకున్నాను' అనుకుంటూ సరోజ గటగటా తాగేసింది. ప్రసాద్ వద్దన్నాడు.

తాగిన గ్లాసు లోపలికి తీస్కెళ్ళి తిరిగొచ్చి మరోకుర్చీలో ముభావంగా కూచుందా అమ్మాయి.

ఐదు నిముషాల వరకూ ఎవ్వరూ మాట్లాడలేదు. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక సరోజ అడిగింది. "రాగిణి ఏదమ్మా. లోపల పడుకోనుందా... నిద్ర పోతోందా...

ప్రసాద్ నేనూ వచ్చినట్టు చెప్పావా?"

ఆమె సమాధానం కోసం వళ్ళంతా చెవులు చేసుకుని ఎదురుచూశాడు ప్రసాద్. అతని చూపంతా గుమ్మం వైపే ఉంది. అందులోంచి ఏ క్షణమైనా తన దేవత రాగిణి వీల్ ఛెయిర్లో వస్తుందన్న ఆశ...

సుభాషిణి సమాధానమేదీ ఇవ్వలేదు.

"మీ అక్క పంపిన మెయిల్స్ వల్ల మావాడు నిరాశా నిస్పృహల్నుంచి కొంతవరకైనా బైటపడగలిగాడు. ఈ ఒకటిన్నర సంవత్సరాలుగా వాడు సంతోషంగా ఉంటున్నాడంటే దానిక్కారణం రాగిణే. నాకూ ఆ అమ్మాయిని చూడాలని చాలా ఉత్సుకతగా ఉంది. మావాడే కాదు నేనుకూడా మనసారా మీ అక్కకు థ్యాంక్స్ చెప్పాలని వచ్చా. ప్లీజ్ ఒక్కసారి బైటికి పిల్చుకు రావా?" అంది సరోజ.

"కుదరదాంటీ"

వెంటనే ఆమెకు తను తప్పుగా మాట్లాడినట్లు అర్థమైంది. "ఓ సారీ.. బైటికి రావడం కష్టమా... పోనీ మేమే లోపలికెళ్ళి మాట్లాడొచ్చా?"

"సరే రండి" అంటూ ఆ అమ్మాయి లేచి యింట్లోకి నడిచింది.

ఇంత చిన్న పనికి ఎంతసేపు ఆరాట పెట్టారో అని మనసులో విసుక్కుంటూనే చక్రాల కుర్చీని మెల్లగా నెట్టుకుంటూ ఆమె వెనకే వెళ్ళింది సరోజ.

చిన్న హాలు.. వాళ్ళమ్మ కన్పిస్తుందేమోనని పరికించి చూసింది. "మీ అమ్మేది?" అని ఆ అమ్మాయిని అడిగింది.

"తలనొప్పిగా ఉందని బెడ్రూంలోకెళ్ళి పడుకుందాంటీ"

"అయ్యో అలానా... రాగిణి కూడా అదే గదిలో ఉందా?"

"లేదాంటీ... ఈ హాల్లోనే ఉంది"

"ఈ హాల్లోనా... ఎక్కడా?" సరోజ మరోసారి చుట్టూ చూసింది.

అప్పుడు విన్పించింది సుభాషిణి ఏడ్వటం... సరోజకేదో అనుమానం వచ్చింది. చప్పున తలయెత్తి గోడల వైపు చూసింది. గోడ మీద ఇరవై, ఇరవై రెండేళ్ళ వయసున్న అమ్మాయి ఫొటో... పూలదండ వేసి ఉంది. కింద విద్యుద్దీపం వెలుగుతోంది.

సుభాషిణి భుజం చుట్టూ అనునయంగా చేయి వేస్తూ “ఎన్ని రోజులైంది?” అని అడిగింది.

“అక్క చచ్చిపోయి ఆర్నెల్లు కావస్తోందాంటీ” వెక్కిళ్ళ మధ్య సమాధానం చెప్పింది.

సరోజ బ్రమ్నపడిపోయింది. ఆర్నెల్లా... ఆమెకేమీ అర్థం కాలేదు.

ప్రసాద్ పూనకం పట్టినోడిలా ఏడుస్తున్నాడు. ఆ ఏడుపు శబ్దం సరిగ్గా బైటికి రాక మరణ యాతన పడుతున్న జంతువు శబ్దంలా విన్పిస్తోంది.

అతన్ని వూరడించడానికి ప్రయత్నించి, విఫలమై వదిలేసింది.

పావుగంటసేపు అతను వెక్కి వెక్కి ఏడ్చాడు. కదలి కదలి... పొగిలి పొగిలి ఏడ్చాడు. అతను దుఃఖసముద్రాన్ని ఈదడానికి ప్రయత్నిస్తున్నాడు... అనంతమైన దుఃఖం... లోతైన దుఃఖం... చావు భయంకరంగా ఉంటుందని తెలుసు... ఆత్మీయుల మరణం మరింత భయంకరంగా ఉంటుందనీ అమితమైన వేదనని కలిగిస్తుందని అతని అనుభవంలోకొచ్చింది.

సరోజ కొద్దిగా స్థిమితపడ్డాక, “ఆరునెల్లయిందా చనిపోయి?” అని అడిగింది.

“అవునాంటీ”

“మరి మా ప్రసాద్‌కి రోజూ మెయిల్స్ వస్తూనే ఉన్నాయిగా. నిన్న కూడా వచ్చిందని చెప్పాడే”

అదే ప్రశ్న ప్రసాద్ గుండెల్లో అరగంటనుంచీ సుళ్ళు తిరుగుతోంది. దుఃఖం ఇంతసేపూ మరుగున పర్చిన ప్రశ్న... అదే ప్రశ్న అమ్మ అడిగేప్పటికి ఏడుపునాపి సమాధానం కోసం ఎదురు చూశాడు.

అప్పుడే బెడ్రూంలోంచి వాళ్ళమ్మ బైటికొచ్చింది.

“మా అమ్మాయి చనిపోయేముందు మెయిల్స్ పంపడం ఆపొద్దనీ తన తరఫున తను పంపించినట్లే పంపిస్తూ ఉండమని సుభాషిణిని కోరిందమ్మా. తను చనిపోయిన విషయం మీ అబ్బాయికి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలీకూడదని ఒట్టేయించుకుంది” అంది కళ్ళని చీర చెంగుతో వత్తుకుంటూ.

“మా అక్క చనిపోయే ముందు నాతో ఏమందో చెప్తానాంటీ. ‘అతన్లో ఆశ

నింపాలన్న కోరికతోనే పరిచయం పెంచుకున్నాను. తన అనారోగ్యాన్ని తన అవిటితనాన్ని ధైర్యంగా ఎదుర్కొనేలా తయారు చేయాలనుకున్నాను. నేను తలపెట్టిన కార్యం పూర్తి కాకుండానే పోతున్నాను. దాన్ని పూర్తి చేసే బాధ్యత నీది చెల్లీ. ఉత్తరాలు సరదాగా ఉండేట్టు రాయి. ఆశ తొణికిసలాడేలా రాయి. జీవితాన్ని పూర్తిగా ఎంజాయ్ చేస్తున్నట్టు రాయి. మానసికంగా అతన్లో ధైర్యం నింపుతూ రాయి' అని ప్రామిస్ చేయించుకుందాంటీ. అందుకే మా అక్క పేరుతో ఆర్నెల్లనుంచీ నేనే మెయిల్స్ పంపిస్తున్నా" అంది. ప్రసాద్ వైపు తిరిగి "సారీ ప్రసాద్ గారూ... నన్ను క్షమించండి. మా అక్క చివరి కోరిక తీర్చడం కోసం అలా చేయక తప్పలేదు" అంది ఏడుస్తూ సుభాషిణి.

ఆ అమ్మాయి మాట్లాడటం పూర్తి కాగానే సరోజ అప్రయత్నంగా చేతులు జోడించి ఫొటోలో కన్పిస్తున్న రాగిణికి నమస్కరించింది.

ప్రసాద్ పిచ్చిపట్టినట్లు ఏడుస్తూనే ఉన్నాడు. గోడమీదున్న ఫొటోవైపు ప్రేమగా ఆరాధనగా బాధగా చూసుకుంటూ ఏడుస్తున్నాడు. మధ్యమధ్యలో జుట్టు పీక్కుంటున్నాడు. ముఖ కండరాలు బలహీనపడటం వల్ల ఏడుస్తుంటే నోటి చివర్లనుంచి చొంగ కారుతోంది. అతని హృదయ విదారకమైన ఏడుపు చూసేవాళ్ళకూ గుండెల్లో చేయిపెట్టి కెలికినట్టు బాధ కలిగించేదిగా ఉంది.

సరోజ బలవంతంగా అతన్ని ఆ గదిలోంచి బైటికి తీసుకొచ్చింది.

ఎంత అపార్థం చేసుకుందీ మనుషుల్ని! ఈ కుటుంబంలోని వ్యక్తులందరూ ఎంత గొప్పవాళ్ళు! ఎంత ఉన్నత సంస్కారం! వాళ్ళందరికీ మనసులోనే వందనాలు సమర్పించుకుంది.

రాగిణి వాళ్ళమ్మను దగ్గరకు తీసుకుని "మీ బాధని నేనర్థం చేసుకోగల్ను. మీ దుఃఖం నా దుఃఖం ఒక్కటే. రాగిణి చనిపోయినందుకు మీకెంత బాధగా ఉందో నాకూ అంతే బాధగా ఉంది. నా కొడుకు కోరిన కోరిక... రాగిణిని ఒక్కసారి చూసి ఆమెకు కృతజ్ఞతలు తెలియచేయాలన్న కోరిక... తీర్చలేకపోయానన్న దిగుల్తోపాటు రాగిణి చనిపోయిందన్న దుఃఖాన్ని కూడా మోసుకుంటూ పోతున్నా" అంది.

***

కోర్టు హాలు...

సిద్ధార్థ బోనులో నిలబడి ఉన్నాడు.

కేసు పూర్వాపరాలు వివరించడానికి అక్షర ముందుకు కదలగానే సిద్ధార్థకి తన లాయర్ ఆమె గురించి చెప్పిన విషయాలు గుర్తొచ్చాయి.

'మన కేస్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అక్షర కావటం మీ దురదృష్టం. ఆమె వాదించిన కేసుల్లో ప్రత్యర్థులు ఓడిపోయిన సందర్భాలే ఎక్కువ' అన్నాడు లాయర్.

'అదేంటి... ఇంకా వాదనలు ప్రారంభం కాకముందే మీరు ఓటమిని ఒప్పుకునేలా ఉన్నారే' అన్నాడు సిద్ధార్థ.

'ఆమె చాలా ప్రతిభావంతురాలు. అందులో అనుమానం లేదు. అలాగని నేనూ ఆమెకేమీ తీసిపోను. ఎటొచ్చీ నేను భయపడ్తున్నది ఆమెకున్న బలమైన నమ్మకాల గురించి'

'ఆమె నమ్మకాలకూ మన కేస్‌కి సంబంధం ఏమిటి?'

'చాలా సంబంధం ఉంది డాక్టర్ సిద్ధార్థ! మీరు చేసిన పనిని కారుణ్య చర్యగా సమర్థించు కుంటున్నారు. కారుణ్య మరణాలకు వ్యతిరేకంగా అక్షర విస్తృతంగా ప్రచారం చేస్తోన్న విషయం మీకు తెలుసా... మస్కులార్ డిస్ట్రాఫీ రోగుల సంక్షేమం కోసం మస్కులార్ డిస్ట్రాఫీ అసోసియేషన్ని స్థాపించి వాళ్ళలో మానసిక స్థయిర్యాన్ని, జీవించే కోరికనీ పెంచడానికి ప్రయత్నిస్తోన్న సామాజిక కార్యకర్త. ఆమె మెర్సీ కిల్లింగ్ గురించి మాట్లాడిన ఒకట్రెండు సభలకు నేనూ హాజరయ్యాను. అక్షర మెర్సీకిల్లింగ్‌కి బద్ధ వ్యతిరేకి. అందుకే ముందే చెప్తున్నాను. ఎక్కువ హోప్స్ పెట్టుకోకండి' అన్నాడు.

లాయర్ మాటల ప్రభావంతో సిద్ధార్థ మనసులో అక్షర రూపం చిత్రించబడింది. చాలా ఎత్తుగా, గంభీరంగా కన్పించే రూపం... క్రోధాన్ని సూచించే కళ్ళు... కత్తుల్లా వెలువడే మాటలు... కానీ తన ఎదురుగా చక్రాల కుర్చీలో కూచుని ఉన్న అక్షరని చూశాక సిద్ధార్థ ఆశ్చర్యపోయాడు. అక్షర గురించి గొప్పగా చెప్పిన లాయర్ ఆమె చక్రాల కుర్చీకి అంకితమై పోయిన విషయం మాత్రం చెప్పలేదు.

వాదనలు ప్రారంభమైనాయి...

"మీరు చేసింది నేరమని ఒప్పుకుంటారా?" సిద్దార్థని అడిగాడు జడ్జి.

"లేదు యువరానర్. ఆ బాబు ఎడ్వర్డ్ సిండ్రోమ్ అనే వ్యాధితో పుట్టాడు. ఈ వ్యాధితో పుట్టిన పిల్లలు ఏడాదికి మించి బతకరు. బతికిన ఆ ఏడాది కూడా రకరకాల రుగ్మతలతో, వైకల్యాలతో క్షణక్షణం నరకం అనుభవిస్తూ బతుకుతారు. దుర్భరమైన జీవితం వాళ్ళది. ఆ బాబుని చూసినపుడల్లా నా హృదయం కరుణతో నిండిపోయేది. హాస్పిటల్లో వైద్యులు చేసిన ప్రయత్నాలన్నీ బాబు జీవితకాలాన్ని పొడిగించడానికేనని అందరూ అనుకోవచ్చు. కానీ వాళ్ళు పొడిగించింది బాబు పడ్తున్న నరకయాతనని. ఎలాగూ చనిపోయేవాడే... నేనా ప్రక్రియని వేగవంతం చేశాను. బాబు పడ్తున్నశారీరిక బాధల్నుంచి విముక్తి ప్రసాదించాలనే నేనలా చేశాను. ఇది తప్పని నేననుకోవడం లేదు" అన్నాడు సిద్దార్థ.

అక్షర తన చక్రాల కుర్చీని జడ్జిగారి ఆసనానికి దగ్గరగా జరుపుకుని తన వాదనని వినిపించడం ప్రారంభించింది.

"ఉన్నత చదువులు చదివి, గౌరవప్రదమైన డాక్టర్ వృత్తిలో ఉన్న ఈ ముద్దాయి కిరాతకంగా ఓ పసికందుని హత్య చేసి దాన్ని దయతో చేసిన చర్యగా కప్పి పుచ్చుకునే వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు యువరానర్... ఇది కోల్డ్ బ్లడెడ్ మర్డర్... ఓ ప్రాణాన్ని ఉద్దేశపూర్వకంగా హరించిన చర్య. డాక్టర్ సిద్దార్థ నమ్ముతున్నట్లు అది మెర్సీ కిల్లింగ్ కిందికొస్తుందని వాదించినా మన దేశ చట్టాల ప్రకారం అదీ శిక్షార్హమైన నేరమే అవుతుంది.

ఏకపక్షనిర్ణయం తీసుకుని, రోగి కోరుకుంటున్నాడన్న భ్రమలో సదరు రోగిని చంపి దాన్ని కారుణ్య మరణం అనడం అర్థరహిత, అనైతిక, పాశవిక చర్య. మెర్సీకిల్లింగ్‌ని అనుమతించే దేశాల్లో ఒకటైన నెదర్లాండ్స్‌లో మెర్సీకిల్లింగ్ విషయంలో ఖచ్చితమైన స్పష్టమైన నియమనిబంధనలున్నాయి. వాటికి లోబడి జరిగితేనే అది చట్ట సమ్మతమైన కారుణ్య మరణం కిందికి వస్తుంది.

అనారోగ్య కారణాల్తో చావుని కోరుకునేవ్యక్తి స్వయంగా స్వచ్ఛందంగా మెర్సీకిల్లింగ్‌ని కోరుకోవాలి. ఆ కోరిక ఒక్కసారి కాకుండా పలుమార్లు వ్యక్తం కావాలి. వైద్యం చేయడం ద్వారా ప్రయోజనం ఉండదనీ, రోగి 'టెర్మినల్లీ ఇల్' అని ప్రభుత్వంచే నియమించబడిన డాక్టర్ల బృందం నిర్ణయించాలి. రోగిని బాధనుంచి విముక్తి చేయడానికి మరో మార్గాంతరం

లేదనీ, మెర్సీకిల్లింగ్ ఒక్కటే దారని వైద్యనిపుణుల కమిటీ నిర్ధారణకొచ్చి దాన్ని రాతపూర్వకంగా తెలియచేయాలి. ఇవన్నీ జరిగాక ఇద్దరు డాక్టర్ల పర్యవేక్షణలో మెర్సీకిల్లింగ్ అమలు జరుపుతారు. దీన్నే 'ఫిజీషియన్ అసిస్టెడ్ సూయిసైడ్' అని కూడా అంటారు.

కానీ ఈ ముద్దాయి చేసిన చర్య ఎంత నీచమైందో ఎంత హేయమైందో మీరే ఆలోచించండి యువరానర్. ఇతను చంపింది తనకు బతుకు భారంగా ఉందనో, చావాలని ఉందనో చెప్పడానికి నోరు లేని పది రోజుల పసికందుని. పేషెంట్ మాట్లాడలేని పరిస్థితుల్లోనో, కోమాలోనో ఉన్నప్పుడు అతని సమీప బంధువుల అనుమతితో మెర్సీకిల్లింగ్‌ని కొన్ని దేశాలు అనుమతిస్తాయి, కానీ ఈ బాబు తల్లిదండ్రులు అటువంటి కోరికని ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ వ్యక్తపర్చలేదు. కారుణ్య మరణాలు శిక్షార్హమైన నేరాలే అనే విషయాన్ని పక్కన బెట్టి ఆలోచించినా ముద్దాయి చేసిన చర్యని కారుణ్య మరణంగా భావించడానికి ఆస్కారం లేదు. ఏ రకంగా చూసినా ముద్దాయి చేసింది హత్య కిందికే వస్తుంది కాబట్టి ఐ.పి.సి. 302 ప్రకారం ముద్దాయికి శిక్ష విధించాల్సిందిగా కోర్టువారిని కోరుతున్నాను" అంటూ ముగించింది.

సిద్దార్థ తరఫు లాయర్ తన వాదన విన్పించడానికి సమాయత్తమైనాడు.

"ఈ కేస్‌లో మనం చూడవలసింది బాబుకు ఆక్సిజన్ అందకుండా చేయడమనే చర్య కక్ష వల్లనో, దురుద్దేశపూర్వకంగానో జరిగిందా లేక శారీరిక హింసను భరిస్తున్నా నోరు విప్పి చెప్పుకోలేని బాబుకు సాయపడ్డామనే సదుద్దేశంతో జరిగిందా అనేది."

అక్షర అతని మాటలకు అడ్డు తగిలింది.

"ఫ్రాన్సిస్ ఇంగ్లిస్ తన కొడుకు థామస్‌ని నవంబర్ 2008లో లీథల్ ఇంజక్షన్ ఇవ్వటం ద్వారా చంపేసింది. వేగంగా వెళ్తోన్న వాహనం పైనుంచి పడిపోవడం వల్ల థామస్ తలకూ మిగతా శరీరానికి బలమైన గాయాలయ్యాయి. తన కొడుకు పడ్తోన్న బాధని చూళ్ళేక తల్లి ప్రేమ వల్లనే అతన్ని చంపినట్లు ఫ్రాన్సిస్ ఇంగ్లిస్ కోర్టులో వాదించింది. ఆ కేస్‌లో ఆమెకు తొమ్మిదేళ్ళ శిక్ష పడింది యువరానర్. తీర్పు ఇస్తున్నప్పుడు జడ్జిగారన్న మాటల్ని ఉదహరిస్తాను. 'హత్యకు సంబంధించి లా పుస్తకాలలో దురుద్దేశపూర్వకంగా చేసే హత్యకూ అనుబంధాలూ ప్రేమలవల్ల చేసే హత్యకూ తేడాలేమీ చెప్పలేదు'. కాబట్టి ఏ కారణంతో చేసినా ఓ మనిషి ప్రాణం తీయటం ముమ్మాటికీ నేరమే అవుతుంది"

అక్షర దట్సాల్ యువరానర్ అన్నాక సిద్దార్థ తరఫు లాయర్ తన వాదనని కొనసాగించాడు.

“యువరానర్. ఎడ్వర్డ్ సిండ్రోమ్‌కి సంబంధించిన సమాచారాన్ని తెలిపిన ఓ మెడికల్ జర్నల్ లోని వ్యాసాన్ని మీకు సమర్పిస్తున్నాను. ఇపుడు చనిపోయిన బాబుకి గుండెల్లో వైకల్యం ఉంది. గ్రహణ మొర్రి... ఐ మీన్ క్లెఫ్ట్ లిప్... శ్వాస తీసుకునే ప్రక్రియలో లోపాలున్నాయి. ఇది ఖచ్చితంగా టెర్మినల్లీ ఇల్ కేస్. ఎలాగూ బాబు చనిపోవటం ఖాయం కాబట్టి నా క్లయింట్ డాక్టర్ కావడం వల్ల... ఆ రోగం గురించీ తద్వారా కలిగే బాధల గురించి పూర్తి పరిజ్ఞానం ఉండటం వల్ల... ఆ బాబుది వ్యర్థమైన నిరర్థకమైన బతుకని నమ్మి, దయతో ఆ చర్యకు పాల్పడ్డాడు”

అక్షర వెంటనే స్పందించింది. “గౌరవనీయులైన లాయర్ గారు ఈ కేసుని టెర్మినల్లీ ఇల్ కేస్ అన్నారు. కానీ యువరానర్... టెర్మినల్లీ ఇల్ అనే పదాలకు నిర్దుష్టమైన నిర్వచనం లేదు. కొన్నిచట్టాల్లో టెర్మినల్లీ ఇల్ అంటే సాపేక్షంగా తక్కువ కాలవ్యవధిలో మరణం సంభవించే కేసులని నిర్వచించారు. మళ్ళా తక్కువకాలవ్యవధి అనేదానికి నిర్వచనం లేదు. తక్కువ కాలమంటే రోజులా... ఓ నెలా... ఆరు నెలలా... సంవత్సరమా? ఇంకో విషయం ఇక్కడ చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. వైద్య రంగంలో నిష్ణాతులైన వాళ్ళు కూడా ఒక వ్యక్తి లేదా రోగి ఎంతకాలం బతికుంటాడనే విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేరనే విషయం నిర్వివాదాంశం. అటువంటప్పుడు టెర్మినల్లీ ఇల్ అని ఎవర్నయినా ఏ కొలమానాలతో అనగలరు?

డిఫెన్స్ లాయర్ గారు మరో మాట వాడారు. ఆ బాబు శారీరికంగా నరకయాతన అనుభవించాడని. ఈ వాదన కూడా సరైంది కాదు. ఎందుకంటే బాధ తీవ్రత వ్యక్తుల్ని బట్టి మారుతుంది. ఎంత బాధను ఓ వ్యక్తి శారీరికంగా మానసికంగా భరించగలడనే విషయం కూడా రిలేటివ్‌నే. సాపేక్షంగా నిర్ధారించాల్సిన విషయాలవి. ఓ వ్యక్తికి ఆ బాధ భరించలేనిదిగా అన్పిస్తే అదే బాధ మరో వ్యక్తికి భరించతగిందిగా అన్పించవచ్చు. ఓ వ్యక్తి చాలా చిన్న బాధకే చచ్చిపోతే బావుండుననుకోవచ్చు. మరో వ్యక్తికి ఎంత పెద్ద బాధ ఉన్నా బతకాలనే కోరుకోవచ్చు.

మనం అనవసరంగా మెర్సీకిల్లింగ్ గురించి వాదించుకుంటూ కోర్టువారి

అమూల్యమైన కాలాన్ని వృథా చేస్తున్నాం యువరానర్. మన దేశంలో మెర్సీకిల్లింగ్ చట్టసమ్మతం కానపుడు ఈ హత్య కరుణతో జరిగిందా దయతో జరిగిందా అనేది అర్థ రహితం... అప్రస్తుతం.

ఈ మధ్య గౌరవనీయులైన సుప్రీంకోర్టు జడ్జిగారు మెర్సీకిల్లింగ్ గురించి వ్యాఖ్యానిస్తూ 'మెర్సీ కిల్లింగ్ అనేది చాలా సంక్లిష్టమైన అంశం. దీని గురించిన చర్చ వచ్చినపుడల్లా సంక్షుభిత కల్లోలిత సముద్రంలో పయనిస్తున్న పడవలా ఉంటుంది మా పరిస్థితి' అన్నారు.

మరో ముఖ్యమైన విషయాన్ని ఈ కేస్‌లో విస్మరించకూడదు యువరానర్. ముద్దాయి ఓ డాక్టర్. సర్వకాల సర్వావస్థలందు తనమీద నమ్మకంతో వచ్చిన రోగుల ప్రాణాల్ని కాపాడాల్సిన నైతిక బాధ్యత ఉన్న వ్యక్తి. క్రీస్తు పూర్వం నాలుగు వందల సంవత్సరాల క్రితం హిపోక్రేటస్ చెప్పిన ప్రమాణాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. 'అడిగినా సరే నేనెవ్వరికీ ప్రాణాంతకమైన మందులు ఇవ్వను. అటువంటి మందులు వాడమని సలహాకూడా ఇవ్వను' అనేదే ఆ ప్రమాణం...

డాక్టర్ వృత్తి చేపట్టేముందు తాను చేసిన హిపోక్రేటస్ ప్రమాణాన్ని మరిచి, ఓ పసివాడి ప్రాణాల్ని హరించటం నేరం గాక మరేమవుతుంది?

అది కారుణ్య మరణమని కదా డిఫెన్స్ వారి వితండవాదన. దీన్ని బలపర్చేవారు వాడే హోప్‌లెస్లీ ఇల్, డెస్పరేట్లీ ఇల్, మీనింగ్‌లెస్ లైఫ్ అనే మాటలు అర్థం లేనివి... మనల్ని తప్పుదోవ పట్టించేవి. నరేష్ మరోత్రావ్ సాఖ్రే కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. 'ఏ పరిస్థితుల్లో పాల్పడినా సరే మెర్సీ కిల్లింగ్ లేదా యూథనేషియా అనేది హోమిసైడ్ కిందే అంటే హత్యానేరం కిందే పరిగణించబడ్తుంది' అని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది.

ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని ముద్దాయికి కఠిన శిక్ష విధించవల్సిందిగా కోరుతున్నాను. ముద్దాయి తన చర్యని సమర్థించుకుంటున్న తీరుని పరిశీలిస్తే ఆ హాస్పిటల్లో జరిగిన మరికొన్ని మరణాల వెనక ముద్దాయి హస్తం ఉండే అవకాశం ఉంది కాబట్టి ఈ కోణంలో ఎంక్వయిరీ చేయించాల్సిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. దట్సాల్ యువరానర్" అంటూ ముగించింది అక్షర.

జడ్జిగారు కేసుని వచ్చేనెల పదహారో తారీక్కి వాయిదా వేశారు. దాంతోపాటు

లైఫ్ లైన్ హాస్పిటల్లో గతంలో సంభవించిన మరణాల విషయంలో ముద్దాయి ప్రమేయం ఏ మేరకు ఉందో, ఏయే కేసుల్లో ఉందో ఎంక్వయిరీ చేసి రిపోర్టు ఇవ్వవలసిందిగా పోలీసులకు ఆదేశాలివ్వబడ్డాయి.

***

నకిరేకల్ నుంచి తిరిగొచ్చాక ప్రసాద్ ఆరోగ్యం చాలా వేగంగా క్షీణించటం సరోజ గమనించింది. ఆమె ఎన్ని రకాలుగా అతన్ని సంతోషంగానూ ఉత్సాహంగానూ ఉంచడానికి ప్రయత్నించినా ఫలితం కన్పించలేదు.

ప్రసాద్‌కి బతుకుమీద ఆశ చచ్చిపోయింది. వీలైనంత త్వరగా చచ్చిపోవాలన్న కోరిక రోజు రోజుకూ బలపడుతూ... రాగిణి చావు గురించి తెలీకముందు శరీరంలోని కండరాలు మొరాయిస్తున్నా మనసు మాత్రం ఉత్సాహంతో ఉరకలేస్తూ ఉండేది. తనలో గత ఏడాదిన్నరగా చైతన్యంతో కదులాడిన జీవకణాలన్నీ ఒక్కసారిగా చచ్చిపోయినట్లు... ఆత్మ విడిపోయిన మృత శరీరంలా... మనసు నిండా ఒకటే కోరిక... చచ్చిపోవాలని...

***

ఉదయాన్నే బెల్ మోగితే ఎవరై ఉంటారబ్బా అనుకుంటూ తలుపు తీసిన సరోజ ఎదురుగా చేతిలో చిన్న సంచితో నిలబడి ఉన్న అమ్మను చూసి ఆశ్చర్యపోయింది.

“అమ్మా... నువ్వా?” అంది తన మనసులో కలిగిన సంభ్రమాన్ని ఆపుకోలేక.

“ఆ... నేనే... ఎందుకంత ఆశ్చర్యం? నా కూతురింటికి నేను రాకూడదా ఏమిటి” అంటూ లోపలికి వచ్చింది జయమ్మ.

“అయ్యో... నా ఉద్దేశం అది కాదమ్మా. ఆశ్రమంలో ప్రశాంతంగా ఉంటున్నావు కదా. ఇలా చెప్పాపెట్టకుండా వచ్చేస్తే నీ ఆరోగ్యం గురించి భయమేసి...”

“నా ఆరోగ్యానికేం... భేషుగ్గా ఉంది. అలాంటి భయాలేమీ పెట్టుకోకు. మరో పదేళ్ళ దాకా నా ప్రాణాలకు ఢోకా లేదు. సరేనా” అందామె ముసిముసిగా నవ్వుతూ.

సోఫాలో కూలబడ్తూ “బస్ ప్రయాణం కదా. వళ్ళు హూనమైందంటే నమ్ము. నా సంగతి సరేనే సరోజా... నువ్వేమిటే ఇలా ఐపోయావూ? ఎంత చిక్కిపోయావో తెలుసా... ఎముకలు కన్పిస్తున్నాయి. ఒక్కసారిగా పదేళ్ళ వయసు మీద పడ్డట్టు ముసిల్దానిలా

కన్పిస్తున్నావేమిటే... నువ్వు తలుపు తీయగానే మొదట గుర్తుపట్టలేదు తెలుసా" అంది జయమ్మ. కూతుర్ని చూశాక ఆమెకళ్ళలో పొంగుకొస్తూ ఆవేదన...

"ఏం లేదమ్మా... ప్రసాద్ గురించే దిగులు"

"అలాగని ఆరోగ్యం పాడు చేసుకుంటారా ఎవరైనా? దిగులుంటుంది. కాదనను. కానీ నిబ్బరంగా నిలబడకపోతే ఎలా? మూడేళ్ళ క్రితమేగా చూసిపోయాను... మూడేళ్ళకే ఇంత మార్పా? డాక్టర్‌కి చూపించుకున్నావా... మొత్తం బాడీ చెకప్ చేస్తారటగా... అదేదో చేయించుకోలేకపోయావా" కూతుర్ని శ్రద్ధగా పరిశీలిస్తూ చెప్పింది.

"నా ఆరోగ్యం బాగానే ఉందమ్మా. నీ మనవడి పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతుంటే చూళ్ళేకపోతున్నానమ్మా" ఉప్పెనలా పొంగుతున్న కన్నీళ్ళలో తడిసిముద్దవుతున్న కూతుర్ని చూసి ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది.

చప్పున లేచొచ్చి కూతుర్ని పొదివి పట్టుకుంది. అమ్మ అలా అనునయంగా దగ్గరకు తీసుకోగానే ఆ క్షణం కోసమే ఎదురుచూస్తున్నట్లు సరోజ వాళ్ళమ్మను చుట్టుకుని తనివిదీరా ఏడ్చింది. ఇన్నాళ్ళూ దాచిపెట్టుకున్న దుఃఖమంతా కన్నీళ్ళుగా మారిపోయేంతగా ఏడ్చింది.

కొద్దిసేపైనాక తనను తాను సంబాళించుకుంటూ, "మొదట స్నానం చేయమ్మా. గీజర్ ఆన్ చేసే ఉంది. నీకు ఉప్మా ఇష్టంగా. ఈ రోజు టిఫిన్ అదే చేస్తాను. కొద్దిగా స్థిమిత పడ్డాక మాట్లాడుకుందాం" అంది సరోజ.

"ముందు ప్రసాద్ ఎలా ఉన్నాడో చూడనీ... ఆగదిలోనేగా ఉందీ... చక్రాల కుర్చీలో కూచుని తిరగ్గలుగుతున్నాడా... మందులు జాగ్రత్తగా వాడ్తున్నాడా?" మాట్లాడుతూనే కూతురు ముందు నడుస్తుంటే ఆమె వెనకే గదిలోకి నడిచింది.

ప్రసాద్ కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నాడు. పక్కనే అమర్చిన వెంటీలేటర్ సాయంతో శ్వాస తీసుకుంటున్నాడు.

అలికిడికి కళ్ళు తెరిచి చూశాడు.

ఎదురుగా అమ్మమ్మను చూడగానే సంతోషం ఆపుకోలేక "అమ్మమ్మా" అని పెద్దగా అరిచాడు. మాటల బదులు గొంతులోంచి వింత శబ్దాలేవో వచ్చాయి. ఒక్కసారిగా

అతనిలో దుఃఖం పెల్లుబికింది. అమ్మమ్మ వైపు నిస్సహాయంగా చూస్తూ నిశ్శబ్దంగా కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

మంచం మీద కూచుని అతని తల నిమురుతూ "ఎలా ఉందిరా నీకు? మూడేళ్ళ క్రితం వచ్చినపుడు మాట బాగానే ఉండిందిగా... ఏం మాయదారి జబ్బో... నా మనవణ్ణి పీడిస్తోంది" అంది జయమ్మ.

ప్రసాద్ ఏదో మాట్లాడటానికి మళ్ళా శ్రమపడ్డాడు. అమ్మ వైపు చూసి ల్యాప్‌టాప్ దగ్గరగా జరపమని సైగ చేశాడు.

సరోజ ల్యాప్‌టాప్‌ని అతని కుడిచేతికి అందేలా జరిపింది. కీ బోర్డ్ మీదకి వేళ్ళని జరిపి మెల్లగా టైప్ చేశాడు. "అమ్మమ్మా... నువ్వొచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. చచ్చిపోయేలోపల నిన్ను చూస్తానో లేదోనని భయపడ్డాను"

దాన్ని చదవగానే జయమ్మకు ఏడుపు తన్నుకు వచ్చింది. అతని ఎదురుగా దుఃఖపడటం భావ్యం కాదనుకుని కన్నీళ్ళని బలవంతంగా ఆపుకుంటూ "కొద్దిసేపు రెస్ట్‌గా పడుకో. నేను స్నానం చేసొచ్చాక నీ దగ్గరే కూచుంటాను. సరేనా" అంది.

ఆ మాటలకు ప్రసాద్ మొహం వెలిగింది. "థ్యాంక్స్ అమ్మమ్మా. అమ్మ ఆఫీస్ కెళ్ళాక నాతో మాట్లాడేవాళ్ళు లేక బోర్ కొట్టి చచ్చిపోతున్నాను తెలుసా? ఎప్పట్లా ఒకట్రెండు రోజులే ఉంటానంటే వూర్కోను" అని టైప్ చేశాడు.

అంత బాధలోనూ తన మనవడు చిన్న పిల్లాడిలా అలా అడుగుతుంటే ఆమెకు నవ్వొచ్చింది.

"సరేరా... అలాగే ఉంటాలే. ఎన్ని రోజులుండమంటావో చెప్పు" అంది.

"చాలాచాలా రోజులు" అని టైప్ చేశాడు.

"నువ్వెళ్ళమనేదాకా ఇక్కడే ఉంటాను. సరేనా... అమ్మ బ్యాంకుకెళ్ళాక మనం బోల్డు కబుర్లు చెప్పుకుందాం. సంతోషమేనా"

అతని కళ్ళలో క్షణకాలం నాట్యమాడిన మెరుపు... వెంటనే ఉదాసీనమైపోయి "నేను కబుర్లు చెప్పలేను అమ్మమ్మా... ఇలానే టైప్ చేస్తాను. నీకు ఓకేనా" అని రాశాడు.

ఆమె వాడి జుట్టుని వేళ్ళతో చెదరగొడ్తూ "పిచ్చి సన్నాసి... ఓకే నేనా... డబుల్

ఓకే" అంది. ప్రసాద్ మొహంలో చాలా రోజుల తర్వాత నవ్వు కన్పించింది సరోజకు.

గదినుండి బైటికొచ్చాక "ఈ మూడేళ్ళలో వాడి పరిస్థితి ఇంత అధ్వాన్నంగా మారిందేమిటే" అంది జయమ్మ.

"ఏం చెప్పమంటావమ్మా... రోజు రోజుకూ పెరిగే వ్యాధి తప్ప తగ్గేది కాదుగా"

"నీతో మాట్లాడాలన్నా ఇలానే టైప్ చేస్తాడేమిటే"

"లేదమ్మా... నాతో మామూలుగానే మాట్లాడతాడు. వాడి పదాల్లో స్పష్టత లేకున్నా పెదవుల కదలిక బట్టి వాడేం అంటున్నాడో నాకు సరిగ్గానే అర్థమౌతుంది. మిగతావాళ్ళకు వాడేం మాట్లాడినా వింత శబ్దాల్లాగానే విన్పిస్తాయి. నువ్వు ఇబ్బంది పడ్తావని వాడు టైప్ చేసి చూపించాడు"

"ఎంత తెలివో... ఏం ప్రయోజనం? భగవంతుడు అర్థాయుష్షు మాత్రమే ఇచ్చాడు. డాక్టర్లు ఏమంటున్నారు?"

"మెల్లమెల్లగా లోపలి అవయవాలు పాడైపోవటం మొదలౌతుందటమ్మా. కండరాలు బలహీన పడటం వల్ల ఆ అవయవాలన్నీ ఇన్ఫెక్ట్ అయి... రెండు మూడు నెలలకంటే ఎక్కువ కాలం బతకడంటమ్మా" మరోసారి సరోజ ఘొల్లుమంది.

"అంతా విధిలిఖితం. మనందరం నిమిత్త మాత్రులమే. నా బాధంతా నీ గురించే సరోజా... ఎన్ని కష్టాలని తట్టుకుంటావు? అంత సడన్‌గా అల్లుడుగారు పోతారని ఎన్నడైనా వూహించామా... వీడికిలాంటి మాయదారి జబ్బొస్తుందని కలగన్నామా... మన తలరాతలో ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరక్క మానదు" అందామె వేదాంత ధోరణిలో.

ఆమె స్నానానికెళ్ళాక సరోజ వంట చేయడంలో నిమగ్నమైపోయింది.

అమ్మ అంత హఠాత్తుగా ఎందుకొచ్చిందో అర్థం కావడం లేదామెకు. ఆమెకిపుడు డెబ్బయ్ యేళ్ళు... నాన్న చనిపోయి పదేళ్ళు... నాన్న చనిపోయాక ఆమె కొడుకు దగ్గరో కూతురి దగ్గరో ఉండటానికి ఇష్టపడలేదు. తాను నమ్మిన రఘునాథ్ బాబా ఆశ్రమానికెళ్ళిపోయింది. తన భర్త మరణానంతరం వచ్చే పెన్షన్ డబ్బుల్ని ఆశ్రమానికి విరాళంగా ఇచ్చేసి, అక్కడే ఓ గదిలో బాబాని ధ్యానించుకుంటూ, భజనల్లో పాల్గొంటూ

ప్రశాంత జీవితం గడపడానికి నిర్ణయించుకుంది.

అందుకే తనకే కష్టం వచ్చినా మౌనంగా భరించింది తప్ప అమ్మకు తెలియచేసి ఆమెకు మనశ్శాంతి లేకుండా చేయాలనుకోలేదు. ఎప్పుడైనా ఉత్తరాలు రాసినా 'అమ్మా ఎలా ఉన్నావు... ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో' లాంటి విషయాలు రాసేది తప్ప తన మనోవ్యథల్ని ఏకరువు పెట్టేది కాదు. మూడేళ్ళక్రితం మాత్రం అమ్మను చూడాలనిపించి ఉత్తరం రాస్తే వచ్చింది. ప్రసాద్ అనారోగ్యాన్ని చూసి చాలా బాధపడింది. అప్పుడైనా రెండ్రోజులు మాత్రమే ఉండి బాబా కలలో కన్పిస్తున్నాడంటూ వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఇదే రావటం... ఏ కబురూ లేకుండా వచ్చిందంటేనే ఏదో అనుమానం వస్తోంది... ఆరోగ్యం బాగో లేదేమో... అందుకే అక్కడ ఉండలేక వచ్చేసిందేమో... చెప్తే తను బాధ పడ్తానని చెప్పలేదేమో... ఆ ఆలోచనకే ఒక్కసారిగా నిస్సత్తువ ఆవహించినట్లనిపించింది. తనకు తన అనారోగ్యంతోపాటు ప్రసాద్‌ని చూసుకోవటమే కష్టంగా ఉంటోంది. ఒక్కోసారి ప్రాణం విసిగిపోయి వాడు తొందరగా చనిపోతే బావుండునన్న దుర్మార్గమైన ఆలోచనలు కూడా వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అమ్మ బాధ్యతకూడా మీదపడితే తను మోయగలదా... లేదు. తనకంత శక్తి లేదు.

ఓ వేళ అమ్మ అనారోగ్యం వల్లనే వచ్చి ఉంటే తనకున్న జబ్బు గురించి చెప్పేసి తన అశక్తతను తెలియచేసి, ఏ వృద్ధాశ్రమంలోనో చేర్పించాలనే నిశ్చయానికొచ్చింది. ఐనా తను అనవసరంగా ఆందోళన పడ్తుందేమో... మూడేళ్ళ క్రితం వచ్చినపుడు రెండ్రోజులుండి పోయినట్లు ఇప్పుడు కూడా ఒకట్రెండు రోజులుండి పోతుందేమో... ఈ ఆలోచన సరికాదనే ఆమె అంతరాత్మ హెచ్చరిస్తోంది. ఇందాక ప్రసాద్‌తో నువ్వెళ్ళమనేదాకా ఇక్కడే ఉంటానని చెప్పిందంటే అంత తొందరగా వెళ్ళే ఆలోచన ఆమెకు లేదనే అన్పిస్తోంది.

ఆమెకు ఒక్కసారిగా జీవితం మీద విరక్తి పుట్టింది. ఇంతేనా జీవితం... అనుబంధాలన్నీ ఇంత బలహీనమైనవా... పుటుక్కున తెగిపోయే దారంలా... ఈ ప్రేమలూ... మమకారాలూ... అంతా నటనేనా... ఇంత డొల్లగా... ఒకర్ని ఒకరు వంచించుకోడానికేనా ఈ ఆత్మీయతలన్నీ... తనని కని పెంచి పోషించిన అమ్మ ఇంటికొస్తే ఆమెను ఈ పండు ముసలితనంలో ఆదుకోవాల్సింది పోయి ఇలా ఆలోచించడం

భావ్యమా... అమ్మ ఇక్కడ ఉండటం తనకు భారమనుకునేంత స్వార్థం ఎలా వచ్చింది... అది స్వార్థమా... కాదు... దీనావస్థ.. తల్లి వచ్చిందని సంతోషపడకపోగా ఎందుకొచ్చిందిరా భగవంతుడా అనుకునే దుస్థితి... చివరికి ప్రాణపదంగా పెంచుకున్న తన కొడుకు విషయంలో కూడా ఎంత క్రూరమైన దుర్మార్గమైన ఆలోచనలు వస్తున్నాయో... ఏమైపోయిందా ప్రేమ... ఎక్కడికి ఎగిరిపోయింది... వాడు చనిపోతే బావుండునని మనసెందుకు కోరుకుంటోంది... తనది అసలు తల్లి మనసేనా... తను రాయిలా మారిపోయిందా... తన కష్టాలు హృదయం లేని పాషాణంలా తనని మార్చేశాయా... తన శరీరాన్ని కొద్దికొద్దిగా తినేస్తున్న క్యాన్సర్ తన మనసులోని మెత్తదనాన్ని మమకారాన్ని కూడా కొరికి తినేసిందా... తన తల్లికి తనసలు కూతురేనా... భగవంతుడా... ఇటువంటి శిక్ష పగవాడికి కూడా వద్దు తండ్రీ...

అమ్మ స్నానం చేసి చీర మార్చుకుని బైటికి రావడం చూసి తన కన్నీళ్ళని చీర కొంగుతో తుడుచుకుంది. అమ్మ వైపు పరిశీలనగా చూసింది. సన్నటి నీలం బార్డరున్న తెల్లటి నూలు చీర... సన్నగా రివటలా శరీరం... ఎంత చకచకా నడిచొస్తుందో... పదేళ్ళక్రితం ఎంత చలాకీగా ఉండేదో ఇప్పటికీ అలానే... ఆ మొహంలో ఎంత తేజస్సో... చుట్టూ వెల్తురు వలయం ఏదో తిరుగుతున్నట్లు... ఆశ్రమంలో గడపటం వల్లనేమో ఎంత ప్రశాంతంగా ఉందీ మోహం...

తన మనవడికిలా ఉందని అమ్మకు దిగులుండదా... తన కూతురి బతుకిలా కాలిపోయిందని అమ్మ బాధపడదా... దుఃఖపడేవాళ్ళ మొహంలో ఆ కాంతి సాధ్యమా... అమ్మ గురించి తనకు బాగా తెలుసు... ప్రేమదేవత... ఎంత బాగా పెంచిందో పిల్లల్ని... ఎంత అల్లరి చేసినా పల్లెత్తు మాట అనేది కాదు. అమ్మ కొట్టడం అస్సలు గుర్తు లేదు. అటువంటి అమ్మ బాధపడకుండా ఎలా ఉంటుంది? తప్పకుండా వ్యథ చెందే ఉంటుంది. ఎటొచ్చీ ఆశ్రమంలో ఉండటం వల్ల వేదాంతం వంటబట్టి సుఖదుఃఖాల్ని తామరాకుమీద నీటిబొట్టులా స్వీకరించడం అలవాటై ఉంటుంది.

అమ్మ వంట గదిలోకొచ్చి “నువ్వు కూచోవే... నేనొచ్చాగా... ఇకనుంచి వంట పనంతా నేను చూసుకుంటాలే” అంది.

“పర్లేదులేమ్మా... ఇపుడేగా వచ్చావు. విశ్రాంతిగా కూచో. ఇంతకూ బాబాగారి

ఆశ్రమం ఎలా ఉంది?"

"ఏమని చెప్పమంటావు? బాబాగారు బతికున్నన్ని రోజులు ఆశ్రమంలో మా అందరి బతుకులు బాగానే ఉండేవి. ఆయన మరణం తర్వాత పరిస్థితులే మారిపోయాయి"

"బాబాగారి మరణవార్త టీవీలో చూసినపుడే అనుకున్నానమ్మా... నువ్వు తప్పకుండా అలజడికి లోనై ఉంటావని... అసలాయన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నారని వార్తలొస్తున్నపుడే నువ్వు బాగా గుర్తుకొచ్చేదానివి"

"ఆయన దేవుడనుకుని కదా వెళ్ళాను. కాదు. మామూలు మనిషే. కనీసం దైవాంశ సంభూతుడో దైవానుగ్రహం ఉన్న వ్యక్తో కాదనిపించింది. మనకుమల్లే రోగపీడితుడై ఆస్పత్రిలో నెల రోజులుండి చనిపోయారు. ఆ భ్రమ తొలగిపోవటం ఒక ఎత్తయితే, ఆయన పోయాక ఆశ్రమంలో నెలకొన్న కుళ్ళు రాజకీయాలు చూసి రోత పుట్టడం మరో ఎత్తు. ఆధిపత్య పోరు... రఘునాథ్ బాబా కూడబెట్టిన ఆస్తుల్ని కైవసం చేసుకోడానికి వాలిపోయిన రాబందులెన్నో... పవిత్రమైన స్థలంలో ఉంటున్నామన్న భావాన్ని మింగేయడానికి ఇంతకంటే ఏం కావాలి?"

"పవిత్రత లేకున్నా ప్రశాంతత ఉంటే చాల్లేమ్మా"

"యింకెక్కడి ప్రశాంతత... రోజూ ఏదో ఓ రగడ... ఆశ్రమం నాదంటే నాదని గొడవలు... కొట్లాటలు... పోలీసులు రావడం... పరిష్కారం దొరకని సమస్య కదా... రావణ కాష్ఠంలా ఉందంటే నమ్ము... అందుకే వచ్చేశానే... శాశ్వతంగా... నువ్వేం కంగారు పడకు. నీకేమీ భారం కానులే. నా ఆరోగ్యం బాగానే ఉంది. ఒంట్లో యింకా ఓపికుంది. నువ్వు నాకేమీ చేయక్కరలేదు. వంటా అదీ నేనే చేసి పెడ్తా. నువ్వు నీ కొడుకుని చూసుకో... నీ ఉద్యోగం చూసుకో... చాలు"

అమ్మ అలా అంటుంటే సరోజకు సిగ్గనిపించింది. ఈమె గురించి తనెలా ఆలోచించిందీ గుర్తొచ్చి బాధనిపించింది. అమ్మ కష్టపెట్టడానికి రాలేదు.. తన కష్టంలో పాలుపంచుకోడానికొచ్చింది అనే విషయం అర్థమై ఆమె కళ్ళు అశ్రుపూరితాలైనాయి.

"ఛ... అవేం మాటలమ్మా... నువ్వు నాకు భారమెలా అవుతావు? నిశ్చింతగా నా దగ్గరే ఉండిపో... నీకే ఇబ్బందీ లేకుండా చూసుకుంటాను" అంది.

"నువ్వలా అంటావన్న ధైర్యంతోనే వచ్చానే. నీకు ఆర్థికంగా సాయం చేయలేని

స్థితిలో నీ వద్దకొచ్చాననే బాధ... ఆ పెన్షన్ డబ్బులు మొత్తం ఆశ్రమానికి రాసిచ్చేశాగా. నీకు తోడుండగల్ను... నాకు చాతనైనంతగా యింటి పనుల్లో సాయం చేయగల్ను... అంతకు మించి ఏం చేయలేనమ్మా"

"నువ్వేమీ చేయకున్నా పర్లేదు. డబ్బులకేమీ ఇబ్బంది లేదులే. బ్యాంకు వాళ్ళు జీతాలు బాగానే యిస్తున్నారు. నువ్వు తోడుంటే నాకూ ధైర్యంగా ఉంటుందమ్మా. ఇన్నాళ్ళూ ప్రసాద్‌ని పనివాళ్ళ దయాదాక్షిణ్యాల మీద వదిలేసి బ్యాంకుకెళ్ళటం దుర్భరంగా ఉండేదమ్మా. మనసంతా వాడేం చేస్తున్నాడో వాడి అవసరాలు సరిగ్గా చూస్తున్నారో లేదోనని దిగులుగా ఉండేది. ఇపుడు నువ్వు చూస్కుంటావన్న ఆలోచన కొండంత బలాన్నిస్తోంది తెలుసా" అంది మనస్ఫూర్తిగా.

ఆమెకు నిజంగానే గుండెలపైనుంచి కొండలాంటి బరువునెవరో దింపేసినంత తేలిగ్గా ఉంది. కొన్ని నిముషాల క్రితమే అమ్మ తనకు భారమౌతుందేమోననుకుంది. ఇపుడు తన భారాన్ని మోస్తాననందుకు మనసు కుదుట పడింది. తనకీ అనారోగ్యం లేకపోతే అమ్మ గురించి అలా ఆలోచించేది కాదు. తను పరిస్థితులకు బానిస... తన పైన ఆధిపత్యం కోసం పోరాడుతున్న క్యాన్సర్‌కి బానిస... తనలో సుళ్ళు తిరుగుతున్న అనేకానేక భయాలకు బానిస... ముఖ్యంగా తన చావు భయం. ప్రసాద్ కంటే ముందు చచ్చిపోతానేమోనన్న భయం... అమ్మ కూడా అనారోగ్యంతో మంచాన పడ్తే ఎవరు చూస్తారన్న భయం...

పనులన్నీ తెముల్చుకుని, అమ్మకు టిఫిన్ పెట్టి తనుకూడా కొద్దిగా ఉప్మా తిని, "బ్యాంక్‌కి వెళ్ళొస్తానమ్మా. ప్రయాణం చేసొచ్చావుగా. కొద్దిసేపు పడుకో" అంది సరోజ.

"ఇలా పసిపిల్లాడికి చేసినట్లు ఎన్నాళ్ళు చాకిరీ చేస్తావమ్మా... నిన్నిలా చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది" అంది జయమ్మ.

"నాకు దేవుడు వంట్లో శక్తి నివ్వాలేగాని ఎన్నేళ్ళయినా సంతోషంగా చేస్తానమ్మా. కానీ ఈ మధ్య వాడి ధోరణిలో మార్పొచ్చిందమ్మా. మాట మాట్లాడితే చాలు చచ్చిపోవాలనుందంటాడు. ప్లీజ్ మమ్మీ నన్ను చంపేయి' అని వాడు దీనంగా అడుగుతుంటే నా హృదయం తల్లడిల్లిపోతోందమ్మా. దాన్ని తట్టుకోలేకుండా ఉన్నాను."

"వాడి శారీరిక బాధేమిటో ఎంత తీవ్రంగా ఉందో నోరు తెరిచి చెప్పలేని స్థితి...

భరించడం ఎంత కష్టంగా ఉందో బిడ్డకి... బతికే బతుక్కన్నా చావే నయమనిపిస్తోందేమో వాడికి. అలాంటి వాళ్ళ కోరికని సానుభూతితో అర్థం చేసుకోవటం మంచిది"

"అలా అనకమ్మా... వాడు నా బిడ్డ. వాణ్ణి బతికించుకోడానికి ఎన్ని పోరాటాలు చేయడానికైనా సిద్ధ పడే తల్లిని నేను. ఏదో నిరాశలోనో నిస్పృహలోనో వాడు చనిపోవాలని కోరుకున్నంత మాత్రాన దాన్నెలా సమర్థిస్తాను? నువ్వయినా వాడికి నచ్చచెప్పమ్మా... అలా మాట్లాడి నన్ను బాధ పెట్టొద్దని చెప్పమ్మా"

"అయ్యో... ఇంత దుఃఖాన్ని ఇన్నాళ్ళూ నువ్వొక్కదానివే మోశావా సరోజా... నేనేమైపోయాననుకున్నావూ... ఒక్క ఉత్తరం ముక్క రాస్తే వచ్చేదాన్ని కదా... దిగులు పడకు. వాడి దగ్గర కూచుని నేను నచ్చచెప్తాగా" అందామె కూతుర్ని యిన్నేళ్ళూ ఒంటరిగా వదిలేసినందుకు పశ్చాత్తాపపడ్తూ..

"ఈ వయసులో నువ్వెక్కడో ప్రశాంతంగా నీ బతుకేదో బతుకుతుంటే ఇవన్నీ చెప్పి నిన్ను కష్టపెట్టడం ఇష్టంలేక చెప్పలేదమ్మా. కానీ నామనసులో బలంగా కోరుకుని ఉంటాను. నువ్వు నాకు తోడుంటే బావుంటుందని... ఎంత బలంగా అంటే నీ మనసుని తాకేంత బలంగా. అందుకేనేమో నీకు నువ్వే ఎవరో పిలిచినట్లు వచ్చేశావు. నీ మనవడికి అర్థమయ్యేలా చెప్పమ్మా. తన చావు గురించి నా దగ్గర మాట్లాడొద్దని చెప్పమ్మా" అంటూ అమ్మను చుట్టుకుని వలవలా ఏడ్చేసింది.

"వచ్చినప్పటినుంచీ చూస్తున్నా... ఎంతని ఏడుస్తావే... ఎన్నిసార్లని ఏడుస్తావు... కళ్ళు చూడు ఏడ్చిఏడ్చి ఎలా ఉబ్బిపోయాయో... నేను మాట్లాడ్తాగా వాడితో... నువ్వు బ్యాంక్‌కి వెళ్ళిరా" అంది జయమ్మ.

తలుపు వేసుకున్నాక ప్రసాద్‌ఉన్న గదిలోకెళ్ళి మంచానికి దగ్గరగా కుర్చీ జరుపుకుని కూచుంది. అప్పటివరకూ కళ్ళు మూసుకుని పడుకున్న ప్రసాద్ కళ్ళు తెరిచి అమ్మమ్మని చూసి మెల్లగా నవ్వాడు.

"అమ్మకు నువ్వంటే ఎంత ప్రేమో తెలుసా ప్రసాద్... నేనొచ్చినప్పటినుండీ చూస్తున్నాగా... దానికి నీ గురించే దిగులు" అంది ఉపోద్ఘాతంలా.

ప్రసాద్ తన ల్యాప్‌టాప్ పైన మెల్లగా ఒక్కో అక్షరం టైప్ చేశాడు. తను రాయాలనుకున్నది పూర్తయ్యాక అది చదవమని అమ్మమ్మకు సైగ చేశాడు. ఆమె కళ్ళద్దాలు

సరి చేసుకుని స్క్రీన్ మీదున్న వాక్యాన్ని చదివింది.

"అందుకే నాకు చచ్చిపోవాలని ఉంది"

"అదేంట్రా అలా అంటావూ... ఇలాంటి మాటలు వింటే మీ అమ్మ ఎంత బాధపడ్తుందో తెలీదా... అది పడ్తున్న హింసకు తోడు నువ్విలాంటి మాటల్తో గాయాలు చేయటం తప్పనిపించటం లేదా?" అందామె మందలిస్తున్నట్లు.

"అమ్మకు నావల్ల కలుగుతున్న కష్టాలనుండి దుఃఖాలనుండి విముక్తి ప్రసాదించాలనే చావాలనుకుంటున్నా" అని టైప్ చేశాడు.

"అలా మాట్లాడితే ఎలారా... ఏ తల్లయినా తన కొడుకు చావుని కోరుకుంటుందా? బతకటం కోసం పోరాడాలి... చావుని కోరుకునేది పిరికివాళ్ళు మాత్రమే. నీకు మేమందరం లేమా చెప్పు... నువ్వు ఒంటరివాడివి కాదు. ఆ విషయం మర్చిపోకు"

ప్రసాద్ బలహీనంగా నవ్వాడు.

"చనిపోయేప్పుడు ఎవ్వరూ తోడు రారు అమ్మమ్మా" అని రాశాడు.

"ఛ... అవేం మాటలు"

"నేను అనుభవిస్తోన్న నరకయాతన ఏంటో నాకొక్కడికే తెలుసు. నాకు నొప్పనిపిస్తే నేనే భరించాలి తప్ప ఇంకెవ్వరూ పంచుకోలేరు. అమ్మయినా ఏం చేయగలుగుతుంది చెప్పు... నా భాధని చూసి బాధపడటం తప్ప... ఇలా ప్రతి క్షణం వేదన అనుభవిస్తూ దుర్భరమైన బతుకు బతకటం కన్నా చావటమే నయం అమ్మమ్మా... జీవితాన్ని అపహాస్యం చేస్తున్న ఈ నికృష్టమైన బతుకు నాకొద్దు. చనిపోవటం గౌరవప్రదం. ప్లీజ్ నన్ను చంపేయండి. నాకు చనిపోవాలని ఉంది అమ్మమ్మా" ప్రసాద్ కళ్ళలో ఉబికిన కన్నీళ్ళు...

"నువ్వడిగేదానికి ఏమైనా అర్థముందా... నీకళ్ళకు మేము కర్కోటకుల్లా కన్పిస్తున్నామా? కన్నబిడ్డనే చంపుకునే కసాయిదనుకున్నావా నాకూతురు?" కొద్దిగా కోపంగా అందామె.

అతను మళ్ళా టైప్ చేశాడు. "నన్ను దయతో చంపమంటున్నాను. కరుణతో చంపమంటున్నాను. పగతోనో ద్వేషంతోనో కోపంతోనో చంపితే కిరాతకత్వం. నామీద

జాలిపడి చంపడానికి కావాల్సింది సున్నిత హృదయం... వెన్నలా మెత్తని మనసు. అది అమ్మకూ నీకూ ఉంది. అందుకే వేడుకుంటున్నా. నన్ను చంపేయండి"

"ఎంత దారుణమైన కోరిక కోరుతున్నావు ప్రసాద్... ప్రేమించిన వాళ్ళని వాళ్ళ చేతుల్తో చంపటం రాక్షసత్వం కాదూ..."

"కాదు... మానవత్వం... ప్రేమ ఉంది కాబట్టే చంపమంటున్నాను. ఈ బాధని భరించే ఓపిక నాకిక లేదు అమ్మమ్మా... ఐ ప్రే మెర్సీ కిల్లింగ్"

ఆమెకు మెర్సీకిల్లింగ్‌కి అర్థం తెలీదు. "పిచ్చి పిచ్చి ఆలోచనలు మానుకుని రెస్ట్ తీసుకో... జీవితం అనేది భగవంతుడిచ్చిన వరం"

"నాకు శాపం" అని టైప్ చేశాడు.

ఆమె అసహనంగా అక్కడినుంచి లేచి బైటికొచ్చింది.

ప్రసాద్‌లో కూడా అసహనం... ఎవ్వరూ అర్థం చేసుకోరెందుకనే బాధ... దాంట్లోంచి పుట్టుకొచ్చిన కోపం... దాన్ని వ్యక్తం చేయడానికి అవకాశం లేనందుకు మరింత అసహనం. అతని గొంతు లోంచి వింత శబ్దం వెలువడింది... బాణం దెబ్బ తగిలి విలవిల్లాడుతున్న పక్షి అరుపులా... హృదయవిదారకంగా... భయవిహ్వలంగా...

సాయంత్రం యింటికి రాగానే మొదట ప్రసాద్ గదిలోకెళ్ళింది సరోజ. "ఎలా ఉంది నాన్నా" అని అడిగింది. ప్రసాద్ సమాధానం చెప్పకుండా అమ్మ వైపు దీనంగా చూశాడు.

"ఏమైనా కావాలా నాన్నా" అని అడిగింది.

తన పక్కనే ఉన్న ల్యాప్‌టాప్‌లో చూడమని సైగ చేశాడు. ఆమె ల్యాప్‌టాప్‌ని తన వైపుకు తిప్పుకుని చూసింది. అందులో పెద్ద అక్షరాల్తో "మెర్సీకిల్లింగ్" అని రాసి ఉంది.

ప్రసాద్ అమ్మ మొహం వైపే చూస్తున్నాడు. ఆమె ఏమీ మాట్లాడకుండా ల్యాప్‌టాప్‌ని యథాస్థానంలో ఉంచి నిశ్శబ్దంగా బైటికొచ్చింది.

అప్పటికే వంట గదిలో అమ్మ కూరగాయలు తరుగుతోంది.

"అమ్మా... వాడితో మాట్లాడావా?" అని అడిగింది సరోజ.

"మాట్లాడానమ్మా... ఏదో మెర్సీ కిల్లింగ్ అని రాశాడు. నాకర్థం కాలేదు"

“మెర్సీకిల్లింగ్ అంటే నయం కాని జబ్బుతో బాధపడ్తూ చావుకి దగ్గరగా ఉన్న వాళ్ళని చావడానికి ప్రభుత్వమే పర్మిషన్ ఇవ్వటమన్మాట. అలా చావడమో లేకపోతే అనుమతి పొందిన డాక్టర్ల సాయంతో చంపడమో నేరం కిందికి రాదు. చట్టసమ్మతమైన మరణం అన్మాట... కారుణ్య మరణం అంటారే...”

“చాలా విడ్డూరంగా ఉందే సరోజా... ఇలా చావడానికో చంపడానికో ప్రభుత్వమే పర్మిషన్ ఇస్తుందన్న విషయం ఇప్పుడే వింటున్నా. అందుకేనేమో వాడది కోరుకుంటున్నాడు. చచ్చిపోతాను చచ్చిపోతాను అంటుంటే కోపం వచ్చి నిన్ను చంపడానికి మేమంత దుర్మార్గులుగా కన్పిస్తున్నామా అన్నానే... అప్పుడా మాట రాశాడు”

“ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకోవడానికీ, మనం వాడి కోరికని మన్నించి చంపడానికీ, ప్రభుత్వం మెర్సీకిల్లింగ్‌కి అనుమతిస్తే చంపడానికీ... వీటిలో నాకేమీ తేడా కన్పించటం లేదమ్మా. ఏ రకంగా ప్రాణాలు తీసినా దారుణమే... కిరాతకమే...” అమ్మతో అలా అంటున్నప్పుడు ఆమె అంతరాత్మ హెచ్చరిస్తోనే ఉంది.. వాడు తొందరగా చచ్చిపోతే బావుండునని తన మనసులో ఉందికదా... ఎంత ద్వైదీ భావం... ఆత్మవంచన... ఓ వైపు వాడికోరిక సరైందేనని మనసులో ఎక్కడో ఏదో మూల అన్పిస్తోంది... పైకేమో వాడు చావకూడదని మెర్సీ కిల్లింగ్ దారుణమని అమ్మతో చెప్తోంది.

ఐనా తను అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు తన కళ్ళెదుటే క్షణక్షణం మరణానికి చేరువవుతుంటే చూడటం ఎంతటి దారుణమైన శిక్షో అనుభవిస్తున్న తనకు తెలుసు... పగవాడికి కూడా ఇటువంటి శిక్ష ఉండకూడదని తను దేవుణ్ణి కోరుకుంటుంది.

అందరూ తనని దుర్మార్గురాలనుకున్నా పర్లేదు... తల్లి కాదు రాక్షసి అనుకున్నా పర్లేదు. వాడిలా రోజు రోజుకూ కొద్దికొద్దిగా చావడం కన్నా ఒకేసారి చావడం మంచిది. వాడిమీద అనంతమైన ప్రేమ ఉండబట్టే వాడు చావాలని కోరుకుంటున్న నిజం వేరెవ్వరికీ తెలీకున్నా పర్లేదు. తన మనస్సాక్షికి తెలిస్తే చాలు.

కాని ఆ విషయాన్ని తనెందుకు ధైర్యంగా బైటికి చెప్పలేకపోతోంది? సమాజం దూషిస్తుందేమోననా... లోకులు తన గురించి ఏమనుకుంటారనేది ముఖ్యమా లేక తన కొడుకుని దుఃఖ భరితమైన దుర్భరమైన జీవితం నుండి విముక్తి ప్రసాదించడం ముఖ్యమా? తన కొడుకు ‘నాకు చావాలని ఉందమ్మా’ అంటే ‘సరైన నిర్ణయం నాన్నా... ఇలా రోజూ

నీ చావు చూడటం కంటే ఒకేసారి చనిపోవడమే నేనూ కోరుకునేది' అని ఎందుకు అనలేకపోతోంది? తను ఎవర్ని మోసం చేయాలనుకుంటోంది? సంఘాన్నా.. అమ్మనా... ప్రసాద్‌నా... లేదు... తన్ను తానే మోసం చేసుకుంటోంది. ఎవరేమనుకుంటారోనన్న పిరికితనం... భయం... చివరికి తన తల్లితోనైనా మనసులో చెలరేగుతున్న అలజడిని పంచుకోవాలని ఎందుకనుకోలేకపోతోంది?

"నీతో ఓ రహస్యం పంచుకోవాలనుకుంటున్నాను సరోజా... ఉదయం వాడితో మాట్లాడాక చాలాసేపు వాడు కోరుకుంటున్న చావు గురించి ఆలోచించాను. ఇప్పటివరకూ ఎవ్వరికీ చెప్పకుండా పదేళ్ళుగా నా గుండెల్లో బడభాగ్నిలా దాచుకున్న రహస్యం చెప్తాను. సాంతం విన్నాక ప్రశాంతంగా ఆలోచించి ఓ నిర్ణయానికి రా" అంది జయమ్మ.

"రహస్యమా... నీకేం రహస్యాలుంటాయమ్మా... జీవితమంతా తెరిచిన పుస్తకంలా బతికావు కదా"

"పైకి కన్పించే మనిషి వేరు సరోజా. వాడి లోపల మరో మనిషి ఉంటాడు... పూర్తిగా భిన్నమైన మనిషి... బాహాటంగా వెల్లడించే అభిప్రాయాలకు పూర్తి వ్యతిరేకమైన ఆలోచనలు దాచుకున్న వ్యక్తి... ఎన్ని ముసుగులో మనిషికి... మహాత్ములు మహనీయులు మాత్రమే లోపలా బైటా ఒకేలా ఉండగలరు. నన్ను చూస్తే నీకేమనిపిస్తుందో చెప్పు... అంటే ఎలాంటిదాన్నని నీ అభిప్రాయం?"

"నువ్వు చాలా మంచి అమ్మవి. ఐడియల్ మదర్... నీలాంటి అమ్మ దొరకటం మా అదృష్టం. కరుణా దయా ప్రేమా నిండుగా ఉన్న గొప్ప స్త్రీవి నువ్వు"

ఆ మాటలకు ఆమె నవ్వింది. "నాకు తెలుసు నువ్వలానే అనుకుంటావని. తల్లిగా నాకు మార్కులు బాగానే వేశావు. మీ నాన్నకు భార్యగా నాకెన్ని మార్కులో చెప్తావా?"

"మేం చిన్నప్పటినుంచీ నిన్నూ నాన్నని గమనించాం కదమ్మా. నాకు తెల్సి నువ్వెప్పుడూ ఆయన మాటకు ఎదురు చెప్పలేదు. ఆయన నోట్లో నాలుకలా నడుచుకున్నావు. నాన్న నిన్ను కోప్పడటం చూశాంగాని నువ్వెప్పుడూ ఆయన్ని విసుక్కున్నట్టు కూడా మాకు గుర్తు లేదు. ఆయన చనిపోయేముందు బాగా జబ్బు పడి రెండేళ్ళు మంచాన ఉన్నాడు చూడు... ఆ రెండేళ్ళయితే ఎన్ని సపర్యలు చేశావో... ఎంత అంకిత భావంతో

చేశావో... మంచాన పడ్డా నీలాంటి భార్య ఉన్నందుకు నాన్న అదృష్టవంతుడని మనూళ్లో అందరూ అనుకునేవారమ్మా"

"ఔను... మన చుట్టాలూ బంధువులూ... వూళ్లోని జనాలు అందరూ అలా అనుకున్నారని నాకూ తెలుసు. నిజమేంటో చెప్పనా... వాళ్ళందరూ అలా అనుకునేలా పైకి ప్రవర్తించానంతే... నటించాను... లోకంకోసం..."

"అదేంటమ్మా... అంత మాటనేశావు?"

"ఔనే సరోజా... నీకీ రోజు నిజం చెప్తున్నా. ఇన్నాళ్ళుగా పడిన మానసిక వ్యథనీ పశ్చాత్తాపాన్ని ఈ రోజు నీతో చెప్పుకుని గుండెల మీది బరువు దింపుకోవాలనుకుంటున్నా"

"నువ్వు పశ్చాత్తాపపడే పని చేశావంటే నమ్మలేకుండా ఉన్నానమ్మా"

"పైకి మంచిదానిలా కన్పిస్తూ అంత ఘోరమైన పని చేశాను కాబట్టే మరింతగా కుంగిపోయాను. నాలాంటి దాన్ని వర్ణించడానికి మేకవన్నె పులి, తేనె పూసిన కత్తిలాంటి ఉపమానాలు చాలవేమోనే"

"అంతంత మాటలు మాట్లాడకమ్మా. నేను భరించలేను. నీవిషయంలో అలాంటి పోలికలు సరిపోవమ్మా... నువ్వు అమృతమూర్తివి"

"లేదు సరోజా... మీకందరికీ కన్పించిన అమృతంలో ఎవ్వరికీ కన్పడకుండా చిన్న విషపుచుక్క దాచి పెట్టాను. మీ నాన్న మంచాన పడ్డాక కొన్నాళ్ళ వరకూ మనస్ఫూర్తిగానే సపర్యలు చేశాను. ఆ తర్వాత నాలో మెల్లగా నిస్పృహ పేరుకు పోవడం ప్రారంభమైంది. ఎంత చేసినా ఏమిటీ ప్రయోజనం అనే ఆలోచన... ఆయన పడే వేదన చూళ్ళేని బలహీనత... నిస్సత్తువ ఆవరించేది. మంచంలో జీవచ్ఛవంలా పడి ఉన్న మీ నాన్నని చూస్తే ఓ వైపు ప్రేమ, మరో వైపు కరుణ పొంగిపొర్లేవి. మనసంతా దుఃఖంతో బరువెక్కిపోయేది. అటువంటి సమయంలో ఓ దుర్ముహూర్తంలో నామనసులో ఓ దుష్ట ఆలోచనకు బీజం పడింది. ఆయన తొందరగా చనిపోతే బావుండునన్న ఆలోచన... ప్రేమలేదనుకునేవు... ఉంది కాబట్టే ఆ ఆలోచన. నువ్విప్పుడు ప్రసాద్ కోసం పసిపిల్లాడికి చేసినట్లు ఎలా చేస్తున్నావో నేనూ మీ నాన్నకోసం అలానే చేసేదాన్ని. అన్నీ మంచంలోనే... మలమూత్రాల్ని ఎత్తి పడేయటం దగ్గర్నుంచి... అన్నీ శుభ్రం చేయటం... తిండి తిన్పించడం... మందులు టైం ప్రకారం ఇవ్వడం... ఈ సపర్యలన్నీ

చేసేదాన్ని... ఇష్టంగానే... మనసులో మాత్రం ఏదో మూల ఆయన తొందరగా చనిపోతే బావుండునన్న ఆలోచన...

ఆ ఆలోచన పర్యవసానమో ఏమో... కొన్ని సార్లు ఆయనకు బీపీ మందులిచ్చేదాన్ని కాదు. గుర్తులేక కాదు... గుర్తొచ్చినా ఏదో తెలీని ఉదాసీనత... ఆయన గుండెపోటుతో మరణించడానికి కారణం బీపీ మందులివ్వడంలో నేను ప్రదర్శించిన నిర్లక్ష్యమే కారణమని నాకు తెలుసమ్మా. ఓ రకంగా నేనే ఆయన్ని చంపేశాను.

బతికినన్నాళ్ళూ ఆయన మహరాజులా బతికాడు. యింట్లోకి వస్తుంటే సింహం వస్తున్నట్లే ఉండేది. అలాంటి మనిషి నిస్సహాయంగా మంచంలో పడిపోయి అన్నీ చేయించుకుంటుంటే మనసు అంగీకరించలేకపోయిందమ్మా. నేను చూళ్ళేకపోయాను. అందుకే ఆయన చావుని కోరుకున్నాను."

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నా... నన్ను దుర్మార్గురాలనుకున్నా ఓ విషయం చెప్పాలి సరోజా... మీ నాన్న చనిపోయినపుడు నాకు ఏడుపు రాలేదు. దు:ఖమూ కలగలేదు. గుండెలమీంచి పెద్ద బరువేదో దిగిపోయినట్లు... రిలీఫ్‌గా అన్పించింది. రెండు రకాల రిలీఫ్... నాకు చాకిరీ తప్పినందుకు... ఆయనకు యాతనబతుకు తప్పినందుకు... ఇద్దరమూ ఒకేసారి విముక్తులమైనాం"

"అమ్మా... నాన్న చనిపోయినపుడు నేనూ వచ్చానుగా... పొర్లిపొర్లి ఏడ్చావు కదమ్మా"

"ఔనే... ఏడ్చానే... నాభర్తని నాచేతుల్తో చంపుకున్నానన్న దుఃఖంతో ఏడ్చాను. ఆయన చనిపోగానే రిలీఫ్‌గా అన్పించినందుకు పశ్చాత్తాపంతో ఏడ్చాను. ఇంకా చెప్పాలంటే మీరందరూ ఏమైనా అనుకుంటారేమోనని ఏడ్చాను... సమాజం తప్పుపడ్తుందన్న భయంతో ఏడ్చాను"

సరోజ బొమ్మలా నిశ్శబ్దంగా కూచుంది. ఏం మాట్లాడాలో తెలీని స్థితి... అమ్మలో కన్పిస్తున్న కొత్త వ్యక్తి... తనకు తెలీని అమ్మ... తన వూహాకందని పని చేసిన అమ్మ...

"సరోజా... ఓ విషయం చెప్తాను విను... మీ నాన్న త్వరగా చనిపోతే మరణ

యాతన తగ్గుతుందని ఆశ పడ్డాను. కానీ ఆయన చనిపోతే బావుండునన్న కోరిక ఎక్కడో అస్పష్టంగా మాత్రమే ఉండేది. ప్రసాద్ విషయంలో నాకా అస్పష్టత లేదు. వాడు చనిపోవాలని కోరుకుంటున్నాడు. వాడి శారీరిక యాతన గురించి మనకంటే వాడికే బాగా తెలుస్తుంది.

పదేళ్ళ క్రితం మీ నాన్న మంచానపడి మరణం కోసం ఎదురుచూస్తున్న రోజుల్లో మెర్సీకిల్లింగ్ అనేది ఒకటుందనీ... ప్రభుత్వమే కారుణ్యమరణాల్ని అనుమతిస్తుందని నాకు తెలీదు. తెలిసి ఉంటే తప్పకుండా గవర్నమెంటు తలుపులు తట్టిఉండేదాన్ని. నా భర్తకు దుర్భరమైన జీవితం నుండి విముక్తి ప్రసాదించమని వేడుకుని ఉండేదాన్ని"

"అంటే ప్రసాద్ కోరుకుంటున్న మెర్సీకిల్లింగ్‌ని సమర్థిస్తున్నావా"

"ఔను సరోజా... వాడి కోరికని తీర్చటమే మన బాధ్యత... గుండెని రాయి చేసుకో సరోజా... వాడు నీకు కొడుకైతే నాకు మనవడు. వాడిమీద నాకూ చాల ప్రేముంది. ప్రేముంది కాబట్టే వాడి కోరికలో న్యాయముందని చెప్తున్నాను. ఇప్పటికే ఆలస్యం చేశావు. ఆ మెర్సీ కిల్లింగ్ ఏమిటో చూడు... దానికవసరమైన ఏర్పాట్లు చేయి"

అమ్మ మాట్లాడటం ఆపేసిన చాలా సేపటివరకూ సరోజ రాయిలా కూచుండిపోయింది.

అమ్మ చెప్పిన మాటలేవీ తనకు కొత్తగా అన్పించటం లేదు. అవన్నీ తన అంతశ్చేతనలో నిద్రాణంగా ఉన్న ఆలోచనలే... ఇపుడు ప్రాణాలు పోసుకుని అమ్మ నోట్లోంచి వూడిపడ్డాయి. అంతే. అమ్మ ఎంత బాగా చెప్పింది! తన కొడుక్కోసం తను మెర్సీకిల్లింగ్ పిటీషన్ పెడ్తే లోకం ఏమైనా అనుకోవచ్చు... కర్కోటకురాలనీ... దుర్మార్గురాలనీ... సపర్యలు చేయడానికి ఇష్టంలేక తప్పించుకునే మార్గమనీ... ఏమైనా అనుకోనీ... తనకు కొడుకు మీద ప్రేమ ఉంది కాబట్టే వాడి కోరికని తీర్చడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది.

తను చనిపోయేలోపల రాగిణిని కల్సుకుని థ్యాంక్స్ చెప్పాలని కోరుకున్నాడు వాడు. ఆ కోరికని తీర్చడానికి ప్రయత్నించి విఫలమైంది. తామక్కడికి వెళ్ళేలోపలే తొందరపడి రాగిణి భగవంతుడి దగ్గరకెళ్ళిపోయింది.

వాడిపుడు కారుణ్య మరణాన్ని కోరుకుంటున్నాడు. ఆ కోరికనైనా తప్పకుండా తీర్చాలి. తల్లిగా అది తన బాధ్యత.

ఆమె మనసుని దిటవు చేసుకుంది.

మరునాడే తనకు తెల్సిన లాయర్ రామనాథాన్ని కలుసుకుంది.

తన కొడుకు ప్రసాద్ విషయంలో మెర్సీకిల్లింగ్‌కి అనుమతి కోరుతూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది.

***

డా. సిద్దార్థ కేసులో తీర్పు వెలువడింది. కోర్టు అతన్ని దోషిగా నిర్ధారిస్తూ పదేళ్ళ కారాగార శిక్షని ఖరారు చేసింది.

"నీ శిగలో మరో కలికి తురాయి చేరింది. త్వరలో నీకు హైకోర్టు జడ్జిగా ప్రమోషన్ రావటం ఖాయం" అన్నాడు కిరణ్ అక్షర నోటికి స్వీట్ అందిస్తూ...

"కొన్ని కేసుల్లో చరిత్రాత్మకమైన తీర్పులివ్వాలన్న నా కోరిక తీరటం కన్నా ఇంకేం కావాలి? అమ్మ కన్న కలల్ని నిజం చేశానన్న తృప్తి చాలు... నా జీవితం ధన్యమైందనుకుంటాను" అంది అక్షర.

"ప్రసాద్ పెట్టుకున్న మెర్సీకిల్లింగ్ పిటీషన్ హియరింగ్ రేపే ఉంది. ఈ కేస్‌కీ డాక్టర్ సిద్దార్థ కేస్‌కీ చాలా పోలికలున్నాయి కాబట్టి ఈ కేస్‌లో కూడా విజయం నీదే"

"ముందుగానే అలా అనేస్కుంటే ఎలా? వాళ్ళ తరపు లాయర్ రామనాథం చాలా సీనియర్ లాయర్. డాక్టర్ సిద్ధార్థ కేస్‌ని దీంతో పోల్చడానికి లేదు. ఆ కేస్‌లో ఓ పసివాడి ప్రాణాలు తీయటం ద్వారా హత్యానేరానికి పాల్పడ్డాడు డాక్టర్. ఇక్కడ తన ప్రాణాలు తీసుకోడానికి కోర్టు అనుమతి కోరుతున్నాడు ప్రసాద్"

"మెర్సీకిల్లింగ్ కోసం కోర్టు తలుపు తట్టిన కేసులు చాలా అరుదు కదా. ముఖ్యంగా మన దేశంలో..."

"మన ప్రాణాలు తీసుకోడానికి కూడా కోర్టు అనుమతి తీసుకోవాలని మనలో చాలా మందికి తెలియకపోవటమే దీనిక్కారణం. జీవితం దుర్భరమనిపిస్తే ఆత్మహత్యలు చేసేసుకుంటారు. అంతే. ఐనా ఈ మధ్య కాలంలో మెర్సీ కిల్లింగ్ కోరుతూ వచ్చే

అభ్యర్థనలు ఎక్కువవుతున్నాయి. ఇంజనీరింగ్‌లో పీజీ చదివి గోల్డ్ మెడల్ సంపాదించిన సీమా సూద్ అనే హిమాచల్ ప్రదేశ్ అమ్మాయి కారుణ్య మరణాన్ని కోరుతూ ప్రెసిడెంట్‌కి ఉత్తరం రాసింది. మీర్జా పూర్ లో నివసించే జీత్ నారాయణ్ ప్రభావతీ దంపతులు తమ నలుగురు పిల్లల్ని చంపడానికి అనుమతి కోరుతూ ప్రెసిడెంట్‌కి అర్జీ పెట్టుకున్నారు. నలుగురు పిల్లలూ మస్కులార్ డిస్ట్రోఫీతో బాధపడ్తున్నారట."

"మన దేశంలో రోగపీడితుల్ని ఆదుకునే వ్యవస్థీకృత సంస్థలు లేకపోవడం విషాదం. డబ్బున్నవాళ్ళు కార్పొరేట్ ఆస్పత్రులకెళ్ళగలరు. పేదోళ్ళని పట్టించుకునేదెవరు? మస్కులార్ డిస్ట్రోఫీ లాంటి దీర్ఘ కాలిక రోగాల్తో బాధపడేవాళ్ళకి ప్రభుత్వం నుంచి సరైన చేయూత లభించకపోవటం వల్లే కారుణ్య మరణాల్ని కోరుకుంటున్నారనుకుంటా"

"కారణాలు ఆర్థిక పరమైనవైనా శారీరిక పరమైనవైనా మరణ కాంక్ష సరైంది కాదు. నేను మెర్సీ కిల్లింగ్‌కి బద్ధ వ్యతిరేకిని. టూ యంగ్ టు డై అని అమెరికాలో ఓ సంస్థ ఉంది. కారుణ్య మరణాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంస్థ. నేను కూడా ఆ పంథాలోనే ఓ స్వచ్ఛందసంస్థని ప్రారంభిద్దామనుకుంటున్నా. మన ఆడిటర్ని పిలిపించు. ట్రస్ట్ డీడ్ రాయిద్దాం" అంది అక్షర.

మరునాడు ప్రసాద్ కేస్‌కి సంబంధించిన వాదోపవాదాలు మొదలయ్యాయి.

అక్షర తన వాదనని విన్పిస్తూ "మెర్సీ కిల్లింగ్ అనే పదమే దుష్ట సమాసంలా ఉంది. చంపటమనే చర్య క్రూరమైందైనపుడు అందులో కరుణకు తావెక్కడుంది? ఓ వ్యక్తిని అతని అంగీకారంతో చంపినా అది ఐ.పి.సి. 306 ప్రకారం శిక్షార్హమైన నేరమే" అంది.

లాయర్ రామనాథం లేచి నిలబడి, "యువరానర్. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారు మెర్సీకిల్లింగ్ అనే పదమే అర్థరహితమని పదేపదే ప్రస్తావిస్తున్నారు. నాదో మనవి. దాన్ని మెర్సీకిల్లింగ్ అనే బదులు మెర్సిఫుల్ డెత్‌గా పరిగణించండి. మెర్సీ కిల్లింగ్ అనేది న్యాయసమ్మతం కాకపోతే నెదర్లాండ్స్, అల్బేనియా, బెల్జియం, జర్మనీ, స్విట్జర్లాండ్ లాంటి అనేక దేశాలు మెర్సీకిల్లింగ్‌కి అనుకూలంగా చట్టాలు చేయవు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా చట్టాల్లో కూడా మార్పులు రావాల్సిన అవసరముంది యువరానర్. మనదేశంలో కారుణ్య మరణాల్ని అనుమతిస్తూ చట్టాలు ప్రవేశ పెట్టడంలో ఇప్పటికే ఆలస్యం జరిగింది.

కారుణ్య మరణానికి అనుమతినివ్వడానికి ప్రసాద్ ఎదుర్కొంటున్న దయనీయమైన పరిస్థితిని మించిన కారణం ఉండబోదు. ప్రసాద్ విషయంలో బతకడమే ఓ భయంకరమైన దారుణమైన శిక్ష. అనేక హత్యలు చేసిన ముద్దాయికి కూడా మన శిక్షాస్మృతిలో అంత ఘోరమైన శిక్షలు లేవు. అటువంటప్పుడు ఏ నేరమూ చేయని వ్యక్తిని అంతటి మానసిక శారీరిక హింసకు బలి చేయటం న్యాయమా? ప్రసాద్ కోరికలోని న్యాయాన్యాయాల విచారణతో పాటు మానవతా దృక్పథంతో ఆలోచించి మెర్సీకిల్లింగ్‌కి అనుమతినివ్వవల్సిందిగా కోర్టువారిని కోరుతున్నాను" అన్నాడు.

"గౌరవనీయులైన లాయర్ గారు మెర్సీకిల్లింగ్‌ని అనుమతిస్తున్న దేశాల గురించి చెప్పారు తప్ప దాన్ని వ్యతిరేకిస్తున్న దేశాల గురించి చెప్పటం మర్చిపోయారు. ఈ మధ్య కాలంలోనే పశ్చిమ ఆస్ట్రేలియా, హవాయ్, ఇజ్రాయెల్, ఫ్రాన్స్... ఇలా ఆరు దేశాల్లో మెర్సీకిల్లింగ్ కోసం ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయింది.

ఇండియాలాంటి పేద దేశంలో మెర్సీకిల్లింగ్‌ని అనుమతిస్తూ చట్టాలు చేస్తే చాలా అనర్థాలు జరిగే అవకాశం ఉంది. జబ్బు పడ్డవాళ్ళకు వైద్యం చేయించే స్తోమత లేనివాళ్ళంతా ఆ బరువు బాధ్యతల్ని వదిలించుకోడానికి మెర్సీకిల్లింగ్‌ని ఆశ్రయించొచ్చు. శారీరిక వైకల్యంతో పుట్టినవాళ్ళు, ముసలీ ముతకాలాంటివాళ్ళ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లవచ్చు. ఆస్తుల కోసం ఆర్థికపరమైన ప్రయోజనాలకోసం రోగ పీడితుల్ని ప్రలోభపెట్టి మెర్సీకిల్లింగ్ ఉత్తమమని నమ్మించి వాళ్ళని చావు వైపుకు నెట్టొచ్చు.

అంతెందుకు? ఇందాక లాయర్ రామనాథం గారు నెదర్లాండ్స్‌లో అమలులో ఉన్న మెర్సీకిల్లింగ్ చట్టాల గురించి చెప్పారు. అక్కడ మెర్సీ కిల్లింగ్ ముసుగులో ఎన్ని అక్రమాలు జరిగాయో తెల్సుకున్న ప్రభుత్వమే విస్తుబోయింది. పేషెంట్ అంగీకారంతోనే మెర్సీకిల్లింగ్ అమలు జరపాలన్న స్పష్టమైన నియమాలున్నా 1990 లో 1030 పేషంట్లని వాళ్ళ అనుమతి లేకుండా చంపేశారు. 14175 మందిని వాళ్ళ అంగీకారం తీసుకోకుండా మెడికల్ ట్రీట్‌మెంట్‌ని ఆపేయడం ద్వారా చంపేశారు. 1701 రోగుల్ని అసలు సంప్రదించకుండా వాళ్ళ లైఫ్‌సపోర్ట్‌ని తీసేసి చంపేశారు. అటువంటిది ఇండియాలాంటి పేదదేశంలో అక్షర జ్ఞానం లేని వాళ్ళు కోట్లమంది ఉన్న మన దేశంలో మెర్సీకిల్లింగ్ ప్రవేశపెడితే ప్రణాళికాబద్ధంగా హత్యలు చేసి మెర్సీకిల్లింగ్ చాటున తప్పించుకునే అవకాశం

ఉంది" అంది అక్షర.

లాయర్ రామనాథం తన వాదన విన్పిస్తూ "ఇందాక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారు పేర్కొన్న ఉదాహరణలేవీ ప్రసాద్ విషయంలో వర్తించవు. అతను మస్కులార్ డిస్ట్రోఫీతో బాధపడ్తున్న మాట నిజం. ఈ జబ్బుని నయం చేసే మందులు లేవనీ అది ప్రాణం తీసేవరకు రోజు రోజుకూ పెరిగే జబ్బు తప్ప తగ్గేది కాదని వైద్య శాస్త్రం చెప్తోంది. అతను ప్రస్తుతం చావుకు దగ్గరగా ఉన్నాడు. వెంటిలేటర్ సాయంతో శ్వాస తీసుకుంటున్నాడు. ఆహారాన్ని మింగలేని దుస్థితి వల్ల ద్రవాహారన్ని గొట్టం ద్వారా అందిస్తున్నారు. కండరాలు ఒకటొకటిగా బలహీనపడిపోతూ... లోపలి అవయవాలు వరసగా పాడైపోతూ దుర్భరమైన బతుకీడుస్తున్నాడు. కోర్టువారు కొన్ని కేసుల్లో మరణాన్ని శిక్షగా అమలు చేస్తారు. కానీ ఈ కేస్‌లో బతకటమే ఘోరాతిఘోరమైన శిక్ష యువరానర్. మరణమే వరం. అటువంటి వరాన్ని ప్రసాదించి అతన్ని శారీరిక బాధల్నుంచి విముక్తి ప్రసాదించ వల్సిందిగా కోరుతున్నాను. ప్రసాద్ వాళ్ళమ్మ సరోజ, వాళ్ళ అమ్మమ్మ జయమ్మ కూడా అతనికి కారుణ్య మరణాన్ని ప్రసాదించమని వేడుకుంటున్నారంటే బతుకీడ్చడానికి ప్రసాద్ ఎంతటి నరకాన్ని అనుభవిస్తున్నాడో దాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న సమీప బంధువులు ఎంతటి క్షోభని గుండె కోతని అనుభవిస్తున్నారో కోర్టువారు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అన్నాడు.

జడ్జిగారు కేసుని మరుసటి రోజుకి వాయిదా వేశారు.

ఆ రోజు కూడా వాదోపవాదాలు జరిగాయి.

కేస్ ఫైనల్ హియరింగ్‌కి వచ్చిన రోజు అక్షరని తన వాదన విన్పించవల్సిందిగా కోరారు.

"ఈ సందర్భంగా కర్నాటక హైకోర్టులో కర్రి బసమ్మ వేసిన కేస్‌ని మీ దృష్టికి తీసుకు రావటం అవసరం యువరానర్. ఆమె వయసు డెబ్బయ్... గత పన్నెండేళ్ళుగా ఆమె గౌరవంగాచనిపోయే హక్కుకోసం పోరాడుతోంది. ఆమె స్లిప్ డిస్క్‌తో కాళ్ళ నొప్పుల్తో బాధ పడ్తోంది. సెక్షన్ 306 మరియు 309 రాజ్యాంగ విరుద్ధమనీ ఆర్టికల్ 14 మరియు 21 ని ఈ రెండు సెక్షన్లూ అపహాస్యం చేస్తున్నాయని ఆమె వాదన.

కానీ యువరానర్... స్లిప్ డిస్క్ ఉందనో కీళ్ళ నొప్పులున్నాయనో మెర్సీకిల్లింగ్‌కి

అనుమతించేట్టయితే ప్రపంచంలోని పదిశాతం జనాభా చనిపోవాల్సి వస్తుంది. మనక్కావల్సింది మెర్సీకిల్లింగ్‌ని అనుమతించే చట్టాలు కాదు... వృద్ధుల విషయంలో, రోగ పీడితుల విషయంలో మరింత శ్రద్ధతీసుకునే ప్రభుత్వ నిర్ణయాలు... నొప్పి నివారణకోసం మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవటం... ప్రసాద్ విషయమూ అంతే. అతను భరిస్తున్న బాధ భరించలేనిదనీ దాన్ని నియంత్రించడానికి అవసరమైన మందులు లేవనీ నిర్ధారించాల్సింది డాక్టర్లు కదా... పేషంట్‌కి తెలీని వైద్య పరిజ్ఞానం డాక్టర్లకుంటుంది"

మధ్యలోనే లాయర్ రామనాథం అందుకున్నాడు. "అలాగైతే ఓ వైద్య బృందాన్ని నియమించి వాళ్ళ సలహా మేరకు మెర్సీకిల్లింగ్‌కి అనుమతినివ్వవల్సిందిగా కోర్టువారిని కోరుతున్నాను"

"దురదృష్టవశాత్తు డాక్టర్ల బృందం యిచ్చే అభిప్రాయం నిష్పక్షపాతమైందని చెప్పడానికి అవకాశం లేదు యువరానర్. రకరకాల ప్రలోభాలకు వాళ్ళేమీ అతీతులు కారు. మెర్సీకిల్లింగ్ కి అవసరమైన నియమాల్ని, చట్టాల్ని పకడ్బందీగా లోపరహితంగా అమలు జరిపే యంత్రాంగం మన దేశంలో లేదు. పేదరికం, అవినీతి రాజ్యమేలుతున్న ఈ దేశం మెర్సీకిల్లింగ్‌ని అనుమతించేంత పరిపక్వ స్థితికి యింకా రాలేదు యువరానర్.

మెర్సీకిల్లింగ్ అనేది కేవలం న్యాయపరమైన సమస్య కాదు. దేశంలో ప్రచలితమైన ధర్మ సిద్ధాంతాల ప్రకారం, నైతిక సూత్రాల ప్రకారం, సామాజిక నియమాలకు లోబడి నిర్ణయించాల్సిన విషయం.

ఫలానా జబ్బుకి సరైన మందులేదన్న కారణంతోనో, రోగి అనుభవిస్తున్న బాధని తగ్గించే పరిజ్ఞానం ప్రస్తుతం వైద్యరంగానికి లేదన్న సాకుతోనో మెర్సీకిల్లింగ్‌ని కోరుకోవటం... కోర్టు దాన్ని అనుమతించడం సముచితం కాదు. ఏదో రోజు అలాంటి జబ్బుని నియంత్రించే లేదా నిర్మూలించే మందుని వైద్యరంగం కనుక్కోవచ్చు"

అక్షర వాదనకు అడ్డు తగులుతూ "మస్కులార్ డిస్ట్రోఫీకి మందులేదు. ప్రసాద్ చావుకి చాలా దగ్గరగా ఉన్నాడు... కొన్ని రోజులు మహా ఐతే ఒకట్రెండు నెలలు... ఈ లోపల వైద్య రంగం దానికి మందు కనుక్కుంటుందన్న ఆశ లేదు యువరానర్... అటువంటి ప్రయత్నం వైద్యరంగం చేస్తున్న ధాఖలాలో అందులో విజయం

సాధించబోతున్నదానికి రుజువులో ఉంటే కోర్టువారి దృష్టికి తీసుకు రావాల్సిందిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారిని కోరుతున్నాను" అన్నాడు రామనాధం.

"లాయర్ రామనాధం గారన్నది నిజమే. మస్కులార్ డిస్ట్రోఫీకి ప్రస్తుతం మందు లేదు. అలాగని మస్కులార్ డిస్ట్రోఫీతో బాధపడేవాళ్ళందరూ చావాలని కోరుకోవటం లేదు యువరానర్. ఆ జబ్బుని ధైర్యంగా ఎదుర్కొంటూ అర్థవంతమైన, ప్రయోజనకరమైన జీవితాన్ని గడుపుతున్నవాళ్ళుచాలామంది ఉన్నారు. దానికి చాలా ఉదాహరణలు చూపించగలను.

పి. సుధాకర రెడ్డి అనే వ్యక్తి మస్కులార్ డిస్ట్రోఫీతో సహజీవనం చేస్తున్నాడు. ఇతను సొసైటీ ఫర్ ఈక్వల్ అపర్చునిటీస్ ఫర్ పర్సన్స్ విత్ ఫిజికల్ డిసబిలిటీస్ అనే సంస్థను నడుపుతున్నాడు. 1980 లోనే ఇతను జవహర్‌లాల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ నుంచి ఇంజనీరింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌లో మెరిట్ మీద ఉద్యోగం తెచ్చుకున్నాడు. తన గురించి అతనేమన్నాడో చెప్తాను.

'నేను వేరేవాళ్ళతో పోల్చుకుంటే డిఫరెంట్‌గా అన్పించను. నేను ఆఫీస్‌లో పన్నెండు గంటలు పనిచేస్తాను. తేడా అల్లా రెండు కాళ్ళకు బదులు నేను చక్రాల కుర్చీని వాడతాను.'

నిర్మాణాత్మకంగా, సమాజానికి ప్రయోజనకరంగా బతకడం ద్వారా నేను మస్కులార్ డిస్ట్రోఫీకి తల వంచకుండా బతుకుతున్నానంటాడతను.

మరో సజీవ సాక్ష్యం మీ ఎదురుగానే ఉంది యువరానర్. నేనే...

నాకు పదహారేళ్ళు రాకముందే మూడుసార్లు డాక్టర్లు నా మరణం ఆసన్నమైందని... కొన్ని రోజులు తప్ప బతకనని తేల్చి చెప్పారు. మూడుసార్లూ నేను మృత్యువుని ధిక్కరించాను. నా వయసు నలభై యేళ్ళు... నేనింకా బతికే ఉన్నాను. డాక్టర్ల అభిప్రాయాన్ని నమ్మి నిస్పృహకు లోనై నేను ఆత్మహత్యకు పాల్పడి ఉంటే లేదా మెర్సీకిల్లింగ్ అనుమతిని పొంది చనిపోయి ఉంటే ప్రస్తుతం ఈ కోర్టులో మీ ఎదురుగా అక్షర అనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉండేది కాదు. దట్సాల్ యువరానర్" అంటూ ముగించింది.

కోర్టు తీర్పుని మరునాటికి వాయిదా వేసింది.

***

ఆ రోజు ప్రసాద్ ఆరోగ్యం మరింత విషమించింది. సరోజ డాక్టర్ మూర్తికి ఫోన్ చేసింది. మూర్తి రాగానే పరిస్థితిని ఆకళింపు చేసుకున్నాడు. "మహా ఐతే కొన్ని గంటలమ్మా. అంతే... మనం చేయగలిగింది ఏమీ లేదు" అన్నాడు సరోజతో.

ఆమెకు బాధనిపించలేదు. ఇలాంటి రోజొకటొస్తుందనీ దాన్ని ఎదుర్కోక తప్పదనీ ఆమెకు తెలుసు... ఈ రోజు కోసం ఆమె ఎప్పటినుండో సమాయత్తమైంది. నిజం చెప్పాలంటే ఇలాంటి రోజుకోసం ఎదురుచూసింది. ఎంత ముందుగా వస్తే అంత బావుంటుందని కోరుకుంది. కానీ తన కోరిక తీరలేదు. పది జీవితాలకు సరిపడా బాధనీ, శారీరిక యాతననీ అనుభవించాకే మృత్యువు అతని దరిజేరబోతోంది.

మెర్సీకిల్లింగ్ అనుమతిపొందటం కోసం తను ఓ పోరాటమే చేసింది. కానీ చివరికా పోరులో ఓడిపోయింది.

హైకోర్టు తీర్పు వెలువడి అప్పటికి దాదాపు నెల రోజులు...

తీర్పు తమకు వ్యతిరేకంగా వచ్చిన విషయం ప్రసాద్‌కు చెప్పకూడదనుకుంది. కానీ ప్రసాద్ అంత తెలివితక్కువ వాడేం కాదు. ల్యాప్‌టాప్ అందుబాటులో ఉండటం వల్ల నెట్లోకెళ్ళి ముందే న్యూస్ తెల్సుకున్నాడు.

కోర్టు తీర్పు విని మొహం వేలాడేసుకొచ్చిన తనతో వాడేమీ మాట్లాడలేదు. వాడి మనసులో ఏముందో ల్యాప్‌టాప్‌లో టైప్ చేస్తే బావుండునని సరోజ చాలా సేపటివరకు ఎదురుచూసింది. కానీ ప్రసాద్ నత్తగుల్లలోకి ముడుచుకుపోయినట్లు తనలోకి తను మరింత ముడుచుకు పోయాడు.

అప్పటినుండీ అతని ఆరోగ్యం రోజురోజుకూ వేగంగా క్షీణించసాగింది...

ఆమెకా ఓటమి ఇప్పటికీ మింగుడు పడటం లేదు. అంత సులభంగా ఆ విషయాన్ని వదిలేయాలని లేదు. ఆమె ఈ రోజు కోసమే ఎదురుచూస్తూ కూచుంది. తను అనుకున్నది చేయాలన్న దృఢ నిశ్చయానికొచ్చి "అమ్మా... చిన్న పనుంది. బైటికెళ్ళి వస్తాను. నేనొచ్చేవరకూ ప్రసాద్‌ని జాగ్రత్తగా చూసుకుంటో ఉండు" అంది అమ్మతో.

విషణ్ణ వదనంతో కూచుని ఉన్న జయమ్మ కంగారు పడింది. "అదేంటే... ఇపుడేగా డాక్టర్ చెప్పి పోయాడు... కొన్ని గంటల్లోనే జరిగిపోవచ్చని కదా చెప్పాడు. ఈ సమయంలో బైటికెళ్తానంటావేమిటే... వాడి చివరి క్షణాల్లో నువ్వుండొద్దూ" అంది.

"తొందరగా వచ్చేస్తానమ్మా... వాడు నాకొడుకు... నాకెంత పట్టుదలో వాడికీ తెలుసు. నేననుకున్నది జరిగేవరకు వాడు చావుని దగ్గరకు రానివ్వడు"

"నువ్వేం అంటున్నావో అర్థం కావడం లేదే" అంది జయమ్మ.

సరోజ బైటికెళ్ళేముందు ప్రసాద్ ఉన్న గదిలోకెళ్ళింది. ఎగశ్వాస తీసుకుంటున్నాడు. మరణ యాతన ఎంత భయానకంగా ఉంటుందో కళ్ళెదురుగా పటం కట్టినట్లు...

ఆమె చూళ్ళేక కళ్ళు తిప్పుకుంది. మంచం వైపుకాకుండా గదిలో ఓ మూలలోకి చూస్తూ "మనం కోర్టు కేసు ఓడిపోయాం. కానీ నేను మాత్రం ఓడిపోదల్చుకోలేదురా. ఈ రోజు కోసమే వేచి ఉన్నాను. నేను అనుకున్నది జరిగేవరకు తొందరపడి వెళ్ళిపోకు... నేను వీలైనంత త్వరగా తిరిగొస్తాను" అని చెప్పింది.

ఆ మాటలు ప్రసాద్‌కి విన్పించి ఉంటాయా లేదా అనే విషయం ఆమె ఆలోచించలేదు. వినలేని స్థితిలో ఉన్నాడని తెల్సినా అలా చెప్పాలనిపించి చెప్పింది. దాని వల్ల ప్రయోజనం ఉంటుందో ఉండదో కూడా తెలీదు. కేవలం పిచ్చి నమ్మకం... తాను తిరిగొచ్చేవరకు కొడుకు బతికే ఉంటాడని...

ఆమె బయల్దేరేటప్పటికి సమయం సాయంత్రం ఆరున్నర. ఆమె నేరుగా అక్షర వాళ్ళింటికెళ్ళింది. అరగంట ప్రయాణం...

ఆమె వెళ్ళే సమయానికి అక్షర, కిరణ్ ఓ కేసు విషయమై చర్చించుకుంటున్నారు.

సరోజని చూడగానే అక్షర వెంటనే గుర్తుపట్టింది. కోర్టు తీర్పు వెలువడి నెల రోజులే కావటం వల్లా ఆ కేస్ చాలా అరుదైంది కావటం వల్లా ఆమెకు సరోజ బాగా గుర్తుండిపోయింది.

జడ్జిగారి తీర్పు వినగానే సరోజలో లావాలా పొంగిన దుఃఖం చూసి అప్పుడే భయమేసింది అక్షరకు... కోర్టు హాల్లోనే తనని పట్టుకుని చెడామడా తిడ్తుందేమోనన్న భయం... అటువంటి సంఘటనలు కోర్టు ప్రాంగణంలో అరుదేమీ కాదు.

తన భయాన్ని మెల్లగా కిరణ్ చెవిలో వూదింది. 'డోంట్ వర్రీ... నేనున్నానుగా' అన్నట్టు సైగ చేశాడతను.

కానీ తను భయపడినట్లు ఏమీ జరగలేదు. ఎటొచ్చీ కోర్టు హాలునుంచి బైటికి

పోయేటపుడు సరోజ చూసిన చూపు మాత్రం శరాఘాతంలా గుచ్చుకుంది... ఆ కళ్ళలో కోపం... ఆ కళ్ళలో దుఃఖం... ఆ కళ్ళలో కసి... ఆ చూపు ఎంత తీక్షణంగా ఉండిందంటే ఇపుడు తమ ఆఫీస్ గదిలో సరోజని చూడంగానే ఆ గాయం ఈ క్షణమే ఐనంత తీవ్రంగా...

ఇన్ని రోజుల తర్వాత తన ఆఫీస్‌ని వెతుక్కుంటూ ఆమె ఎందుకొచ్చిందో అక్షరకు అర్థం కాలేదు. ఆమె వేగంగా ఆలోచిస్తోంది. బహుశా ప్రసాద్ చనిపోయి ఉంటాడు. ఆ కోపంలో వచ్చి ఉంటుంది. ఇపుడు తప్పకుండా తనని తిట్టడం ఖాయం... తిడ్తుందా... తిట్లతో ఆపకుండా ఆవేశంతో కొడ్తుందేమో...

ఏం చేద్దాం అన్నట్లు కిరణ్ వైపు చూసింది. 'నువ్వుండు... నేను కనుక్కుంటాను' అన్నట్లు ప్రతి సైగచేశాడు కిరణ్.

అప్పటివరకూ వాళ్ళెదురుగా నిలబడి ఉన్న సరోజ "మీ ఆఫీస్‌కి వచ్చిన క్లయింట్లని కూచోమని చెప్పే కనీస మర్యాద కూడా పాటించరా" అంది. మళ్ళా తనే "ఓ... నేను ప్రత్యర్థి వర్గం నుంచి వచ్చాననా కనీసం చిర్నవ్వుతో కూడా ఆహ్వానించలేదు" అంది.

అక్షర ఆమె మొహం వైపు నిశితంగా చూసింది. ఎక్కడా కోపఛాయలు కన్పించలేదు. దిగులుకు ప్రతిరూపంలా మాత్రముంది. కళ్ళల్లో దట్టంగా పేరుకున్న దుఃఖం కన్పిస్తోంది. అంతే...

"కూచోండి. మీరు ప్రసాద్ వాళ్ళమ్మ కదూ. మా అక్షర వాదించిన మెర్సీకిల్లింగ్ కేస్‌లో ప్రసాదేగా... నేను పొరబడలేదుగా" అన్నాడు కిరణ్.

"మీరు సరిగ్గానే గుర్తు పట్టారు. నాపేరు సరోజ" అందామె వాళ్ళెదురుగా ఉన్న కుర్చీలో కూచుంటూ...

"చెప్పండి. ఏంపనిమీద వచ్చారో" అన్నాడు కిరణ్.

అప్పటికీ అక్షర మనసులో రకరకాల అనుమానాలు పడగలు విప్పి బుసకొడ్తూనే ఉన్నాయి.

"నేను మీ సాయం కోరి వచ్చాను" సరోజ అక్షరవైపు చూస్తూ అంది.

"ఓ... మీరిపుడు మా క్లయింట్‌గా వచ్చారన్మాట. కంప్లెయింట్ చేయడానికొచ్చారని భయపడ్డాం" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

“నాకు కోర్టులో న్యాయం జరగలేదు. ఆ విషయం మీకూ తెలుసు” అంది సరోజ.

అక్షర వెంటనే స్పందిస్తూ “పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నా డ్యూటీ నేను చేశాను. మీ లాయర్ తన శక్తికొద్దీ మీ తరఫున వాదించాడు. అంతే. తీర్పు చెప్పే బాధ్యత మాత్రం జడ్జిగారిదే. అందులో మా ప్రమేయం లేదు. మీకు న్యాయం జరగలేదని అనుకుంటే పైకోర్టుకి అప్పీలు చేసుకోవాల్సింది. ఆ విషయంలో మేమేం సాయం చేయలేం” అంది.

“నేనిపుడు ఆశించి వచ్చింది కోర్టువాళ్ళిచ్చే తీర్పు గురించి కాదు. అది న్యాయశాస్త్రాల ప్రకారం ఇచ్చే తీర్పు... నాకిపుడు కావల్సింది మానవత్వధర్మాల ప్రకారం ఇచ్చే తీర్పు”

“మీకేం కావాలో అర్థమయ్యేలా చెప్పండి. అది మేం చేయగల సాయమైతే తప్పకుండా చేస్తాం” అంది అక్షర.

“మీరు చేయగల సాయమే... చాలా చిన్న సాయం... నా కొడుకు చావుకి దగ్గరగా ఉన్నాడు. కొన్ని గంటలకు మించి బతకడని డాక్టర్ గారు చెప్పారు. వాడి చివరి కోరిక తీర్చమని మిమ్మల్ని రిక్వెస్ట్ చేయడానికొచ్చాను”

“ఏమిటా చివరి కోరిక?” కిరణ్ అడిగాడు.

“మీరిద్దరూ మా యింటికి రండి. వాడి చివరిక్షణాల్లో మీరు వాడిదగ్గరగా ఉండాలనేదే వాడి కోరిక. అంతే”

ఆమె కోరిన కోరిక అక్షరకు చాలా వింతగా అన్పించింది. దానివల్ల వాళ్ళకేమిటి లాభం? ఏం ఆశించి అటువంటి కోరిక కోరుతోంది?

కిరణ్ వైపు ఏం చేద్దాం అన్నట్లు చూసింది.

“మమ్మల్ని కొద్దిగా ఆలోచించుకోనివ్వండి. మీ ఫోన్ నంబర్, అడ్రస్ రాసిచ్చి వెళ్ళండి. మేము ఏ 233విషయం ఫోన్ ద్వారా తెలియచేస్తాం” అన్నాడు కిరణ్.

“అంత సమయం ఎక్కడుంది? అసలు నేను తిరిగి వెళ్ళేలోపలే వాడు చనిపోవచ్చు. మీరు ఎక్కువ సమయం ఉండాల్సిన అవసరం రాదు. వాడు బతికినా ఒకట్రెండు గంటలు మించి బతకడు. ప్లీజ్ కాదనకండి. వచ్చి వాడి దగ్గర కూచోటమే మీరు చేయాల్సింది... అంతే”

కిరణ్‌కి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. అక్షరకైతే ఆమె కోరికే అర్థ రహితంగా అన్పించింది. ఇందులో ఏమైనా ప్లాన్ దాగి ఉందా అని ఆలోచిస్తోందామె.

“సరే. కొద్దిసేపు బయట వెయిట్ చేయగలరా? మా నిర్ణయమేంటో చెప్తాం” అన్నాడు కిరణ్.

“థ్యాంక్స్... నేను వెయిట్ చేస్తాను. మీరు తప్పకుండా వస్తారనే ఆశిస్తున్నాను. చనిపోతున్న వ్యక్తి చివరికోరిక తీర్చటం ఎంత ముఖ్యమో లాయర్లయిన మీకు చెప్పనక్కరలేదు.” సరోజ బైటికెళ్ళి అక్కడున్న ప్లాస్టిక్ కుర్చీల్లో ఒకదాన్లో కూచుంది.

కిరణ్ ఆమె వెనకే వెళ్ళి తలుపు మూసి వచ్చి “ఏం చేద్దాం?” అన్నాడు అక్షరతో.

“నాకో అనుమానం. ఆమె అడుగుతోంది కొడుకు చివరికోరిక కాదనుకుంటా. అది ఆమె కోరికే” అంది అక్షర.

“ఇపుడు కోరిక ఎవరిదనేది కాదు ముఖ్యం. మనం ఏం చేయాలనేదే ఆలోచించు”

“ఇందులో ఏమైనా కుట్ర దాగి ఉందంటావా కిరణ్?”

కిరణ్ ఆమె వైపు నవ్వుతూ చూశాడు. “నీకు విజయాలు ఎక్కువయ్యేకొద్దీ ఇలాంటి అనుమానాలు కూడా ఎక్కువగానే వస్తున్నాయి”

“మన వృత్తిలో ఉన్న ప్రమాదమే అది కదా కిరణ్. మన ఖాతాలో సక్సెస్‌లు నమోదయ్యే కొద్దీ అదే నిష్పత్తిలో శత్రువులు కూడా పెరుగుతుంటారు. మన జాగ్రత్తలో మనం ఉండాలిగా”

“ఇక్కడటువంటి ప్రమాదమేమీ కన్పించడం లేదు అక్షరా. ఆమె అడుగుతున్నదాంట్లో నిజాయితీ కన్పిస్తోంది. నా ఉద్దేశంలో అక్కడికి వెళ్ళటం వల్ల మనకొచ్చే ప్రమాదం కానీ నష్టం కానీ నాకేమీ కన్పించటం లేదు”

“అసలెందుకు వెళ్ళాలి? మనకూ ఆమె కుటుంబానికి ఏమిటీ సంబంధం? పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎన్నో కేసులు వాదించాను. వాటిలో మనకే రకమైన పర్సనల్ ఇంట్రస్ట్ ఉండదు. ఈ కేసుని మనం ప్రత్యేకంగా ఎందుకు భావించాలి? ఆమె కోరికని మన్నించాల్సిన అవసరం మనకు లేదు కిరణ్”

“ఉంది. ఆమె అడిగిన కోరిక చాలా చిన్నకోరిక... గంటలోనో రెండు గంటల్లోనో

చావబోతున్న వ్యక్తి సమక్షంలో కూచోవటం... అంతేగా. చనిపోయేవ్యక్తి చివరికోరిక తీర్చటం మన కనీస ధర్మం. వెళ్ళి రావటమే మంచిది"

"సరే కిరణ్. నువ్వు చెప్తున్నావు కాబట్టి రావడానికొప్పుకుంటున్నా. అతను చనిపోయే వరకూ ఉండాలంటే కుదర్దు. గంటకు మించి క్షణంకూడా ఉండను. సరేనా... ఇపుడు టైం ఏడున్నర. మనం వెళ్ళడానికి అరగంట వేసుకున్నా కరెక్ట్ తొమ్మిదింటికి బైటికొచ్చేద్దాం."

"ఓకే... సరోజగార్ని లోపలికి పిలవనా?"

"పిలువ్... నువ్వెళ్ళి అమ్మకు చెప్పిరా... డిన్నర్‌కి లేటవుతుందని"

కిరణ్ తలుపు తీసి, సరోజని లోపలికెళ్ళి కూచోమని చెప్పాడు. యింట్లోకెళ్ళి అత్తగారితో 'డిన్నర్ తొమ్మిది తర్వాత తింటామనీ పనిమీద బైటికెళ్తున్నామని' చెప్పి వచ్చాడు.

అతను తిరిగొచ్చే సమయానికి "చాలా థ్యాంక్స్... నా కోరిక మన్నించి యింటికి వస్తున్నందుకు" అంటోంది సరోజ.

"ముందే చెప్తున్నా... మీ అబ్బాయి కేసులో నేను వాదించిన విషయాల మీద చర్చగానీ ఆ విషయంలో నా అభిప్రాయాల్ని విమర్శించడం గానీ చేయకూడదు" అంది అక్షర.

"అటువంటి ప్రసక్తే రాదు"

"మెర్సీకిల్లింగ్‌కి నేను బద్ధ వ్యతిరేకిని. మీ యింటికొచ్చాక మెర్సీకిల్లింగ్ మీద నా అభిప్రాయం మార్చుకోమని వత్తిడి చేయకూడదు"

"అసలు మెర్సీకిల్లింగ్ గురించి ఎవ్వరూ మాట్లాడరని హామీ ఇస్తున్నాను. అసలు మీతో ఎవ్వరూ ఏమీ మాట్లాడరు. మీరూ ఏమీ మాట్లాడనవసరం లేదు. వాడి గదిలో కొన్ని గంటలు గడిపితే చాలు"

"సరే పదండి... కిరణ్ వెళ్దామా" అంది అక్షర.

సరోజా వాళ్ళు యింటికెళ్ళేప్పటికే జయమ్మ చాలా కంగారుగా ఎదురుచూస్తోంది.

"వచ్చావా... నువ్వొచ్చేలోపలే వాడికేమైనా అవుతుందని భయపడి చచ్చానే. వీళ్ళ కోసమేనా అంత హడావిడిగా పరుగెత్తావు? యింతకీ ఎవరు వీళ్ళు? డాక్టర్లా..." అని అడిగింది జయమ్మ.

ప్రసాద్ కేస్‌లో ప్రభుత్వం తరఫున వాదించిన లాయర్ అని పరిచయం చేస్తుందేమోనని అనుకుంది అక్షర.

"ఈ దంపతులిద్దరూ మన ప్రసాద్‌కి బాగా కావాల్సిన వాళ్ళమ్మా. తన చివరి క్షణాల్లో వీళ్ళిద్దరూ తన దగ్గరే ఉండాలనేది వాడి చివరికోరిక. అందుకే వీళ్ళింటికి వెళ్ళి పిల్చుకొచ్చాను" అంది సరోజ.

"అలానా... ఐతే త్వరగా లోపలికి పిల్చుకెళ్ళవే. వాడి పరిస్థితి చూస్తే ఏ నిముషంలోనైనా వాడి ప్రాణం పోయేలా ఉంది" ఆమె గుడ్లనీరు కుక్కుకుంటూ అంది.

ప్రసాద్ మంచానికి పక్కన రెండు కుర్చీలు వేసి వాళ్ళిద్దర్నీ కూచోబెట్టింది సరోజ. ఆమె బైటికి వెళ్ళబోతుంటే "మీరూ కూచోండి" అంది అక్షర.

ఆమె మొహంలో ఒక్కసారిగా ఉప్పెనలా దుఃఖం పొంగుకు రావడం అక్షర గమనించింది.

"కొడుకు క్షణక్షణం నరకయాతనపడ్తూ మరణానికి దగ్గరవుతున్న దృశ్యాన్ని చూసి తట్టుకునే శక్తి ప్రపంచంలో ఏ తల్లికీ ఉండదమ్మా. ఆడదాని హృదయం అంత కఠినంగా ఇంకా మారలేదు" అంటూ సరోజ బైటికెళ్ళిపోయింది.

నేలమీద గోడకానుకుని కూచుని ఏడుస్తున్న జయమ్మ ఒడిలో తలపెట్టుకుని పడుకుని కరువు తీరా ఏడ్చింది... ఏడుస్తూనే ఉంది... ఎప్పటికీ అంతం కాని ఏడుపది...

లోపల గదిలో... వెంటీలేటర్లోంచి ఆక్సిజన్ పొంగుతున్న శబ్దం... పైన ఫ్యాన్ తిరుగుతున్న శబ్దం... మరణయాతన పడ్తున్న ప్రసాద్ గొంతులోంచి వస్తున్న వింత వింత శబ్దాలు... భయంగొలిపేలా... ఆ గదిలో ఎటు చూసినా చావు ముంచుకొస్తున్న దానికి గుర్తుగా విన్పిస్తున్న గజ్జెల శబ్దం... చావు చేస్తున్న చివరి రాక్షస నృత్యం... మరణవాసన... కమ్ముకొస్తున్న కమురు వాసన... అక్షర ప్రసాద్‌నే చూస్తూ కూచుంది.

ఆమె ఇప్పటివరకూ చావుని ఇంత సమీపంగా చూళ్ళేదు. చనిపోతున్న వ్యక్తిని గమనిస్తూ ఆ గదిలో కూచోవాల్సి రావడం ఆమెకు కొత్తగా... కాసింత భయంగా అన్పించింది.

ప్రసాద్ మొహంలో అంతులేని పీడన కన్పిస్తోంది. అతని గుండెలు ఎగిరెగిరి

పడ్తున్నాయి. ప్రాణం పోవటం ఇంత బాధాకరంగా ఉంటుందా? దేహాన్ని ప్రాణం వదిలిపోవడానికి ఇంత ఘర్షణ జరగాలా... దేహం ఇంత హింస పడాలా?

సమయం చాలా మెల్లగా నడుస్తున్నట్లు... క్షణాలు గంటలుగా మారిపోయి... సెకండ్ల ముల్లు ఓ అంకెనుంచి మరో అంకెకు మారడానికి మరణయాతన పడ్తున్నట్లు... కాళ్ళూ చేతులూ తెగిపడిపోయి పాక్కుంటూ ఒక్కో క్షణాన్ని చేరుకుంటున్నట్లు...

ప్రసాద్ గొంతులోంచి ఏదో గురకలాంటి శబ్దం వస్తోంది. భయం గొలిపేలా ఉందా శబ్దం... చీకటి గదిలో ఒంటరిగా కూచుని భయంకరమైన హారర్ సినిమా చూస్తున్నపుడు కలిగే జలదరింపు వెన్ను నిండా పాకుతూ...

పది నిముషాలు గడిచాయి... భారంగా...

అక్షర తన చక్రాల కుర్చీలో అసహనంగా కదిలింది.

కిరణ్ వైపు చూసింది. అతని పరిస్థితీ అలానే ఉంది.

“కిరణ్... నేనిక చూళ్ళేను. వెళ్ళిపోదాం” అంది.

అతను తన చేతికున్న వాచి వైపు చూసుకుని చెప్పాడు. “మనం వచ్చి పది నిముషాలు కూడా కాలేదు. గంట సేపు ఉందామన్నావుగా... గంట కావడానికి ఇంకా చాలా టైం ఉంది”

“పది నిముషాలేనా... ఇంకా యాభై నిముషాలు కూచోవాలా... నావల్ల కాదు”

“తప్పదు అక్షరా... మనం సరోజగారికి మాటిచ్చాం”

అక్షర ప్రసాద్ వైపు చూడటం మానేసి సీలింగ్ వైపూ గది మూలల వైపూ చూడసాగింది.

కానీ ఆ శబ్దాలు... చావు వేస్తున్న అడుగుల చప్పుడు... చావు డప్పు శబ్దంలా... మరీ బాధాకరమైన చావు... అందుకే ఆ శబ్దాలు మరీ భయంకరంగా... శరీరంలోని ఒక్కో అవయవం చచ్చిపోతున్నపుడు కలిగే మరణబాధ.. ప్రాణం జీవిని వదిలి వెళ్ళటానికి మొరాయిస్తున్న క్షణాలు... శరీరం ప్రాణాన్ని బలవంతంగా బైటికి నెట్టడానికి చేస్తున్న ప్రయత్నంలో పడ్తున్న తీవ్ర వేదన... అనంత క్షోభ... కళ్ళు మూసుకున్నా ప్రసాద్ మరణ వేదన స్పష్టంగా కన్పిస్తూ...

వద్దనుకుంటూనే అక్షర చూపు ప్రసాద్ శరీరం వైపుకు ప్రసరించడం... భూకంపం వచ్చినట్లు అతని శరీరం కుదుపుకి లోనయినపుడల్లా భయంతో వళ్ళు జలదరించడం జరుగుతోంది.

"కిరణ్... చావు ఇంత బాధాకరంగా భయానకంగా ఉంటుందా?" అని అడిగింది. ఆ ప్రశ్న సమాధానాన్ని ఆశించి కాకుండా అక్కడి వాతావరణాన్ని భరించలేక ఏదో ఒకటి మాట్లాడాలనే ఉద్దేశంతో అడిగింది.

"నేనూ ఇపుడే చూస్తున్నా అక్షరా... మా నాన్న మరణం వల్ల సంపాదించే వ్యక్తి హఠాత్తుగా చనిపోతే మిగిలిన కుటుంబం ఎంతటి క్షోభని అనుభవిస్తుందో ప్రత్యక్షంగా తెల్సుకున్నాను. అంతే తప్ప చావుని ఇంత దగ్గరగా చూడటం నాకూ కొత్త"

"నేనింక ఉండలేను కిరణ్. అతను పడ్తున్న బాధని చూళ్ళేకుండా ఉన్నాను. వెళ్ళిపోదాం"

కిరణ్ మరోసారి తన వాచీ వైపు చూసుకున్నాడు.

"మరో ఆరు నిముషాలు గడిచాయి. అంటే మొత్తం పదహారు నిముషాలు"

"అయ్యో... అంతేనా... తొందరగా ప్రాణం పోతే ఎంత బావుంటుంది... పాపం చూడు ఎంతటి యాతన పడ్తున్నాడో.."

"నేనూ భరించలేకుండా ఉన్నాను అక్షరా... నీ వల్ల తీర్పు వాళ్ళకు వ్యతిరేకంగా వచ్చిందన్న కక్షతో సరోజగారు మనిద్దరికీ విధించిన శిక్షలా ఉంది. వస్తామని మాటిచ్చి ఎంత పెద్ద తప్పుచేశానో నాకిప్పుడర్థమౌతోంది"

"ఎవరేమైనా అనుకోనీ... మనం వెళ్ళిపోదాం ప్లీజ్" అంది అక్షర.

"అతని కండిషన్ చూస్తే మరికొన్ని నిముషాల్లో తుదిశ్వాస విడిచేలా ఉన్నాడు. అతని చివరికోరిక తీర్చడం కోసమైనా మరికొద్దిసేపు భరిద్దాం"

అక్షర నిస్పృహగా మంచం వైపుకు చూసింది. చనిపోబోతున్నాడా... కొన్ని నిముషాల్లోనా... ఔను... గుండె కొట్టుకుంటున్నట్లు లేదు. కుదుపులు ఇంతకు ముందులా వెంటవెంటనే రావటం లేదు. ఆగి ఆగి వస్తున్నాయి. కొద్దిసేపు అలా వచ్చి శాశ్వతంగా ఆగిపోతాయేమో...

అతని నోట్లోంచి నురగ వస్తోంది... ఆ నురగ తెల్లగా లేదు. ఎర్రగా ఉంది... నోట్లోంచి గాలి పోతున్నట్లు బుడగలు... ఎర్రటి బుడగలు... చిన్నగా పెద్దగా మరీ పెద్దగా మారి చిన్న శబ్దంతో పేలి పోతున్న బుడగలు... ప్రాణం ఆ బుడగల రూపంలో పోతోందా...

"కిరణ్.. ఇంక ఉండటం నావల్ల కాదు. ప్లీజ్ వెళ్ళిపోదాం పద" భయంతో కళ్ళు పెద్దవి చేసి ప్రసాద్ శరీరం పైనుంచి చూపు మరల్చకుండానే చెప్పింది.

"ఇరవై ఆరు నిముషాలైంది. మరికొద్దిసేపు..."

"నో" పెద్దగా అరిచింది. "ఇంకొద్దిసేపు ఇక్కడే ఉంటే జీవితాంతం ఈ చేదు అనుభవం పీడకలలా నన్ను వెంటాడటం ఖాయం. ఇంత వేదనా భరితమైన మరణం పగవాళ్ళకు కూడా వద్దు కిరణ్... అందుకే నేను చాలాసార్లు చెప్పాను. దేవుడనేవాడు లేడు. ఉంటే ఇంత క్రూరంగా నిర్దయగా భయంకరంగా మనుషుల ప్రాణాలు తీయడు. ఓ వేళ నిజంగా ఉన్నా అతని కన్నా పెద్ద శాడిస్ట్ ఈ ప్రపంచంలో ఉండడు"

"అనాయాస మరణాన్ని యోగమని ఎందుకన్నారో ఇప్పుడు నాకర్థమౌతోంది"

"మొదట మనం వెళ్ళిపోదాం పద. ఇంకొద్దిసేపుంటే నేను పిచ్చిదాన్ని కావటం ఖాయం"

"సరే పద" కిరణ్ లేచి ఆమె చక్రాల కుర్చీని నెట్టుకుంటూ బైటికొచ్చాడు.

అమ్మ ఒడిలో తలదూర్చి ఏడుస్తున్న సరోజ వాళ్ళని చూసి లేచి కూచుంది. ఆమె శోకదేవతలా ఉంది. అలా ఏడ్చి ఏడ్చి తనుకూడా ఓ కన్నీటి బొట్టులా మారిపోయి నేలకు జారిపోయేలా ఉంది. "అంతా ఐపోయిందా బాబూ" అని కిరణ్‌ని అడిగింది.

సమాధానం చెప్పడానికి చాలా ఇబ్బంది పడ్డాడతను. మాటల్ని కూడబలుక్కుంటూ "లేదు... మేమే... ఉండలేక వెళ్ళిపోతున్నాం. క్షమించండి. మీకిచ్చిన మాటని నిలబెట్టుకోలేకపోయాం" అన్నాడు చేతులు జోడిస్తూ.

ఆమె కొద్దిసేపు మౌనంగా నిలబడింది. గొంతులో ఉండలా అడ్డుపడ్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ "ఇంకా ఎంతసేపు బాధని ఆ శరీరం అనుభవించాలని రాసి పెట్టి ఉందో... చావుని తొందరగా ప్రసాదించమని ఆ దేవుణ్ణి వేడుకోవటం తప్ప ఏం చేయలను" అంది.

వాళ్ళతో పాటు గేటు దాకా తోడెళ్ళింది. వాళ్ళు వీడ్కోలు తీసుకుంటున్నపుడు "మీరు నా మాటని మన్నించి వచ్చినందుకూ అరగంటైనా వాడి మరణయాతనని చూసినందుకు మరోసారి థ్యాంక్స్. చివరగా ఒకే ఒక మాట చెప్పాలనుకుంటున్నా. ముఖ్యంగా అక్షర గారితో... ఏ అనుబంధం ఏ రకమైన బాంధవ్యంలేని మీకే వాడి మరణయాతన చూడటం కష్టంగా అన్పించి అరగంటకు మించి చూళ్ళేకపోయారే... మరి తల్లిగా వాడు రోజు రోజుకూ మరణానికి చేరువవుతూ పడిన నరకయాతనని నేనెలా తట్టుకుని చూడగలిగాననుకున్నారూ... ఎంత గుండె కోత... రంపంతో కడుపుని కోస్తున్నట్లు... గర్భ శోకం... అది ఎంత పెద్ద శిక్షో మీకర్థమయితే చాలు" అంటూ చేతులు జోడించి నమస్కరించింది.

అక్షర ఇంటికొచ్చిందన్న మాటేగాని ఆమె మనసంతా పచ్చిపుండులా మారిపోయింది. ఇంతటి అలజడిని ఆమె గతంలో ఎన్నడూ అనుభవించి ఎరుగదు.

అన్నం సయించలేదు. అమ్మ బతిమాలినా కిరణ్ సముదాయించినా ఆమెకు ఒక్క మెతుక్కూడా మింగుడు పళ్ళేదు.

ఆ రాత్రి చాలా సేపటివరకు ఆమెకు నిద్ర పట్టలేదు. ఆలోచనలు... వేటకుక్కల్లా తరుముతూ... భయానకమైన ఆలోచనలు..

మెర్సీకిల్లింగ్‌కి వ్యతిరేకంగా వాదించి తప్పు చేశానా అన్న అపరాధభావం ఆమెకు మనశ్శాంతి లేకుండా చేసింది... ఆ రోజే కాదు... ఆ తర్వాత చాలా రోజుల వరకు...

***

అక్షర వెళ్ళిపోయిన రెండు గంటల తర్వాత ప్రసాద్ చనిపోయాడు...

అతని వేదనాభరితమైన మరణం... తన కొడుక్కి కారుణ్యమరణం ప్రసాదించమని కోరుతూ సరోజ చేసిన న్యాయపోరాటం వృథా పోలేదు. ప్రసాద్ చనిపోయిన కొన్నేళ్ళకు అరుణా శాన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు పరోక్ష కారుణ్యమరణాలకు అనుకూలంగా సంచలనాత్మకమైన తీర్పునిచ్చింది.

***

"మరణ కాంక్ష" నవల సీరియల్‌గా వెలువడుతున్నప్పుడు "మెర్సీకిల్లింగ్" మీద పలువురు ప్రముఖులు వెలిబుచ్చిన అభిప్రాయాలు:

రోగికి భరించలేని బాధ ఉన్నప్పుడు, డాక్టర్లు ఏమీ చేయలేని పరిస్థితుల్లో మెర్సీకిల్లింగ్‌ని అనుమతించాలి. ప్రభుత్వం సమ్మతించదనో, కోర్టులు అనుమతించవనో ఓ వ్యక్తిని బలవంతంగా, అతని ఇష్టానికి వ్యతిరేకంగా బతకమనే అధికారం ఎవ్వరికీ లేదు. చనిపోవాలనుకున్నప్పుడు చనిపోవటం అతని ప్రాథమిక హక్కు. లేని పక్షంలో మెర్సీకిల్లింగ్‌కి అనుమతి ఇవ్వని ప్రభుత్వం అటువంటి రోగుల పూర్తి బాధ్యతని స్వీకరించగలగాలి. వైద్యం, భోజనవసతులకవసరమయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలి. అప్పుడా రోగిని సహజ మరణం ఆసన్నమయ్యేవరకు బతకమనే అధికారం ప్రభుత్వానికుంటుంది. కానీ మన ప్రభుత్వం అలాంటి బాధ్యతల్ని నెత్తిన వేసుకోదు. అటువంటప్పుడు మెర్సీకిల్లింగ్‌ని తిరస్కరించే అధికారం ప్రభుత్వానికి కాని, కోర్టులకు కాని లేదు.

- **మాలతీ చందూర్,** ప్రముఖ రచయిత్రి

***

అన్ని మతాలవాళ్ళు భగవంతుణ్ణి నమ్ముతారు. చెట్టుకి కాసిన పండు పక్వానికొచ్చి ఎలా రాలుతుందో అలా భగవంతుడిచ్చిన జీవితం అంతం కావాలి. శరీరం రోగగ్రస్థమై భరించలేని బాధగా ఉన్నా, డాక్టర్లు ఏమీ చేయలేమని చేతులెత్తేసినా బతక్క తప్పదు. పాప కర్మఫలం ఈ జీవితంలోనే పూర్తిగా అనుభవించాలి. అలా కాకుండా మధ్యలోనే ఆత్మహత్య చేసుకుని చనిపోతే మరో జన్మ ఎత్తి ఆ కష్టాలన్నీ పడక తప్పదు. కాబట్టి మెర్సీకిల్లింగ్ అనేది సమర్థనీయం కాదు.

- **పరుచూరి గోపాలకృష్ణ,** ప్రముఖ సినిమా రచయిత

***

మృత్యువు దేవ రహస్యం. ఎవరు ఎప్పుడు చచ్చిపోవాలో ప్రకృతి నిర్ణయిస్తుంది. కానీ మహాభారతంలో భీష్ముడికి మాత్రమే మృత్యువు తాలూకు తాళం చెవి చేతికి దొరికింది. మళ్ళీ అలాంటి శక్తి మానవ చరిత్రలో లేదు. ప్రకృతి సంకల్పానికి విరుద్ధంగా మనిషి ఎన్నో చేస్తున్నాడు. మెర్సీకిల్లింగ్ ప్రకృతికి అనుగుణంగా ఉంటే చేయక తప్పదు. ప్రకృతి అంటే ఇక్కడ మానవ ప్రకృతి. మనిషి ప్రాణం ఎప్పుడూ ఆనందాన్ని కోరుకుంటుంది. ఆనందం ఇక లభించదని నిర్ధారిస్తే దానికి బదులు శాశ్వత దుఃఖము లభిస్తుందని రుజువైతే అప్పుడు మరణం అనివార్యం చేయాలి. అప్పుడు మెర్సీకిల్లింగ్‌కి అంగీకరించవచ్చు. ఈ విచక్షణ లేకుండా మెర్సీకిల్లింగ్‌ని అనుమతిస్తే ప్రాకృతిక, సాంఘిక న్యాయాలు దెబ్బతింటాయి.

– **రాళ్ళబండి కవితా ప్రసాద్,** సాంస్కృతిక శాఖ సంచాలకులు

***

మెర్సీకిల్లింగ్ ప్రపంచంలో కేవలం మూడు దేశాల్లోనే అమల్లో ఉంది. అభివృద్ధి చెందిన అమెరికాలాంటి దేశాలు కూడా మెర్సీకిల్లింగ్‌ని అనుమతించకపోవడానికి కారణం దాన్ని తమ స్వార్థప్రయోజనాలకు వాడుకోకుండా నిరోధించే సరైన యంత్రాంగం లేకపోవడమే. మన దేశంలో మెర్సీకిల్లింగ్‌ని ప్రతిభావంతంగా పటిష్ఠంగా అమలుపర్చడానికి అవసరమైన చట్టాలుకాని, మెడికల్ ఏజన్సీలు కాని, ప్రభుత్వ యంత్రాంగం కానీ లేదు. మనం మెర్సీకిల్లింగ్‌ని పకడ్బందీగా అమలు చేయాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. దానికి సానుకూలమైన పరిస్థితులు ఏర్పడాలంటే చాలాకాలం వేచి ఉండకతప్పదు. నియంత్రణ వ్యవస్థ సరిగ్గా పని చేయకపోతే మెర్సీకిల్లింగ్ misuse లేదా abuse అయ్యే ప్రమాదమే ఎక్కువ.

- **డా. సోమరాజు,** ప్రముఖ హృద్రోగ నిపుణులు

***

మెర్సీకిల్లింగ్ సమర్థనీయమే. ఎందుకంటే ఆధునిక వైద్య సదుపాయాల వల్ల బ్రెయిన్ డెడ్ కేసులు చాలా వస్తున్నాయి. ఆధునిక వైద్యం సమాధానం చెప్పలేని పరిస్థితులు ఎదురైనప్పుడు మెర్సీకిల్లింగ్‌ని అనుమతించడంలో తప్పులేదు. బ్రెయిన్ డెడ్,

పెరాప్లెజిక్ రోగుల్ని వాళ్ళు బతికున్నంతకాలం భరించాలంటే ఆ కుటుంబం సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉండాలి. లేకపోతే ఆ కుటుంబం మొత్తం చితికిపోయే ప్రమాదముంది. క్యాన్సర్ పేషంట్ల విషయంలోనూ ఇదే పరిస్థితి. మెర్సీకిల్లింగ్‌ని అనుమతిస్తే అది మిస్యూజ్ అవుతుందన్న వాదన సరైంది కాదు. దానికోసం పటిష్ఠమైన నియంత్రణా వ్యవస్థని ఏర్పాటు చేయవచ్చు, దురుపయోగపరిచే అవకాశముందని ఏమాత్రం అనుమానమొచ్చినా అటువంటి కేసుల్లో అనుమతిని నిరాకరించొచ్చు. ఆర్గాన్ డొనేషన్ మరియు ట్రాన్స్‌ప్లాంటేషన్ విషయంలో మనం ఇటువంటి పద్ధతినే సక్రమంగా అమలు పరుస్తున్నప్పుడు మెర్సీకిల్లింగ్ విషయంలో ఎందుకు అమలు పర్చలేం? గౌరవంగా బతికే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంది. అలా బతకడానికి అవకాశం లేనప్పుడు చనిపోయే హక్కు లేకుండా చేయడం సమంజసం కాదు. భగవంతుడిచ్చిన జీవితం కాబట్టి ప్రాణం తీసే హక్కు కూడా భగవంతుడిదే అనేది అద్దె గర్భాలు, ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్, ఇన్ విట్రియో ఫెర్టిలైజేషన్, క్లోనింగ్ లాంటివి ప్రాచుర్యంలో ఉన్న నేటి రోజుల్లో అర్థరహితమైన వాదన. ప్రతి వ్యక్తికి తాను చావాలనుకున్నప్పుడు చనిపోయే హక్కుంది. రోగి పరిస్థితిని మెరుగు పరిచే అవకాశం లేదని డాక్టర్లు ధృవీకరించిన కేసుల్లో దుర్భరమైన జీవితాన్ని అంతం చేసుకోడానికి మెర్సీకిల్లింగ్‌ని అనుమతించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- **డా. గురువారెడ్డి,** ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్

***

నేనైతే ఈ విషయంలో శాస్త్రం చెప్పినదాంతో ఏకీభవిస్తాను. మనకీ దేహాన్ని భగవంతుడు సాధన చేయడానికి యిచ్చాడు. దాన్ని అంతం చేసే అధికారం ఎవ్వరికీ లేదని శాస్త్రం. అందుకే ఆత్మహత్య మహాపాపం. బాధలు భరించలేకనో, కష్టాలు పడలేకనో ఆత్మహత్య చేసుకోరాదు. కానీ శాస్త్రం ఒకే ఒక్క కారణం ఉంటే ఆత్మత్యాగం ధర్మమేనంటుంది. ఈ శరీరం జీర్ణమైపోతే లేదా సాధన చేయడానికి వీలు కానంతగా పాడైపోతే అప్పుడు ప్రాణాన్ని స్వచ్ఛందంగా వదిలేయవచ్చు. అలా కాకుండా భరించలేని బాధ ఉందనో, ఇక జీవించే అవకాశం లేదనో, కోమాలో ఉన్నారనో మెర్సీకిల్లింగ్ చేసే అధికారం వారి కుటుంబ సభ్యులకు కానీ వైద్యులకు కానీ లేదు. ఈ విషయం పరీక్షిత్

మహారాజుని బ్రతికించగల శక్తి ఉన్న కశ్యపుడు, తక్షకుని ప్రలోభానికి ఎందుకు లొంగాడో ఆలోచిస్తే అర్థమౌతుంది. కర్మఫలం అనుభవించడానికే ఈ దేహం. ప్రాణం సహజంగా పోయేంత వరకు అనుభవించాల్సిందే.

- **పి.వి.ఆర్.కె. ప్రసాద్,** రిటైర్డ్ ఐ.ఏ.యస్. ఆఫీసర్

***

మనదేశ పరిస్థితుల దృష్ట్యా మెర్సీకిల్లింగ్ సమర్థనీయం కాదు. వైద్య పరిజ్ఞానంతో సమస్యను ఎదుర్కోవాలే తప్ప చావు పరిష్కారం కాకూడదు. డాక్టర్లు ఏమీ చేయలేని కేసుల్లో, నయం కాని దీర్ఘ వ్యాధుల విషయంలో ఆ కుటుంబం ఆర్థికంగా బలహీనమైనప్పుడు ప్రభుత్వమే మెడికల్ ఖర్చులతో పాటు పోషణ బాధ్యతని కూడా తీసుకోవాలి. కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో న్యాయనిపుణుల సలహామీద మెర్సీకిల్లింగ్‌ని అనుమతించొచ్చు. ఎటొచ్చీ దాన్ని స్వార్థ ప్రయోజనాలకోసం వాడుకోకుండా చట్టాల్ని పకడ్బందీగా చేయడం అవసరం.

- **మాడభూషి శ్రీధర్,** ప్రొఫెసర్, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం

***

జంతువుల్ని చంపితినే మానవుల మాంసాహార ప్రవృత్తిలో మెర్సీ అనే మాటకు అర్థం లేదు. చంపడమనే ఇన్‌స్టింక్ట్‌కి మెర్సీ అనే లక్షణం జతకూడదు. గ్రామర్‌లోనే తప్పున్న ఈ భావం ఆచరణలో సరైంది ఎలా అవుతుంది? బతకడం అంటేనే చచ్చేదాకా పోరాడటం. పుట్టుక ఎలా మన చేతుల్లో లేదో చావు కూడా అంతే సహజంగా ఉన్నప్పుడే ప్రకృతి ధర్మం సజావుగా సాగినట్లు. వైద్యుడు రోగిని చివరి వరకూ బతికించడానికే ప్రయత్నించాలి. అనివార్యమైనపుడు బాధను తగ్గించేలా వైద్యాన్ని వృద్ధి చేయాలి తప్ప ప్రాణాలు తీయడాన్ని ఆఖరి అస్త్రంగా వాడకూడదు. నేను పూర్తిగా దీనికి వ్యతిరేకిని.

- **వి.ఎన్. ఆదిత్య,** ప్రముఖ దర్శకుడు

***

Marana Kanksha

Novel by Saleem

"ఏమైనా కావాలా బాబూ" బైటికెళ్ళబోతూ అడిగింది.

"ఏమడిగినా ఇస్తావా మమ్మీ?"

"తప్పకుండా ఇస్తాను"

"నాకింత విషం తెచ్చిపెట్టు మమ్మీ" అన్నాడతను విషాదంగా...

* * *

తను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళాడి- అమెరికాలో సాఫ్ట్‌వేర్ యింజనీర్‌గా స్థిరపడి- లక్షలకు లక్షలు సంపాదించి- అమ్మను సుఖపెట్టాలనుకున్న కలలన్నీ కరిగిపోయి, బతుకు దుర్భరమనీ నిరర్థకమని నిర్ణయించుకుని మెర్సీకిల్లింగ్‌ని కోరుకున్న ప్రసాద్...

* * *

ఆశావహ దృక్పథంతో అసాధ్యాలనుకున్న వాటిని కూడా జయించాలన్న పట్టుదలతో ఆత్మస్థయిర్యాన్ని ఆయుధంగా ధరించి... ఎన్ని విపత్కర పరిస్థితులెదురైనా పోరాడాలి తప్ప భయపడి జీవితం నుంచి పారిపోకూడదని నమ్మి కారుణ్య మరణాలకు వ్యతిరేకంగా వాదించే లాయర్ అక్షర.

* * *

'దీని గురించి చర్చ వచ్చినపుడల్లా సంక్షుభిత సముద్రంలో పయనిస్తున్న పడవలా ఉంటుంది మా పరిస్థితి' అని సుప్రీం కోర్టు జడ్జిచే వ్యాఖ్యానించబడిన సంక్లిష్ట అంశాన్ని వివిధకోణాల్లో చర్చించిన నవల "మరణ కాంక్ష".

- పబ్లిషర్స్

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్